భగవద్గీత

# భగవద్గీత - అర్జున విషాద, సాంఖ్య యోగం



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో భాగంగా ఈ పుస్తకాన్ని తెలుగు భక్తి వెబ్ సైట్ నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో భాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ ఫౌండేషన్ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంథాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) తెలుగు భక్తి వారి వెబ్ సైట్: www.telugubhakti.com
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో తెలుగు భక్తి వారి సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Helpline/WhatsApp: 9042020123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## తెలుగు భక్తి వారి వెబ్ సైట్:

## http://www.telugubhakti.com/



# అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ధనసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# భగవద్గీత అర్జున విషాద, సాంఖ్య యోగ ప్రవచనం

బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ



శ్రీకృష్ణ శరణం మమ.

# గీతామృతం

## ప్రవచనం - బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

విలేఖనం : మద్దూరి రాజ్యశ్రీ

ఆదిగురువు, జగద్గురువు అయిన శ్రీకృష్ణ చరణకమలాలని ఆశ్రయిస్తూ, భగవద్గీతా మతల్లికి నమస్సులు అర్పిస్తూ, భగవత భాగమయమయిన శ్రీకృష్ణమయమైన సభకు నమస్కరిస్తూ...

మూకం కరోతి వాచాలమ్, మూగవానిని సహితం పలకరించే వాడు, బుద్ధిని ప్రేరేపించి ఏది సుజ్ఞానమో తెలియజేసేటటువంటి ఆ జగద్గురువులైన ఆ శ్రీకృష్ణ పరమాత్మ వివరించిన భగవద్గీత గురించి చెప్పుకుందాం. ఇందులో అంతరార్థాన్ని ఆయనే వివరించారు.

హిందువులేకాక,ప్రపంచమంతా కూడా భగవద్గీతతోనే మనల్ని గుర్తిస్తోంది.భగవద్గీతకి, హైందవ సంస్కృతికి అంతటి అవినాభావ సంబంధమేర్పడి, హిందువుల మతగ్రంధమే భగవద్గీత అని ఇతరులు అనుకునేటట్లుగా ప్రభావం చూపగల గొప్పగ్రంధం భగవద్గీత. అదృష్టవశాత్తూ, హిందువులకే మత గ్రంధమూ లేదు. హిందువులది సనాతమైన ఒక ధర్మం మాత్రం ఉంది. ఈ ధర్మానికొక ఆధారం ఉంది.

ఆ ఆధారమేమిటి?

'వేదోఖిల ధర్మమూలం' - వేదమే అఖిల ధర్మములకు మూలమని, అన్ని పురాణములు వివరించాయి. చివరికి కృష్ణపరమాత్మ కూడా గీతలో చెప్పినదే కదా! 'వైదేశ్చ సర్వైరహమేవ విద్యాః' అన్నాడాయన. అందుకు మనందరికీ మూలం, మన ధర్మాలన్నింటికీ మూలం వేదం అని చెప్పుకుంటే, ఇతిహాస పురాణాభ్యాం వేదం సముప బ్రహ్మయేత్ ఇక్కడ మన ధర్మం యొక్క ప్రధాన స్వరూపాన్ని చెప్పుకోబోతున్నాం.

మన ధర్మమేమిటి?

సనాతనమైన ధర్మం. ఈ సనాతనమైన ధర్మానికి ఆధారం వేదం, ఆ వేదం చెప్పిన ధర్మాన్ని అనేక విధములుగా విస్తృతములుగా బోధించినట్టివి, ఇతిహాస, పురాణములు.అటు తర్వాత

వచ్చినవి ధర్మశాస్త్రములు. వీటిని స్మృతులు అంటారు. ఇతిహాస,పురాణాలని కూడా స్మృతుల లెఖ్ఖలలోనే పెద్దలు తేల్చిచెప్పారు. స్మృతులు అంటే పరాశరుడు, మనువు, యాజ్ఞవల్క్యుడు, గౌతముడు మొదలైనవారు రచించిన స్మృతి గ్రంధాలు ఎన్నో ఉన్నాయి అంటే ధర్మ శాస్త్ర గంధములు. స్మృతులు అంటే శృతులు చెప్పిన వాటిని స్మరించేవి గనుక స్మృతులు అని పేరు. ఆ ధర్మాన్ని అవి జ్ఞాపకం చేసుకుని, మనకి జ్ఞాపకం చేస్తున్నాయి గనుక,వాటిని స్మృతులు అంటారు. ఈ స్మృతులు, ఇతిహాస, పురాణాలు, అటు వేదములు, ఇవి అన్నీ కలుపుకుని మన సనాతన ధర్మానికి ఆధార గ్రంధములు అని చెప్పుకుంటాము. ఇందులో అనేక మంది ఋషులు తమ విజ్ఞానాన్ని విశదంగా తెలియజేశారు. వీరి యొక్క ప్రధాన లక్ష్యం ఏమిటంటే - పరబ్రహ్మతత్వాన్ని ప్రతిపాదించటమే.

ఇంత విస్తృతంగా ఇన్ని గ్రంధాలుంటే ఒక్క భగవద్గీతని ప్రధాన గ్రంధంగా మనము ఎందుకు భావిస్తున్నాము? మన గురించి భావించేవాళ్ళు ఎందుకు భావిస్తున్నారు? ఇందులో ఏమిటి వైశిష్ట్యం? ఈ ప్రశ్నలకి జవాబులు తెలుసుకోవాలంటే ముందు గీత అంటే ఏమిటో, గీత సంప్రదాయం ఏమిటో తెలుసుకోటానికి ప్రయత్నిద్దాం. అంటే మన గురించి మనం తెలుసుకోటానికి ప్రయత్నం చేస్తున్నామన్నమాట.

గీతలు ఎన్ని చెప్పబడ్డాయి?

భారతంలోనే చాలా గీతలున్నాయి - హంసగీత, అనుగీత మొదలైనవి భారతంలో వస్తాయి. బ్రహ్మదేవుడు హంసరూపంలో చెప్పింది హంసగీత.ఇవికాక భాగవతంలో కపిలగీత,ఉద్ధవగీత, రుద్రగీత అని గీత శబ్దంతో చెప్పబడుతున్నాయి. గీతలు అనేమాటతో భ్రమర గీతలు, గోపికా గీతలు కూడా భాగవతంలో చెప్పబడే అంశమే. ఇవికాక ప్రతి పురాణంలోనూ గీతలున్నాయి. అవి ఒకవైపు శివగీత, దేవీగీత, గణేశగీత వగైరా. ఇక్కడ మనం చర్చించుకునేది కృష్ణగీత దీన్నే భగవద్గీత అని కూడా అంటున్నాం.

గీతలు ఎలా వచ్చాయి?

చారిత్రకంగానూ, లేదా ఇతిహాసకంగానూ పరిశీలించేవాళ్ళు, సాహిత్యాత్మకంగా పరిశీలించేవారూ, సంప్రదాయం తెలీక కొన్ని మాట్లాడుతుంటారు. కృష్ణగీత అయిన భగవద్గీత వచ్చిన

తర్వాత అనేకమంది అనేక గీతలు రచించారు అని వాళ్ళంటారు. అయితే ఇక్కడొక సంప్రదాయం మనం తెలుసుకోవలసిన అవసరం ఉంది. వేదం యొక్క సంప్రదాయం వేరు, పురాణం యొక్క సంప్రదాయం వేరు, కావ్యం యొక్క సంప్రదాయం వేరు. మన ధర్మం ఈ మూడు విధములుగా వచ్చింది- వేదం, పురాణం, కావ్యంగా.

వేదానికి,పురాణానికి, కావ్యానికి గలతేడా ఏమిటి?

వేదం ధర్మాన్ని ప్రభువు శాసనంలా చెపుతుంది అంటే, ఒక రాజు శాసనం ఎలా ఉంటుందో, వేదం యొక్క శాసనం అలా ఉంటుంది. రాజు ఎందుకిలా శాసించాడు అని ప్రశ్నించటానికి లేదు. చేయవలసిందే! రాజు ఏది చేసినా రాజ్య క్షేమం కోసమే చేస్తాడుగనుక, ఆయన చేసిన శాసనాన్ని మనం అనుసరించవలసిందే! అందుకే వేదం పరమేశ్వరుని యొక్క శాసనాత్మకమైన వచనం. నారాయణుడు శాసించిన వచనం వేదం. అందుకే వేదం అపౌరుషైవం యశ్వనిశ్వశితయ వేదాః అన్నారు. పరమేశ్వరుడైన నారాయణుని ఊపిరులే వేదములు అందుకని చెప్పింది చేయటమే మన పని. చెప్పిన ధర్మాన్ని ఒక మిత్రుడిలా బోధిస్తే పురాణములు, కాంతిసహితతయోపదేశ యుగే అన్నట్లు, సర్వావిధ అలంకారములతో, కాంతా సంహితముగా చెపితే అవి కావ్యములు. అలా ఒకే ధర్మాన్ని ప్రభుసంహితంగా వేదం చెపుతుంది, మిత్రసంహితంగా పురాణం చెపుతుంది, కాంతా సహితంగా కావ్యం చెపుతుంది.

ఇప్పుడు మనం పురాణం అనే దాని దగ్గరకొస్తున్నాం. ఈ పురాణవిద్యని ఇచ్చిన వాడు వ్యాసదేవుడు. ఆ మాటకొస్తే ఒక్క పురాణమే కాదు, వేదమూ ఆయన దగ్గర నుండే వచ్చింది. ఆయన రచించక పోయినా, ఒక వ్యాసం చేసి ఇచ్చాడు. అలాగే పురాణాలని కూడా ఆయన విభజించి, 18 మహా పురాణములుగా, 18 ఉపపురాణములుగా చేసి ఇచ్చాడు. అటు తర్వాత భారత భాగవతాలని, బ్రహ్మసూత్రాలని కూడా అందించాడు. ఈ పురాణము ఒక సంప్రదాయ ప్రకారంగా చెప్పబడుతుంది. ప్రతి పురాణ విద్యకీ వక్త శూత పౌరాణికులు, శ్రోతలు సౌనకాది మహర్షులు. అలాగే మహాభారతానికి కూడా వక్త శౌనకాది మహర్షులు, శ్రోతలు సౌనకాది మహర్షులే. ఇక్కడ విశేషం ఏమిటంటే పురాణం ఏ సంప్రదాయంలో రచించాడో, మహాభారతాన్ని అదే సంప్రదాయంలో రచించాడు. అందుకే మహాభారతానికొక్క దానకే ఇతిహాసమని, పురాణ

మని రెండు విధాలుగా మనం తెలుసుకోవాలి. మహాభారతం కావ్యసంప్రదాయంలో రచింపబ డలేదు, పురాణ సంప్రదాయంలో రచింపబడింది. అందుకే ముందు మనకి, మన సంప్రదాయం ఏమిటో తెలియాలి. సంప్రదాయం తెలియని వాళ్ళు వ్యాఖ్యానిస్తే చాలా ప్రమాదాలు జరుగుతాయి, అవి ఇప్పుడు జరుగుతున్నాయి కూడా.

ఇదంతా ఎందుకు చెప్తున్నాను?

ఇదంతా చూడటానికి విషయాంతరంగా అనిపించవచ్చు, కాని భగవద్గీత అంటే ఏమిటో, దాని ప్రాధాన్యం ఏమిటో తెలియాలంటే పునాదుల నుంచి కదిలిరావాలి మనం. అందుకు భగవద్గీత ఎక్కడ పుట్టింది అంటే మహాభారతంలోంచి అని చెప్తున్నాం. ఈ మహాభారతాన్ని వ్యాసదేవుడు ఎలా రచించాడు? దీన్ని ఒక, పురాణంలా రచించాడు, ఒక కావ్యంలా రచించాడు, ఒక వేదం లా రచించాడు, ఒక ఇతిహాసంగా రచించాడు. అందుకే

'దీన్ని ఇతిహాసకులు ఇతిహాసమనిరి

ధర్మతత్వజ్ఞులు ధర్మశాస్త్రంబనిరి

అధ్యాత్మ్యవాదులు వేదాంతమనిరి' అన్నారు నన్నయ్య భారతాన్ని మన తెలుగు వారికి అందజేస్తూ, అందుకే ఇది ధర్మశాస్త్రము, వేదశాస్త్రము, ఇంకా మాట్లాడితే సర్వశాస్త్రముల సమూహము ఇదే.

అందుకే మహాభారతం గురించి చెపుతూ 'కృపయా మునినా కృతం' అన్నారు. దయతో వ్యాసదేవుడు అందించాడట. అంటే వేదాది విద్యల్లో మామూలు బుద్ధులకి అందని ఎన్నెన్ని రహస్యాలున్నాయో, అన్ని రహస్యాలూ అతి సామాన్యులకి కూడా అందజేయాలన్న తపనతో పురాణములు అందజేయటమే కాకుండా వాటన్నింటిసారంగా మహాభారతాన్ని అందజేసాడు, మహానుభావుడైన వ్యాసదేవుడు. పురాణం అనగానే పురాణ సంప్రదాయం ప్రకారం గీత ఒక భాగం. అదీ విశేషం.

పురాణాల్లో ఒకొక్క పురాణం ఒకొక్క దైవాన్ని ప్రాధాన్యం చేసుకుని ఉంటుంది. శైవపురాణం,శాక్త్యపురాణం, స్కాందపురాణం వగైరా, రచించిన వారు మాత్రం ఒక్కరే. శివ ప్రాధాన్యంగా ఉన్నవి శివపురాణములు, శక్తి ప్రాధాన్యంగా ఉన్నవి శాక్తేయపురాణములు, విష్ణుప్రాధా

న్యముగా ఉన్నవి వైష్ణవ పురాణములు. ప్రతిపురాణంలోను గీతనేది ప్రధానంగా ఉంటుంది. అంటే అక్కడ ఏదైవం చెప్పబడుతున్నాడో, ఆ దైవం పలికిన పలుకులు, ఆ పురాణంలో గీతగా చెప్పబడింది. అందుకే మనకి శివగీత, గణేశగీత వచ్చాయి. అలాటిదే కృష్ణగీత, ఇక్కడ ఆ పరమాత్మ కృష్ణమూర్తిగా చెప్పిన గీత గనుక కృష్ణగీత. అయితే, ఇందులో గీత అనే మాట సామాన్యంగా వచ్చేమాట.దీన్నే గీత అంటారు అంటే ఏమాట యందు బ్రహ్మవిద్య చెప్పబడుతోందో, ఆ మాటకి గీత అని పేరు. గణేషు చెప్పినా, శివుడు చెప్పినా, విష్ణువు చెప్పినా, కృష్ణుడు చెప్పినా అన్ని చోట్లా చెప్పబడేదే గీత.

భగవంతుడు పలికిన మాట బ్రహ్మవిద్య. అందుకు ఎన్ని గీతలున్నా దేని ప్రాధాన్యం దానిదే. సర్వగీతల సమన్వయం ఈ గీతలో గోచరిస్తుంది. అందుకు ద్వాపరాంతము, కలియుగం యొక్క ఆది, ఈ సంధ్య అవస్థలో జరిగిన కురుక్షేత్ర సంగ్రామవస్థలో మహానుభావుడైన అర్జునుడికి నారాయణుని పూర్ణావతారమైన శ్రీకృష్ణపరమాత్మ అనుగ్రహించినట్టిది భగవద్గీత. దీని వైశిష్టమేమిటి?

అప్పటిదాకా ఎన్ని విద్యలున్నాయో అన్ని విద్యలనీ సమన్వయపరిచి చూపించారు శ్రీకృష్ణపరమాత్మ. అందువల్లనే భగవద్గీత ఒక పరిపూర్ణ గ్రంథమై, సర్వవిద్యలసారమై, ఇదే భారతీయుల గ్రంధం అనిపించుకునేలా చేసింది. అందుకే దీనినే ప్రమాణంగా స్వీకరించటంలో ఏమీ ప్రతిబంధకం లేదు. కాకపోతే భగవద్గీత ఒక్కటి మాత్రమే హిందువుల గ్రంధం అనుకోరాదని ఇంత వివరంగా చెప్పవలసి వచ్చింది. ఆ విధంగా భగవద్గీత మహాభారతంలో ఒక ప్రత్యేక గ్రంధంగా చెప్పబడుతూ వచ్చింది.

పైగా మహాభారతం ఒక పురాణ సంప్రదాయం బట్టి రచింపబడింది అని ఎలా చెప్పగలం? మహాభారతం యొక్క ప్రధమ శ్లోకాన్ని ఒక్కసారి మనం పరిశీలిస్తే

నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమం

దేవీం సరస్వతీం వ్యాసం తతోజయం ఉదీరయేత్

పద్దెనిమిది పురాణాలకి కూడా ఇదే ప్రార్ధనా శ్లోకం. ఈ పురాణ సాంప్రదాయం తెలీక కొంతమంది మహాభారతం 'జయ'అనే శబ్దంతో ప్రారంభమయింది కనుక అది జయేతిహాసమ

ని, తర్వాత క్రమక్రమంగా మహాభారతమయి పోయిందని, వాళ్ళకి తోచినట్లు వ్యాఖ్యానిస్తారు. కాని వ్యాసదేవుడే చెప్పాడు దీని పేరే మహాభారతం అని. అందుకోసం మహాభారతం మహా భారతంగానే రచించబడింది. జయ అనే పేరు కేవలం మహాభారతానికే కాదు, 18 పురాణాలకి కూడా చెప్పబడింది.

'జయం' అని ఎందుకు చెప్పబడింది?

జయ అనే మాటని తిరగేస్తే యజ అవుతుంది. యజ అంటే యజ్ఞము. యజ్ఞము చేయుము అని చెప్పబడుతోంది. అందుకు యజ్ఞ సంబంధమైనటువంటి విషయం చెప్పబడుతున్నది.

యజ్ఞయ - కార్యం అవుతుంది. ఏదైతే వేదంలో యజ్ఞంగా చెప్పబడ్డ మంత్రాదులు, ధర్మములు ఉన్నాయో, అవి అన్నీ దేనియందు చెప్పబడుతున్నాయో, ఆ కావ్యం పేరు జయం అని అనచ్చు. అలాగే 'జయ' అనే పదానికి మన సంప్రదాయ అర్థం చతుర్విధ పురుషార్థము లు దేనియందు లభిస్తాయో అదీ జయం. మానవుడు నాలుగు సాధించటానికి పుట్టాడు కదా! ఈ నాలుగు సాధించటమే జయం. జయమంటే ఏమిటి? గెలవడం. గెలవటమంటేనే సాధించ డం! తాను ఏది సాధించటానికి పుట్టాడో, దాన్ని సాధించటమే కదా జయమంటే! ప్రతి పురుషు డు (పురుషుడంటే జీవుడు) సాధించవలసినవి నాలుగు పురుషార్థములు - ధర్మ, అర్థ, కామ, మోక్షములు. ఈ నాలుగు సాధించటానికై పుట్టిన మనం అది సాధించగలిగితే జయం అనిపిం చుకుంటుంది. అందుకే ఏ గ్రంధమునందు చతుర్విధ పురుషార్థములు చెప్పబడుతున్నాయో, వాటిని సాధించే ధర్మములు చెప్పబడుతున్నాయో, ఆ గ్రంధమునకు జయం అని పేరు. ఇదీ విశేషం.

మరియొక విధంగా జయమనే పదానికి సంఖ్యాశాస్త్రపరంగా ఒక అర్థమున్నది. మన సంప్రదాయంలో కటపయాది సంఖ్యలు అని సూత్రం చెప్పబడుతూ ఉంటాయి. అంటే అక్షరా లని బట్టి సంఖ్యలని నిర్ణయించే ఒక శాస్త్రము. దాన్నిబట్టి మనకి జయ అనే సంఖ్య 18ని తెలి యజేస్తుంది. ఈ 18ని తెలియజేస్తుంది కాబట్టి జయం ఉదీరయేత్ అనే మాట పురాణము లకూ వాడబడింది., భారతానికీ వాడబడింది. పురాణాలెన్ని? 18. మహాభారతంలో పర్వాలెన్ని? 18. అందువల్ల రెండింటికి సరిపోతుంది. ఇంక 18 పర్వములున్న భారతంలో 18 అధ్యాయా

లున్న ప్రత్యేక గ్రంథం భారతం మరిదీనిలో జయముందా ఉన్నది, ఎక్కడో మనం త్వరలో చూడబోతున్నాం, తొందరెందుకు జయమనే గ్రంథములో మరో ప్రత్యేకమైన జయమనే గ్రంథం భాగవతం. అందుకే ఇదిపూర్తి సార గ్రంథము. అలా జయమనే నామానికి పూర్తిగా తగినటువంటిది భగవద్గీత.

నిజానికి భగవద్గీత మీద ఎన్ని భాష్యాలొచ్చాయంటే ఒక్క భగవద్గీత మీదే ఒక గ్రంథాలయం పెట్టుకోవచ్చు. మనకి ఆదిలో లభ్యమవుతున్న ఆది గ్రంథములలో ప్రథమ వ్యాఖ్యానం ఆదిశంకర భగవత్పాదుల వారిదిగా భావిస్తాం. ఆయన వ్యాఖ్యానంలోనే ఒకచోట మనకి ప్రథమంలోనే కనిపిస్తుంది. సర్వజగత్తుని ఉద్ధరించటానికి అవతరించిన వాడు నారాయణ. శంకరులవారు చాలా సూటిగా ప్రారంభించారు గీతా భాష్యాన్ని. మనం ఆయన మాటతోనే ప్రారంభిస్తున్నాం.

ఈ సర్వజగత్తుని నడపటానికి, ఉద్ధరించటానికి నారాయణుడు రెండు విధములైన ధర్మములని సృష్టించాడు. అవి - ప్రవృత్తి ధర్మము, నివృత్తి ధర్మము. ప్రవృత్తి అంటే సంసారాదుల యందు ప్రవర్తించేవారి ధర్మము. నివృత్తి రూపము అంటే దీని నుంచి మరలి అంతర్ముఖులై, బ్రహ్మాది ముఖులైనటువంటి పరమహంసల ధర్మం. ఈ రెండు ధర్మాలని తెలియజేసారు. ఈ రెండు ధర్మాలని అనుసరించి జీవకోటి వెళ్లినప్పుడు వాళ్ళు ఉత్తమస్థితిని పొందుతారు అని నారాయణుని యొక్క హృదయం. ఈ ధర్మం పరంపరలో క్రమక్రమంగా దెబ్బతింటూ ఉంటే, ఆ ధర్మాన్ని రక్షించటానికే.

పవిత్రాణాయ సాధూనాం, వినాశాయచ దుష్కృతాం
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే

అన్నట్లుగా ఆ పరమాత్మ అవతరించారు. అవతరించి, తన లీలతో ఆ ధర్మాన్ని ఉద్ధరించటమే కాకుండా, తర్వాతి కాలానికి తన లీలని గాథారూపంగా అందిస్తూ, తన హృదయాన్ని బోధన రూపంగా అందిస్తూ, రెండు విధములుగా అనుగ్రహించారు. లీలని గాథారూపంలో అందించేది భాగవతమైతే, తన హృదయాన్ని బోధనరూపంగా అందించేది భగవద్గీత. ఈ రెండూ శ్రీకృష్ణుడు మనకిచ్చిన దివ్యమైన వరములు. ఆయన చరిత్రని భాగవతంలో చదువుకోండన్నాడు.

నీ ఉపదేశమేమిటయ్యా అంటే భగవద్గీతనిస్తున్నా అన్నాడు. ఆయన మాటని, చేతని రెండు గ్రంధాలుగా అందజేశాడు పరమాత్మ. అందులో మాట - గురువాక్యం. కృష్ణుడు రెండు విధ ములుగా గురువే - ఆచరించి చూపించిన ఆచార్యుడు, ఇది ఆచరించు అని చెప్పిన ఆచా ర్యుడు. అందుకే కృష్ణుడిని ఆచార్యుడు అంటున్నాం. కృష్ణం వందే జగద్గురుం అంటున్నాం. కృష్ణుడు సహజగురువు. అది విశేషం.

కృష్ణుడు జ్ఞానమే తానైనవాడు. జ్ఞాన స్వరూపుడు. జ్ఞానము పొందినవాడో, జ్ఞానము తెలు సుకున్నవాడో కాదాయన. జ్ఞానమే, తానైనవాడు. అందుకే కృష్ణుడి గురించి చెపుతూ 'వాచక ప్రణవోస్య' అన్నారు. కృష్ణుడు ఎవరూ అంటే ఓంకారము చేత చెప్పబడే పరతత్వము. క్రీడావస్థ ఖిలం జగత్. ఆయన ఆడుకునే క్రీడా వస్తువు- ఈ అఖిలజగత్తు! ఆయన ఆజ్ఞ - శృతి ఆజ్ఞ! వేదం ఆయ ఆజ్ఞ! మరి ఆయన శరీరం - బహుహు జ్ఞానం! జ్ఞానమే ఆయన శరీరం. కృష్ణం వందే దేవకీసుతం. ఇలా ఉన్నటువంటి దేవకీసుతునికి నమస్కరిస్తున్నాం అన్నారు ఋషులు. ఆ మహాత్ముడు బోధించినటువంటి భగవద్గీత ఇది.

వ్యాఖ్యానాలు ఇన్ని తయారయిన తర్వాత భగవద్గీత మీద ఒక విషయాన్ని ఎక్కువ వివ రిస్తే సందేహం చాలా ఎక్కువవుతుంది. సందేహం నివారించటానికి వివరణ చేస్తారు కొందరు. వివరణ చేస్తున్న కొద్దీ సందేహాలు పెరిగి పోతుంటాయి కొందరికి. అంటే వివరణ చేసే వారు వారి బుద్ధి వైపరీత్యం కూడా కలపటం చేత కూడా జరుగుతుంటుంది - శంకరుని వ్యాఖ్యానం తర్వాత అనేక మంది అనేకరకాలుగా వ్యాఖ్యానించారు. అక్కడితో ఆగారా? దాన్ని పారమార్థిక వాదం నుంచి భౌతికవాదం వరకూ అన్ని విధాలా వ్యాఖ్యానించారు. కొందరు ఇది జ్ఞాన ప్రధాన గ్రంధం అన్నారు,కొందరు కర్మ ప్రధాన గ్రంధం అన్నారు, కొందరు భక్తిప్రధాన గ్రంధం అన్నారు. ఇంతకీ భగవద్గీత దేన్ని బోధిస్తోంది?

జ్ఞాన యోగాన్నా, కర్మయోగాన్నా, భక్తి యోగాన్నా? మూడింటిని చెపుతోంది కాని జ్ఞానమే శ్రేష్ట మంటోంది అంటారు పరమహంసలు. కాదు భక్తిమార్గమే శ్రేష్టమంటారు భక్తయోగులు.

ఈ రెండు కాదు కర్మయోగమే శ్రేష్టమంటారు కర్మవీరులు. ఇంతకీ కృష్ణుడి హృదయం ఏమిటీ అంటే - ఏదైనా యోగమయితే చాలన్నాడాయన. కర్మయైనా, భక్తియైనా, జ్ఞానమైనా

యోగముండాలి. యోగ మంటే విద్యతే అనైనయితి యోగః - దేనితో కలయిక ఏర్పడుతుందో అది యోగము. కలయిక అంటే ఎవరితో! ఏ పరమసత్యమైనటువంటి పరమాత్మ ఉన్నాడో, ఆయనతో కలయిక దేనితో ఏర్పడుతుందో దాని పేరు యోగము. అది కర్మయోగమైనా, జ్ఞాన యోగమైనా, భక్తియోగమైనా ఒక్కటే. అన్నింటిలో యోగమనే పదం కామన్‌కదా! అందుకే!

కృష్ణ పరమాత్మ ఎవరు ?

విడివిడి మార్గాలు చెప్పినవాడు కాదు, వేదములో విడివిడిగా చెప్పబడినవాటి నన్నింటినీ సమ న్వయ పరచినవాడు కృష్ణపరమాత్మ. ఆయనని సర్వయోగ సమన్వయకర్తగా మనం చూడాలి కాని, ఏదోఒక యోగాన్ని ప్రతిపాదించాడని చెప్పటానికి లేదు.

మరికొందరు గీతని సైంటిఫిక్ గ్రంథంగా చెప్పారు. ఒకరైతే దీనినుంచి ఎలక్ట్రికల్ ఎనర్జీ గురించి చాలా రాసారు. కృష్ణ పరమాత్మ అంటే ఎలక్ట్రిసిటీ గురించి బాగా తెలిసినవాడని ఆ పుస్తకంలో ప్రతిపాదించాడాయన. మరొకరు అణువిజ్ఞానాన్ని చెప్పారు. అంటే దీని బట్టి మనకి అర్థమవుతున్నదేమిటంటే కృష్ణపరమాత్మ చెప్పాడు గనుక ఈ మాటల్లో అన్నీ ఉన్నాయి. ఎవరు ఎలా దర్శిస్తే, వాళ్లకలా కనిపిస్తుంది.

అయితే ఇప్పుడు నేనేం చెప్తాను?

ఆయన ఏం చెప్పాడో, సరిగ్గా అర్థం చేసుకుని చెప్పేలా చెయ్యమని ఆయనకే అప్పచెప్పిచెప్ప బోతున్నాను.

ఈ భగవద్గీత ఎలా మొదలవుతుంది?

మొదటి అధ్యాయాన్ని అర్జున విషాదయోగము అని అంటున్నాము మనము. వట్టి విషాదయోగము కాదు, అర్జున విషాదయోగము. పేరు అర్జున విషాదయోగమన్నా, లోకంలో విషాదయోగం కిందే చలామణి అయిపోతోంది. అయినా ఏం ఫర్వాలేదు. ఇది నరుడి విషాద యోగం. నరుడు అంటే అర్జునుడు అనే పాత్ర పరిభాష తీసుకోవచ్చు, లేదా నరుడు అంటే జీవుడు, జీవుని విషాదయోగంగా తీసుకోవచ్చు.

అది ప్రారంభం.అయితే మనకి కృష్ణుడి బోధకావాలి కాని అర్జునుడి విషాదం ఎందుకు? కృష్ణుడి బోధ ఏమిటో చెప్పండి, మొదటిదంతా అర్జునుడి విషాదం. అది మనకు ఎందుకు

అంటే, ఆయన దుఃఖం వల్లే పుట్టింది అంతబోధ. ఎలాంటి వేదన నుంచి అలాంటి బోధన పుట్టిందో గ్రహించటానికి ముందు వేదనని అర్థం చేసుకోవాలి. అందుకా వేదనని బాగా తెలియ చేస్తున్నాడు. ఇది విషాదయోగం.

ఇది ఎందులో చెప్పబడుతోంది? మధ్యే మహాభారత్ - మహా భారతానికి మధ్యలో ఉంది. పురాణమునినా వ్యాసేన- పురాణమునియైన వ్యాసుడు - ప్రాచీన మహర్షియైన వ్యాసుడు, అపరనారాయణుడైన వ్యాసుడు అనుగ్రహించినటువంటింది మహాభారతంలోని ఈ భగవద్గీత భీష్మపర్వంలో వస్తుంది.

ఇది ఏ సందర్భంలో?

భీష్మపర్వంలో .అప్పటికే సంజయుడు యుద్ధాన్ని చూస్తాడు యుద్ధం ప్రారంభమై పదిరోజులైన తర్వాత చెప్తున్నాడు. సంజయుడికావిధంగా యుద్ధంలో తిరుగుతున్నా, ఏ ప్రమాదం అంటకుండా తిరిగే జ్ఞానం వ్యాసదేవుని అనుగ్రహం చేత వచ్చింది. అటువంటి ఆ అనుగ్రహాన్ని పొంది,సర్వం చూడగలగటమే కాదు, ఎవరెవరు ఏమేమి చేస్తున్నారో వాళ్ళ ఇంగితాలని కూడా గ్రహించగలిగి, అందులో జరుగుతున్నటువంటి స్థూలమైన సంఘటనలే కాకుండా, సూక్ష్మమైన సంఘటనలు కూడా గ్రహించే జ్ఞానం వ్యాసదేవుడిచ్చాడు. ఊరికే చూసొచ్చి చెప్పడం కాదది, అందులో ప్రతి అంశాన్ని కూడా గ్రహించ గలిగేటటువంటి శక్తి ఆయనకి వ్యాసదేవుని యొక్క అనుగ్రహం చేత వచ్చింది. అందుకే పదిరోజుల యుద్ధం చూసి, అందులో భీష్ముడెప్పుడైతే అర్జునుని బాణముల దెబ్బతిని అంపశయ్యమీద కూలాడు అన్న వార్త విన్నాడో, అది వచ్చి ధృతరాష్ట్రుడికి వినిపించాడుట. అది విని ధృతరాష్ట్రుడు మూర్ఛపోయి, శైత్యోపచారము వల్ల తెప్పరిల్లి, భీష్మునికోసం దుఃఖించి, కొంతసేపు మనసు కుదుటపరచుకుని, సంజయుని అప్పుడడుగుతున్నాడు, అసలు మొత్తం మొదటినుంచి యుద్ధం ఎలా జరిగిందో ఆ వివరణంతా చెప్పమంటున్నాడు. అంటే ఫ్లాష్‌బ్యాక్ అన్నమాట. ఒక్కసారి వెనక్కివెళ్ళి అక్కడి నుంచి వివరించమని అడిగితే, అప్పుడు సంజయుడు చెప్తున్నాడిక్కడ.

అయితే ఇక్కడ ఇది చెప్తున్నదెవరికి? - ధృతరాష్ట్రుడుకి.

ఈ భీష్మపర్వంలో ధృతరాష్ట్ర ఉవాచకి వస్తే, గీత అని పేరు చెప్పి ముందు వీడి పేరేమిటి అని

పిస్తుంది. ధృతరాష్ట్రుడంటే ఎవరు? అందరూ తేల్చి చెప్పేసారు - ధృతరాష్ట్రుడంటే మహాభారతంలో 'విలన్' అని. మరి హీరో ఎవరు? వాళ్లే చెప్పారు - శ్రీకృష్ణుడే హీరో అని. అందుకే కృష్ణ మూలం భారతం అన్నారు. భారతాన్ని కల్పవృక్షంతో పోల్చి, శ్రీకృష్ణుడిని దానికి మూలం అని పోల్చారు. అందుకే కృష్ణుడు హీరో, ధృతరాష్ట్రుడు విలన్. విలన్‌తో మొదలయింది, గుడ్డిరాజు గారితో మొదలయింది.

ధృతరాష్ట్రుడు అడుగుతున్నాడు సంజయుడ్ని

ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః।

మామకాః పాండవశ్చైవ కిమకుర్వత సంజయ॥

కురుక్షేత్రే ఇక్కడ లక్ష్యం. కురుక్షేత్రంలో యుద్ధం జరుగుతోంది. ఎవరు యుద్ధం చేస్తారు? యుయుత్సవః - అంటే యుద్ధం చెయ్యాలని కుతూహలం కలిగిన వారు యుయుత్సులందరూ కూడా కురుక్షేత్రంలో సమతేతాః - సమావేశం అయ్యారు. అందరూ కలిశారు. ఎక్కడ? కురుక్షేత్రంలో! కురుక్షేత్రంకి ఒక విశేషం వాడారు - ధర్మక్షేత్రం అని. ధర్మక్షేత్రమైన కురుక్షేత్రం. మొదటే గీత ధర్మమనే పదంతో మొదలయింది. ధర్మం ప్రథమ పురుషార్థం అది చెప్పడం ముఖ్యం కదా! అందుకు ధర్మక్షేత్రం అని చెప్పటంలో ఉద్దేశ్యం! చెప్పిన వాడు గుడ్డివాడు అయినా, ఒక మహాశాస్త్రానికి ఆది వాక్యం కనుక ఈ శ్లోకాన్ని వ్యాసుడు చాలా దివ్యంగా సమకూర్చాడు. అందుకు కొంతమంది ఈ శ్లోకంలోనే చాలా ఉందన్నారు.

అహల్యాబాయి గీత గురించి చెప్పించుకుంటున్నప్పుడు ఆ పండితుడు, 'ధర్మక్షేత్రే, కురుక్షేత్రే' అనగానే ఆపేయమందిట. ఏమమ్మా ఆపేయమన్నారు అంటే నాకు అర్థమయిపోయిందందిట. అంటే ధర్మ, కురు, క్షేత్రే, క్షేత్రే! ధర్మక్షేత్రే, కురుక్షేత్రంలో క్షేత్రే అనేది కామన్. రెండు పదాలు - ధర్మం, కురు. క్షేత్రమంటే పొలమని చోటని రెండు అర్థాలున్నాయి. క్షేత్రే, క్షేత్రే అంటే ప్రతిచోటా, ధర్మం కురు. ప్రతి చోటా నువ్వు ధర్మమే చెయ్యి. అది నాకు బాగా అర్థమయిపోయింది అని చెప్పేసిందామె. ఎక్కడున్నా ధర్మమే ఆచరించు.

కాని ధర్మమంటే ఏమిటి? ఏది నువ్వు ఇంద్రియాలతో నిర్ణయించలేవో, ఏది బుద్ధితో నిర్ణయించలేవో, ఏది నీ జీవితానికవసరమో, అది శాస్త్రం నిర్దేశిస్తుంది, దానికి ధర్మమని పేరు.

ఆ ధర్మమే నిన్ను పట్టి ఉంచుతుంది. ధర్మమే లేకపోతే కట్లు తెగుతాయి, మర్యాదలు తెగుతాయి, ఎవడి ఇచ్ఛానుసారం వాడు ప్రవర్తిస్తాడు, పట్టిఉంచేది ధర్మం. ధారణం ధర్మ విధ్యాగురు. మనిషి ఒక మార్గం నుంచి తప్పిపోకుండా పట్టిఉంచేది. మనం ఒక తోవలో నడుస్తున్నాం. తోవ తప్పితే పడిపోతాం అంటే తోవ మనని పట్టి ఉంచిందన్నమాట. అలాగే ఏ తోవలో మనిషి నడవాలో అది ధర్మం. ఆ ధర్మాన్ని ఆచరించటానికే మనం పుట్టాము. అందుకే ధర్మం కురు. ఎక్కడ? క్షేత్రే క్షేత్రే! ఒకచోట చేసి ఒకచోట మానేయకుండా అన్ని చోట్లా చెయ్యి, అన్ని కాలాల్లోనూ చెయ్యి! ఇది అర్థమయింది, చాలు అంది ఆవిడ. ఆవిడకైతే అది సరిపోయింది. మనకి 700 శ్లోకాలూ కావాలి ఈ మాట బలపడటానికి. కొన్ని అప్పటికప్పుడు చాలా బాగుంటాయి. అర్థమైపోయినట్లే ఉంటాయి. అర్థమయింది. పట్టటానికి ఎంత రుద్దినా, ఎంత చెప్పినా కావాల్సిందే. అయితే యిందులో అనేకములైన అర్థాలు తీసారు పెద్దవారు, వాళ్ళ బుద్ధి నైపుణ్యం బట్టి ఎన్ని అర్థాలు తీసినా వినగలిగినటువంటి గొప్పగొప్ప భావాలుంటాయి. ఏ అర్థంతీసినా, శాస్త్ర సమ్మతంగా ఉండాలి కనుక కొన్ని విశేషాలు చూద్దాం ఇందులో.

భగవద్గీత ప్రారంభం ధర్మ అనే మాటతో మొదలయింది. చివరిదేమిటి? కృష్ణ పరమాత్మ చెప్పిన 'సర్వధర్మాన్ పరిత్యజ్య' అన్న చివరిది కాదు. ధృతరాష్ట్రుడడిగితే సంజయుడు చెప్పినది కనుక, సంజయుడు చెప్పిన చివరిమాటే, గీతకి చివరిమాట మనకి. అది ఏమిటంటే.

యత్ర యోగీశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః ।

తత్ర శ్రీర్విజయో భూతిః ధ్రువా నీతిర్మతిర్మమ॥ 18- 78

ఇక్కడ ధర్మ తీసుకోండి. చివరిది మమ తీసుకోండి. ఈ రెండూ తీసుకుంటే ఏమిటొచ్చింది. దర్మం, మమ - అంటే మమ ధర్మ - అంటే స్వధర్మం అని అర్థం. స్వధర్మం అంటే నా ధర్మం. ధర్మాన్ని ఆచరించు. అదే గీత యొక్క ప్రధానమైన సూత్రం.

ఈ స్వధర్మాచరణ చేయడం ఎలాగ? అది చెప్పడమే మిగిలిన లోపలి విషయాలు. చెప్పటం తేలికే. స్వధర్మాన్ని చెయ్యిఅని, కాని ఆచరించటం అంత తేలికయిన విషయం కాదు కదా! స్వధర్మాచరణకి ఎన్ని విఘాతాలొస్తాయి?ప్రథమ విఘాతం ఎక్కడ్నుంచి వస్తుంది?మన నుంచే మనలో మోహమనే ఒక దుర్లక్షణముంది. అజ్ఞాన జనితమైనదిది. అజ్ఞాన జనితమైన

మోహం చేతే స్వధర్మం కూడా అర్థం కాని విషయమేర్పడుతుంది. స్వధర్మం ఆచరిస్తున్నప్పుడే ఇది ఏది దర్మమో, ఏది అధర్మమో అర్థం కాని సమూఢ తేజస్సు అని అర్జునుడు పేర్కొన్నాడే అది వస్తుంది. అందుకు స్వధర్మం అనే మాటని ధర్మ, మమ అను రెండుమాటలతో అనుసంధానించి చూస్తే, దాని ఆచరణలో వచ్చే అవరోధాల్ని ఏ తెలివితో ఎదుర్కోవాలో, ఆ తెలివి పేరే భగవద్గీత. అందుకు ధర్మ, మమ అనే రెండు మాటల మధ్య ఉంచిన విషయమంతా కూడా, అది ఆచరించటానికి కావాల్సిన జ్ఞానాన్ని ఇస్తుంది. గీత ప్రయోజనమే అది! గాండీవాన్ని జార్చేసిన అర్జునుడు, గీత విని గాండీవాన్ని పట్టుకున్నాడు. అందుకు స్వధర్మాన్ని ఆచరించటానికి ప్రేరేపించే వాక్యములన్నీ దేనియందు చెప్పబడ్డాయో అవి ధర్మ, మమ అనే రెండు మాటల మధ్య బంధింపబడి మనకి ఇవ్వబడింది.

ఇప్పుడు మళ్ళీ ధర్మ క్షేత్రే అన్నపదానికి వెళ్తే, క్షేత్రము అనే పదం కేవలం చోటు,పొలం అని కాకుండా పుణ్యక్షేత్రాలకి కూడా వాడతాం. అంతే కాక దేహానికి కూడా వాడతాం. ఆ మాట గీతలోనే -

ఇదం శరీరం కౌంతేయా క్షేత్ర మిత్య మిదీయతే

అని చెప్పబడుతోంది. అందుకు దర్మక్షేత్రే, కురుక్షేత్రే అంటే గీతలో చెప్పబడిన ఈ సూత్రం ప్రకారం దేహానికన్వయించుకుంటే, దేహానికి ఈ రెండు లక్షణాలున్నాయి. ధర్మక్షేత్రే, కురుక్షేత్రే ధర్మము అంటే పవిత్రమైన కర్మ అని మనం అర్థం చేసుకుంటే, ఆ పవిత్రమైన ధర్మముకల క్షేత్రమేదో అది ధర్మక్షేత్రం. అంటే ఒక పుణ్యమువల్ల సంపాదించిన దేహము ఏదైతే ఉందో అది ధర్మక్షేత్రమే. దానిని కేవలం ధర్మ క్షేత్రంగా కాకుండా కురుక్షేత్రంగా చేసుకోవాలి. కురు అంటే చెయ్యి అనే విషయాన్ని శాసిస్తోంది కనక కురుక్షేత్రే! ఈ పవిత్రమైన దేహంతో మనం కర్మ ఆచరించటానికి వచ్చాం కనక దీనికి ధర్మక్షేత్రము, కురుక్షేత్రము అని రెండు లక్షణాలున్నాయి. కొన్ని కేవలం ధర్మక్షేత్రములు అంటే కొన్ని దేహాలు కేవలం అనుభవించటానికే ఉన్నవి - ఉదా: దేవతలవి కొన్ని కురుక్షేత్రములు - చేస్తూ వెళ్ళిపోతూ ఉంటాయి. కాని మానవ దేహమే ధర్మము, కర్మము కలబోసిన దేహము. పుణ్యము సంపాదితమై తద్వారా

ధర్మము ఆచరించవలసిన దేహమైంది. అలా ధర్మక్షేత్ర, కురుక్షేత్ర రెండు లక్షణములు మానవ దేహానికి అన్వయింపబడుతోంది.

అటువంటి ఈ దేహమందు అని చెప్తున్నాడు.

ఇందులో కూడా సంజయా అనేది చివరిమాట. సంజయా అని సంబోధిస్తున్నాడు. నేనుఇందాక చెప్పిన భారతానికి మొదటి మాట, 'తతో జయము ధీరయత్' అన్నది గుర్తుంచు కుంటే భగవద్గీతకు మొదటి మాట కూడా జయ అని వస్తుంది. సం 'జయా' అన్న మాటలోంచి వస్తోంది. అందుకే ఇదొక ప్రత్యేక గ్రంధముగా చెప్పచ్చు. 'జయ'తో ప్రారంభమవుతున్న శాస్త్ర మిది. ఏవైతే దివ్యశాస్త్రములని చెప్పబడుతున్నాయో అవన్నీ జయగానీ, లితః గానీ, శ్రీగానీ, ఓం కారం గానీ - ఈ నాలుగింటితో ప్రారంభించాలని సంప్రదాయం. ఈ నాలుగు పదాలూ మంగళవాచకం. అందుకు ఇక్కడ జయ అన్నారు. గోపికా గీతలు కూడా జయతితేకం జన్మనాౖ పభఃతో ప్రారంభమవుతాయి.

అలాగే శృతిగీతలు 'జయజయ జహ్యాజాం'అని జయ శబ్దంతోనే ప్రారంభమవుతాయి. ఇప్పుడీ భగవద్గీత కూడా సంజయా అనే సంబోధన నెపంతో జయ శబ్దంతో ప్రారంభమవు తోంది. ఒక శ్లోకం వ్రాస్తే ఇలా ఉంటాయి. అదీ విశేషం.

ధర్మక్షేత్రే, కురుక్షేత్రే, సమవేతా యుయుత్సవః

యుద్ధం చేయాలని కుతూహలపడిన వారు ఎవరు? ఉభయ పక్షముల గురించి చెప్తున్నాడు ధృతరాష్ట్రుడు. ఎవరు వారు అంటే

మామకాః పాండవాశ్చైవ

నావాళ్లు, పాండవులుట! అంటే అతనికి పాండవుల పట్ల ఎలాంటి భావముందో చూడండి, అంతవరకూ దొంగ మాటలు చాలా ఆడాడు. పాండవుల క్షేమం కూడా నేను కోరుకుంటున్నాను. కాని నా కొడుకు నా మాట వినటం లేదు, అంటూ! అంటే వాడు వినే టట్లు వీడికి చెప్పాలని కూడా అనిపించలేదని అర్థమన్నమాట. అందుకు మమకాః పాండ వాశ్చైవ అనటంతో కౌరవులు తనవారని, పాండవులు పెరవారని భావం ఆయనకి ఉందన్న మాట. ఆ స్వార్థమంతా, స్పష్టంగా ఇందులో చూపిస్తున్నాడు.

కిమకుర్వత సంజయ

యుద్ధం చేయాలని సమావేశం అయిన యుయుత్సువులైన నావాళ్ళు, పాండవులు ఏం చేశారు? దర్మక్షేత్రంలో ఏం చేస్తారు? యుద్ధానికెళ్లిన వాళ్ళు యుద్ధం చేస్తారు. అది ఎవ రన్నా అడుగుతారా? సినిమా థియేటర్‌లో ఎవరన్నా కలిసినప్పుడు సినిమా చూడటానికి వచ్చారా అంటాము. సినిమాకొచ్చిన వారు సినిమా చూడటానికి రాక దేనికొస్తారు? ఇలాంటి ప్రశ్న మనం చాలా సందర్భాల్లో చూస్తుంటాము. బస్సెక్కిన వాడ్ని ఊరెళ్తున్నారా అంటాము ఊరెళ్ళటానికి కాకపోతే బస్సెందుకెక్కాను అని వాడంటాడా? ఇవిలోకరీతిలో అడిగాడు ఇది ఏం ప్రశ్న అంటే ఏ ప్రశ్నా అడగలేం. బాగున్నారా అని పొరపాట్న అడిగామనుకోండి, నేను బాగుంటే నీకెందుకు, బాగుండకపోతే నీకెందుకు, బాగాలేనట్లు కనిపిస్తున్నానా అని అర్థమా దానికి. లోకరీతిలో పలకరింపు! యుద్ధంలో ఉన్నవాడు యుద్ధము చేస్తాడు కాని దీనికి చాలా మంది చాలా అర్థాలు లాగారు. కాని నేను లాగటం లేదు. అనేక గ్రంధాలు చదివి షాక్ తిన్నట్ల యింది. ఎందుకంటే ఇన్ని అర్థాలు దురాన్వయం దాకా వెళ్ళిపోయాయి. ఎక్కువ సాగదీస్తే చాలా ప్రమాదం. ఎక్కువ సోదిరాస్తే, భగవద్గీతని తీసి, తీసి, తీసి, కృష్ణుడు కూడా నేనిన్ని అర్థాలు చెప్పానా అని ఆశ్చర్యపోయేటంతగా అర్థాలు తీసినవాళ్ళున్నారు. అందుకు మరీ అంత దూరాలు పోకుండా, దీన్ని మళినాధ్, సోమసుర్ బాగా చెప్పారు. కాళిదాసు కావ్యానికి వ్యాఖ్యా నం రాస్తూ, నేను దూరాన్వయానికీ పోను, దురన్వయానికీ పోను, రెండూ కూడదు అన్నారు. అందుకే మూలహృదయానికి దెబ్బ తగలకుండా ఎంతమేర అవసరమో అంత మేరకే. అంద మైన అన్వయాలు కొన్ని ఉంటాయి. వింటూ ఉంటే ఆశ్చర్యంగా ఉంటాయి. ప్రేయసీ ప్రియులు పాడుకునే పాట చూడండి.

నీవు లేకనేను లేను, నేను లేక నీవు లేవు

దీనికి ఒకడి వ్యాఖ్యానం జీవాత్మ లేకపోతే పరమాత్మ లేడని, పరమాత్మ లేకపోతే జీవా త్మ లేడనీ! అదా వాడి ఉద్దేశం? రాసిన వాడిదీ ఆ ఉద్దేశం కాదు, పాడిన వాళ్లదీ ఆ ఉద్దేశం కాదు. మధ్యన వాడి ఉద్దేశం వీళ్ళకి పెట్టటం ఎందుకు?

కొంతమంది ఏమన్నారంటే ధర్మక్షేత్రం, కురుక్షేత్రం గనక, వెళ్ళగానే వీళ్ళ బుద్ధి మారి పోయిందేమో, యుద్ధం మానేసారేమో అందుకు 'కిం కరోతి' అని అడిగారేమో అన్నారు. అల్లాటి అర్థాలేం తీయఖ్ఖరలేదు. అడుగుతున్న వాడు ధృతరాష్ట్రుడు గనుక, వాళ్ళేం చేసేరు అంటే, యుద్ధమెలా చేసారు, అందులో జయాపజయాలు ఎవరికి వస్తున్నాయి, ఈ విషయా లన్నీ చెప్పమని అడుగుతున్నాడు. అంతే వాడి ఉద్దేశం. హిమకురే సంజయా - ఎలా యుద్ధం చేశారు?

ఇక వాడికి తెలియకుండా పలికిన దివ్యశబ్దాలు - సంజయా, దర్మక్షేత్రే, కురుక్షేత్రే వాటికి ఎందుకు చెప్పుకుంటున్నామంటే, మనమొక మహాగ్రంధాన్ని పట్టుకున్నాం గనుక, అందులో దివ్యత్వాన్ని ఋషి అందించాడు గనుక!

అయితే మామకాః పాండవశ్చైవ అని మనం ఎందుకు చదువుకోవాలి? మనలో కూడా మామకాః అని భావం ఉంది. మమత్వమనే భావం. నావి అని, నావి అనే భావం రాజస, తామస ప్రవృత్తుల వల్ల ఏర్పడుతాయి. రాజసం అంటే అహంకారం, అహంభావం, దానివల్ల మమత్వం. ఈ రెండిటి వల్ల ఇంక మరో జ్ఞానం పనిచేయదు. ఆ అహం, మమ దేని మీద ప్రస రిస్తామో, దానిచుట్టూ తిరుగుతాము. ఈ లైట్లు ఒకదాని మీద ఫోకస్ చేసి ఆ లైట్లోనే తిరుగుతు న్నట్లుగా ఈ అహం, మమ ఒకదాని మీద ఫోకస్ చేసి ఆ, గిరిలోనే తిరుగుతూ కూర్చుంటాము. ఆ తిరిగేగుణం, తిప్పేగుణమే అహంకారం, మమకారం. అదే రాజస, తామసాలతో కూడుకు న్నది. ఆ రాజస తామసాలు ఒకవైపు, సాత్త్వికమైన దైవీ ప్రవర్తులు మరియొక వైపు ఉంటాయి. దీనికి మనకాధారం మళ్ళీ గీతలోది - దైవాసుర సంవాదన యోగం. అందులో దైవీ గుణ ములు, ఆసురీగుణములు రెండూ చెప్పబడుతున్నాయి. ఈ దైవీ, ఆసుర సంఘర్షణ ఎప్పుడూ జరుగుతుంటుంది. అందుకు 'ధర్మక్షేత్రే, కురుక్షేత్రే' - ధర్మక్షేత్రమైన ఈ శరీరంలో యుయు త్సవః- యుద్ధం చేయటానికి సిద్ధపడినటువంటి అనేక రకమైన మనః ప్రవృత్తులు - సాత్విక ప్రవృత్తులు - రాజసిక, తామసిక ప్రవృత్తులు- వీటి యొక్క ఘర్షణలో ఏమి జరుగుతున్నదో తెలుసుకోవడానికి ప్రయత్నం కావాలి.

అది తెలియాలంటే ఎవరు చెప్పగలరు?

ఇంద్రియ నిగ్రహం కలిగినట్టివారే, దాన్ని సరిగ్గా అర్థం చేసుకుని విజయం కోసం ప్రయత్నించ గలరు. దాన్ని సం'జయుడే' చెప్పగలడు. మనకోసం అన్వయించుకోవటానికి చెప్పుకుంటున్న అర్థం అది. ఇతడు సంజయుడు, వీడు ధృతరాష్ట్రుడు. ఈ పేర్లు ఎలా పెడతారో గానీ, తర్వాత ఆ పేర్లన్నీ ఒక యోగశాస్త్రంగా మారిపోతాయి. అందుకే పేర్లు మనం పెట్టేవికావు. అవి ఈశ్వర సంకల్పంతో పెట్టబడతాయి. తర్వాత ఆ పేర్లే శాస్త్రాలయిపోతాయి. అదీ విశేషం.

రాముడికి రామా అని పేరు పెట్టడంలో, ఆయన లక్షణమంతా ఆ పేరులో ఉంది. అది వసిష్ఠుడికి రాముడే స్ఫురింపచేసాడు. కృష్ణుడికి కృష్ణ అని పెట్టమని గర్గమహర్షికి కృష్ణుడే సూచించాడు. ఇప్పుడు ధృతరాష్ట్రుడికి ఆ పేరు పెట్టమని వాళ్లమ్మకి ఆ పరమేశ్వరుడే సూచిం చాడు.

ధృతరాష్ట్రుడు అంటే రాష్ట్రమును ధరించువాడు. రాష్ట్రమంటే మనం పాలించే మన శరీ రమే. దాన్ని ధరించేవాడు ఈ జీవుడు. రాష్ట్రమే నేననుకుని ఎవడైతే ఉన్నాడో, అహంభావంతో - దేహాత్మభావంతో ఉన్నాడో వాడు ధృతరాష్ట్రుడు. వీడు సంజయుడు జయించినవాడు. ఎవడు ఇంద్రియములను జయించినవాడో వాడు. వాడు కదా ఉపదేశానికి అర్హుడు. అందుకు చెప్పే వాడి స్థానంలో సంజయుడున్నాడు, వినేవాడి స్థానంలో ధృతరాష్ట్రుడున్నాడు.

అంతమాత్రమే చెప్తున్నాను. వాళ్ళని గురుశిష్యులనటం లేదు. మనకి గురుశిష్యులిద్దరే. వాళ్ళు రాబోతున్నారు ఎలాగూ! అందుకు చెప్పేవాడు జితేంద్రియుడైన సంజయుడు, వినే వాడు ధృతరాష్ట్రుడు!

అయితే ఈ ధర్మక్షేత్రమైన శరీరంలో జరుగుతున్న సంఘర్షణ, దీనినుంచి కావాల్సిన సంయక్ జయము ఏదైతే ఉందో, దాన్ని మనం ఇప్పుడు తెలుసుకోపోతున్నాము. ఈ మామకాఃఅనే భావం ఎంత చిత్రమైనదో చూశారుకదా! మమత్వం అనే దానితో చూపిస్తున్నాడు.

(సశేషం)

శ్రీకృష్ణ శరణం మమ.

# గీతామృతం

అర్జునవిషాద యోగము - 2

## ప్రవచనం - బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

విలేఖనం : మద్దూరి రాజ్యశ్రీ

అటు తర్వాత సంజయ ఉవాచ. సంజయుడు చెప్తున్నాడు. ఇప్పుడు యుద్ధం దృశ్యం మొత్తం మనకి కనిపిస్తోంది.

ధృతరాష్టుడి మాటతో మొదలై రెండోమాట దుర్యోధనుడితో మొదలవుతోంది. ధృత రాష్టుడి సంతానమంతా దుస్సంతానమే.ఆయన కొడుకుల పేర్లు దుర్యోధనుడు, దుశ్శాసనుడు, దుర్ధరుడు, దుర్ముఖుడు, దుశ్శల, అలా దుః తో వచ్చింది. దుర్యోధనుడు అంటే ఇతరులెవరి చేతా యుద్ధం చెయ్యటానికి వీలుకానటువంటివాడు. దుః అనే శబ్దం అసాధ్యము అనే అర్థంతో కూడా వాడతారు. ఆ అర్థంతో పెట్టాడాయన అది వేరే విషయం. కాని ఈ అర్థంలోకి అందరూ అన్వయించుకున్నారు. ధృతరాష్టుడు - ఈ రాష్ట్రమే నేను అనుకుంటే ఇందులో పుట్టే భావాలన్ని దుస్సంతానాలే ! అందుకే వాళ్ళు దుస్సంతానాలుగా తయారయ్యారు. దుస్సంతా నాన్ని గెలవటం మహాకష్టంగనుకే దుర్యోధనునితో మొదలయ్యారు అలా దుర్యోధన దుశ్శాసన అనే అజ్ఞాన ప్రవృత్తులు ఉన్నాయి వాళ్ళకి.

దుర్యోధనుడు ద్రోణుడితో చెప్తున్నాడు.

**దృష్ట్వా తు పాండవానీకం వ్యూఢం దుర్యోధనస్తదా ।**

**ఆచార్యముపసంగమ్య రాజా వచనమబ్రవీత్॥ 1- 2**

ఆచార్యుడైన ద్రోణుడి దగ్గరకు రాజుయైన దుర్యోధనుడు వెళ్ళి- 'బ్రవీత్' పలుకుతున్నాడుట.

**పశ్యైతాం పాండుపుత్రాణామ్ ఆచార్యమహతీం చమూమ్**

**వ్యూఢాం ద్రుపద పుత్రేణ తవ శిష్యేణ ధీమతా ! 1-3**

ఇక్కడ నిజానికి ఇందులో కూడా పలుకులో ఉండే గొప్పదనం చూడండి ! అవతలి వాడికి ఎలా మాట్లాడితే పౌరుషం పొడుచుకొస్తుందో అలా మాట్లాడుతున్నాడు. ద్రోణాచార్యుడితో నీ శిష్యుడైన దుష్టద్యుమ్నుడి చేత వ్యూహంగా రచింపబడినట్టి పాండవ సేనని చూడు అంటున్నాడు. అంటే, వాడు నీ శిష్యుడు, పాండవులూ ఆయన శిష్యులే. మరొక విశేషం 'ద్రుపదపుత్రేణా' అన్న మాట. దుష్టద్యుమ్నుడు ద్రుపద పుత్రుడు. నిజానికి ద్రుపదుని చేత పరాభవింపబడ్డాడు కదా ద్రోణాచార్యుడు. అందుకని లోపల ఎక్కడో ఆయనమీద కోపం ఉంటుంది ఈయనకి. అది రెచ్చగొడుతున్నాడు. ఆ ద్రుపదుని కొడుకు అనగానే కోపం, పౌరుషం పొడుచుకు రావాలని! మాటలు అంత బాగుంటాయి. దుర్యోధనుడిక్కూడా మాటల చమత్కారం అంత ఉందన్నమాట ఏదీ లేకపోతే అంత గొప్ప వాడెలా అవుతాడు ?

ఎలాంటి వాళ్ళున్నారయ్యా అక్కడ !

**అత్ర శూరా మహేష్వాసా భీమార్జున సమాయుధి**

**యుయుధానో విరాటశ్చ ద్రుపదశ్చ మహారథః** 1-4

**ధృష్టకేతుశ్చేకితానః కాశిరాజశ్చ వీర్యవాన**

**పురుజిత్ కుంతి భోజశ్చ శైబ్యశ్చ నరపుంగవ** 1-5

**యుధామన్యుశ్చ విక్రాంత ఉత్తమౌజాశ్చ వీర్యవాన్**

**సౌభద్రో ద్రౌపదేయాశ్చ సర్వఏవ మహారథా** 1-6

పాండవుల వద్ద ఉన్న సైన్యబలం లిస్టంతా చదివాడు.

**అస్మాకం తు విశిష్టా యే తాన్నిబోధ ద్విజోత్తమ**

**నాయకా మమ సైన్యస్య సంజ్ఞార్థం తాన్ బ్రవీమితే** 1-7

వాళ్ళగురించి చెప్పాడు కదా! తనవాళ్ళ గురించి చెప్పాలి. 'భవాన్' మీరు. మన వైపు ఉన్నవాళ్ళలో మొదట 'మీరేనండి' అన్నాడు ద్రోణాచార్యునితో, తర్వాత

**భవాన్ భీష్మశ్చ కర్ణశ్చ కృపశ్చ సమితింజయః ।**

**అశ్వత్థామా వికర్ణశ్చ సౌమదత్తిస్తథైవ చ ॥** 1-8

**అన్యే చ బహవః శూరా మదర్థే త్యక్తజీవితాః ।**

**నానాశస్త్ర ప్రహరణాః సర్వే యుద్ధవిశారదాః ॥** 1-9

ఇక్కడ లిస్టు తక్కువా, అక్కడ లిస్టు ఎక్కువా చెప్పాడు. అక్కడ ఉన్నవాళ్ళ వివరాలు ఎక్కువ. శత్రువులని బాగా స్టడీ చేయటం. అంతమంది ఉన్నారక్కడ చూస్కోమనటం ఇక్కడ వాడు ఏ ఉద్దేశంతో చెప్పినప్పటికీ కూడా దైవాసుర సంపత్తి యోగంతో పోల్చి చూస్తే, అక్కడ కృష్ణ పరమాత్మ దైవీ గుణాల లిస్టు చాలా ఇచ్చాడు. ఆసురీ గుణాల లిస్టు కొంచెమే ఇచ్చాడు. అలాగే ఇక్కడ పాండవులు నిజానికి తక్కువగా కనిపిస్తున్నా యోధులు ఎక్కువ ఉన్నారక్కడ. అందుకు వాళ్ళ పేర్లన్నీ ఎక్కువ ఇచ్చాడు. వీళ్ళ పేర్లు తక్కువే చెప్పాడు. అంటే ఎప్పుడైనా ఆ దైవీ గుణముల శక్తి ఎక్కువ. తెలీకుండా దుర్యోధనుడు మరో వ్యూహంతో పలికినా, వచ్చిన మాటలు మాత్రం దైవీ గుణములు కలిగిన పాండవుల సంపత్తిలే చెప్పబడుతున్నాయి.

అయితే ఇందులోనే అతడు మాట్లాడుతూ

**అపర్యాప్తం తదస్మాకం బలం భీష్మాభిరక్షితమ్ ।**

**పర్యాప్తం త్విదమేతేషాం బలం భీమాభిరక్షితమ్ ॥** 1-10

ఆమాటలు చూడండి. మనసైన్యములన్నీ భీష్మాభిరక్షితం. వాళ్ళ సైన్యములన్నీ భీమాభి రక్షితం. అటు భీముడు రక్షిస్తాడు. ఇటు భీష్ముడు రక్షిస్తున్నాడు అనటంలో భీముడికన్నా, భీష్ముడు చాలా గొప్పవాడే. భీమా అనే శబ్దమే భీష్మ అనే శబ్దంలో అణిగి పోయింది.

ఆ కారణంగా భీముడు అల్పుడే ! 'మన సైన్యం చాలా విస్తృతంగా ఉన్నది. వాళ్ళసైన్యం పర్యాప్తం. ఒక పరిమితి కలది. వారితో పోల్చి చూస్తే మనది అపరిమితమైనది.' ఒక ధైర్యంతో మాట్లాడుతున్నాడు. ఇటు 11 అక్షౌహిణులు ఉంటే అటు 7 అక్షౌహిణీలే ఉన్నాయి. అందుకే ఇది ఆ పర్యాప్తం, అది పర్యాప్తం. యోగుల సంఖ్య చెప్పినప్పుడు వాళ్ళవి ఎక్కువా తనవి తక్కువా చెప్పాడు, కాని ఈ బలం చెప్పినప్పుడు తన బలం చాలా ఎక్కువ అనే ఆత్మ సంతృప్తి కనిపిస్తోంది. ఎందుకంటే ఇతను మొదటినుంచి మెజారిటీ సంఖ్య చూసేవాడు. అంటే మెజారి

టీని బట్టి బలం నిర్ణయించేది దుర్యోధనుడి లక్షణం అని తెలుస్తోంది. నేటి ప్రపంచ వైఖరి కూడా అలాగే ఉంది.

మెజారిటీయే బలం అను కోవటం దుర్యోధన ప్రవృత్తి. అంటే రాక్షస ప్రవృత్తి అని అర్థ మన్నమాట. ఇప్పుడదే కనిపిస్తోంది. మొదటే కృష్ణపరమాత్మ నేను కావాలా, నా నవకోటి నారా యణులనే నా సైన్యం కావాలా అంటే, అప్పుడు కూడా వాడు మెజారిటీ చూశాడు. అందుకే నువ్వొక్కడివి నాకెందుకు, వాళ్ళు చాలన్నాడు. అందుకే వాడి దృష్టి ఎప్పుడూ కూడా మెజారిటీ మీదే ఉంటుంది కాని భారతీయుల దృష్టి మెజారిటి మీద కాదు. అది ఆత్మబలం, ధర్మబలం, దైవబలం మీద ఉంటుంది. ఎంతో బలవంతుడు లాగా కనబడేవాడు, వాడిని వాడేమొయ్య లేక తిరుగుతుంటాడు. వాడిని బలవంతుడని శ్లాఘించి వాడికి సన్మానం చేస్తారా?
కాదు కదా ! వాడి శరీరం అంత ఉంది కాని బలం మాత్రం శూన్యమే. కనిపించేటటువంటి స్థూలత్వాన్ని చూసి బలం అనుకోకూడదు. అందుకే భారతీయ ఋషులు సూక్ష్మ దృష్టిగలవారు కనుక సూక్ష్మమైన దృష్టే బలమని చెప్పటానికి రెండు గ్రంథాలు పుట్టించారు - రామాయణం, భారతం!

రామాయణం తీసుకుంటే అందులో ఇటువైపు ఇద్దరే రాముడు, లక్ష్మణుడు. వెనకాల హను మంతుడు, వానరులు అంతేగా. అటువైపు చూస్తే వాడి కాలమూ ఎక్కువే, వాడి దేశమూ ఎక్కువే. వాడి జనమూ ఎక్కువే ఎప్పటినుంచో, అంటే కొన్ని యుగాలనుంచీ, ఉన్నాడువాడు. అనుభవం ఉన్నవాడు రావణాసురుడు. నిన్నమొన్నటివాడు రాముడు. రావణునికి రాక్షసబల గం చాలా ఉంది. రాజ్యంలో ఉన్నవాడు రాముడేమో అడవిలో ఉన్నాడు, కోతుల్నేసుకెళ్ళాడు. చూస్తే ఇద్దరే కాని గెలుపెవరిది ? అలాగే భారతంలో ఇటు ఐదుగురు, అటు నూరుగురు. గెలుపెవరిది ?

భారతీయ ధర్మమంతా రెండు గ్రంథాలుగా మన కిచ్చిన సందేశమేమిటని తరచి చూస్తే పెంచు కోవలసిన బలం దైవబలం. ఆ దైవ బలం పెంచుకుంటే విజయం నీదే. అది చూసుకోకుండా కేవలం నా మంద ఇంత ఉంది, నా బలం ఇంత ఉంది అనుకుంటే లాభం లేదు. కాబట్టి

మంద పెంచుకోవటం కాదు, దైవబలం, ఆత్మబలం పెంచుకో ! దైవబలం ఎక్కడుంటుంది ? ఎక్కడ ధర్మముంటుందో, అక్కడ ఉంటుంది, అందుకని మనం ధర్మబలం పెంచుకుంటే, దైవబలం తానంతట తానే వస్తుంది. ధర్మరాజు గానీ, అర్జునుడు గానీ ఎప్పుడూ కృష్ణా రా అని పిలవలేదే. వాళ్ళ ధర్మాన్ని పెంచుకుంటూ వచ్చారు గనుక కృష్ణుడు వాళ్ళ వెంట తిరుగుతూ వచ్చాడు. అందుకని ధర్మమెక్కడ ఉంటే, జయమక్కడ ఉంటుంది.'యతో ధర్మః తతో జయః! అందుకే ధృతరాష్టుడికి తెలియకుండానే ధర్మక్షేత్రే, కురుక్షేత్రే... సంజయా' అన్నాడు. ధర్మం మొదటి పదం జయం చివరి పదం. ధర్మముంటేనే జయం ఉంటుందని ఆ శ్లోకంలోనే చెప్పారు. అదే నిజమని అతనికి తెలియదు పాపం.

అందుకు ఇది తెలియని దుర్యోధనుడు భీష్మాభిరక్షితా అపర్యాప్తం - అన్నాడు వీడి దృష్టి అంతే, మెజారిటీ మీదే!

**అయనేషు చ సర్వేషు యథాభాగమవస్థితాః ।**

**భీష్మమేవాభిరక్షంతు భవంతః సర్వ ఏవ హి ॥** 1-11

**అయనేషు చ సర్వేషు యథాభాగమవస్థితాః ।** - అన్ని వైపులనుండి, మనం ఆయా స్థానములు యందు నిలిచి భీష్మడ్ని మనం కాపాడుకుంటూ ఉంటే,ఆయన మనని కాపాడుతాడు. కాపాడుతున్నవాడిని మనం కాపాడుకుంటే మనం హాయిగా ఉంటాం.

ఇదంతా 'రాజావచన బ్రవీత్' మాట పలికాడుట. దుర్యోధనుడు రాజు, అతను మాట్లాడాడు. అందులో వినయం లేదు, కాని రాజనే అహంకారం ఉంది కాబట్టే ఆచార్యుడితో అలా మాట్లాడాడు. ధర్మరాజుకి దుర్యోధనుడికి ఎంత తేడానో చూడండి. ధర్మరాజు యుద్ధంలో ఉన్నప్పుడు స్వయంగా రథం దిగి వెళ్ళి, అందరి ముందుకి వెళ్ళి ద్రోణాచార్యుడు, భీష్మాచార్యుడు, కృపాచార్యుడు మొదలగు పెద్దలకు సవినయంగా నమస్కరించి వచ్చాడు.అది అతని వినయ సంపద.

**తస్య సంజనయన్ హర్షం కురువృద్ధః పితామహః ।**

**సింహనాదం వినద్యోచ్చైః శంఖం దధ్మౌ ప్రతాపవాన్ ॥** 1-12

ఎప్పుడైతే దుర్యోధనుడు ఈ మాటలు చెప్పాడో, అప్పుడు భీష్మాచార్యుడు శంఖాన్ని తీసుకుని ఊదాట్ట, 'దధ్మౌ ప్రతాపవాన్' దధ్మౌ అంటే శంఖాన్ని పూరించాడు. ఎవరు ? ప్రతాపవాన్ ప్రతాపవంతుడైన భీష్మాచార్యుడు. సింహనాదంలాంటి శంఖనాదం చేసాట్ట. ఈ శంఖనాదం ఉత్సాహజనకం. యుద్ధానికి మేం సన్నద్ధులం అని చెప్పటం లాంటిది. ఇది తస్య సంజనయన్ హర్షం. అది విన్న దుర్యోధనుడు మహా ఉత్సాహ పడిపోయాడు

ఎప్పుడైతే ఆయన సింహనాదం లాంటి శంఖనాదం చేసాడో, దుంధుభులు మ్రోగాయి.

**తతః శంఖాశ్చ భేర్యశ్చ పణవానకగోముఖాః ।**

**సహసైవాభ్యహన్యంత స శబ్దస్తుములోఽభవత్ ॥** 1-13

వెంటనే కౌరవులందరూ కూడా శంఖములను పూరించారు. భేరులు, ప్రణవాకములు, గోముఖాలు మొదలైనటువంటి అనేకములైన వాద్యములన్నీ మ్రోగించారు. దానితో అక్కడ, ఒక చక్కటి ఉత్సాహం ఒక్క పెట్టున మ్రోగింది కౌరవుల వైపునుంచి మరి ఇక్కడా ఆ సన్నధ్యం రావాలికదా.

అక్కడ తొలుత శంఖం పూరించినవాడు భీష్మాచార్యుడైతే, ఇక్కడ మొదట శంఖం పూరించిన ఆ మహానుభావుడిని మనముందుంచుతున్నారు ఆ వ్యాసదేవుడు. ఆయన్ని చూడ టంలోనే ఉంది గీత విశిష్టత అంతా! మొదట నాదం వినిపిస్తుంది, తర్వాత మరోనాదం వినిపి స్తుంది. ఇప్పుడు ప్రథమ నాదాన్ని వినబోతున్నాము మనము.

**తతః శ్వేతైర్హయైర్యుక్తే మహతి స్యందనే స్థితౌ ।**

**మాధవః పాండవశ్చైవ దివ్యౌ శంఖౌ ప్రదధ్మతుః ॥** 1-14

ఒక అపూర్వ దృశ్యాన్ని చిత్రలేఖనంలా చిత్తరువుగీసి చూపిస్తున్నాడు వ్యాసదేవుడు. శంఖం పూరిస్తున్నాడని కాదు. సినిమాలో క్లోజప్ చూపించినట్టు, మన దృష్టిని క్రమంగా క్లోజప్‌తో చూపిస్తున్నాడు.

అక్కడ 'తతః శ్వేతైర్హయైర్యుక్తే' తెల్లని గుర్రములు కూడ్చినటువంటి మహతి స్యందనే ఒక గొప్ప రథము అన్నాడు.

ఏమిటా రథము గొప్ప ధనము?

అన్ని రథములు కంటే ఎత్తుగా ఉందా? అది కాదు అర్థం అన్ని రథముల కంటే గొప్పగా ఉంది అంటే ఆ గొప్ప దనం కృష్ణుడిది. ఆ గొప్ప దనం ఆ రథానికున్న దివ్యత్వం. దివ్యమైన రథమని. ఇక్కడ చెప్పాలి కాబట్టి చెప్పటం కాదు. ఈ శ్లోకంతో ఇక్కడికి కృష్ణ పరమాత్మని ఆవాహనం చేస్తున్నాం.

ఎలాంటి కృష్ణ పరమాత్మని ఆవాహనం చేస్తున్నాము?

యశోదా తనయునిగా పారాడిన చిన్ని కృష్ణుడిని కాదు, వేణువును మ్రోగించిన చిలిపి కృష్ణుడినీ కాదు, ఈ శ్రీకృష్ణుడు పార్థసారథియైన కృష్ణస్వామి. ఆచార్యుడైన కృష్ణస్వామి, రథాన్ని సన్నద్యం చేసి శంఖం పూరిస్తున్న కృష్ణస్వామి. అలాంటి కృష్ణస్వామిని ఈ శ్లోకమనే మంత్రంతో ఇక్కడ ఆవాహనం చేస్తున్నాం.

తతః అనే దివ్యశబ్దం ఇక్కడ మొదలయ్యింది. ఈ తతః అనే శబ్దం వాల్మీకి రామాయణంలో చాలా చోట్ల కనిపిస్తుంది. ఇదో గొప్పశబ్దం. తత్ అనే దివ్యశబ్దం గాయత్రీ మంత్రానికెలాగో, ఈతతః అనే దివ్య శబ్దం పార్థసారథి మంత్రానికి మొదలవుతోంది.

'శ్వేతైర్హయైర్యుక్తే' - తెల్లటి గుర్రాలుట.అందం చూడండిక్కడ. స్వచ్ఛమైన గుర్రములు. ఆ తెల్లని గుర్రములతో, 'మహతి స్యందనే' ఒక మహోన్నతమై, ఒక మహోజ్వలమై , మహా మహిమాన్వితమైన స్యందనమునందు ఉన్నారుట ఇద్దరు స్థితే అంటే అది ద్వివచనము.

ఎవరాఇద్దరు ?

'మాధవః పాండవః' మాధవుడు, నారాయణుడు! పాండవః పాండురాజు తనయుడైన అర్జునుడు. వీరు ఉభయులూకూడా దివ్య శంఖాలని పూరించారుట. అలా దివ్యశంఖాలను పూరిస్తున్న నరనారాయణ సాక్షాత్కారం ఇందులో కనిపిస్తున్నది మనకి.

ఇక్కడ స్వామి ఉన్న రథాన్ని తలుచుకుంటే ఇది అర్జుని రథమా, కృష్ణుని రథమా అన్న ప్రశ్న ఉదయిస్తుంది. కృష్ణ రథం ఎలా వచ్చిందో భారతమూ చెప్తోంది, భాగవతమూ చెప్తోంది. కృష్ణపరమాత్మకి ఆ రథం ఎలా వచ్చిందంటే ఆయన సంకల్ప మాత్రమునే ఆకాశం నుంచి దిగి

వచ్చింది. భూమికి సంబంధించింది కాదు. అది ఆకాశం నుంచి అన్ని ఆయుధములతో సహా వచ్చింది. జరాసంధుడితో యుద్ధం చేయాలని ఆయన మధురానగరంలో సంకల్పించుకున్నప్పుడు రెండు దివ్యరథాలు వచ్చాయి. అవి ఒకటి బలరాముడు. ఒకటి శ్రీకృష్ణుడు స్వీకరించారు. ఆ రథాలకి నాలుగు గుర్రాలు కూడా అక్కడి నుంచే అంటే వైకుంఠం నుంచే వచ్చాయి. వైకుంఠం నుంచి బయలుదేరి సూర్యమండలం లోంచి వచ్చాయి. ఆ నాలుగు గుర్రముల పేర్లు సైభ్య, సుగ్రీవ, మేఘ పుష్ప, వలాహకములు వీటి పేర్లు తలుచుకుంటేనే ధన్యులమవుతాము. అలాంటి దివ్యరథంతోనే ఆయన జరాసంధుడితో యుద్ధం దాని తర్వాత అనేక మంది దనుజులతో యుద్ధం చేసారు. ఈ దివ్యరథాన్ని అనేక చోట్ల వర్ణించిభాగవతం పరవశించి పోయింది. అమ్మ రుక్మిణమ్మని తీసుకురావటానికి కూడా ఈ రథంతోనే బయలుదేరాడు.

ఇప్పుడు యుద్ధంలో రథమేది?

అర్జునుడి రథమనే భారతం వర్ణిస్తోంది. అర్జునుడి రథం కూడా అగ్నిదేవుడు ప్రసాదించిన దివ్య రథం. అర్జునుడి రథం గురించి చెప్తున్నప్పుడు కృష్ణుడి రథం ప్రస్తావన ఎందుకు అనిపించవచ్చు మీకు. కాని ఇందులో ఒక రహస్యం ఉంది. ఎప్పుడు అర్జునుడుకి విజయం కావాలనుకున్నా కృష్ణ పరమాత్మ తన రథ శక్తిని ఆవహింపజేసాడుట అతని రథంలో. కృష్ణుడి రథం కేవలం ఒక జడ పదార్థమైన బండి కాదు. అది దేవతాత్మకమైన రథం. దేవతలు మంత్రశక్తితో, భావనాశక్తితో ఆవహింప బడతారు. అందుకు ఆయన తన దివ్యరథ శక్తిని  ఈ రథము నందు ఆవహింపజేసాడు. కనుకే 'మహతి స్యందన స్థితే' అని చెప్పారు మహారథముపై ఉన్నవారు అని వర్ణించటం లో ఇదీ విశేషం.

దీనికి ప్రమాణం ఏమిటి ?

మహాభారతంలోనే విరాటపర్వంలో ఉంది దీని ప్రమాణం. బృహన్నల వేషం తర్వాత అర్జునుడు, శమీ వృక్షం నుంచి ఆయుధాలు స్వీకరించి శోభిస్తూ ఉంటే, ఉత్తరుడు ఆ రథం నడుపుతూ, 'ఇవి వాయువేగ మనోవేగాలవలే వెళుతున్నాయి. ఇవి నేను పట్టుకున్నాను కాని దాన్ని నేను నడుపుతున్నానా అవి నన్ను నడుపుతున్నాయా తెలియటం లేదు, చూస్తుంటే ఈ

గుర్రములు శ్రీకృష్ణుని గుర్రాలైన సైభ్య, సుగ్రీవ, మేఘపుష్ప, వలాహకములు వలె నా కని పిస్తున్నాయి' అన్నాడు. ఉత్తరుడుగొప్ప సారధి. అతను గుర్రాల లక్షణాలని అంచనా వేయగ లడు. అంటే దీని అర్థం, కృష్ణ పరమాత్మ అక్కడికి రాకున్నా, ఆయన సర్వమూ గమనిస్తూ ఉంటాడు.కనుక,విజయుని రధమందు తన రథశక్తిని ఆవహింప జేశాడు. ఎవరు తోలారన్నది ఆయన కనవసరం. ఈ రహస్యాన్ని వ్యాసదేవుడు అక్కడ చెప్పాడు. అక్కడ చెప్పిన ఈ సూచిక ను తీసుకుని ఇక్కడ మనం అన్వయించుకోవాలి. భారతంలో తీర్థానికి తీర్థం, ప్రసాదానికి ప్రసాదం కాకుండా ఆ అన్వయించుకునే విధానం మనకి చేతనవ్వాలి. మహతి స్వందన స్థితౌ అర్థంలో అంత విశేషం ఉంది.

భగవద్గీతలో రధవర్ణన అంటూ జరిగిందంటే శ్రీకృష్ణుడు ఏరథం మీద ఉన్నాడో, ఆ రథం మీదనే జరిగింది. వ్యాసుని ఉద్దేశం మన ఏకాగ్రత నంతటినీ కృష్ణుని మీద నిలపాలని. అందుకే ఎంత యుద్ధాన్ని వర్ణిస్తున్నా, ఆ యుద్ధ మధ్యలో ఉన్న కృష్ణుడ్ని దర్శించాలన్న ఉద్దేశం తోనే తత శ్వేతే... ధనంజయః అన్నారు. శ్వేత వర్ణంతో ఉన్న గుర్రములు తెల్లని గుర్రములు ఈ వర్ణన మహాభారతంలో యుద్ధ సమయంలో వర్ణించారు అన్న విషయం పక్కకి పెడితే, భగవద్గీత అనే బ్రహ్మవిద్యను గ్రహించటానికి ముందు వర్ణించారంటే మాత్రం వేరే కోణంలో చూడాలి. బ్రహ్మ విద్యచెప్పబోయే ఆచార్యుడు ఆ రథం మీద ఉన్నాడు. ఇక్కడ మన అన్వయించుకోవాల్సింది.

భగవద్గీతాసు, ఉపనిషసు, బ్రహ్మ విద్యాయాం యోగశాస్త్రే

అప్పుడు ఈ రథమంతా కూడా ఆత్మానాం రుధినం విద్ధి శరీరం రథం అని ఉపనిషత్తులు ఏవైతే వర్ణించాయో, ఆ విధంగా మనం తెలుసుకోవలసిన అవసరం ఉంది. అందుకే బుద్ధి రూపమైనటువంటి, ఆపగ్నములను నడపవలసినటువంటి ఈశ్వర చైతన్యాన్ని, ఈ శరీరమనే రధాన్ని జీవితమనే కురుక్షేత్రంలో నడిపించమని ఆహ్వానించటానికి ఈ ధ్యానం మనం ఇక్కడ చేయబోతున్నాము. అందుకే ఈ రథవర్ణన అంత ప్రాధాన్యమైనది. అంతేకాక, ఎటువంటి రథము అంటే నాలుగు గుర్రములు కూర్చిన రథం. మనం మనని బ్రతుకులో నడిపించేవి

ఇంద్రియములనుకుంటాం.

ఇంద్రియాని హయాన్యాహుః - కాని ఇంద్రియములు గుర్రములైనప్పటికి కూడా ఆ ఇంద్రియాలనినడిపేవి ప్రధానంగా అంతఃకరణములు. అందుకు ఇక్కడ నాలుగు గుర్రాలు అనగానే మన అంతఃకరణ చతుష్టయాన్నే తీసుకోవాలి. మనో, బుద్ధి అహంకార, చిత్తములు. ఇది నిజానికి ఒకే అంతఃకరణము. ఈ అంతః కరణము ఈశ్వరుడు నడిపేటప్పుడు శ్వేతం అవాలి.అంటే శుద్ధం కావాలి. శ్వేతగుర్రములు అంటే సాత్త్వికమైన గుణములుకల గుర్రములు. ఇలా మనం మన అంతఃకరణని మలుచుకుని ఆయనకి అప్పచెప్పితే ఆయన నడుపుతాడు. ఇక్కడ ఆచార్యుడిగా మనం శ్రీకృష్ణమూర్తిని వరించబోతున్నాం గనుక, ఇటువంటి స్వరూపాన్ని మనం ధ్యానం చేసుకుంటున్నాం.

ఈ దివ్యమూర్తులని ఇంత తనివితీరా వర్ణిస్తున్నాడు. అప్పుడు వాళ్ళు ఊదుతున్న శంఖ ముల పేర్లున్నాయి చూడండి ! అటువైపు శంఖముల పేర్లు చెప్పలేదు. పాండవులు ఊదినటువంటి శంఖాల పేర్లు మాత్రమే చెప్పారు. అంటే పేర్లు చెప్పుకోవలసిన శంఖములు వీరివే అని చెప్పినట్లన్నమాట. మిగిలిన వారివి సామాన్య శంఖములు. కాని వీరికి ఎవరికి వారికే ప్రత్యేక శంఖాలున్నాయి. అంటే ఎవరూ తీసుకోకుండా ఒక పేరు పెట్టుకుని దాచుకు న్నారు పెట్టెలో అని అర్థం కాదు. అది వారి ప్రత్యేకత కోసం పెట్టుకున్న పేరుకాదు. ఆ శంఖ మునకో ప్రత్యేకత ఉంది.

పాండవులంటే ఎవరు?

వాళ్ళు పూర్ణదేవతా స్వరూపులు. పాండవ స్మరణ ఎక్కడ జరుగుతుందో అక్కడ దుర్భిక్షాలు ఉండవు, అతి వృష్టులుండవు, అనావృష్టులు ఉండవు. ఒక్క ఇంద్ర శక్తి ఐదు స్వరూపాలు ధరించింది, ఆ ఇంద్రుని యొక్క భార్య శచీదేవే, అయోనిజగా, ద్రౌపదిగా వచ్చింది. ఎల్లవేళలా ఇంద్రుడిని, సకల దేవతలని రక్షించే నారాయణుడే శ్రీకృష్ణుగా వచ్చాడు. ఇది భారతం చెప్తున్న ప్రధాన విషయం. ఈ విషయం ఆది, సభాపర్వాల్లోనే తేట పరిచారు. ఆ విషయాలు మనం ఇక్కడ గుర్తు తెచ్చుకోవాలి. ఎటువెళ్తున్నా భారతాన్ని మర్చిపోకూడదు. ఒక విషయాన్ని ఒక పుస్త

కంలోంచి లాగినప్పుడు, దానిలో మిగిలిన విషయాల్ని మిగతా చోట్ల చెప్పి ఉంటారు. అందుకు వాటితో వీటిని తేటపరచుకోవాలి.

అందుకే ఈ శంఖముల పేర్లు. ఇవన్నీ మనం తలుచుకుంటే, అవన్నీ అనుగ్రహిస్తే, అప్పుడు మనకి శ్రీకృష్ణ పరమాత్మ ప్రసరించే జ్ఞానం , బుద్ధికి సరిగా వెళుతుంది. శంఖాల పేర్లు తలుచు కుంటున్నాం అంటే ఆ శంఖాలని అధిష్టించిన దేవతల పేర్లు తలుచుకుంటున్నాం అని అర్థం. నారాయణ శంఖమే మనల్ని రక్షించాలనే

**శంఖం సదాహం శరణం ప్రపద్యే**

**గదా సదాహం శరణం ప్రపద్యే**

**చక్రం సదాహం శరణం ప్రపద్యే**

అని అంటున్నామే మరి యిప్పుడు సదాహం శరణం ప్రపద్యే అయిన శంఖాన్ని స్వామి ఊదుతున్నాడు.

**పాంచజన్యం హృషీకేశో.దేవదత్తం ధనంజయః**

హృషీకేశుడు పాంచజన్యమైన శంఖాన్ని ఊదాడట. కృష్ణుడు ఊదిన శంఖం పేరు పాంచజన్యం. నారాయణుని శంఖం పేరే పాంచజన్యం అనాదిగా, కృష్ణుడి శంఖం పేరు కూడా పాంచజన్యం అంటే కృష్ణుడు సాక్షాత్తు నారాయణుడే అని చెప్పటం ఒక అర్థం. ఇంకోటి కృష్ణుడు తన గురువైన సాందీపునికి మృతుడైన శిశువుని బ్రతికించి తెచ్చాడని మనకు తెలుస్తుంది. బాలకుడిని బ్రతికించటాన్ని అతను ఎలా చనిపోయాడని అడిగాడు. సముద్రంలో సంహరింపబడ్డాడు అన్నారు. సముద్రంలో పంచజనుడు అనే రాక్షసుడు ఉన్నాడు.అతను సంహరించాడు. వీడు నత్తవంటి రాక్షసుడు. నత్తమీద శంఖం ఉంటుంది కదా అలాంటి మహారాక్షసుడు అయిన వాడ్ని జయించి వాడి శంఖాన్ని తీసి ఉదాడు. అలా పంచజనుడి నుంచి వచ్చిన శంఖం గనుక పాంచజన్యం అని ఆయన శంఖమునకు పేరు వచ్చింది. అందుకు ఆ ప్రత్యేక మైన శంఖం. ఆయనఆశంఖం ఊదుతూ యమలోకానికీ వెళ్ళి, యముడిని శాసించి ఆ బాలకుడిని

బ్రతికించాడని భాగవతంలో లేదా భారతంలో హరివంశంలో చెప్పబడింది. ఆ పాంచజన్యాన్ని ఊదాడాయన. ఆ పాంచజన్యం దివ్యనాదం

ఆ పాంచజ్యం -

**వనమాలీ గదీశంఖీ శంఖీచక్రీచ నందకీ**

**శ్రీమాన్ నారాయణో విష్ణు వాసుదేవోభి రక్షతు**

అంటున్నాం కనుక శంఖీ అని చెప్పబడుతున్న ఆ పాంచజన్యాన్ని ఆయన నాదం చేస్తే, 'దేవద త్తం ధనంజయః' అర్జునుని శంఖం పేరుదేవదత్తం ధనంజయుడుఅర్జునునికి ధనంజయుడు అని పేరు. దీనిలో ఒక రహస్యం ఉంది. పాండవులు ఇంద్ర తేజస్సుతో వచ్చినటువంటివారు. ఆ ఇంద్రుడు అగ్నియొక్క లక్షణం. అగ్నికి ధనంజయుడని పేరు.అర్జునుడికి ధనంజయుడని పేరు. అర్జునునికి ఆ పేరు ఎందుకు వచ్చిందంటే రాజసూయ యాగంలో ఆయన అనేక మంది రాజులని జయించి, ధనమునంతటినీ జయించి వచ్చాడు అందుకు. ఇది భారతంలో చెప్పబడ్డ అర్థం. ఇంకా సూక్ష్మార్థాలు, తాత్త్వికార్థాలు జోలికి పోవటంలేదు.

ఇక్కడ వినోభా భావేగారి భాష్యం కూడా అన్వయించుకోవచ్చు. ఆయన పాంచజన్య, దేవదత్త అనే పదాలకు చాలా విశేషమైన భాష్యం రాశారు. పంచజనులు అంటే జీవులే పంచజ నులు అన్నారాయన.జనులు అంటే జని ధర్మం కలవారు. మానవులు మాత్రమే జనులు కారు. సృష్టిలో పుట్టిన వన్నీ జనులే. జని ధర్మము అంటే జన్మధర్మము ఎవరికుందో వాళ్ళు అందరూ జనులే, పంచజనులే. పంచజనులంటే పాంచ భౌతిక మైనటువంటి దేహాన్ని ధరించిన జనులు. మనదంతా పంచతో కూడినది - పంచభూతాలూ, వాటికి పంచ తన్మాత్రలు, పంచ జ్ఞానేంద్రి యాలూ, పంచ కర్మేంద్రియాలు అన్నీ పంచతో కూడుకున్నాయి. ఈ పంచ జనులని ప్రేరేపిం చటానికి పలికిన నాదం పంచజన్యం.సర్వజీవులనీ మేలుకొలిపే దివ్యనాదాన్ని ఆయన పలి కాడు.ఇకపోతే దేవదత్తం ధనంజయా! భక్తుడాయన. ఆయన పలికే పలుకులన్నీ దేవదత్తం ఆ దేవుడిచ్చినవే. అందుకే ఆ భక్తుడంత వినయంగా దేవదత్తం దైవము ఇచ్చినది అంటాడు. దేవదత్తం అన్న శంఖం ఊదటం భక్తుడికి ప్రతీక. పాంచ జన్యం భగవంతుడికి ప్రతీక. భగవం

తుడు సర్వజీవులలో వ్యాపించి, సర్వజీవులలో నాదరూపంగా ప్రసరిస్తున్నాడు గనుక ఆయన శంఖం పాంచజన్యం. ఇది సంప్రదాయ బద్ధంగా చక్కగా తీసుకోవచ్చు.

**పాంచజన్యం హృషీకేశో దేవదత్తం ధనంజయః ।**

**పౌండ్రం దధ్మౌ మహాశంఖం భీమకర్మా వృకోదరః ॥ 1-15**

వృకోధరుడు అయిన భీమకర్మా. వృకోధరుడు కూడా అగ్ని విశేషమే ధనుంజయలాగే! జయ అంటే యజ కదా ! యజ అంటే అగ్నిలక్షణమే. వృకోధరుడుని విడదీస్తే వృకము అనే అగ్నిని తన ఉదరమునందు కలవాడు. అలాంటి మహాఅగ్ని ఉండటం చేతనే జీర్ణశక్తి బాగా కలిగిన వాడు ఆయన అందుకే వృకోదరుడ్ని స్మరిస్తే జీర్ణశక్తి పెరుగుతుందట. ఎందుకంటే ఆయన దేవత గనుక. అర్జునుని స్మరిస్తే పిడుగులు లాంటివి తగ్గుతాయిట. అంటే వాళ్ళు దేవతలనే విషయం అందులోనే తెలుస్తుంది కదా.

భీమకర్మ అయినటువంటి భీముడు, భీమకర్మ అంటే అవతల వాళ్ళని భయపెట్టే ప్రతాపం కల భీముడు, పౌండ్రము అనే శంఖాన్ని ఊదాడు.

**అనంతవిజయం రాజా కుంతీపుత్రో యుధిష్ఠిరః ।**

**నకులః సహదేవశ్చ సుఘోషమణిపుష్పకౌ ॥ 1-16**

కుంతీ పుత్రుడైన యుధిష్టరుడు ధర్మరాజు అనంత విజయం అనే శంఖాన్ని ధ్వనింప జేశాడు. నకులుడు, సహదేవుడు సుఘోషము, మణిపుష్పకము అనే శంఖాలను ఊదారు.

**కాశ్యశ్చ పరమేష్వాసః శిఖండీ చ మహారథః ।**

**ధృష్టద్యుమ్నో విరాటశ్చ సాత్యకిశ్చాపరాజితః ॥ 1-17**

**ద్రుపదో ద్రౌపదేయాశ్చ సర్వశః పృథివీపతే ।**

**సౌభద్రశ్చ మహాబాహుః శంఖాన్ దధ్ముః పృథక్ పృథక్ ॥ 1-18**

ఇక అక్కడినుంచి పేర్లులేవు. ఈ పేర్లు మాత్రమే ఎందుకు రాశారు అంటే కేవలం జనరల్ నాలెడ్జికోసం చెప్పినవి కావు. ఆ శంఖచక్రాలనీ, వాళ్ళనీ స్మరించుకోవటము, గీతాశాస్త్రములో మనం ముందు చేసే ఒక శ్వాస ప్రక్రియ వంటిది. వీటిని స్మరించి మనం గీతను పఠిస్తే,

ఒక మంత్రముగా మనని రక్షిస్తుంది. ఎందుకంటే గీత పారాయణ గ్రంథం. ఈ పారాయణ గ్రంథంలో దేవతలు, పరివార దేవతలూ ఉన్నారు కదా! అందుకే గీతలో ధ్యానయోగ్యములైన మంత్రమూర్తులని చెప్తున్నారు. ఎలాగైతే విష్ణుసహస్రనామానికి ప్రారంభంలో భూః పాదౌ యస్య నాభిః వియ దసు రనిలః చంద్ర సూర్యౌచనేత్రే...అని ధ్యాన శ్లోకంలో చెప్పబడుతుందో అలా వీటిని ధ్యానశ్లోకాలుగా మనం భావించాలి.

శంఖనాదం చేస్తున్నటువంటి ఆ నారాయణ స్వామివారిని మనం ధ్యానించాలి.

ఇలా అన్ని శంఖాలు పూరించారు.

**స ఘోషో ధార్తరాష్ట్రాణాం హృదయాని వ్యదారయత్ ।**

**నభశ్చ పృథివీం చైవ తుములో వ్యనునాదయన్ ॥** 1-19

ఇలా ఘోషములతో నభము, పృధ్వి నిండిపోయాయి. భూమి ఆకాశములు దద్దరిల్లు తున్నాయి ఆ సమయంలో

**అథ వ్యవస్థితాన్ దృష్ట్వా ధార్తరాష్ట్రాన్ కపిధ్వజః ।**

**ప్రవృత్తే శస్త్రసంపాతే ధనురుద్యమ్య పాండవః ॥** 1-20

ఆయన తన గాండీవ ధనుస్సుని శస్త్రాస్త్రములని సిద్ధంచేసుకుని శ్రీకృష్ణపరమాత్మని అడుగుతున్నాడు.

**హృషీకేశం తదా వాక్యమ్ ఇదమాహ మహీపతే ।**

**అర్జున ఉవాచ**

అర్జునుడు పలుకుతున్న తొలిపలుకులు

**సేనయోరుభయోర్మధ్యే రథం స్థాపయ మేచ్యుత ॥** 1-21

ఓ అచ్యుతాడా! రెండు సేనల మధ్య నా రథాన్ని ఉంచు. అటుకీ చెందక, ఇటుకీ చెందక రెండు సేనల మధ్య ఉండి పరిశీలన చేయబోతున్నాడు.

**యావదేతాన్ నిరీక్షేహం యోద్ధుకామానవస్థితాన్ ।**

**కైర్మయా సహ యోద్ధవ్యమ్ అస్మిన్ రణసముద్యమే ॥** 1-22

**యోత్స్యమానానవేక్షే ఽహం య ఏతే ఽత్ర సమాగతాః ।**

**ధార్తరాష్ట్రస్య దుర్బుద్ధేః యుద్ధే ప్రియచికీర్షవః ॥** 1-23

ధార్తరాష్ట్రస్య - 'ధృతరాష్ట్రుడి పుత్రుడైన దుర్యోధనుడికి ప్రియము చేకూర్చాలని ఎవరెవరైతే అక్కడ చేరారో, వారు ఎవరో, ఎవరితో నేను యుద్ధం చేయాలో, గ్రహించటానికి గాను, వారిని పరిశీలిస్తాను. అందుకని రథాన్ని ఉభయసేనల మధ్య నిలువు'మని అడిగాడు.

కృష్ణుడేమి చేసాడో సంజయుడు ధృతరాష్ట్రుడికి చెప్తున్నాడు.

**సంజయ ఉవాచ**

**ఏవముక్తో హృషీకేశో గుడాకేశేన భారత ।**

**సేనయోరుభయోర్మధ్యే స్థాపయిత్వా రథోత్తమమ్ ॥** 1-24

**భీష్మద్రోణప్రముఖతః సర్వేషాం చ మహీక్షితామ్ ।**
**ఉవాచ పార్థ పశ్యైతాన్ సమవేతాన్ కురూనితి ॥** 1-25

హృషీకేశునితో గుడాకేశుడు ఇలా చెప్పాడన్నాడు.

కృష్ణుడికి వాడిన శబ్దం హృషీకేశ, అర్జునికి వాడి శబ్దం గుడాకేశ. హృషీకేశుడు అంటే ఈయనే నారాయణుడు అని వ్యాసుడు ఎలా చెప్పేస్తున్నాడో చూడండి. అచ్యుత, కేశవ అన్న మాటలతో నారాయణుడే కృష్ణుడు అన్న మాటలని స్పష్టం చేస్తున్నారు. స్థాపయమేవ అచ్యుత రథాన్ని ఇక్కడ పెట్టు అనటంలో అర్థం నిన్ను నమ్ముకున్నవాళ్ళు జారిపోరు అనటం. అచ్యుత అంటే జారడు, జారనివ్వడు. చ్యుతము కానివాడు అచ్యుతుడు.

అటువంటి అచ్యుతునితో ఇలా పలికితే ఆ హృషీకేశుడు ఆ రథాన్ని తీసుకొచ్చాడు.

హృషీకేశః అంటే ఏమిటి?

హృషీకములు అంటే ఇంద్రియములు. ఇంద్రియములకు, ఎవడు ఈశ్వరుడో, శాసకుడో 'ఈశ్వర సర్వభూతేషు ఉద్దేశే అర్జున సర్వ హృదయాంతరవర్తియై ఇంద్రియముల యందు చైతన్యాన్ని ప్రసరింపచేస్తున్న పరమాత్మయే హృషీకేశుడు.

గుడాకేశ అంటే ?

అర్జునుడు గుడాకేశుడు. గుడాకేశుడు శబ్దానికి రెండు అర్థములు ఉన్నాయి. గుడా కేశ. గుడా అనే శబ్దానికి గూఢములైనవి అంటే ఒత్తుగా ఉన్న, కేశః అంటే కేశములు కలిగిన వాడు. పై పై అర్థం తీసుకుంటే ఒత్తైన జుట్టు కలవాడు అని.

ఇంకో అర్థం గుడాకము అంటే నిద్ర అని ! గుడాకేశా అంటే నిద్రని వశపరచుకున్న వాడు, లేదా నిద్రని జయించినవాడు. నిద్రని జయించిన వాడు అర్జునుడు. నిద్ర అంటే తమో గుణము. తమోగుణాన్ని జయించిన వాడే యుద్ధం చేయటానికి అర్హుడవుతాడు కదా ! సరిగ్గా బాణం వేస్తున్నప్పుడు ఆవలింత వచ్చింది ఏం చేయను అనలేడు కదా ! అందుకని గుడాకేశు డు అంటే, అప్రమత్తంగా ఉన్నవాడు అని అర్థం. ఇంగ్లీషులో చెప్పాలంటే ఎలర్ట్‌గా ఉన్నవాడు. యుద్ధం చేసే మహా యోధుడికి ఉండవలసిన లక్షణం గుడాకేశవత్వం. నిద్ర అంటే నిన్ను మర పించేది అని అర్థం. దానిని జయించేవాడు అంటే బుద్ధిని ఏకాగ్రంగా ఉంచేవాడు.

చెప్పబోతున్నది బ్రహ్మవిద్య. బ్రహ్మవిద్యకి కావలసినది గుడాకేశవత్వం. ఆ శబ్దం అక్కడ వేయటంలో విశేషం ఏకాగ్రతతో వినాలి. కొంత మందికి బ్రహ్మవిద్య పేరు చెపితే చాలు ఎక్కడ లేని నిద్ర వస్తుంది. అందుకు బ్రహ్మవిద్యకి ప్రధాన అర్హత గుడాకేశః.

ఇక్కడ కృష్ణ పరమాత్మ తీసుకు వెళ్ళబోతున్నాడు రథాన్ని తీసుకెళ్ళబోతున్నప్పుడే అర్జునుని లక్షణాన్ని చెప్తున్నాడు. శిష్యుడు ఎలా ఉండాలి ? గుడాకేశుడై ఉండాలి. అంటే తమో గుణమైన నిద్రని జయించి ఏకాగ్రతతో ఉండాలి.

మళ్ళీ ఒకసారి ఈ శ్లోకాన్ని చూస్తే

**ఏవముక్తో హృషీకేశో గుడాకేశేన భారత ।**

**సేనయోరుభయోర్మధ్యే స్థాపయిత్వా రథోత్తమమ్ ॥** 1-24

రథాన్ని ఉభయ సేనల మధ్య నిలిపి ఉంచాడు. అప్పుడాయన చుట్టూ చూస్తున్నారు.(సశేషం)

శ్రీకృష్ణ శరణం మమ.

# గీతామృతం

అర్జునవిషాదయోగం - 3

## ప్రవచనం - బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

విలేఖనం : మద్దూరి రాజ్యశ్రీ

తత్రాపశ్యత్ స్థితాన్ స్థితాన్ పార్థః పితౄనథ పితామహాన్ ।
ఆచార్యాన్ మాతులాన్ భ్రాతౄన్ పుత్రాన్ పౌత్రాన్ సఖీంస్తథా । 26
శ్వశురాన్ సుహృదశ్చైవ సేనయోరుభయోరపి ।

పార్థః - పార్థుడైన అర్జునుడు ఎవరిని చూసాడు? తండ్రి స్థానంలో ఉన్నవారిని, అటుపై పితా మహః తాతలని, ఆచార్యులని, మేనమామలని సోదరులని, పుత్రస్థానీయుల్ని, పౌత్రస్థానీ యుల్ని, మిత్ర స్థానీయుల్ని భావమరుదుల స్థానీయుల్ని, స్నేహితుల స్థానీయుల్ని, సేనయోరు భయోరపి. అటూ ఇటూ కూడా చూశాడు. వీరు కొట్టేవారు వారు కొట్టబడేవారు. అటైనా ఇటై నా ఒకటే. అందుకు తాను అందరినీ చూసి

తాన్ సమీక్ష్య స కౌంతేయః సర్వాన్ బంధూనవస్థితాన్ । 27
కృపయా పరయానిష్టో విషీదన్నిదమబ్రవీత్ ।

తాన్ సమీక్ష్య - అందరినీ స్టడీచేసి , అక్కడ బంధువుల్ని చూసి, కృపయా పరయావిష్టో అపరిమితమైన జాలి కలిగింది. ఈ జాలి కరుణకాదు. అది మమ అనే భావంచేత కలిగిన ఒక జాలి. అటువంటి జాలితో విషీదన్ని దమబ్రవీత్ - విషాదాన్ని పొంది ఇలా పలుకుతున్నాడు.

అర్జునుడి ప్రత్యేకత ఏమిటి ?

దుఃఖం, విషాదం ఇదే జ్ఞానానికి తొలిమెట్టు. వివేకానికి తొలిమెట్టు. అంటే విషాదం గొప్ప దనికాదు అర్థం. విషాదాన్ని కూడా యోగం చేసుకోగలిగాడుఅర్జునుడు. కొందరికి విషాదం విషాదమే. అర్జునునికి విషాదం యోగం అయింది. అదీ విశేషం. ఎందుకంటే ఆ విషాదం ఆయన దగ్గర అయింది. అంటే ఏడుపు ఈశ్వరుడి దగ్గర ఏడిస్తే అది యోగం అవుతుంది.

ఇంకెక్కడైనాఅయితే అది ఏడుపుగానే మిగిలిపోయేది. ఆ ఏడుపు జీవితంలోంచి వచ్చిందే. ఏడుపు మామూలు విషయమే అయినా అది కృష్ణ పరమాత్మ దగ్గర అయింది కాబట్టి విషాదం యోగమై, కర్మయోగమై,భక్తియోగమై , జ్ఞానయోగమయింది. ఆ విషాదం ఆ తపన.

పరీక్షలోకాన్, కర్మచితాన్, బ్రాహ్మణో నిర్వేదం అని ఉపనిషత్తులు చెప్తున్నాయి. కర్మ చితమైన లోకాన్ని చూసి జ్ఞాని, నిర్వేదాన్ని పొందుతున్నాడు. నిర్వేదమంటే వైరాగ్యము. వైరాగ్యమెందుకు వచ్చింది ?

పరీక్షలోకాన్, కర్మచితాన్ - కర్మచేత వండబడుతున్న లోకాలను చూస్తే వచ్చిందిట ఆ వైరాగ్యం. మరి మనమూ ఆ లోకాలను చూసినా మనకెందుకు రాలేదంటే మనది పరీక్ష కాదు. పరితః ఈక్ష. సమగ్రంగా లోకాన్ని పరీక్షిస్తే వైరాగ్యం వస్తుంది కాని మనకది చాత కాదు. అలా వచ్చిన వైరాగ్యాన్ని నిర్వేదము అంటారు. నిర్వేదమే ఎప్పటికన్నా వేదాంతానికి ఆలంబన మయింది.

ఎందరి నిర్వేదాలున్నాయో మనకి!

రాముని నిర్వేదం వసిష్ఠుడి చేత యోగ వాసిష్టం చెప్పించింది. బలి చక్రవర్తికి ఒకసారి నిర్వేదం వచ్చిందట. ఎన్నేళ్ళు పాలించినా ఈ భూలోకాన్ని, త్రిలోకాల్ని, ఇదే శరీరం, ఇదే భోగం, ఇవాళ ఒక పదిమందిని కొడితే, మరుసటి రోజు మరో వంద మందిని కొట్టటం, ఏమి సాధించాను, ఇలా ఎంతకాలం, తినటం, తిరగటం ఎటుపోతున్నాం ? ఇలాటి ప్రశ్నలు వేసుకుంటే కలిగేది నిర్వేదమే ! కాని ఆ నిర్వేదమే జ్ఞాన స్థితి కాదు.

నిర్వేదం నుంచి జ్ఞానం వైపు ప్రయాణించాలి. అప్పుడు శుక్రాచార్యుల వారు వచ్చి జ్ఞానాన్ని బో ధించారని ఉంది. ఆ ప్రాతిపదిక ఉంది గనుకనే, అహంకారం వదిలించటానికి అప్పుడొక ఆచా ర్యుడు దిగాడు. అతనే వామనుడు.

రాముడి నిర్వేదం రామాయణంలో రాలేదే ?

యోగవాసిష్టం అని విడిగా ఎందుకు వచ్చింది ? ఎవరో రాసేసి రాముల వారి పేరు పెట్టారా అన్నారు కొందరు. ఇలాంటి మీ మాంసలు సంప్రదాయం తెలియక పోవటం వల్ల వస్తాయి.

ముందే చెప్పుకున్నాం కదా ! కావ్యం వేరు, పురాణం వేరు అని. రామాయణం కావ్యం కనుక. వాల్మీకి అందులో గీతని వ్రాయలేదు. అందుకు ఆ గ్రంధాన్ని వాల్మీకి మళ్ళీ ప్రత్యేకంగా యోగవాసిష్టంగా రచించారు. మహాభారతంపురాణ సంప్రదాయంగా రచించారు గనుక అందులో గీత వచ్చింది. ఇంతకీ వసిష్ఠుల వారు
రాముడి నిర్వేదాన్ని వేదాంతంగా చూపించారు. వేదాంతంగా చూపించకపోతే కర్మ భ్రష్టత్వం ఎలా వస్తుంది ?

ఒకాయనకి వేదన కలిగి,ప్రపంచమంతా దుఃఖమయమే, బాల్యం, యవ్వనం, కౌమార్యం ఈ సుఖములన్నీ అశాశ్వతములే అన్న నిర్వేదం కలిగింది. క్షత్రియుడైన వాడికి, నిర్వేదం కలగడం బాగానే ఉంది కాని సరియైన గురువు దొరకక పోవటంతో పాపం ఆయన భార్యా బిడ్డలని విడిచి పెట్టేసాడు. ఏదో చెట్టుకింద కూర్చున్నాడు. ఏదో జ్ఞానం వచ్చింది. అది ఆయనకి వచ్చింది కాని అవతల వాళ్ళకి చెప్పే సరికి పొరపాటయింది. అవైదిక సిద్ధాంతం మొదలైపోయింది కాని ఇక్కడ అదృష్టవశాత్తు ఈ నిర్వేదం స్వధర్మ భష్టత్వం కలిగించకుండా చేసింది. ఎవరి గురించి అన్నది విడమరచి చెప్పక్కరలేదు. ఎందుకది అవైదికమత మన్నారో ఇప్పుడర్థమై ఉంటుంది.

వేదనా, వైరాగ్యం జ్ఞానమనుకోవచ్చా?

మనకు తాత్కాలికంగా వైరాగ్యం కలుగుతుంది.అది మోహం వల్లకావచ్చు, దేని వల్లనైనా కావచ్చు. ప్రపంచమంతా మిధ్య అని తెలిసిపోయిందిఅనుకుంటాం అది ఎంతసేపు ? ఆరోజేదో దుఃఖకరమైన విషయం జరిగింది కనుక వచ్చింది. రేపొద్దున్న మారో సుఖం వస్తే ఇంత వైరాగ్యం మాయమై పోతుంది. కాబట్టి ఈ వైరాగ్యాన్ని లెక్కలోకి తీసుకోకూడదు. వేదన వల్ల కలిగిన వైరాగ్యాన్ని పాజిటివ్ వే వైపు తిప్పాలి. అది కూడాసామాన్యంగా కలగదు. కొంత దైవీ ప్రకృతి ఉంటేనే కలుగుతుంది. అయ్యో లోకం ఇలా ఉన్నదా అని అనుకున్నాడు. అంటే కొంతదైవీ ప్రకృతి వాడిలో ఉంది కదా ! అలా రగిలిన ఈ వైరాగ్యపు మంటను ఒక దీపంలా ప్రజ్వలింపజేసి అజ్ఞానాంధకారాన్ని తొలిగించే విధంగామలచగలిగేటటువంటి శిక్షకుడైన ఆచార్యుడు

దొరికితే వాడు బాడుపడతాడు. రాముడికి వసిస్టుడి వంటి ఆచార్యుడు దొరికాడు, అర్జునుడికి వేరే ఏదో శాస్త్రాన్ని తీసుకు రానక్కరలేదు. భగవద్గీత చాలు. వైరాగ్యం వచ్చిన వెంటనే, స్వధర్మాన్ని భ్రష్టం చేసే వేదాంత వచనాలు చెప్పక్కరలేదు. వేదాంతంలోనే స్వధర్మంలో నిలవ వచ్చు అని చెప్పిన గ్రంథం భగవద్గీత. అందుకు శంకరులు దీనిని వ్యాఖ్యానించి అవైదిక మతాలని ఖండించటం లోని ఆంతర్యమిది. అదీ విశేషం.

వేదాంతమంటే ఏమిటి ?

మరో విశేషమేమిటంటే పనులన్నీ అయిపోయాయి. చెట్టుకింద కొచ్చాను, మీరు చెప్తారా అని అర్జునుడు మఠం వేసుకుంటే, చెప్తాను నాయనా అని కృష్ణుడు మఠం వేసుకుని చెప్పలేదు. మంచి యుద్ధభూమిలో చెప్పాడు. వేదాంతం ఎప్పుడవసరం? యుద్ధ భూమిలోనే అవసరం. అంటే కర్మక్షేత్రంలో వేదాంతం అవసరం. పని చేస్తున్నవాడికి అవసరం కాని, పనినుంచి విశ్రమించిన వాడికి కాదు. అంటే భారతీయ వేదాంతం కర్మని ప్రబోధం చేసేదే తప్ప, కర్మనుంచి జార్చేది కాదు. కర్మని ఎలా చెయ్యాలో ఒక క్లారిటీ ఇవ్వటానికి వేదాంతం. కర్మాచరణకి ఒక స్పష్టమైన అవగాహన యిచ్చి, ఒక లక్ష్యనిర్దేశం చేసి, ఎటువైపు వెళుతున్నావ్, ఎందుకు వెళుతున్నావ్,ఏది సాధించాలని వెళుతున్నావ్ అది దృష్టిలోపెట్టుకుని వెళ్ళు అని చెప్పేది వేదాంతం. అందుకే భారతీయ వేదాంతం ప్రాక్టికల్ అని మనం భగవద్గీత ఆధారంగా చెప్పుకుంటున్నాం. అందుకే ప్రస్తాన త్రయంలో భగవద్గీతకి అంత దివ్యమైన స్థానం ఉంది. అటు ఉపనిషత్తుల్లో చెప్పబడ్డ వేదాంతం ఇటు బ్రహ్మసూత్రాల్లో చెప్పబడ్డ వేదాంతం ఈ రెండింటిని జీవితానికన్వయించు అని చెప్పేది భగవద్గీత. అందుకు వేదాంతాన్ని జీవితాన్నికి అన్వయించే శాస్త్రమే భగవద్గీత.

భగవద్గీత కున్న గొప్ప తనమేమిటి ? బోధన గొప్పదనం ఒక వైపుంటే, సన్నివేశం గొప్పదనం మరియొకవైపు. యుద్ధభూమిలో బోధింపబడటమనే సన్నివేశమే భగవద్గీత గొప్పదనం. అందుకే కర్మవీరుల కోసం పుట్టింది భగవద్గీత. కర్మలు ఎలా చెయ్యాలో, ఏ దిశగా చెయ్యలో బోధించటానికి పుట్టింది భగవద్గీత, జీవితానికి వేదాంతాన్ని అన్వయించటానికిపుట్టింది భగవ

ద్గీత అనే దృష్టితో పరిశీలించమని వ్యాసదేవుడు యుద్ధం నుంచే ప్రారంభించాడు దీన్ని. అర్జు నుడి దుఃఖం నుంచి డైరెక్టుగా మొదలెడతారు.

అర్జునుని విషాదం ఎటువంటిది?

అతని విషాదం యోగంగా పరిణమించింది. యోగ శబ్దానికి అనేక అర్థములున్నాయి. యోగము అంటే కలయిక, ఉపాయము, సాధన అని ఏదైనా చెప్పచ్చు. ఉపాయము సాధన ఇంచుమించు ఒకటే. అందుకే యోగమంటేఉపాయము. ఇక్కడ విషాదం ఉపాయంగా మల చబడుతోంది. ఇక్కడ అర్జునుడు ఇప్పటివరకూ విషాదంలో కలిసి ఉన్నాడు. కాని దాన్ని ఉపా యంగా మలుచుకుంటున్నాడు. జ్ఞానమునకుసాధనా దశగా మలుచు కుంటున్నాడు. శోకం లోంచి వేదన తీరి తపన వస్తే దానిలోంచి బోధన వస్తుంది. ఇక్కడ విషాదం ఆయన వేదనని తెలియజేస్తుంది. ఆ విషాద స్వరూపాన్ని మనం పరిశీలించినప్పుడు ఇది నిజానికి బ్రహ్మసూ త్రములు. ఏవిధంగా ప్రారంభమయ్యాయా గీత అదేవిధంగా ప్రారంభమవుతుంది. ఎందుకంటే రెండూ బ్రహ్మవిద్యలే బోధిస్తాయి కాబట్టి.

శిష్యునికి ఉండవలసిన అధికారములు ఏమిటి?

మనం గమనించవచ్చు. వేదనే మొదటిఅధికారం అంటే తెలిసి ఉండాలి. ఆ తపన లోంచి రావాలి అధికారములు అథ, అథః, బ్రహ్మ జిజ్ఞాన అని చెప్పినట్లు మొదట ఉండవలసినది అటుపిమ్మట జిజ్ఞాస అని ఆ సూత్రమున కర్థం. ఏ పిమ్మట అంటే అధికారం సంపాదించు కున్న తర్వాత ..

ఏ అధికారం ?

నాలుగు విధాలైన అధికారాలు సాధన చతుష్టయ సంపత్తి. అందులో ప్రధానంగా -

నిత్యానిత్య వివేకము

యాముత్రాత్త భోగ విరాగము

శమదమాది షడ్గుణ సంపత్తి

తితీక్ష

ఇక్కడ అర్జునుని మాటలు జాగ్రత్తగా పరిశీలిస్తే అతని వేదనలో ఈ లక్షణాలు కనిపిస్తాయి. ఆ లక్షణాలు కనిపెట్టాడు కనుకనే కృష్ణ పరమాత్మ గురువుగా ఉన్నాడు.

ఏవ ముక్త్వా...... బంధూ నవ స్థితాన్ 1-24 - 1-27

మొదలైన శ్లోకాలు అయిన తర్వాత

కృపయా పరయావిష్టో నిషీదన్నిద మబ్రవీత్. 1-28

ఒక విధమైన జాలి మనసుకి లేదా బేల మనుసుకి వెళ్ళి 'విషీదని' - విషాదంలో ఇలా అంటున్నాడు అర్జునుడు.

అర్జున ఉవాచ

దృష్ట్వేమం స్వజనం కృష్ణ యుయుత్సుం సముపస్థితమ్ । 28

మొదట అన్నది స్వజనం నాజనులు, నావాళ్ళు. ఇటైనా, అటైనా ఎందుకంటే రెండింటికి మధ నిలబడ్డాడు. ఇక్కడ ఈయనకి కొత్త రకమైన స్వభావం వచ్చింది. ఏమిటది? వేదన!యుద్ధభూమికి ఎలా వచ్చాడు ? ఎలాగైనా వాళ్ళని జయించుతానని. అప్పటి వరకూ వాళ్ళపట్లద్వేషమనే ప్రవృత్తి ఉండేది.ఇక్కడికి వచ్చేవారికిఅది రాగంగా మారుతున్నది.రెండూ ప్రవృత్తులే?మొదటి ద్వేష వృత్తిఅయితే ఇది మమ అనే వృత్తి. ఈ రెండు వృత్తులనుంచి అతను శరణాగతి అనే వృత్తికి ఎదగాలి, ద్వేషవృత్తిలో వచ్చినవాడు రాగవృత్తిలోకి మారిపోయాడు. 'స్వజనం' అనే మాట వచ్చిందీతనికి. నావారు ఇక్కడ ఉన్నారు. వీళ్ళను చూడగానే

సీదంతి మమ గాత్రాణి ముఖంచ పరిశుష్యతి ।

వేపథుశ్చ శరీరే మే రోమహర్షశ్చ జాయతే। 29

గాండీవం స్రంసతే హస్తాత్ త్వక్చైవ పరిదహ్యతే ।

నచ శక్నోమ్యవస్థాతుం భ్రమతీవ చ మే మనః । 30

ఇది రాగము చేత, శోకము చేత కలిగిన శరీరక అవస్థ. నా శరీరమంతా దేనికదే విడిపోతున్నట్టున్నది. సంధుల నుంచి చీలిపోతున్నట్లుగా ఉంది. నోరు ఎండిపోతోంది, శరీరం వణికిపోతోంది. వళ్ళు గగుర్పొడుస్తోంది నా గాండీవం జారిపోతోంది అంటున్నాడు. అంటున్నవాడు

సామాన్యుడు కాడు. కిరీటి, విజయుడు. తన ప్రతాపంతో పరమశివుని మెప్పించిన వాడు, స్వర్గ లోకానికి ఈ శరీరంతో వెళ్ళి వచ్చినవాడు. అటువంటి వాడు అంటున్నాడంటే, అటువంటి వాడిని కూడా కదిలించగల మోహం యొక్క బలం ఎలాంటిదో ఊహించుకోవచ్చు. ఆయన భయపడుతూ 'త్వక్చైవ పరిదహ్యతే!' శరీరమంతా మంట లెక్కిపోతున్నాను. 'నచ, శక్నోమ్యవ స్థాతుం' నిలబడలేక పోతున్నాను. 'భ్రమతీవచమేమనః' నామనస్సు తిరుగుతోంది అటు ఇటు.

నిమిత్తాని చ పశ్యామి విపరీతాని కేశవ ।
న చ శ్రేయోఽనుపశ్యామి హత్వా స్వజనమాహవే । 31

అనేక దుర్నిమిత్తాలు కూడా నాకు గోచరిస్తున్నాయి. మన మనస్సులు నిమిత్తానిచ పశ్యామి' దుఃఖం ఉంటే, మనకి కనిపించే వన్నీ అపశకునాలుగానే ఉంటాయి. నచశ్రేయోను శ్యామి ఎక్కడా నాకు శ్రేయస్సు ఉన్నట్లుగా అనిపించటం లేదు. ఎందువల్ల? స్వజనమాహవే నావార్ని యుద్ధంలో చంపటంవల్ల మరినీకు యుద్ధం అక్కర లేదా, రాజ్యం అఖ్కరలేదా అంటే

న కాంక్షే విజయం కృష్ణ న చ రాజ్యం సుఖాని చ ।
కిం నో రాజ్యేన గోవింద కిం భోగైర్జీవితేన వా । 32
యేషామర్థే కాంక్షితం నో రాజ్యం భోగాః సుఖాని చ ।
త ఇమేఽవస్థితా యుద్ధే ప్రాణాంస్త్యక్త్వా ధనాని చ। 33

దుర్యోధనుడు మాట్లాడినదానికి, అర్జునుడు కృష్ణుడితో మాట్లాడినదానికి ఎంత బేధం ఏమిటి? అది వాళ్ళ ప్రవృత్తులలో ఉంది. అక్కడ నాకోసం ప్రాణాలు వదలటానికి సిద్ధంగా ఉన్నవారు అన్నాడు. ఈయనేమంటున్నాడు? నేను ఎవరికోసం యుద్ధం చేయాలనుకుంటున్నానో వారంతా ఇక్కడే ఉన్నారు అన్నాడు. అదీ వీళ్ళిద్దరికీ లేదా ! ఇవి ఎందుకు చెప్పారు? ఏకంగా ఎందుకు భగవాన్ ఉవాచ మొదలెట్టలేదు అంటే ఇందుకే ! వాళ్ళ ప్రవృత్తులలో తేడాని మనం గమనించి, ఎవరికి కృష్ణ పరమాత్ముని శిష్యునిగా అయ్యే అర్హత ఉందో గమనించటానికే. అర్జునుడిలో దైవీ ప్రకృతి ఉంది. అందుకే వేదనలో మోహం ఉన్నప్పటికీ ఉత్తమ

మైన సంస్కారం లేకపోలేదు. ఆ సంస్కారమే అతన్ని కృష్ణుడిగా శిష్యునిగా మలచటానికి కావలసిన యోగ్యతనిస్తున్నది.

ఆచార్యాః పితరః పుత్రాస్త తథైవ చ పితామహాః ।
మాతులాః శ్వశురాః పౌత్రాః శ్యాలాః సంబంధినస్తథా । 34

ఎటువంటి వారున్నారు. ఆచార్యులు, తండ్రులు, తాతలు, మేనమామలు, బావలు, మనుమలు మొదలైన వారంతా ఉన్నారు.

ఏతాన్న హంతుమిచ్ఛామి ఘ్నతోఽపి మధుసూదన ।
అపి త్రైలోక్యరాజ్యస్య హేతోః కిం ను మహీకృతే । 35

వాళ్ళని, చంపటం నాకిష్టం లేదు. మరి వాళ్ళు నిన్ను చంపితే ? చంపుకోనీ ? ఘనతోసి చంపినా నాకు చంపాలని లేదు. నాకెందుకు చెప్పు రాజ్యములు, ముల్లోకములు కూడా !

నిహత్య ధార్తరాష్ట్రాన్నః కా ప్రీతిః స్యాజ్జనార్దన
పాపమేవాశ్రయేదస్మాన్ హత్వైతానాతతాయినః । 36

వీళ్ళు ఆతతాయిలే (దుష్టులు) అందులో సందేహం లేదు. కాని నా వాళ్ళు. నావాళ్ళని చంపుకున్నాక అది దోషం కిందే నేను భావిస్తున్నాను. ఇక్కడ పాపశబ్దానికి దోషం అని అర్థం. దోషం గానే భావిస్తున్నాను. ఆతతాయినః - అంటే ఆతతాయి లైనటువంటివారు. ఆత తాయి లైనటువారిని ఆలోచించకుండా చంపవచ్చు. మనువు ధర్మ శాస్త్రంలో చెప్పిన విషయం ఇది. ఆతతాయిలంటే ఎవరు ?

అగ్నిదో గరదశ్చైవ క్షేత్రదారాపహారకః

అగ్నిదోగరదశ్చైవ నిప్పుపెట్టి హింసించువారు, విషం పెట్టువారు, క్షేత్రదారాపహారకః - మనయొక్క భూములను, స్త్రీలును అపహరించువారు. ప్రాణాపహారి, ధనాపహారి, వీరిని ఆతతాయిలంటారు. వీరిని అవిచారయన్ ఆలోచనలేకుండా చంపినా పాపమురాదు అని శాస్త్రం. కౌరవులకి ఈ మాట అక్షరాలా సరిపోతుంది. కౌరవులు ఈ ఆరు పనుల్లో చేయని దేమిటి ? లాక్షాగృహంలో దహనం చేశారు. విషం పెట్టి పడేశారు. ప్రాణం ధనం కూడా అప

హరించారు. అలాంటివారు ఆత తాయినులే ! అలాంటి వారి మీద దయచూపిస్తావా అంటే అయినా దయ చూపిస్తానంటున్నాడు. ధర్మశాస్త్రం చెప్పినదాన్ని మించిపోయిన మోహం ఒకటి వస్తోంది వివరరగా అదేదో గొప్ప అనుకుంటున్నాడు. అదీ విశేషం. ఇంకో విశేషం ఏమిటంటే ఆయనలో ఉన్న ఉత్తమ సంస్కారంతో బాటు మోహం వల్ల కలిగిన అజ్ఞానం కూడా ఉంది. అందుకు బోధ అవసరమైంది. ఆవేదనే జ్ఞానంతో కూడుకునుంటే బోధన ఎందుకు ? అందుకే జ్ఞానంకి వేదన రగుల్కొల్పుతుందే తప్ప వేదనే, జ్ఞానం కాదు. చాలా మంది వైరాగ్యంలో ఉన్నప్పుడు ఏదీ శాశ్వతంకాదు అంటారు. దాన్ని జ్ఞానం అనరు. దాన్ని విరక్తి అంటారు. విరక్తి వేరు, జ్ఞానం వేరు. అందుకని విరక్తి కలిగిన వాడిని జ్ఞాని అనుకుంటే అదో పెద్ద అజ్ఞానం. అందుకు ఇతనికి కలుగుతున్న ఆవేదనలో ఎంత వరకు మోహపు అజ్ఞానపు పాళ్ళు ఉన్నాయి, ఎంతవరకు జ్ఞానం కలగటానికి కావల్సిన యోగ్యత ఉంది ఈ రెండూ పరిశీలించి, అజ్ఞానపు పాళ్ళను పక్కకు తీసి, ఆజ్ఞానం యోగ్యతను పైకి తీసి, ఆయోగ్యత నుంచి యోగంవైపు తీసుకెళ్ళే ఆచార్యుడు అక్కడఉన్నాడు అదీ అతని అదృష్టం.

తస్మాన్నార్హా వయం హంతుం ధార్తరాష్ట్రాన్ స్వబాంధవాన్ ।
స్వజనం హి కథం హత్వా సుఖినః స్యామ మాధవ । 37

ఇక్కడ అర్జునుడి వేదనలో దైన్యంలో ఒక విధమైన అహం కనిపిస్తుంది మనకి. జాగ్రత్తగా పరిశీలిస్తే ఏమని ? తానాలోచిస్తున్న విధానం చాలా కరెక్టు అనుకుంటున్నాడతను. ఇక్కడ ఇలా వీరిని సంహరించటం 'సుఖినః స్యామ మాధవా' అలా వారిని సంహరించి నేనెలా సుఖపడతాను చెప్పు అంటున్నాడు?

యద్యప్యేతే న పశ్యంతి లోభోపహతచేతసః ।
కులక్షయకృతం దోషం మిత్రద్రోహే చ పాతకమ్ । 38

మరి వాళ్ళు అలా చేసినప్పుడో అంటే, వాళ్ళు లోభము చేత చేస్తే చేయవచ్చు కాని మనం వివేకవంతులం కదా, మనం అలా చేయవద్దు అంటున్నాడు.

కథం న జ్ఞేయమస్మాభిః పాపాదస్మాన్నివర్తితుమ్ ।

కులక్షయకృతం దోషం ప్రపశ్యద్భిర్జనార్దన । 39

మనం చాలా తెలివైన వాళ్ళం గనుక ఈ పాపము నుంచి తొలగటం మంచిది ఎప్పుడొచ్చిందీ ఆలోచన ?

ఇన్ని జరిగాక, యుద్ధభూమి కొచ్చాక, తనకి వివేకం ఉందనుకుని మాట్లాడుతున్న మాటలివి. అది వివేకమా ? యుద్ధ భూమిలో సరిగ్గా యుద్ధం చేసే ముందు, అలా మాట్లాడటం వివేకం అనిపించుకుంటుందా ? తనదేమో వివేకం అనుకుంటున్నాడా ? వాళ్ళనేమో 'లోభోప హత చేతసః' అంటున్నాడు లోభం చేత దెబ్బతిన్న చిత్తంగల కౌరవులుట వాళ్ళు. వాళ్ళు చేస్తే చేయని మనంమాత్రం చేయకూడదు. అంతేకాదు ఇక్కడొక గొప్పధర్మం చెప్తున్నాడు.

కులక్షయే ప్రణశ్యంతి కులధర్మాః సనాతనాః ।
ధర్మే నష్టే కులం కృత్స్నమ్ అధర్మోఽభిభవత్యుత । 40
అధర్మాభిభవాత్ కృష్ణ ప్రదుష్యంతి కులస్త్రియః।
స్త్రీషు దుష్టాసు వార్ష్ణేయ జాయతే వర్ణసంకరః। 41

ఈ యుద్ధంలో కులం దెబ్బతింటుంది కృష్ణా ! మనదైన జాతి దెబ్బతింటే, క్రమంగా కులక్షయం అయితే, కులధర్మం దెబ్బతింటుంది. కులధర్మం దెబ్బతింటే, అధర్మములు పెచ్చుపెరిగి, కుల స్త్రీలు దెబ్బతింటారు. వాళ్ళు నశిస్తే సాంకర్యం ఏర్పడుతుంది. సాంకర్యం ప్రధాన దోషం కింద భారతీయ జాతి భావించేది.

సంకరో నరకాయైవ కులఘ్నానాం కులస్య చ ।
పతంతి పితరో హ్యేషాం లుప్తపిండోదకక్రియాః। 42

పతంతి పితరో హ్యేషాం లుప్త పిండోదక క్రియాః అంటున్నాయి ధర్మశాస్త్రాలు. ఇది అర్జునునికి పుట్టిన బుద్ధికాదు. ఒక శాస్త్ర వచనాన్ని చెప్తున్నాడు. సాధారణంగా మనం అజ్ఞానంతో మాట్లాడినా కూడా కొన్ని శాస్త్ర వచనాలు చెప్తుంటాం. గీతలో ఇలా చెప్పారనో, ఉపనిషత్తులో అలా చెప్పారనో ! మన అజ్ఞానాన్ని సమర్థించుకోవటానికి, శాస్త్రమో, వేదాంతమో తెచ్చుకుంటాం అలా చెప్పినంత మాత్రాన మనం జ్ఞానులం అయిపోము. అది ఇక్కడ అర్జునుని అవ

స్థలో పరిశీలించవలసింది. ఏదో ధర్మశాస్త్ర వచనాన్ని తీసుకొచ్చి చూపిస్తున్నాడు. ఇది నిజమే. అందులో సందేహం లేదు. వర్ణసాంకర్యం గానీ ఏర్పడితే, పరంపరాగతమైన ధర్మం చెడి పోతుంది. ఎందుకంటే ఒక వ్యక్తిని తీసుకుంటే అతని పరిధి అతనితోనే పరిమితమవదు. అత నితో సూక్ష్మబంధం కలిగిన తరములు వెనకాల ఉంటాయి. దాన్నే జాతి అంటారు. ఎంతకా దన్నా ! అవి మన జీవాణువులందు నిబద్ధమై ఉంటాయి. ఒక మనిషి ఒక చోట పుట్టాడంటే దానికి పుట్టవలసిన చోటే అతను పుడతాడు. వాడి ఎదుగుదలకి సంస్కారానికి మూలములైన భూమికలన్నీ వాడు పుట్టినచోట నుంచే మొదలవుతాయి. అందుకే ఆ పరంపరని ఎప్పుడూ పోగొట్టుకోకూడదు. ఎంతో సూక్ష్మమైన దృష్టితో భారతదేశం ఏనాడో ఈ విజ్ఞానాన్ని ఆవిష్కరిం చింది. దాని వల్ల ఏం జరుగుతుంది అంటారేమో . ముందు అసలు వివాహము ఎందుకో అర్థం చేసుకోవాలి. అది పితరులు తరించటానికి ! ప్రజాయై గృహమేదినాం ప్రజాతంతుం మావ్యవచ్ఛేతిః అని వేద వచనం, కాళిదాసు వచనం కూడా ! అసలు వివాహమనే యజ్ఞం సత్సంతానాన్ని పొంది తద్వారా పితరులని తరింపజేయటానికి. అందుకే వివాహ వేళలో అటు ఇటూ ప్రవరలు చెప్పేది. ఆ పరంపరంని కాపాడమని, ఆ బాధ్యతని అప్పచెప్తున్నాం వధూవరు లకి. తద్వారా గృహస్థ ధర్మంలో వారది చేస్తారు. తర్వాత వారు వేసే పిండోదకాలు అందుకుని పితరులు సంతోషిస్తున్నారు. వర్ణసాంకర్యం ఎప్పుడైతే ఏర్పడిందో 'పతంతి పితరోహ్యేషాం లుప్త పిండోదక క్రియాః' పిండోదకములు అందక పితరులు కూడా దెబ్బతింటారు. అందుకే కుల క్షయం కాకుండా కాపాడుకోవాలి.

దోషైరేతైః కులఘ్నానాం వర్ణసంకరకారకైః ।
ఉత్సాద్యంతే జాతిధర్మాః కులదర్మాశ్చ శాశ్వతాః । 43

ఈ కులధర్మములు నువ్వు నేనూ కొత్తగా పెట్టుకున్నవికావు. శాశ్వతః సనాతనములైన ఈ కుల ధర్మములు దెబ్బతినరాదు.

ఉత్పన్నకులధర్మాణాం మనుష్యాణాం జనార్దన ।
నరకే౭నియతం వాసో భవతీత్యనుశుశ్రుమ । 44

ఏదో పితరులు పడితే పడ్డారు, నేను హాయిగానే ఉంటానా అని అనుకుంటే వాళ్ళని పీడించిన పాపం వల్ల అతనూ నరకంలో పడతాడు. అందుకే నరకేని యితం వాసో - నరకంలో నివసించవలసి ఉంటుంది సుమా.

అహో బత మహత్ పాపం కర్తుం వ్యవసితా వయమ్ ।
యద్రాజ్యసుఖలోభేన హంతుం స్వజనముద్యతాః । 45

అహోబత - అయ్యో ఎంత ఆశ్చర్యం ! మనం ఎంతపాపం

చేయటానికి వచ్చేసాం.

'వ్యవసితా వ్యయమ్' - కలిపేసుకుంటున్నాడు ఏకంగా ! మనం మహాపాపం చేయటానికి వచ్చేశాం ! తను జ్ఞాని అన్న అహంకారం ఎప్పుడైతే మొదలైందో, అప్పుడే యిలాంటి మాటలు నెమ్మదిగా పట్టాలు తప్పి వస్తుంటాయి. 'వ్యయమ్' అంటున్నాడిక్కడ. వ్యయం అంటే మనం అంటే ఎవరితో మాట్లాడుతున్నాడో ఆయన్ని కూడా కలుపుతున్నాడు. 'మహత్పాపం కర్తు వ్యవసి తా' మహాపాపం చేయటానికి సిద్ధమయిపోయామే. ఎందువల్ల ?

రాజ్యసుఖలోభం చేత స్వజనం మాటిమాటికి స్వజనం మాట వాడుతున్నాడు. నావారిని చంపటానికి సిద్ధమైపోయాను.

యది మామప్రతీకారమ అశస్త్రం శస్త్రపాణయః ।
ధార్తరాష్ట్రా రణే హన్యుః తన్మే క్షేమతరం భవేత్ । 46

ఇదుగో నేనస్త్రాన్ని విడిచి పెట్టేస్తున్నాను. ఒక వేళ నేను అస్త్రం విడిచిపెట్టాను కదా, నన్ను చంపేస్తానని వాళ్ళే వచ్చి చంపారనుకో అదే నాకు క్షేమం అన్నాడు. అనేసి కూర్చు న్నాడు.

ఇక్కడి వరకూ కూడా, అర్జునుడు నేనిలా అనుకుంటున్నాను, ఇది సబబేనా అని అడగలేదు చూడండి. ఇది మనం గమనించవలసిన విషయం. ఈ విషాదంలో ఒక నిశ్చయ మైన భావంతో ఉన్నాను అనే మాట్లాడుతున్నాడు. పైగా తనని తను శభాష్ అని మెచ్చుకుం టున్నాడు.

నిజంగా కథ ఇక్కడే ఆగిపోయిఉంటే, ఇతను మరొక గొప్ప క్షత్రియుడు అని ఒక పుస్తకం తయారు చేసి ఉండేవారు కలిదోషంతో ఉన్నవాళ్ళందరూ. వాళ్ళు అర్జునుడు ఎంత దయామయులు, ఎంత కరుణామయుడు అని ఉండేవాళ్ళు. అలా అంతకు ముందు మనకి చాలా మంది అవతారపురుషులైపోయారు. క్షత్రియులై పుట్టి, క్షేత్ర ధర్మాన్ని విడిచిపెట్టేసి, ఈ జాతిని వెయ్యేళ్ళు బానిసత్వానికి దింపేసిన ఎందరో ఉన్నారు మనకి. వాళ్ళందరిని మనం దయామయులో, కరుణామయులని అమాయకంగా కొలుచుకుంటున్నాం. కాని క్షేత్ర ధర్మంలో ఉన్న వాడు, ఇటువంటి దయ చూపిస్తే దానికి కృష్ణుడేం పేరు పెట్టాడో తర్వాత చూద్దాం. ఇప్పుడి తను తనేదో చాలా తెలివిగా మాట్లాడాననుకుంటున్నారు. నాలో ఎంత దయ ఉంది, నావాళ్ళ మీద ఎంత ప్రేమ పుట్టేసింది అనుకున్నాడు. అంతేకాక కృష్ణుడు తనని మెచ్చుకుని, నువ్వెంత మహానుభావుడివయ్యా, నిజమే మనమెంత తప్పుచేసేసాం (వయం అన్నాడు కదామరి) పద పద ఇంటికెళ్ళి పోదాం అని అంటాడేమో అని అనుకున్నంత ఖచ్చితంగా చెప్పేస్తున్నాడు. 'తన్మే క్షేమతరం భవేత్' - అది నాకు గొప్ప క్షేమం అనుకుంటున్నాను అని కూడా అన్నాడిక్కడ.

నువ్వేమంటావు అన్నమాట లేదు, నేననుకున్నది సబబా అనే సందేహం లేదు. తానే నిశ్చయం చేసేస్తున్నాడు ఇలా అనీ,

సంజయ ఉవాచ

ఏవముక్త్వార్జునః సంఖ్యే రథోపస్థ ఉపావిశత్ ।

విసృజ్య సశరం చాపం శోకసంవిగ్నమానసః॥ 47

ఇలాంటి వికారం వచ్చిందా కలి విజృంభిస్తాడు. ఆ విషయం తెలుసాయనకు, తర్వాత ఇలాంటి వికారం కలిగినటువంటి క్షాత్రం రావటం వల్లే ఈ భారతజాతి యొక్క క్షాత్ర తేజస్సు క్షీణించి పోయింది. ఇప్పటికి కూడా మనకెందుకు లెద్దూ అనే ఉదాసీనత పెరిగిపోయే బీజాలు అప్పుడున్నాయి. ఈ బీజాలు వృద్ధి చెందకుండా కృష్ణుడు అక్కడ సంస్కరించాడు. పాపం తర్వాతి వారికి కృష్ణుడిలాంటి గురువు లభించలేదు. మనమైనా సరే, ఎప్పటికప్పుడు ఆ కృష్ణుని తలచుకుని పొందవలసిన స్ఫూర్తిని పొందవలసిన అవసరం ఉంది. అందుకే ధర్మం స్వరూపా

న్ని కృష్ణపరమాత్మ ఎంత విస్తృతంగా చెప్పబోతున్నాడో గమనించాలి. ఇందులో ఉన్న వేదాంత పరమైన ఆత్మ అనాత్మ. జీవాత్మ పరమాత్మ అంశాలు కాసేపు పక్కన పెడదాం. వ్యక్తికి కావలసిన కర్తవ్యాన్ని కృష్ణపరమాత్మ ఏ విధంగా ఇందులోంచి చెప్పబోతున్నాడో గమనించబోతున్నాం.

ఇలా మాట్లాడి 'రధోపస్థ ఉపా విశత్' - రధం మీద చతికిల బడ్డాడుట. విసృజ్య సశరం చాపం వదిలేయనా ధనుస్సునీ, చాపాన్ని అని అడగలేదు. వదిలేశాడు.శోక సంవిగ్నమానసః శోకంలో ఉన్నాట్ట. అప్పుడు అలాంటి స్థితిలో ఏంజరిగిందో రెండవ అధ్యాయంలో తెలుసుకుందాం.

# రెండవ అధ్యాయం

ఈ రెండవ అధ్యాయాన్ని సాంఖ్య యోగం అంటున్నాం. మొదటిది విషాద యోగం. రెండవది సాంఖ్య యోగం. ఈ సాంఖ్య యోగంలో ప్రవేశించే ముందు గీతకి సంబంధించిన కొన్ని పనికి మాలిన ప్రశ్నలకి జవాబు చెప్పుకోవలసిన అవసరం ఉంది. పనికి మాలిన, ప్రశ్నలకి పనికిమాలిన జవాబులు చెప్తూకూర్చోవాలా అంటే చెప్పాలి ? ఆ పురుగు మనని తొలవకుండా చూసుకోవాలి. ఆ ప్రశ్న ఏమిటి యుద్ధంలో గీతా బోధ ఏమిటి. అందులోనూ 700 శ్లోకాలేమిటి ? అంటారు. రాసినది చంధస్సులో. ఆనాడు భారతకాలంలో అందరూ చంధస్సులో , పద్యాలలో మాట్లాడుకున్నారని కాదు. వాళ్ళు మాటల్లో చెప్పుకున్న దానినే, చంధోబద్ధంగా అందించాడు. వ్యాసదేవుడు చంధస్సులో దేవతా శక్తి ఉంది కనుక చంధోమయమైన వాక్కుని ఇచ్చినప్పుడే అది దైవీ వాక్కువుతుంది. దేవీం సరస్వతీం అవుతుంది. అందుకే ఆ మాటని ఛందోమాయంగా అందజేసారు వ్యాసదేవులు.

యుద్ధంలో  ఇంత చెప్పటం సాధ్యమా? అలా తలబద్దలు కొట్టుకోనక్కర లేదు. పట్టు మని ఒక సామాన్యవేగంలో చదివినా కూడా 700 శ్లోకాలు గంటన్నర పడుతుంది. అందులో అర్జున ఉవాచ, భగవాన్ ఉవాచ అంటూ ఈ ఉవాచలు తీసేసి చదివితే గంటంపావు పడు తుంది.ఇది చందోమయంగా నిర్మాణం చేసినప్పుడు చదివేటప్పుడు కాని మాట్లాడేటప్పుడు ఏ రాగం ఏ సంగీతం అనేటటువంటివి ఉండదు కదా ! అందుకని అటూ, ఇటూ ఎంత తీసినా ఆ సారాంశం 20 నిమిషాలు. పైగా అటూ, ఇటూ ఉన్నవాళ్ళు కిరాతకులు కారు. యుద్ధనీతిని అనుసరిస్తున్న వాళ్ళు. ఇద్దరు మాట్లాడుకుంటుంటే, ఇంకా ఏమిటా మాటలు అని వచ్చి కొట్టేసేటటువంటి యుద్ధం కాదది. ఒక నీతిని, ఒక విధానాన్ని అనుసరించి సాగు తున్న యుద్ధం అది. అదీ ప్రథమ దివసం నాడు. అందుకు ఆ కారణం చేత ఆ ప్రశ్న పనికి మాలినది అని తెలుసుకోవాలి.

మరి కొంతమంది ఏమంటారంటే అర్జునంత పండినవాడికి కృష్ణుడంతటి మహాను

భావుడు చెప్పినమాటలని, మనలాంటి వారికి అందించటానికి వ్యాస దేవుడు మరింత విస్తృతి చేశాడు అని. ఇది కూడా సమర్థనీయమే. ఎందుకంటే భగవద్గీతలో ఉపనిషత్ మంత్రాలు యధాతథంగా కొన్ని కనిపిస్తాయి మనకి. ఆ ఉపనిషత్ మంత్రాలు కృష్ణపరమాత్మ కోట్ చేసి మాట్లాడిఉంటాడా అంటే మాట్లాడి ఉండవచ్చు. అందులో ఒక్క వాక్యం చెప్పినా చాలు, అర్జునుడికే అర్థం అవుతుంది. మనకి అర్థం అవటానికి మరో నాలుగు వాక్యాలు కలుస్తాయి. అందుకు అర్జునునికి శ్రీకృష్ణపరమాత్మ చెప్పిన బోధనని వ్యాసుడు 700 శ్లోకాలుగా మనకి సమకూర్చారన్నారు శంకరాచార్యుల వారు. ఎంత చక్కగా చెప్పారో చూడండి.

అందులో ఏమన్నారు? అర్జునుని నిమిత్తంగా చేసుకుని కృష్ణుడు ఇచ్చిన బోధ అన్నారు. అందుకే పార్థో వత్సః సుధీర్భోక్తాః సర్వోపనిషదోగావో దోగ్ధాగోపాలనందన పార్థో వత్స కృష్ణుడు అసలు గోపాల కృష్ణుడు కదా! ఆయన వృత్తి ఆవులమందలని మేపటం, పాలు పితకటమే కదా ! అందుకే ఆయన్ని గోవిందా, గోపాల కృష్ణా అంటున్నాం. ఆవులమందలు ఏమిటి? ఉపనిషత్తుమంత్రములే ఆవుల మందలు. ఒక్క ఉపనిషత్ మంత్రములే కాదు, వేదమంత్రములు కూడా ! అందుకే గోవర్ధన గిరిని ఉద్ధరించిన తర్వాత నందుడు, మొదలైన వారంతా ఈయన పరమాత్మ అని తెలుసుకుని, ఆయనకి నమస్కరించి, స్వామీ నీ దివ్యస్వరూపాన్ని చూపించు అన్నారు. వెంటనే వాళ్ళని ఈ భౌతిక వాతావరణం, అన్ని లోకాల వాయువులు దాటించి, పరంధామానికి చేర్చుతాడుట. ఆ పరంధామంలో పరమాత్మగా సాక్షాత్కరించాడు కృష్ణుడు. ఎలా అంటే ఛందో నిహే సేవ్యః

ఛందముల చేత సేవించబడుతూ గోచరించాడుట. ఆయన చుట్టూ అక్కడ ఎవరున్నారంటే, వేదమంత్రములన్నీ రూపు ధరించి, కృష్ణుడిని స్తోత్రం చేస్తుండగా, అలాంటి కృష్ణుడుని నందుడు, మొదలైన వారు చూశారు.

ఈ వర్ణన భాగవతంలో ఉంటుంది. గోవులు ఏవి అంటే ఛందములు ఛందములు అంటే వేద మంత్రములు. వేదమంత్రములన్నీ అక్కడ గోరూపం ధరించి కొలుచుకుంటూ ఉంటే వాటి మధ్య, ఆ గోలోకంలో కృష్ణుడున్నాడు. గోలోకం అంటే వేదమయమైన దివ్యధా

మం. అంటే దీనర్థమేమంటే వేదములన్నీ ప్రతిపాదిస్తున్న ఆ పరతత్త్వమే అతడు. మరి తన చుట్టూ ఉన్న గోవుల్లో ఉన్న ఆ పాలని పిండగలవాడు ఆయనే! ఎందుకంటే ఆయన చేతికే లొంగుతాయి. అందుకు వాటి పాలు పిండి తీసుకొచ్చాడుట ఆయన. అంటే ఆ వేదమంత్ర ముల పాలు పిండి ఇస్తున్నారు. అవి పిండాలంటే ముందొక దూడ వెళ్ళి ఆ పొదుగుని చాపాలి కదా ! అందుకు వత్స ఎవరంటే అర్జునుడే ! అతన్ని వత్సగా చేసుకుని ఆ వచ్చిన పాలని తీసి ఇస్తున్నాడు.

"సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాలనందనః

పార్థో వత్సః సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్ " అన్నారు.

అలా కృష్ణుడు ఆ వేదములనేటటువంటి ఆవులనుంచి పితికి తీసాడు.అంటే సర్వవేద సారము, సర్వ ఉపనిషత్ సారంగా ఆయన నోటివెంట మాటలు రాబోతున్నాయి. అందుకు అర్జునుడిప్పు డు మనకి నిమిత్తంగా కనిపిస్తున్నాడు. అందుకు అర్జునుల వారికి నమస్కారం చేసుకోవాలి మ నం.

అర్జునుని విషాద యోగం అయ్యాక సాంఖ్యయోగం వచ్చింది.

తత్త్వవేత్తలు భగవద్గీతలోని, 18 అధ్యాయాలని మూడు భాగాలు చేశారు. వాటిని త్రిష ట్కలు అన్నారు. షట్కము అంటే ఆరు. మొదటి దానికి కర్మయోగము అని, రెండవ దానికి భక్తియోగమని, మూడవదానికి జ్ఞానయోగమని పేర్లు. వాటిని విడివిడిగా చూడకూడదు. భక్తి యోగము మధ్యలో పెట్టబడింది. అదీ దాని విశేషం. మధ్యలో ఉండటంవల్ల రెండింటి వైపూ చెయ్యి చాచవచ్చు. అది దాని శక్తి.

గుమ్మం మధ్యలో గాని దీపం పెడితే అది ఇంటిలోపలికీ, వెలుపలికీ కూడా వెలుగు నిస్తుందిట. అలా ఇటు జ్ఞానానికి, కర్మానికి మధ్యలో భక్తి అనే దీపం పెట్టాడాయన. అంటే భక్తి లేని కర్మకాని, భక్తి లేని జ్ఞానం కాని వృధా అని చెప్పటమే దాని ఉద్దేశం. భక్తికంత ప్రాధా న్యం ఇచ్చారు.

అలాంటి మూడు షట్కముల్లో మొదటి షట్కములో ఉన్నాం మనము. ఇంకా కృష్ణుడి బోధ మొదలవలేదు. ఇందులో మొదలౌతుంది. దీనికి సాంఖ్యయోగము అన్నారు. సాంఖ్యముతో తెలుసుకోవలసిన ఉపాయము అని అర్థం.

ద్వితీయం అద్వితీయం అనే నానుడి ఉంది. ఎందుకు?

వేదాంత శాస్త్రంలో రెండవది అద్వితీయం.దానికి మరి రెండవది లేదు అని అర్థం.ఆ శాస్త్రం పుట్టటానికి కారణం ఈ ద్వితీయాధ్యాయమే. దీన్ని మించింది లేదా అన్నారు. కొందరు అతి తెలివైనవాళ్ళు, కృష్ణుడు ఒక్క ఈ అధ్యాయమే చెప్పాడు.మిగతావన్నీ ఎవరో కూర్చారు అన్నారు. వాళ్ళ అతి తెలివికో నమస్కారం. వాళ్ళ తాత్పర్యం ఏమిటంటే రెండవ అధ్యాయంలోనే సమగ్రమైన జ్ఞానాన్ని ఇచ్చాడు కృష్ణ పరమాత్మ అని. ఎప్పుడైనా మహాత్ములు అలాగే మాట్లాడతారు. వాళ్ళు ఇంట్రడక్షను అని, ఎక్స్‌ప్లనేషన్ అని కంక్లూషన్ అని విభజించరు వారు . మహాత్ములు మాట్లాడితే మొదటి మాటలోనే సూత్రప్రాయంగా విషయం ఉంటుంది. తర్వాత మనకి వివరించటానికి మరిన్ని వివరణలు దాంట్లోంచి తీస్తారు. అందుకు కృష్ణపరమాత్మ మాట్లాడిన తొలిమాటల్లోనే స్పష్టము, సాంద్రము సమగ్రమైనజ్ఞానము ఉంటుంది. అందువల్ల ద్వితీయాధ్యాయాన్ని సమగ్రగ్రంధంగా భావించటంలో తప్పేంలేదు.

చాలా మంది ద్వితీయాధ్యాయాన్నే ప్రధానంగా గ్రహించి, దాన్నే వ్యాఖ్యానిస్తుంటే దానిలోని అనేక వాక్యాలకై మిగిలిన 16 అధ్యాయాల్లోని శ్లోకాలు వచ్చి తగుల్తూ ఉంటాయి. ఇక్కడ చెప్తూ ఉంటే, అక్కడివి గుర్తుకొస్తున్నాయన్న మాట. అంటే అర్థం ఆ రెండవ అధ్యాయంలో చెప్పిన విషయం బాగా నిలబడటానికి మిగిలిన 16 అధ్యాయాలు మనకి పనికొచ్చాయన్న మాట.

గ్రహించగలిగే వాడికి రెండు అధ్యాయాలే చాలు. అందుకే గీతని ఒక జ్ఞానగ్రంధంగా మనం భావించుతాం, భావించాలి కూడా ! మన మాజీ ప్రెసిడెంట్ అబ్దుల్ కలామ్‌గారు తన కిష్టమైన గ్రంధం ఏమిటంటే తడుముకోకుండా గీత అని చెప్తారు. నిజంగా వివేకం ఉన్నవాడు, తత్త్వజ్ఞానం తెలుసుకోవాలని ఆసక్తి ఉన్నవాడు భగవద్గీతనే చెప్తాడు. ఆయన, 'నేను రోజూ సాంఖ్య

యోగం చదువుకుంటా' నన్నారు. ఆయనే స్వయంగా అన్నమాట ఇది. ఆయన మాట ప్రమాణమా అంటే ప్రమాణమే మరి. ఆయన మహామేధావి, తత్త్వ చింతన గలవాడు ఆయన దీంతో ఆగి పోవద్దు, తత్త్వం దాకా ఎదగండి అన్నాడు. చాలా గొప్ప విశేషం. ఏమతం తత్వం వైపు వెళుతుందో ఆ మతాన్ని ఆధ్యాత్మిక మార్గం అంటారు. భాషని భావవ్యక్తీకరణకు ఎలా సాధనగా వాడుతామో అలా మతాన్ని మనలో తత్వచింతన తత్వం వైపు వెళ్లటానికి సాధనగా మలుచుకోవాలే తప్ప ఆ మతపు సంప్రదాయాల్లో (రిచ్యువల్స్) లో కూరుకుని పోకూడదు. తత్త్వాన్నే మతంగాకలిగిన మతం మన భారతీయ మతం. అదీ విశేషం. అందుకే తత్వగ్రంథమైన ఈ గీతని మనం మన మత గ్రంథంగా తీసుకున్నాం. ఇక్కడ జ్ఞానాన్ని ప్రధానంగా చెప్తున్నాడు.

సాంఖ్య యోగం అని ఎందుకు చెప్తున్నారు.

సాంఖ్యం అనేది అనేక చోట్ల వినిపిస్తుంది. దర్శన శాస్త్రాల్లో సాంఖ్య దర్శనం ఉంది. దీన్నే కాపిల దర్శనం అంటారు. కపిల మహర్షి చెప్పారుదీన్ని. మనకి జ్ఞానం తెలుసుకోవటానికి ఎన్నో రకాలైన మార్గాలు వచ్చాయి. అందుకే ఒక పాశ్చాత్య శాస్త్రవేత్త అంటాడు. ఈ విశ్వమేమిటి ? ఈ విశ్వానికి సృష్టికర్త ఎవరు లాంటి బ్రహ్మవిచారం భారతదేశంలో జరిగినంతగా ఇంకెక్కడా జరగలేదుట. మిగిలినవారంత శరీరం గురించి, దాని పోషణ గురించి ఆలోచిస్తుంటే ఒక్క భారతదేశమే ఈ శరీరాన్ని కూడా అతిక్రమించి తన ఉనికి రహస్యమేమిటి అన్నదాని మీద

సమగ్రమైన పరిశోధన జరిగింది. ఎన్ని రకాల ఆలోచనలో వచ్చాయి. వాటిని ఆహ్వానించాం.

అనోభద్రా క్రతవో యాన్తు విశ్వతః

అన్నది ఋగ్వేదం. అనేక వైపుల నుంచి భావాలు రావాలి , స్వీకరించాలి అనే విశాల దృక్పథం కలిగిన భారతీయమతంలో అనేక దర్శనాలు పుట్టాయి మనకి. అందులో కపిలుడి దర్శనం పేరు సాంఖ్య దర్శనం. సాంఖ్యయోగం అనగానే అది గుర్తురాక తప్పదు.

కాని ఆ సాంఖ్యమే ఇక్కడ స్వీకరించాలా ?

స్వీకరించినా తప్పేం లేదు. ఇక్కడ తత్త్వ విచారం వైపే వెళ్ళబోతున్నాం. కొంత లోతుకు వెళ్ళ

దలుచుకున్నాం. ఎంతలోతుకు వెళ్ళనిస్తే అంత లోతుకి వెళ్ళి ఆ రత్నాలు అందుకోటానికి ప్రయత్నిద్దాం.

సాంఖ్యానికి నాస్తికదర్శనం కింద కొందరు కేటాయించారు. సాంఖ్యము అనే పేరెందుకు వచ్చింది ?

ముందు కపిలుడి వైపునుంచి ఆలోచిద్దాం. తత్త్వ శాస్త్రం అనేమాట కపిలుని వద్దనే కనిపిస్తుంది. ఆయన తత్త్వముతో కూడుకున్నది ఈ విశ్వం అన్నాడు. విశ్వం అంటే మళ్ళీ రెండు విషయాలున్నాయి. విశ్వం అంటే నేను అనే విశ్వం ఒకటి, నాచుట్టూ ఉన్న ప్రపంచం ఒకటి. దీనినే పిండాండం, బ్రహ్మాండం అన్నాం. పిండాండం మనకి సంబంధించింది. బ్రహ్మాం డం అంటే ప్రపంచానికి సంబంధించింది. ఈ రెండింటికి సంబంధించిందే మన బ్రతుకు. ఈ సంబంధంలోంచి పుట్టిందే మన సుఖదుఃఖాలు. నేను అనబడే ఈ శరీరానికి సంబం ధించిన గొడవొకటి ఎదురుగా కనబడ్తున్న విశ్వానికి సంబంధించిన గొడవ ఒకటి. అక్కడా, ఇక్కడా ఒకటే వస్తువున్నది అనే సూత్రం చెప్పబడుతుంది. భగవానుడు విశ్వాన్ని ఎలా సమ కూర్చాడంటే బ్రహ్మాండాన్ని ఏ ఫార్ములాతో తయారు చేసాడో, అందులోని ప్రతి అణువునీ అదే ఫార్ములాలో తయారు చేశాడు. అందుకే అణువు, బ్రహ్మాండం ఒక్కటి. అందుకే మన దేహ నిర్మాణం వైఖరిలో, విశ్వనిర్మాణ వైఖరిలో మొత్తం 24 తత్త్వాలు ఉన్నాయి అని చెప్పారు. అందులో క్రమంగా మనకి పృథ్వి ఆపస్ తేజోవాయురాకాశాలు

ఇవందరికీ తెలిసినవే. పంచభూతములు, పంచ తన్మాత్రలు, పంచేద్రియములు పంచ జ్ఞానేంద్రియములు, పంచ కర్మేంద్రియములు, తర్వాత పురుషుడు అంటే జీవుడని చెప్పబడు తున్నవాడు, ప్రకృతి అని 24 తత్వములని మనకి తెలియజేశారు. కపిలుడు ఈ 24 తత్త్వాలతో విశ్వమంతా ఉంది అన్నారు. కాని దాన్ని అనుసరించిన వాళ్ళ చేసిన కొన్ని పొరపాట్ల వల్ల కపిల దర్శనానికి కూడా నాస్తిక దర్శనం అనే పేరు పెట్టారు. ఎందుకంటే ఒకళ్ళు ప్రారంభించినా, అనుసరించేవాళ్ళ పొరపాట్ల వల్ల అసలు రూపు మారిపోయింది. అసలు మనిషి కొంతకాలానికి వస్తే ఇదంతా నేను చెప్పిందేనా అని అనుకునే ప్రమాదం ఉంది. కపిలమహర్షి లాంటి వాళ్ళు

వైదిక విరుద్ధమైన మాటలేవీ చెప్పలేదు. కపిలమహర్షి దేవభూతికి ఉపదేశించిన సాంఖ్యదర్శనంలో ఇది పరం పరంగా వస్తున్న గొప్ప జ్ఞానమూ, ఇది కాలక్రమేణా నష్టమైతే దీన్ని తిరిగి ఉద్ధరించటానికి నేను వచ్చాను అన్నాడు. ఆయనెవరు ? సాక్షాత్తూ నారాయణ స్వరూపుడు. అటువంటి ఆయన చెప్పింది అవైదికం ఎలా అవుతుంది ? నాస్తికం ఎలా అవుతుంది ? మరి నాస్తికదర్శనం అనుకోటానికి అవకాశం ఎలా వచ్చింది ? ఇందులో 24 తత్త్వముల్లో ఎక్కడా ఈశ్వరుని గురించి చెప్పలేదు. ఈశ్వరుని గురించి చెప్పలేదు కాబట్టి ప్రకృతే అన్నిటికీ కారణం, అందులోని పరిణామాలే కారణంగాని ఈశ్వరుడనేవాడు ఇంకొకడు లేడు అని తరువాతి వాళ్ళు కంక్లూషన్ ఇచ్చేశారు. ఇది చాలా అజ్ఞానం క్రిందే లెక్క.

ఒక తోటకి వెళ్ళి అందులో ఏం ఉన్నాయి అంటే జాంపళ్ళు, కొబ్బరిచెట్లు, మామిడి చెట్లు ఉన్నాయి అంటే తోటలో చెట్లున్నాయి సరే , ఆ తోటలో నేల ఎలా ఉందో చూశారా అంటే నేలే లేదండీ అన్నాట్ట. ఎందుకంటే ఆ రిపోర్టులో నేల గురించి రాయలేదట. రాయలేదు కాబట్టి నేలే లేదనుకోవటం ఎలాంటి అజ్ఞానమో, 24 తత్వాల్లో ఈశ్వరుని గురించి చెప్పలేదనుకోవటం అలాంటి అజ్ఞానమే. ఈ 24 తత్త్వములందు ఈశ్వరుడే వ్యాపించి ఉన్నాడనేది కపిల మహర్షియొక్క ఉద్దేశం అందుకే మనకి ఉపనిషద్ దర్శనంతో సమన్వయం ఏమిటంటే

ఈశావాస్యమిదగ్ం సర్వం.........

మరి విడదీసి ఎందుకు చూపించారు ?

ఇది విడిగా దర్శించి వీటికి ఏది ఆధారమయి ఉందో ఆ చైతన్యాన్ని దర్శించు. అందుకే 24 తత్వాల్ని పరిశీలించి ఆధారమయినదాన్ని గురించి చెప్పటం కపిలమహర్షి ఉద్దేశం. ఈశ్వర చైతన్యమే నిత్యం శాశ్వతం. ఈ ఈశ్వర చైతన్యమే 24 తత్త్వములయందు వ్యక్తమై ఉన్నది. వ్యాప్తమై ఉన్నది. అది తెలియక పైపైన చూసి ఇదంతా విడివిడిగా ఉంది అనుకోవటం ఒక అజ్ఞానం. ఆ అజ్ఞానాన్ని నిర్వర్తింపజేసి, అసలు సత్యమేదో తెలియజేయటానికి ముందు ప్రకృతి అనే వస్తువుని విభజనాత్మకంగా పరిశీలించారు.

ఉదాహరణకి గడియారంమంటే ఏమిటో పరిశీలించాలనుకోండి దానికొక గొలుసు ఉంటుంది. దానికి కొన్ని పూసలుంటాయి, ముల్లు ఉంటుంది, కాలాన్ని సూచించే గీతలుంటాయి. ఇలా కొన్ని వివరాలు విడివిడిగా చెప్పాం. అంటే ఇవన్నీ విడివిడిగా ఉన్నాయా ? గడియారాన్ని అర్థం చేసుకోవటానికి చెప్పాలి. అలా చెప్పటం వల్ల ఒక సంఖ్య తేలిందా లేదా, విడివిడిగా తెలుసుకుని, గడియారానికి సంబంధించిన పూర్ణజ్ఞానాన్ని మనం గ్రహించాలి.

అలాగే నేనేమిటి, ఈ ప్రపంచమేమిటి అనే దాన్ని పరిశీలించి నప్పుడు దానిని సంఖ్యగా గమనిస్తున్నాము తప్ప సంఖ్యగా దాన్ని విడదీయటం లేదు. సంఖ్యగా దాన్ని అవగాహన చేసుకోవటానికి ప్రయత్నిస్తున్నాము.

జగత్తులో అనాత్మ విషయాన్ని గమనించటానికి, ఆత్మ విషయాన్ని గమనించాలి. ఆత్మ అంటే పూర్ణ ఈశ్వర చైతన్యం. అనాత్మ అంటే తత్‌భిన్నంగా ఏదనుకుంటున్నామో అది. ఈశ్వరుని ఉనికిని అంగీకరించనివ్వని అజ్ఞానం ఉంది కదా ! కనిపించని ఈశ్వరుడెందుకు. కనిపించే ప్రపంచాన్ని చూద్దామనుకునే అజ్ఞానం అది. సరే కనిపించే ప్రపంచాన్నే చూద్దాం. కనిపించే ప్రపంచంలో నువ్వొప్పుకునేవే నేను చెప్తాను. పంచభూతాలున్నాయి, వాటికి పంచ తన్మాత్రలున్నాయి అంటూ అలా ఒప్పుకునేవే చెప్పి చెప్పీ, అవన్నీ దేనియందు ఆధారమయి ఉన్నాయో ాఅది ఈశ్వరుడు అని చెప్పబోతున్నాడు. అందుకు విడదీసి చెప్పినటువంటి, సంఖ్యతో చెప్పినటువంటి తత్త్వ శాస్త్రం గనుక దీనికి సాంఖ్యం అని పేరు కపిల ధర్మానికి చెప్పబడింది. తద్వారా మనం తెలుసుకునే పరమ జ్ఞానం ఒకటుంది. అందుకే సాంఖ్యము తత్త్వముగా జ్ఞానముగా, వేదాంతముగా చెప్పబడుతున్నది.

సాంఖ్యమునకు మరొక అర్థమేమిటి ?

కపిల దర్శన పరంగా ఇందాకటి అర్థం చెప్పుకున్నాం. ఇక్కడ సాంఖ్యమనే పదానికి అర్థమేమిటంటే సమ్యక్ ధారయతే యితి సాంఖ్యమ్. సమ్యక్ - సమగ్రముగా ఛాయతే - చెప్పబడినది. యితి సాంఖ్యమ్ - అది సాంఖ్యమే. చక్కగా స్పష్టంగా సమగ్రంగా చెప్పటం. ఇంతకి మించి చెప్పటానికి ఇంకేమీ లేదు అన్నంత పరిపూర్ణంగా ఏది చెప్పబడుతుందో దాని

పేరు సాంఖ్యం. అందుకే సాంఖ్యం  అంటే పరిపూర్ణమైన జ్ఞానమని అర్థము. అందుకే సాంఖ్యా న్ని కూడా జ్ఞానం క్రిందనే మనం తీసుకోవటం జరుగుతోంది. వ్యాసదేవుడే సాంఖ్యం అంటే ఏమిటో నిర్వచనం చెప్పాడు చూడండి.

శుద్ధాత్మ తత్త్వ విజ్ఞానం సాంఖ్య మిత్యవిదీయతే

శుద్ధాత్మ విజ్ఞానం - శుద్ధమైన ఆత్మ తత్త్వ విజ్ఞానమేదున్నదో దాన్ని సాంఖ్యమంటారు. ఏదైనా మణి మట్టిలో ఉందనుకోండి. దానిమీద మట్టిని ఊదుతాం. అప్పటికీ పోకపోతే కడుగు తాం. కడిగికదా తీస్తాం. అలాగే శుద్ధ ఆత్మ చుట్టూ, శుద్ధత లేని అనాత్మ విషయమైన అవిద్య ఆక్రమించి ఉంటే, దాన్ని దులిపి, ఇది శుద్ధ ఆత్మ అని తేల్చి చెప్పే జ్ఞానాన్ని సాంఖ్యః అన్నారు. అటువంటి సాంఖ్య విజ్ఞానాన్ని చెప్పే యోగం కనుక దాన్ని సాంఖ్యయోగము అన్నారు. అదీ పేరులోని విశిష్టం.

ఇప్పుడు అర్జునుని విషయానికొస్తే, అర్జునుడు అలా దుఃఖిస్తూ ఉన్నాడు.

తం తథా కృపయావిష్టమ్ అశ్రుపూర్ణాకులేక్షణమ్ ।

విషీదంతమిదం వాక్యమ్ ఉవాచ మధుసూదనః ॥1॥

తం తథాకృపయా ఆవిష్టం - ఆ విధమైన దయతో కూడుకున్న అర్జునుడున్నాడు. ఇక్కడ కేవలం దయతో కూడుకున్న అర్జునుడు అనలేదు చూడండి. ఎందుకంటే అది గొప్ప దయ అయితే,గొప్ప దయతో అనో, దయతో అనో అని వదిలేశేవాడు. తథా కృపయా ఆ విధ మైన కృపతో అన్నాడు. అంటే కరుణకూడా అన్ని సమయాల్లో గొప్పదైపోదు. ఆ కరుణ పొజెసీవ్ నెస్ వల్ల ఏర్పడ్డ కరుణ. ప్రేమని గొప్పగా వర్ణిస్తారు. ప్రేమయే దైవమన్న నినాదాలు వినిపి స్తాయి. ప్రేమరూపా, ప్రియంకరీ అని అమ్మవార్ని కూడా అంటున్నామే, మరి విరుద్ధంగా కనిపి స్తున్నాయా, అంటే కనిపిస్తున్నాయి. పొజెసీవ్‌నెస్, నాదీ అనే తాపత్రయం గనుక ఉంటే అది ప్రేమ అనిపించుకోదు. దాన్ని రాగము అంటారు. ప్రేమలో ఇది నాది అనే దేశ, కాల పరిమితి ఉండదు. దయకూడా అలాంటిదే. ఇక్కడ స్వజనం అనే దయ, నావాళ్ళు వీళ్ళని చంపేస్తే

ఎలా అనే తథాకృపయా ఆ విధమైన దయవల్ల అంటున్నాడు.అంటే మోహభూషితమైన దయ చేత అని అర్థం.

అశ్రుపూర్ణాకులేక్షణం - కళ్ళనిండా నీళ్ళు పెట్టుకుని ఏడుస్తున్నాడు. అటువంటి ఆయనతో కృష్ణుడంటున్నాడు. మయం - మనం కలిసి  ఇంత పనిచేయటానికి వచ్చామే. వాళ్ళు చంపేసినా మనం చచ్చిపోవటమే క్షేమతరం అన్నాడు. అయితే ఇందులోనే అతనికున్న కొన్ని అధికారాలున్నాయి.

అవి ఏమిటి?

సశేషం

బహ్మవిద్యని తెలుసుకోవటానికి కావాల్సిన అర్హతకి తెలుసుకోవలసిన విషయాలున్నాయి. అది పరిశీలించినట్లయితే...

న కాంక్షే విజయం కృష్ణ న చ రాజ్యం సుఖాని చ ।
కిం నో రాజ్యేన గోవింద కిం భోగైర్జీవితేన వా । 1- 32

ఇహలోక సుఖాలమీద ఏకోరికా లేదు. అలాగే తర్వాత కూడా అంటాడు ముల్లో కాలాధి రాజ్యం వచ్చినా నాకఖ్ఖరలేదన్నాడు. పరమందు సుఖమున్నా అఖ్ఖరలేదు అన్నాడు. అంటే ఇహ, పర లోకముల సుఖముల యందు విరక్తి భావమున్నది. పైగా వాళ్ళొచ్చిచంపే సినా నాకేం ఫర్వాలేదు అన్నాడు. అంటే ఆ సాధన సంపత్తిలో చెప్పిన తితీక్ష - సహనం - ఉంది. శమదమీది షట్కసంపత్తి కనిపిస్తోంది. ఇవన్నీ ఉన్నాయి కాని నిత్యానిత్య వివేకం కావాలి. అది లేదని కాదు. ఉన్నది దృఢపడాలి. అందుకే ఈ వైరాగ్యంలో దానిని దృఢపరిచే జ్ఞానం ఇవ్వబోతున్నా డిక్కడ. అడిగిన పద్ధతి చూడండి. ఒక నిర్ణయాత్మకంగాచెప్పి విషాదంలో కూర్చుంటే, కృష్ణపరమాత్మ మొదటిగా అంటున్నాడు.

రాకూడని సమయంలో రాకూడని మాటలొచ్చాయి. నీ నోటిలోంచి 'విషమే సముప స్థితమ్' ఎటువంటి సంకట పరిస్థితి ఇది? ఇప్పుడు యుద్ధం నుంచి వెనక్కి మరలాల్సిన పరి స్థితా యిది? యుద్ధం చేయటానికి వచ్చిన ఒక మహావీరుడు ఆడవల్సిన మాటలా యివి? ఇలాంటి సమయంలో నీ మనసుకు తట్టిన ఈ చింత ఉన్నదే అది'కశ్మలం'అన్నాడు ఆయన 'కశ్మలం' అంటే కాలుష్యం, మాలిన్యం. 'కుతస్త్వా కశ్మలమిదం' ఈ పాడు భ్రాంతి నీకెక్కడ నుంచి వచ్చింది అన్నాడు. అర్జునుడు తనేదో దయామయుడంటాడనుకున్నాడు. కాని ఆయన మొదటే ఎంత మాలిన్యం ఉంది, నీలో అన్నాడు. పైగా ఈ సమయంలోనా? ఇది.

శ్రీభగవాన్ ఉవాచ

కుతస్త్వాకశ్మలమిదం విషమే సముపస్థితమ్ ।

అనార్యజుష్టమస్వర్గ్యమ్ అకీర్తికరమర్జున ॥2॥

మాట్లాడుతున్నది ఎవరు?

జగద్గురువు. ప్రతిమాటా ఆచి తూచి బరువుగా లోతుగా వస్తాయి. అందుకే నీ వాడిన మాటలో కశ్మలం ఉంది. నీ పరిస్థితే కశ్మలం. అందుకే ఈ వికారాలు, ఒళ్ళు వణికిపోవటం, చేతుల్లోంచి జారిపోవడం వగైరాలు మానసిక వికారాలు. ఇక్కడ మనం తెలుసుకోవలసినదేమిటంటే మనం అనేక నిర్ణయాలు ఉద్రేకంలోనో, ఆవేశంలోనో తీసుకుంటాం. ఆ సమయంలో మనం తీసు కునే నిర్ణయం సబబే అనుకుంటాం. మన నిర్ణయాన్ని మసిపూసి మారేడుకాయ చేసి, దాన్ని శాస్త్రంగా నిర్ణయించటానికే కాదు... అందుకే భారతదేశంలో శాస్త్రమనేది ఒకటుంది. అతి తెలివితేటలతో తనుచేసిన దాన్ని ఎవరైనా ధర్మంగాచెలామణి చెయ్యచ్చు. కాని అలాంటి యుక్తులు శాస్త్రంలో పనికిరావు.

అందుకే కార్యాకార వ్యవస్థితే తస్మాశాస్త్రం ప్రమాణతే!

అందుకే కృష్ణపరమాత్మ ప్రమాణభూతమైన శాస్త్ర వచనాలకి నాంది పలుకుతున్నాడు. 'గీతాశాస్త్రం మిదం పుణ్యం' ఆ శాస్త్రమే గీతాశాస్త్రం.అటువంటి శాస్త్రాన్ని చెప్పబోతున్నాడాయన. దానికి ఉపోద్ఘాతం ఇది.

నీ పరిస్థితి, నీ మాటలు ఎలాంటివి అంటే అనార్యజుష్టం. ఆర్యులు అంగీకరించని మాట ఇది. అంటే అవివేకుల మార్గాన్ని ఆశ్రయించాడు.

ఆర్యులు అంటే ఆర్యులు, ద్రావిడులు అన్న విభజన కెళ్లిపోవద్దు దయజేసి. మనకి 'ఏది ధర్మం'అని అడిగితే పెద్దలు ఏది ఆచరించారో,అది ధర్మం.శాస్త్రములు అనేకం ఉన్నాయి. శాస్త్రాలు ఎన్ని ఉన్నా, మనోవికారాలు లేకుండా ఆ శాస్త్రధర్మాన్ని అనుసరించిన పెద్దవారు

మనకి ప్రమాణం. మనకి ఏదన్నా మందిచ్చిఇది వాడండి అంటే, అది వాడిన వాడెవరు అని చూస్తామా లేదా? అలాంటి ఉదాహరణ కావాలి - అలా మనకి ఉదాహరణగా ఆర్యులని తీసు కోవచ్చు. వాళ్ళు ధర్మాన్ని ఆచరించి చూపారు. ఆ ధర్మాచరణలో ఎప్పుడూ మోహంలోగాని, శోకంలోగాని,క్రోధంలో కాని, ఎట్టి పరిస్థితిలోనూ ధర్మం నుంచి భ్రష్టం కాకుండా ఉండేవారు ఆర్యులు. ఆర్యశబ్దానికి ఒక అర్థం - ఆ రాత అంటే దూరంగా, దేనికి దూరంగా అంటే పాపా నికి దూరంగా, ఉండేవారు అంటే, ఎట్టిపరిస్థితిలోనూ పాపం చేయనివారు అని. ఇంకో అర్థం గౌరవించదగిన వారు అని. ఇవి రెండర్థాలు కావు నిజానికి. అటువంటి వారే కదా గౌరవించ దగిన వారు. అందుకని ఒకటే అర్థం కింద తీసుకోవచ్చు. అటువంటి పూజించతగిన వారు అంగీకరించరు ఈ విషాదాన్ని అంటున్నాడు.

కొందరు మంచివాళ్ళు పెద్దవాళ్లకి ఇష్టం లేని పని చేయకూడదంటారు. అలాంటిమంచి వాళ్ళలో అర్జునుడొకడు. అందుకే అనార్యదృష్టం అన్నాడు. పెద్దవాళ్ళు అంగీకరించరు అని.

కృష్ణపరమాత్మ అర్జునుడు తీసుకున్న నిర్ణయం మూడు విధాలుగా, తప్పు, అని నిరూపి స్తున్నాడు. మొదటిది, అనార్యదృష్టం. ఇది ఆధ్యాత్మిక దృష్ట్యం.'అసర్గమ్' - ఇది ధార్మికదృష్ట్యం. అకీర్తికరం - ఇది భౌతిక దృష్టం. అన్ని కోణాల్లోంచి పరిశీలించాడు. అందుకే ఆయన పూర్ణ పురుషుడయ్యాడు. ఒక విషయంలో నిర్ణయం తీసుకునేటప్పుడు ఎంత స్పష్టమైన అవగాహన ఉండాలో, కృష్ణపరమాత్మను చూసి గ్రహించాలి మనం. అందుకే కృష్ణుడు ఆదర్శం, ఆరాధ్యం రెండు అయ్యాడు.

ఇక్కడ అర్జునుడు ఆడిన మాటలు భౌతికంగా ఆలోచిస్తే సరియైనదనే అనిపిస్తుంది కాని లోతుగా ఆలోచిస్తే అది అనార్యదృష్టం. గొప్పవాళ్ళు అంగీకరించరు. 'అస్వర్గం' అది పర మును కూడా ఇవ్వదు. పరలోక సుఖములు కలుగవు. ఇక ఇహమందు అకీర్తికరం - అది

అపకీర్తికరం కూడా. అందుకు మూడు విధముల కూడా నీవు తీసుకున్న నిర్ణయం సరియైనది కాదు సుమా!

క్లైబ్యం మా స్మ గమః పార్థ నైతత్త్వయ్యుపపద్యతే ।

క్షుద్రం హృదయదౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరంతప ॥3॥

అర్జునుడు తానేదో బుద్ధిమంతుడిలా మాట్లాడాననుకున్నాడు. కాని ఇది బుద్ధిమంతుల మాటలు కాదు సుమాపేడివాడి మాటలు అన్నారు. తెలివిగా మాట్లాడాననుకోకూడదు. మాట వెనక, ఆ తెలివి వెనక ఎటువంటి మనస్థితితో మాట్లాడామన్నది ముఖ్యం. నీ మనస్థితి పూర్తిగా మూఢత్వంతో కూడుకుని మాట్లాడుతున్నావు నీవు.

నపుంసకుడిలా మాట్లాడకు అన్నాడు. ఎంత కఠినమైన మాట ఇది? గీతలో విశేషమేమిటంటే ఈ ఒక్క శ్లోకం చాలు ఈ రెండు శ్లోకాలు చాలు అంటూనే 700 ఒప్పుకున్నవాళ్లున్నారు. ఈ రెండే చాలు భారతదేశానికి అన్న మహానుభావుడున్నాడు. ఆయనే వివేకానంద. ఆయన వాటి గురించి ఎంత సింహగర్జన చేసినా మనలో నిద్రిస్తున్న ఆ విషాదయోగం నుంచి ఇంకా బయట పెట్టలేదు మనని.

అలాగని అతనిని అవమానించలేదు చూడండి. నీ వంటి వానికి ఇది తగదు అన్నాడు. అది గొప్పమాట. కాన్ఫిడెన్స్ ఇచ్చాడు గురువు ఎలా మాట్లాడాలో అలా మాట్లాడుతున్నాడు. 'నైతత్త్వయ్యుపపద్యతే' నీలాంటివాడు అలా మాట్లాడకూడదు, అంటే అతన్ని మెచ్చుకున్నట్టూ ఉంది, తిడుతున్నట్టూ ఉంది. అలా అంటే తన మాట వింటాడు. అదేంటలా మాట్లాడారు అంటే కోపం వస్తుంది.అందుకే కృష్ణపరమాత్మ నీలాంటివాడు ఇలా మాట్లాడకూడదు అన్నాడు. నువ్వెవడివి, విజయుడివి, కిరీటివి, ప్రతాపవంతుడివి, మర్చిపోయావా నీ సహజ స్వభావాన్ని?

ఇక్కడి విశేషాలేమిటి?

మనం ఎటువంటి వాళ్ళం? వేదం ఏం చెప్తోంది? నువ్వు నిత్యుడివి, అచలుడివి, స్థాణువువి అని చెప్తూ అమరుడివి, అజలుడివి అని చెప్తుంటే, నేను చేతకాని వాడిని, నేను శరీరానికి బంధితుడిని, నేను పోతే ఏమైపోతానో, ఇది ఉండాలి అనుకునే అజ్ఞానంలో ఉన్నాం. అందుకని నువ్వు ఇది కాదు, నువ్వు ఏదైతే నేను, నేను, నేనని ప్రాకులాడుతున్నావో దానికి మూలమైన చైతన్యం నువ్వు. అది తెలుసుకుంటే నువ్వు అక్కడిదాకా వ్యాపిస్తావు.

అటువంటి ఆత్మతత్వము నందు ఈ క్లైబ్య భావములు పనికిరావు. అదీవిశేషం.

క్లైబ్యం మా స్మ గమః పార్థ నైతత్త్వయ్యుపపద్యతే ।
క్షుద్రం హృదయదౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరంతప ॥3॥

ఇంతవరకూ నువ్వాడిన మాటలను ఏమంటారు?

ధర్మపన్నాలు కావు. 'క్షుద్రం, హృదయదౌర్బల్యం' అదీ విశేషం. ఇది క్షుద్రమైనది నీ యొక్క హృదయ దౌర్బల్యం. బలంకాదు. బలహీనత. చాలామంది బలానికి, బలహీనతకి తేడా తెలుసుకోలేరు. నీకొచ్చినది దౌర్బల్యం. అటువంటి క్షుద్రమైన హృదయ దౌర్బల్యం 'త్యక్త్వా' విడిచిపెట్టి, 'ఉత్తిష్ట' మేలుకో !.

కృష్ణుడు ఆడిన మొదటి మాటేమిటి? మేలుకో!సుప్రభాతం ఆయనకి పలుకటం కాదు, ఆయన మనకి పలుకుతున్నాడు.

నిత్య జాగరీకుడికి మనం మేలుకొలుపు పాడటం ఏమిటి? 'ఉత్తిష్ట' అంటున్నాడు. అంటే 'ఉత్తిష్ఠోతిష్ట'... మనకి మేలుకొలుపు పలికింది ఉపనిషత్‌మాత ఉత్తిష్టత. జాగృత, మేలుకో! లే! అదీ విశేషం. లే అంటే మంచం మీంచి లేస్తే చాలదు, మత్తు వదలాలిగా! అందుకు జాగృత! పరమును తెలుసుకో! నిద్రపోకు! తమోగుణంలో కూరుకుపోయి క్లైబ్యం వచ్చిందా అన్నాడు.

ఇక్కడ ఒక చిన్న ఎత్తిపొడుపు కూడా ఉంది. నిన్నటి వరకు బృహన్నల వేషం వేసావుగా! పోలేదా అది ఇంకా? అదేదో శాపం వల్ల వచ్చింది కాని, అది స్వభావమైపోయిందా ఏమిటి? బావ, బావ మరుదుల హాస్యంగా తీసుకోవచ్చు. ఆ శాపం అయిపోయింది గనుక ఆ గుణాన్ని కూడా వదిలేయ్. ఆ పేడితనాన్ని వదిలేయ్.

'త్యక్త్వోత్తిష్ఠ పరంతప'

సంబోధన చూడండి ఎంత గొప్పగా ఉందో! క్లైబ్యం అన్నానని నీ స్వభావం అదికాదు. నీ స్వభావమేమిటి? 'పరంతప!'. శత్రువులను తపింపజేసేవాడు. ఏది పరమో దాన్ని తపింప జేయి. ఏది ఆత్మకి పరమో, అంటే అనాత్మ విషయమో, దాన్ని తపింపజేయి, దాన్ని వదిలేయ్! 'పరంతప!' మాటలో ఈ విశేషం కూడా ఉంది.

ఎవరిపేరు తలుచుకుంటే పిడుగులు కూడా భయపడి ఆగిపోతాయో అటువంటివాడివి కదా నువ్వు! నీ ప్రతాపాన్ని నువ్వు మర్చిపోతున్నావా?

దుఃఖం,క్రోధం రాగద్వేషాల వల్ల వస్తున్నాయి. వీటివల్ల మనం ఏమిటో మనం మర్చిపో తాం. మన అసలు స్వభావమేమిటో చెప్పే వాడే గొప్పవాడు. ఒక అడవిలో ఒక ఆడ సింహం గర్భం దాల్చి, సంతానాన్ని కని మరణించింది. సింహం పిల్ల ఒంటరిగా పడి ఉంది. అటుగా వస్తున్న మేకల గుంపు దీన్ని చూసి జాలిపడి కాపాడి, వాటితోపాటు తిప్పుతున్నాయి.ఈ సింహం పిల్ల వాటితో తిరుగుతూ, వాటిలాగే ఆకులు అలములు తింటూ, వాటిలాగే 'మేమే' అని అరుస్తున్నది. ఇలా కొన్నాళ్ళు గడిచాయి.

ఒకరోజు కొన్ని సింహాలు అటువచ్చి ఈ మేకలగుంపు మీద పడ్డాయి. అవి చెల్లాచెదర య్యాయి. ఈ సింహం పిల్లకూడా వాటి వెంట మేమేమే అంటూ పరిగెడుతుంటే ఒక సింహం దాన్ని పోల్చుకుంది. ఇద స్వజాతేనని, మేకలని పోనిచ్చి వెనక నుంచి వెళ్లి దాన్ని పట్టుకుంది.

అదేమో 'మే..మే' అని గింజుకుంటోంది. నువ్వు మేమే కాదు, నువ్వు మన జాతివాడివి అంది. మేకలేమో ఇంతవరకూ అలా భయపడటమే నేర్చాయి మరి. మేమే కాదు ఇలా గర్జించు అందిట. కాని అలవాటయిన కూత అంత తొందరగా పోతుందా? కాని ఈ సింహం వదల్లేదు. నువ్వేమిటో చూపిస్తాను రా అని తీసుకెళ్ళి, ఒక నూతిలో చూపించిందిట. నువ్వేమిటో చూసుకోమని. కాని ఈ సింహం పిల్లేమో ఇంకో సింహం వచ్చేసిందేమోనని మళ్ళీ భయపడిపోయింది. అంతకు ముందెప్పుడైనా తన మొహం, నూతిలోనైనా, చూసుకుంటే గదా తెలియటానికి! అలాటి అమాయకురాలయిన ఆ సింహం పిల్లకి బోధించటానికి ఆ సింహం ఎంత యాతన పడిందో ఆ సింహానికే ఎరుక! కాని పట్టువదలకుండా నేర్పించి, క్రమంగా వాళ్ళలో కలుపుకుందిట. అలా సింహాల్లాంటి మనం మేకల్లాగా అయిపోయాం! ఏ ఆత్మతత్వముందో దాని ఎరగక ఈ దేహంలోనే బంధితులమై నేననగా ఈ రూపంలో పుట్టి, చచ్చి, మళ్ళీ పుట్టీ, చచ్చే వాళ్ళలో ఉన్నాం. ఇలాంటి అజ్ఞానంలో పడిపోయిన మనకి ఉపనిషత్తు తట్టిలేపి, జాగృత, అని ఉపనిషత్తనే సింహం మేకలా మారిపోయిన సింహం పిల్లలకి బోధించింది. అది కూడా తెలుసుకోలేకపోతే ఆ ఉపనిషత్ స్వరూపమైన పరబ్రహ్మం కృష్ణపరమాత్మ మేకల్లాంటి మనల్ని ఉత్తిష్ఠ అంటున్నాడు.

మరి ఈ భావం ఎక్కడ్నుంచి వచ్చింది?

క్షుద్రం హృదయదౌర్బల్యం అని బోధిస్తున్నది - అర్జునుడి అసలు స్వరూపమైన పరంతపా స్వభావాన్ని నిద్రలేపటానికి, ఇప్పుడు మోహం వల్ల ఆక్రమించుకున్న మేక వంటి ఈ పనికి మాలిన దయనుంచి తొలగించి, మోహం నుంచి బయటపెట్టి, అతనిలోని పరంతప లక్షణాన్ని జాగృత పరుస్తున్నాడు. శ్రీకృష్ణపరమాత్మ అనేటటువంటి మహాసింహం. 'త్యక్త్వోత్తిష్ఠ పరంతప' ఈ రెండు మాటలాడాడు. అప్పుడు అర్జునుడి విషాదయోగం మరో మలుపు తిరుగుతోంది.

ఇప్పటివరకు ఇదే క్షేమకరమనుకుంటున్నాను అంటే నీకు క్షేమమేమిటో, కాని దేమిటో నీ సారధిని నేను చెప్పాలి. అందుకేగా నన్ను ఎంచుకున్నావు.

అప్పుడు అర్జున ఉవాచ.

స్వామీ అంత తిట్టావా నన్ను! సరే ఎలా చంపుతాను?

ఎవరు తెలుసావాళ్ళు?

కథం భీష్మమహం సంఖ్యే ద్రోణం చ మధుసూదన ।

ఇషుభిః ప్రతియోత్స్యామి పూజార్హావరిసూదన ॥4॥

ఆ భీష్ముడు, ద్రోణుడు ఎవరు? ఓ శత్రుభయంకరా, నారాయణా పూజ చేయదగిన వారిపై ఏ విధంగా బాణాలు వేయాలి?

గురూనహత్వా హి మహానుభావాన్

శ్రేయో భోక్తుం భైక్ష్ యమపీహ లోకే ।

హత్వార్థకామాంస్తు గురూనిహైవ

భుంజీయ భోగాన్ రుధిరప్రదిగ్ధాన్ ॥5॥

వీరు పెద్దలు,మహనీయులు, అటువంటి వారిని వధించి, ఆ నెత్తుటి కూడు భుజిస్తూ, భోగాలు అనుభవించే కంటే భిక్షమెత్తుకోవడం మేలన్నాడు. ఇదొక స్వధర్మ ప్రకటన. అది నీకు పనికి రాదయ్యా అంటాడుకృష్ణపరమాత్మ తర్వాత. ఎప్పుడేది గొప్పో నాకే తెలియటం లేదు అంటే ఇప్పుడొచ్చిందన్నమాట సందేహం. ఇప్పటివరకు యుద్ధం మానే స్తానన్నాడు. ఇప్పుడేమో ఏది గొప్పో నాకు తెలియటం లేదు. నేను జయిస్తానో లేదో తెలి యదు అంటే యుద్ధం వల్ల వచ్చే ప్రయోజనం సందిగ్ధం. బిచ్చమెత్తుకోవాలో, యుద్ధం చేయాలో తెలియటం లేదు.

న చైతద్విద్మః కతరన్నో గరీయో
యద్వా జయేమ యది వా నో జయేయుః ।
యానేవ హత్వా న జిజీవిషామః
తే వస్థితాః ప్రముఖే ధార్తరాష్ట్రాః ॥6॥

ఎవరిని చంపి నేను బ్రతుకలేనో వారితో యుద్ధం చెయ్యబోతున్నాను. అందుకే ఏం చేయాలో తెలియటం లేదు. ఆ తెలయనితనంలో ఒకటే చేస్తున్నాడు. అంతకు ముందు కృష్ణుడు రెండు చెణుకులు విసిరాడుగా అందుకు నువ్వే దిక్కు అంటున్నాడు.

మనం చెప్పుకోబోతున్న శ్లోకం చాలా ముఖ్యమైనది. భగవద్గీత అనే గొప్ప శాస్త్రం ఆది గురువైన, నారాయణ స్వరూపుడైన శ్రీకృష్ణుని ముఖం నుంచి మనకి రావటానికి కారణమైన శ్లోకం అర్జునుని నోటివెంట ఇప్పుడు రాబోతున్నది.

కార్పణ్యదోషోపహతస్వభావః
పృచ్ఛామి త్వాం ధర్మసమ్మూఢచేతాః ।
యచ్ఛ్రేయః స్యాన్నిశ్చితం బ్రూహి తన్మే
శిష్యస్తే హం శాధి మాం త్వాం ప్రపన్నమ్ ॥7॥

ఈ శ్లోకం గొప్పదైతే ఇందులో చివరి వాక్యం ఇంకా గొప్పది ఇందులో తన గురించి రెండు లక్షణాలు చెప్పుకుంటన్నాడు.'శిష్యః' 'ప్రపన్నః' - నేను శిష్యుడుని, రెండవది ప్రపన్నుడిని.

'శిష్యుడిని' అంటే నిన్ను గురువుగా ఎంచుకున్నానని చెప్పటం, ప్రపన్నుడు అంటే నిన్ను దైవంగా ఎంచుకున్నాను. అటే నా గురువూ నువ్వే, దైవం నువ్వే అని చెప్తున్నాడు. అదీ విశేషం అర్జునుడిలో శిష్యలక్షణం, ప్రపన్న లక్షణం రెండూ ఉన్నాయి... ప్రపన్న లక్షణం కొత్తగా పుట్టు కొచ్చిందా?

ముందునుంచీ ఉంది. ఆ కారణం చేతనే నేను కావాలా, నా సైన్యం కావాలా అంటే నువ్వే కావాలన్నాడు. అదీ విశేషం. అక్కడే ఆ ప్రపన్న లక్షణం ఉంది. ఇప్పుడు శిష్యః అన్నాడు. కృష్ణ పరమాత్మకి భక్తుడు అర్జునుడు. ఎంత తెలివైనవాడు కాకపోతే ఆయన్నిఎంచుకుంటాడు. అలా ఎంచుకున్నాడు కనుకే కృష్ణపరమాత్మ ఇలా బోధిస్తున్నాడు. అంటే కృష్ణపరమాత్మఅతని సారధి గానే రాలేదు, అతని బుద్ధిని తోలటానికి వచ్చాడు. అదీ విశేషం.

ఇక్కడ అర్జునుడేంచెప్తున్నాడు?

మీ బుద్ధుల్ని తోలాలంటే కృష్ణపరమాత్మని పట్టుకోండి అంటున్నాడు. ఆ విధంగా అర్జునుడు మనకి గురువు, ఎవర్ని ఎంచుకోవాలో చూపిస్తున్నాడాయన! మంచి గురువు ఎవరో మనకి చూపించాడు.

అర్జునుడి తెలివి రెండు చోట్ల కనిపిస్తోంది. ఒకటి కృష్ణుడిని సారధిగా ఎంచుకోవడం లోను, రెండవది గురువుగా ఎంచుకోవటంలోను. ఇప్పుడు ప్రపన్నుడై వేడుతున్నాడు. ముందుగా తన స్థితిని వర్ణిస్తున్నాడు.

స్వామీ నువ్వన్న పరంతప నా స్వభావమేమో కాని, పరంతప స్వభావం 'కార్పణ్య దోషారహిత' - కార్పణ్యమనే దోషంలో నా పరంతప అనే స్వభావం దెబ్బతింది అన్నాడు.

'కార్పణ్య' - అదీ విశేషం. కార్పణ్యం అంటే కృపణస్వభావం. కృపణము అనే దుర్గుణము ఉంది. కృపణ అనే శబ్దానికి బోలెడు అర్థాలున్నాయి. అందులో ఒక అర్థం పీనాసివాడు అని. తన దగ్గర ఉన్నది ఎక్కడ పోతుందోననే పిసినారి స్వభావము కృపణస్వతితేంద్రియః అని ఇంకో అర్థం. కృపణుడు అంటే జితేంద్రియుడు కాని వాడు అని ఒక అర్థం ఉంది. అలాగే కృపణః అని మరొక అర్థం కూడా ఉంది. ఒక ఫలం కోసం పని చేయటాన్ని కృపణత్వం అన్నారు. ఏది చేసినా నాకేం వస్తుంది అనే భావం కృపణత్వం.

తనే ఒక ప్రయోజనాన్ని ఊహించుకుని, దాని వైపు తిప్పుకునే అజ్ఞానాన్ని కృపణ అంటారు.

అలాంటి కృపణత్వం వల్ల నా స్వభావం దెబ్బతింది అని అర్జునుడ్ని అనటానికి తగదు. ఎందుకంటే ఈ దుర్లక్షణాలేవీ ఆయనకి లేవు. పిసినారితనం లేదు. జితేంద్రియుడు కాదనటానికి లేదు. ఎంత జితేంద్రియుడు కాకపోతే స్వర్గలోకంలో సర్వభోగాలు అనుభవించే అవకాశం వచ్చినా అనుభవించకుండా, ఊర్వశి వచ్చినా ఆమెని అమ్మా అని సంబోధించగలడు? పోనీ ఫలహీనత అందామా అంటే ఆయన ఫలమే అక్కర్లేదు కృష్ణా అన్నాడు కదా?

న కాంక్షే విజయం కృష్ణ న చ రాజ్యం సుఖాని చ ।
కిం నో రాజ్యేన గోవింద కిం భోగైర్జీవితేన వా । 1-32

ఇవి అన్నవాడికి ఫలం అక్కర లేదు.

మరి ఏ అర్థం తీసుకోవాలి?

ఇలాంటి సందర్భంలోఉపనిషత్తులో 'కృపణ'అనే శబ్దానికి ఏ అర్థం వాడబడిందో ఆ అర్థాన్ని తీసుకోవాలి. అందుకు ఒకసారి బృహదారణ్యకోపనిషత్తుకి వెళ్దాం. యజ్ఞవల్క్యుడు, గార్గి మధ్య జరిగిన సంభాషణలో కృపణకి అర్థం కనిపిస్తుంది.

అక్షరమైన ఆత్మతత్వం తెలుసుకోకుండా,ఎవరు ఈ లోకమునందే భ్రమిస్తూ ఉంటారో, అలాంటి అజ్ఞానత్వాన్ని కృపణత్వము అంటారు. అంటే కృపణత్వము అంటే అర్థమేమిటి? ఆత్మజ్ఞాన శూన్యత. ఆ అర్థాన్ని ఇక్కడ తీసుకోవాలి, మామూలు అర్థాలు ఇక్కడ అర్జునుడికి అన్వయించవు కాబట్టి. పైగా బ్రహ్మవిద్య తెలుసుకోబోయే ముందు ఆడుతున్నటు వంటి మాట గనుక, ఇది అర్జునుడి మాట, అంటే నరుడి మాట, అంటే మనమాట!

మన కృష్ణుడి ముందు అనుకోవలసిన మాట

కార్పణ్యదోషోప హిత స్వభావః

స్వామీ నేను ఆత్మజ్ఞాన శూన్యత అనే అవిద్యచేత, దెబ్బతిన్నవాడను. స్వభావము అంటే అంతరంగమని కూడా అర్థం. నా మనస్సంతా కూడా అజ్ఞానం చేత దెబ్బతిన్నది. అందుకే 'పృచ్ఛామిత్వాం' - నిన్నడుగుతున్నాను.

ఎందువల్ల?

'ధర్మ సమ్మూఢచేతా' - ఏది ధర్మమో తెలుసుకోలేని ఒక అవివేకం నాకు వచ్చింది. ధర్మాధర్మ విచక్షణ చేయలేని పరిస్థితిలో ఉన్నాను. అందుకు నువ్వు నాకు ఏది శ్రేయస్సో నిశ్చితంగా చెప్పమన్నాడు. ఇదా, అదా అని ఏదోఒకటి కోరకుండా నువ్వు ఏది శ్రేయస్సు అని చెపితే అదే పాటిస్తాను.

నిశ్చితంగా 'శ్రేయస్స్యాత్' - ఏది శ్రేయస్సు అయి ఉన్నదో, దాన్ని 'నిశ్చితంబ్రూహి' నిశ్చితమైన దానిని తెలియజేయి. తన్మే - నాకు ఏది శ్రేయస్సో! అందరికీ ఒకటే ధర్మం ఉండదు. అది ఉంటుందనుకోవటం, ఉండాలనుకోవటం అవివేకం. స్వభావతః అందరూ ఒకటే, కాని ధర్మం మాత్రం లేదు. శరీరధర్మోతే వేర్వేరుగా ఉన్నాయే! స్వధర్మం అన్న మాటే చెప్తోంది, ధర్మం సాపేక్షం అనేది సర్వజనీనం. బిక్షమెత్తుకుంటాననటం క్షత్రియుడైన అర్జునునికి తగదు. సన్యాసి ధర్మం వేరు, గృహస్థ ధర్మం వేరు. జ్ఞానం వచ్చిందనుకుని ఒకధర్మం నుంచి ఇంకో ధర్మంలోకి మారితే అజ్ఞానంలో బ్రష్టుడైనట్టు అర్థం. అందుకు ధర్మానికున్న ప్రధాన లక్షణం సాపేక్షం. అందుకే ఏది నాకు శ్రేయస్సో అది చెప్పమన్నాడు.

ఒక జ్ఞానాన్ని సంపాదించటానికి అధికారం ఎలా వస్తుంది?

శిష్యుడని ఎవర్నానాలి.ఏదో అప్పటికప్పుడు కాదు. ప్రపన్నుడై శిష్యత్వాన్ని స్వీకరించాలి.ఆయన్ని గురువుగా స్వీకరిస్తూ శిష్యత్వాన్ని అంగీకరించాలి. అందుకు, 'స్వామీ ఇప్పటివరకు నువ్వు మిత్రుడివి, సారథివి, సచివుడివి, సలహాదారుడివి అన్నాను. కాని ఇప్పుడు కేవలం గురువువి.

గురిచూపించే గురుడవు. నా గురివి నీవు, గురువు నీవు. అందుకు ప్రపన్నుడనై నిన్ను శరణు వేడుతున్నాను.

సశేషం

కృష్ణం వందే జగద్గురుం సహజసిద్ధుడు. నిత్యసిద్దుడు అయిన అర్జునునికి కృష్ణుడు సహజ గురువు. పరమాత్మ గురువుగా లభించాడు.

సిద్ధార్థ, సిద్ధ సంకల్ప, సిద్ధిదసిద్ధి సాధన:

అని చెప్పబడ్డ స్వామి ఎదురుగా గురువై ఉంటే ప్రపన్నుడైన నన్ను 'శాధి' - నన్ను అనుగ్రహించు అంటున్నాడు. అదీ విశేషం.

ప్రపన్నత అనే మాట ఎందుకు వచ్చింది?

శరణాగతుడై వెళ్లాలి. శరణాగత ధర్మం జ్ఞానానికి, తరించటానికి ప్రధానమైనది. ఈ దివ్యమార్గాన్ని మనకు రామానుజుల వంటి వారు వ్యాప్తి చేశారు. ఉపనిషత్తులు చెప్పి నటువంటి గొప్ప విశేషం. అందుకే భగవద్గీత అంతా శరణాగతి ధర్మం అని చెప్పటంలో సందేహం లేదు.

గురువులకు గురువైన ఆ పరమాత్మని శరణు వేడిన వాడే కైవల్యాన్ని పొందగలడు గురువులకి గురువు ఎలాగంటే మనం కారణాలు వెతుకుతూ వెళ్తుంటే ఈ సర్వ జగత్తుకి సృష్టికర్త బ్రహ్మదేవుడు, అతనికి బుద్ధి ఇచ్చినవాడు పరమేశ్వరుడు. అతన్ని శరణు వేడిన వాడికే మోక్షం వస్తుంది అని చెప్తుంది ఉపనిషత్తు.

ముముక్షుడవై శరణమహం ప్రపద్యతే!

శ్వేతాశ్వతర మంత్రం... ఆత్మబుద్ధి ప్రకాశం కోసం ఆది గురువును శరణు వేడుతు న్నాను అని శ్వేతాశ్వతర మంత్రం మనకి చెపుతుంది. అలా ఉపనిషత్తు చెప్పిన మార్గం ప్రకారంగా బ్రహ్మవిద్యకు కావాల్సిన మార్గం చెప్తున్నారు. గీతలో తర్వాత పరమాత్మ

తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా

అందులో ఏవిధంగా శరణువేడితే ఏ విధంగా జ్ఞానం వస్తుందో చెప్తాడు. అందుకే ‘ ప్రపన్న’ అంటే ప్రపత్తి మార్గంలోకి వెళ్లాడితను. ప్రపత్తి, శరణం రెండూ ఒకటే! ప్రపద్యే అనే మాట ఉన్నది. ప్రపద్యే అంటే ప్రపన్నుడనవుతున్నాను, అంటే శరణు వేడుతున్నాను.

శరణు అనేది ఏమిటి, ఎలా ఉంటుంది?

నువ్వే దిక్కు అన్నప్పుడు అది ద్వైతమా, అద్వైతమా, విశిష్టాద్వైతమా అని పెద్ద మీమాంస. కలియుగంలో ఇదే పెద్ద చిక్కు.ఒకరు ఒక మార్గం పాటిస్తుంటే ఈ కలిపురుషుడు అదేం గొప్ప మార్గం కాదు పొమ్మంటాడు. పూజ చేయబోతుంటే విగ్రహారాధన కూడదంటారు. నిర్గుణరూపం అవ్యక్తం కాబట్టి అది అర్థంకాదు. తరించటానికి ఏ మార్గంలో వెళ్లినా మనని మరలిస్తాడు ఇంకొకడు. ధ్యానం కొచ్చేయ అంటాడు ఒకడు. పోనీ ధ్యానం చేస్తుంటే శ్వాస మీద ధ్యాస పెట్టు. ముక్కుపైన పెట్టావా, ముక్కు కొసన పెట్టావా అంటాడు ఇంకొకడు. ఇది కాదు మార్గం యోగాభ్యాసం చేయమంటాడు ఇంకొకడు. మనం ఎటూకాని సందిగ్ధంలో పడిపోతాం. దానికి బదులు ఏదైనా సరే ఉన్న మార్గంలో నడిస్తే ఎక్కడో ఒక చోట తేలుతాం. వివాదం వైపు తీసుకెళ్లే విజ్ఞానం ఎప్పుడూ నిన్ను తరింపజేయదు. విషయం వైపు తీసుకెళ్లాలి. తమ సంప్రదాయాలు నిలుపుకోటానికి సాంప్రదాయాలే తప్ప, సంప్రదాయ లక్షణమైన పరమాత్మ తత్త్వాన్ని ప్రతిపాదించటానికి ఏ విజ్ఞానీ ముందుకు రావటం లేదు, చివరికి ఆచార్యులు కూడా. అందుకు శరణాగతులు ఎలా ఉంటారు అంటే ఆ కృష్ణ పరమాత్మ తప్ప మరొక తత్వం నాకు లేదు అన్నాడొక మహానుభావుడు. ఆయన చాలా చక్కగా చెప్పాడు మధుసూధన సరస్వతి, ఆయన పేరు. ఆయన భగవద్గీతకు భాష్యం రాస్తూ

ప్రపన్నమనే విషయంలో శరణాగతి ఎలా ఉంటుందంటే

తలైవాహం, మమైవత్వం, త్వమేవాహమితి త్రిధా
మూడు విధములుగా ఉంటుందిట ప్రపన్నత్వం.

ముందుగా తవైవ అహం - తవ ఏవ అహం - నీవాడను అన్నాడు మొదట. క్రమంగా మమైవాహం - క్రమంగా నువ్వు నావాడవు అంటాడు. అటుపై క్రమంగా నువ్వే నేను అంటాడు. ఇది మూడింటిగా అంటే మూడు ముక్కలుగా కాదు. మూడు సమన్వయం అయిపోతాయి చివర. అదీ విశేషం. తవైవాహం, నీవాడను. ఈ మాట సామాన్యమైనది కాదు. రామాయణంలో రామ తవైవాహం విశిష్టత గురించి, నీవాడను అంటే అభయం ఇస్తాను అన్నాడు రాముడు. ఇక్కడ ఆ రాముడే కృష్ణుడు కనక ఆ అభయంకర జ్ఞానాన్ని ఇవ్వడా?

ముందు భగవంతుని, స్వామీ నీవాడను అంటే ఆయన చూపించిన ప్రేమ వల్ల ఎంత చనువు ఏర్పడుతుందంటే, నువ్వు నావాడవు అనేంత! ఎలా కావాలంటే అలా ఆడుకోవచ్చు. మొదట వినయం, తర్వాత చనువు. ఒకసారి అంధుడు, మహాభక్తుడు అయిన సూరదాస్ ఒకసారి త్రోవ తప్పిపోతే కృష్ణా, కృష్ణా అని అలమటించాడు. అతనికి ఎప్పుడూ ఆ స్మరణ తప్ప మరొకటి లేదు. కృష్ణపరమాత్మ బాలకుని వేషంలో వచ్చి చెయ్యిపట్టుకుని నడిపించాడు. ఏదో తెలియని దివ్యానుభూతి కలుగుతున్నది కాని కృష్ణపరమాత్మ అని తెలియలేదు. చెయ్యి వదిలేశాక తెలిసింది తనను వదిలేసిన వాడు ఆయన అని. 'ఇంత వరకూ నడిపించిన స్వామీ నన్ను వదిలేశావా నువ్వు పట్టుకుంటానంటే ఎన్ని మార్లయినా దారి తప్పుతానయ్యా అన్నాడాయన' గొప్పవిషయం. కుంతీదేవి కూడా అంది, 'ఎప్పుడా

పదలు వచ్చినా మా దగ్గరకు వచ్చావు. నువ్వు వస్తాను అంటే ఆపదలే రానీ మాకు అంది. నువ్వు రావు అనే సుఖాలు మాకొద్దయ్యా, ఆపదలు వస్తే అదే సంతోషం అంది.

అలాగే ఈయన ఇక్కడ దుఃఖపడుతూ చెయ్యి వదిలిపెట్టి వెళ్లావుగానీ, నా హృదయాన్ని విడిచిపెట్టగలవా నువ్వు అన్నాడు. అంటే తన హృదయంలో అంత పదిలంగా పట్టుకున్నాడు. నీ పట్టుకన్నా నా పట్టు గట్టిది. నీ పట్టు వదిలేశావుగానీ నాది వదలను. అట్టి పట్టుదలగలవాడిని ఆయన మాత్రం విడుతాడా? ప్రపనుడెప్పుడైతే శరణాగతి వేడుతాడో ఆయన తప్పకుండా ఓదారుస్తాడు, ఏడవద్దంటాడు. ఆనందమే ఆయన మూర్తి. ఎందుకు అనవసరంగా ఏడుస్తారు, వద్దు, కృష్ణుడి వచనమంతా కూడా 'ఆనందంగా ఉండండి, ఆనందమే నేను, అభయమే నేను, అజ్ఞానమే దుఃఖం, ఆనందం సహజలక్షణం, దుఃఖమే అసహజం. అసహజాన్ని విడిచి సహజానికి రండి. దుఃఖంలో ఏ యోగముందో ఆ సంయోగం నుంచి వియోగం కల్పించుటకు అసలైన యోగం. ఆ యోగం కల్పించే యోగేశ్వరుడిని నేనే' అనే! ఎక్కడ ఆ కృష్ణపరమాత్మ ఉంటే, అలాంటి ప్రపన్నుడైన భక్తుడుంటే అక్కడే శ్రీ, విజయం అన్నీ ఉంటాయి.

యత్ర యోగేశ్వరః కృష్ణో  యత్ర పార్థో ధనుర్ధరః

తత్ర శ్రీర్విజయో భూతి ర్ధ్రువా నీతిర్మతిర్మమ.

శరణాగతి అనేదే దివ్యమైన యోగం. ఆయోగం సిద్ధిస్తే అన్ని యోగములూ సిద్ధిస్తాయి.

విశిష్టాద్వైతములో మూడు విధములైన కృత్యములు చెప్పబడుతాయి. ఉపాధు కృత్యం, పురుషకార్య కృత్యం, ఆచార్యకృత్యం. ఈ మూడు కృత్యములు భగవదర్పణం చేయటమే శరణాగతి, ప్రపన్నత!

ఆచార్యకృత్యం అంటే నువ్వే ఆచార్యుడువు, గురుడవు అని శరణువేడటం. ఉపాయకృత్యం అంటే ఏ విధమైన ఉపాయంతో నేను తరించాలో ఆ ఉపాయం కూడా నువ్వేననటం. పురుషకారకృత్యం అంటే పురుష ప్రయత్నాన్ని కూడా ఈశ్వరార్పణ చేయ టం. దీన్నే సర్వ సమర్పణ బుద్ధి అని, శరణాగతి అని చెప్తారు. పురుషకారం కూడా ఈశ్వ రార్పణం చేస్తే అది తప్పించుకోవటం కాదా అని సందేహం రావచ్చు. మన మీద భారం పెట్టుకోకుండా ఆయన మీదే పెట్టున్నాం అంటే అర్థం నేను చేస్తున్నాను అనే భావం లేకుండా అహంకార త్యాగం జరుగుతుందే తప్ప కర్మ నుంచి తప్పించుకోవటం జరగ ట్లేదు అందుకు. అందుకే శరణాగతి అంటే పూర్ణ అహంకార త్యాగం. అంతకు ముందేమో తన అహంకారంతో నిర్ణయం తీసుకున్నప్పుడు, నాకిది సబబనిపిస్తోంది, నేను యుద్ధం చేయను అన్నాడు. ఇప్పుడు ఆ అహంకారం వదులుకుని కృష్ణార్పణం చేస్తున్నాడు. అందుకే ప్రపన్నంలో ఈ మూడు కృత్యములూ కృష్ణుడికే సమర్పించే యోగ్యమైన పని చేశాడు అర్జునుడు.

త్వమేవాహం స్థితిలో కూడా శరణాగతి ఎలా ఉంటుంది అనేది అర్థం చేసుకోవటానికి ఆదిశంకర భగవత్పాదులు ఇచ్చిన అద్వైతంలో ఉంది. అసలు గీతని అద్వైతామృతవర్షిణీం అన్నాం. దానియొక్క లక్షణమే అద్వైతమనే అమృతాన్ని వర్షించే ఓ తల్లీ, ఓ భగవద్గీతమ్మా 'త్వాం అనుసంధథామి' నిన్ను అనుసంధానం చేస్తున్నాను అని భగవద్గీతకు మనం నమ స్కరించుకున్నాం. అదే ఆ శ్లోకం అర్థం. కృష్ణుని ద్వారా అర్జునునికి ఉపదేశించబడిన జన నివి నువ్వు. నువ్వు మాపై వర్షించే వాత్సల్యమే అద్వైతామృతవర్షిణి. అందుకే అద్వైతమనే పరమసిద్ధిని అందజేసే గ్రంధమౌతోంది భగవద్గీత. ఈ ప్రపత్తి అద్వైతానికి ఏమీ విరుద్ధం కాదు.

శంకరభగవత్పాదులు శరణాగతి అద్వైతానికి విరుద్ధమైతే, శివానందలహరి లాంటివి రచించేవారు కాదు. ఉపనిషత్తు చెప్పిందని ముందే అనుకున్నాం కదా! శంకరులు కూడా షట్పదీ స్తోత్రం చెప్తూ, ఆ నారాయణుని కీర్తిస్తూ, జీవులందరూ అలలవంటి వారైతే, పరమాత్మ సముద్రం వంటివాడు అన్నారు. అలలుగా చూస్తే, విడిగానే కనిపిస్తాయి, కాని, వాటిని సముద్రంతో కలిపి చూస్తే ఒక్కటిగానే కనిపిస్తాయి. ఆ ఒక్కటే అన్న విషయమే శంకరులు చెప్పారు. దాన్ని సరిగ్గా అర్థం చేసుకోలేక అలలతోనే పరిమితులైన బుద్ధులు కలవారు అనవసరంగా కల్లోలపడ్డారు తప్ప, మొత్తం సముద్రంగా దర్శించినప్పుడు, ఆ అల కూడా సముద్రంలో జరిగే ఆటే కదా! ఈ ఆటంతా సముద్రుడు ఆడిస్తున్నాడు, అలలు విడిగా చూస్తే అనేకమైన అలలు ఉన్నాయి. భిన్నములుగా కనిపిస్తున్నాయి. కాని ఈ అలలకి సముద్రాన్ని ఆధారం చేసుకుని వస్తూ, పోతూన్న ప్రతికెరటంలో సముద్రమే ఉంది. ఆ దర్శనం కాని మనకి లభిస్తే ఏకత్వమంతా మనకి అర్థమవుతుంది.

చిన్నప్పుడు పిల్లల్ని ఆడించేటప్పుడు

తారంగం తారంగం, వేణూనాదా తారంగం అనేవాళ్ళు. వేణునాదా, చిన్ని కృష్ణ తారంగం అంటే కృష్ణుడినే అక్కడా తెచ్చారు. ఆ తారంగం అంటే ఏమిటి?

నిత్యం ఈ విశ్వమనే మహాసముద్రంలో జరుగుతున్నటువంటి ఈ క్రీడే ఆ తారంగం. ఆ 'తారంగం' అంటే తరంగ సంబంధమైన ఆట. ఈ జగత్తులో జరుగుతున్నవన్నీ తరంగముల వంటి ఆటలే. అది ఎవరియందు జరుగుతుందో అతను కృష్ణుడు. ఆ పూర్ణ పరబ్రహ్మమే శ్రీకృష్ణుడు. ఆయన యందు జరుగుతున్న ఆటే మన బ్రతుకుల ఆట.

ఈ బ్రతుకులాట బ్రతుకులాటలో వెతుకులాట

ఎన్ని బ్రతుకులాటలు, మనవి బ్రతుకుల ఆటలు

ఇలాంటి బ్రతుకులాటలన్నీ, ఈ తారంగ క్రీడ, ఏ సముద్రాన్ని ఆధారం చేసుకుందో ఆ సముద్రాన్ని ఆత్మ అన్నారు. దాన్ని అవగతం చేసుకోమని చెప్పటమే దీని యొక్క ఉద్దేశం. అందుకు శంకరులు కూడా 'తారంగః' అనే మాట వేశారు. స్వామీ తరంగం సముద్రానికి చెందినది కాని సముద్రం తరంగానికి చెందినది అనగలమా అన్నారు. అదీ విశేషం. వ్యవహారంలో జీవుడికి, ఈశ్వరుడికీ బేధం కల్పించినా (అంటే అల, సముద్రం విడిగా కనిపించినా, అవి ఎలా విడిగా లేవో) అలాగే జీవుడికి, ఈశ్వరుడికీ బేధమనేది వ్యవహారదృష్టి ఉన్నప్పుడు విడిగా కన్పించినప్పటికీ కొంచెం లోతుగా ఆలోచిస్తే అలకీ, సముద్రానికీ బేధం లేనట్టే మనకీ, ఈశ్వరునికీ బేధం లేదని తెలుస్తోంది. అందుకు అల వంటివాడను నేను, సముద్రం వంటి వాడవు నువ్వు. అయితే నేను అలగా ఉన్నా, నీలో ఉన్నాను, నా అలలో కలిగే ప్రతిభావం నీవే అని తెలిశాక, నేను నువ్వే అన్న భావం ఏర్ప డ్డాక, అలభావం పోయి, నేను సముద్రభావాన్ని వహిస్తున్నాను, అందుకు నా ఆటలన్నీ నీ ఆటలే అని తెలిసినప్పుడు నాకొచ్చిన ఆ సముద్రభావం గొప్పది అని శంకరుల శరణాగతి పూర్ణ, తదాత్మ్యాన్ని కలిగించింది.

ఇలా ప్రపన్నుడయ్యాక అర్జునుడేం చేశాడు?

స్వామీ నాకు కలుగుతున్న వేదన నువ్వు తప్ప ఎవరూ తీర్చలేరు. నాకు శ్రేయస్సు ఏది అనేది నువ్వే ఇవ్వగలవు. ప్రపన్నుడికి  నాకు మనశ్శాంతి రాజ్యం లభిస్తే రాదు, స్వర్గాధిపత్యం వచ్చినా రాదు. ఈ శోకాన్ని ఎలా చల్లారుతుందో తెలియదన్నాడు. ఇది ప్రపన్నుడి గొప్ప విశేషం. ఇహలోకం సుఖం, పరలోక సుఖం గురించి చెప్తున్నాడు. రెండు రకాల సుఖాల గురించి చెప్తున్నాడు క్షత్రియుడికి ఇహలోక సుఖం ఏమిటి? మరొక శత్రువు లేకుండా, నిష్కంటకంగా భూమిని ఏకఛత్రాదిపత్యంగా ఏలటమే!అందుకు నాకు అలాంటి ఇహలోక సుఖం లభించినా నాలోపల ఉన్న శోకాగ్నికి శాంతి లభించదు.

నా యింద్రియాలన్నిటినీ మండిస్తున్న నాలోపలి శోకానికి శాంతి, నిష్కంటకమైన ఏకఛత్రాదిపత్యం లభించినా నాకు శాంతి లభించదు. పోనీ స్వర్గాదిపత్యం లభిస్తే వస్తుందా అంటే అది 'రాజ్యం సురాణామపి చింధిపత్యమ్' నాకు దేవతలపై ఆధిపత్యం లభించేటంత స్వర్గలోక ప్రాప్తి లభించినప్పటికీ నాకు శాంతి లభించదు.

అసలైన శాంతి అనే వస్తువు ఏమిటి?

న పాతాళే, నా భూతలే, న మోక్షో, నభసపృష్టే అన్నారు శంకరులవారు. నభస పృష్టేన ఆకాశం కొనలో లేదు, పాతాళంలో లేదు, భూతలంలో లేదు, మోక్షము, శాంతి ఒకచోటునాశ్రయించి ఎప్పుడూ లేవు. అందుకే అర్జునుడు నాకు ఇహలోకంలోగాని, పరలోకంలోగాని శాంతి లేదు, అందుకే నీకు ప్రపన్నుడనయ్యాను. నువ్వే శాంతినివ్వు అన్నాడు. ఈ జ్ఞానం ముందు కలగాలి. మనం శాంతికోసం ఈ ప్రయత్నం ఎప్పుడైనా చేశామా? అర్జునుడి గొప్పతనమంతా ప్రపన్నుడనటంతో ఎంతకనిపిస్తుందో. ఈ శ్లోకం చెప్పటంలో అంత కనిపిస్తుంది. ఎందుకు అక్కడే ఆగలేదు, ఈ శ్లోకం కూడా ఎందుకు చెప్పాడు?

అర్జునుడి మనస్థితిలో ఉన్నా ఔన్నత్యం ఇక్కడ చూపిస్తున్నాడు. ప్రపన్నతా భావం తో ఉన్నవాడి మనసు ఎలా ఉండాలి? ఇహ, పరలోక సుఖాలను వెతుక్కునే వాడు శాంతి పొందలేడు. కేవలం ప్రపన్నుడు మాత్రమే నిజమైన శాంతిని పొందగలడు. ఆ ప్రపన్నత వల్ల పరమేశ్వరుడే ఆయనకి శాంతినివ్వగలడు.

ఈశ్వరానుగ్రహోదేవ పులసామద్వైత వాసః

ఈశ్వరుని అనుగ్రహం వల్లనే శాంతి లభిస్తుంది. అందుకు నిన్ను నేను శరణు వేడుతున్నాను అన్నాడు.

ఇహాముద్రాద్రభోగవిరాగము అని సాధన సంపత్తిలో చెప్పబడుతున్నది, ఇక్కడ స్పష్టముగా చెప్పబడింది. ఈ మాట చాలా మందికి తెలిసే ఉంటుంది. ఇహలోక, పర లోక సుఖముల యందు విరక్తి గలవానికే బ్రహ్మవిద్య వినటానికి అర్హత కలిగి ఉంది. ఒక కష్టం కోసం ఒక మంత్రం జపించటం బ్రహ్మవిద్యకాదు. మనకేదో ఒక అవసరం తీర్చుకోవటం కోసం ఆలయానికి వెళ్లటం ఆధ్యాత్మికత కాదు. ఇది ముందు తెలుసు కోవాలి. అది భౌతిక మార్గమే! భౌతికమైన కోర్కెలు కోరి, అవి అనుకూల పడ్డానికి భగవం తుని ఆశ్రయిస్తున్నాం. దాని ప్రయోజనం భౌతికమే కనుక ఆధ్యాత్మికం కాదు. ఇటువంటి శరణాగతి అర్జునుని ప్రపన్నత కాదు. అతని ప్రపన్నత జ్ఞానం కోసం, శాంతికోసం చేసినది. దానిని ఆధ్యాత్మిక ప్రపత్తి అని చెప్పాలి. నేను అర్జునునిలా చేస్తాను, నాకు రావాల్సిన సొమ్ము రావాలి అని నిలదీయకూడదు. నిలదీస్తే యివ్వడా అంటే యిస్తాడు, అది వేరే విషయం. కాని భగవంతుని ఇలా సాధనగా చూసేవాడు ఆధ్యాత్మికవేత్త కాదు. మనకు, అప్పు ఇచ్చేవాడ్ని ఎలా చూసుకుంటున్నామో భగవంతుడిని అలాగే చూసుకుంటున్నాం. అందుకే దేవతా దృష్టి, ఆధ్యాత్మిక దృష్టి వేరు. పరమేశ్వరుని చూసి ఎవరి నెత్తిన చేయి పెడితే వాడు నాశనమవాలని కోరుకునేవాడు ఆధ్యాత్మికవేత్త ఎలా అవుతాడు? అదే పరమేశ్వరుని చూపి కైవల్యం పొందిన మహాత్ములు ఆధ్మాత్మికవేత్తలు. తన ప్రయోజనం నెరవేరటానికి మరికొంత శక్తికోసం భగవంతుని కూడా ఒక సాధనగా వాడుకున్నాడు. అంతే తప్ప పరబ్రహ్మపట్ల అవగాహన లేదు. పరబ్రహ్మ పట్ల అవగాహన ఆధ్యాత్మికత. ఆధ్యాత్మికత్వాన్ని అనవసరంగా అష్టానభరితం చేయద్దు. అష్టానభరితం అంటే వాడకూడని మాట వాడకూడని చోట చెప్పద్దు అని.

అర్జునుని యొక్క ప్రపన్నతలో ఎంత ఔన్నత్యం ఉంది, ఎంత స్పష్టత ఉంది, ఎంత అవగాహన ఉంది, ఎంత గాఢత ఉంది అని చెప్పటానికే ఈ శ్లోకం మనకి ఉదాహరణ.

ఏవముక్త్వా హృషీకేశం గుడాకేశః పరంతప ।
న యోత్స్య ఇతి గోవిందముక్త్వా తూష్ణీం బభూవ హ ॥9॥

ఈ విధంగా హృషీకేశునితో గుణాకేశుడు చెప్పీ - గుణాకేశుని అర్థం ముందే చెప్పుకున్నట్టుగా నిద్రని జయించినవాడు.

న యోత్స్య ఇతి గోవిందముక్త్వా తూష్ణీం బభూవ హ ॥9॥

ఇంక నేను యుద్ధం చెయ్యజాలను అని 'తూష్ణీం బభూవహ' అన్నాడు. 'తూష్ణీం' అంటే మిన్నకున్నాడు అని అర్థం. అన్నీ ఆపి నువ్వే శరణు అని మిన్నకుండటం అనేది గొప్పమాట. పూర్ణంగా అర్పణం చేసి, ఇక తనది అనే ఏభావం లేకుండా ఊరుకోవటమే తూష్ణీం అనే మాటలో చూపిస్తున్నారు. ఆ స్థితికి చేరుకుని గోవిందా ఇతిముక్త్వా చివరి మాట ఏమిటి? 'నయోత్స్య ఇతి' - గోవిందునితో పలికాడు.

గోవిందా అనే సంభోదనలో గొప్పతనమేమిటి?
జ్ఞానమంతా దేనిని ఆధారం చేసుకుని ఉంది? వేదములని, వేదములన్నీ ఎవర్ని ప్రతి పాదిస్తున్నాయి? నిన్నే! అందుకు గోవిందా! గోవిందా అంటే వేదములచే ప్రతిపాదింపబడే నారాయణా,ఏది జ్ఞానమో అది నువ్వు చెప్పు అనటం. గోవిందుడనే మాటని ఇక్కడ వాడ టంలో గొప్పదనమది.

ఆ విధంగా విషాదంతో ఉన్న అర్జునుని చూసి, ఉభయసేనా మధ్యలో హృషీ కేసుడు 'ఇదం వచః అబ్రవీత' ఈ వచనాన్ని చెప్తున్నాడు. ఎలా చెప్తున్నాడు?

ప్రహసన్నివ - నవ్వుతున్నవాని వలె చెప్తున్నాడు. ఎందుకా మాట చెప్తున్నాడు ? ఇక్కడ వరకు సాంఖ్య యోగంలో పది శ్లోకాలు అయ్యాయి. విషాదయోగంలో 47 శ్లోకాలు అయ్యాయి.అంటే 57 అయ్యాయి. ఇప్పటి వరకూ కృష్ణుడి బోధ మొదలవలేదు. మరి

క్లైబ్యం వచ్చిందంటే అది ఇంతకు ముందు చేసినటువంటి పునాది రాయి లాంటిది. అంటే వేడెక్కించటమన్నమాట. ఏ జ్వాల రగలాలో, అది రగిలించాలి. అంత వరకు ప్రపన్నం లేదు. తను మోహితుడై తన నిర్ణయమే గొప్పది అనే స్థితిలో ఉంటే నీ నిర్ణయం తప్పు అంటే అప్పుడు ప్రసన్నుడయ్యాడు ? అందుకే ప్రపన్నం అనే మాట అతని నోటి వెంట పలకటానికి పనికి వచ్చింది ఆ చిన్నమాట. అది వెలికి తీసాక ఇప్పుడు ఈయన తన ఉపదేశాన్ని వెలికి తీస్తున్నాడు. 57 శ్లోకాల తర్వాత కృష్ణబోధ మొదలవుతుంది కాబట్టి ఈ శ్లోకాలని పూర్వపీఠిక అంటారు. విష్ణు సహస్రనామంలో పూర్వపీఠిక ఉన్నట్టుగా అలాగే అభిరక్షతు తర్వాత.
తర్వాత వచ్చిన మాటలు ఉత్తర పీఠిక.

ఇప్పుడు ఉత్తరపీఠిక మొదలవుతున్నది. అందులో కృష్ణ పరమాత్మ వచనం మొద లవుతుంది.

ప్రహసన్నివ - నవ్వుతున్న వానివలె ఉన్నాయట. అంటే స్వామి వదనంలో చిరునవ్వు కనిపిస్తున్నది. మామూలు నవ్వుకాదు. ప్రహసన్ బాగా నవ్వాడుట. హసన్ ప్రహసన్ తీసుకుంటే హసన్ అంటే నవ్వటం, ప్రహసన్ అంటే సృష్టంగా నవ్వటం అలా అని స్పష్టంగా నవ్వుతున్నాడా అంటే స్పష్టంగా నవ్వుతున్నవానివలె అన్నాడు. అర్జునికేమో విషాదంతం అన్నారు. ఆయనేమిటి ప్రహసనం ఈ రెండు విశేషాలు మనం గమనించితే అర్జునుడు, అంటే జీవుడు దుఃఖలక్షణం గలవాడు. ఆయన్ని తరింపచేసే దేవుడు ప్రహసన్.ఆనందమే

ఆయన స్వరూపం. దుఃఖమే వీడి లక్షణం. అజ్ఞానంతో కూడిన దుఃఖంతో ఉన్నవాడు వాడు. పరమాత్మ జ్ఞాన స్వరూపుడు. ఆ ఆనందం ఎప్పుడూ ఉన్నదే. దాన్ని నవ్వుద్వారా వ్యక్తం చేస్తున్నాడు. నవ్వటం అనేది ఆయనకి వికారం కాదు. ఆయన సహజ లక్షణమే ఆనందమై భాసిస్తూ ఉంటుంది. అందుకు ప్రహసన్నివాత్ ఆయన ఆనిత్యానంద స్థితిని నవ్వుతో తెలియజేస్తున్నాడు. ఆ నవ్వులో ఎన్ని అర్థాలున్నాయో ఎందుకు నవ్వుతున్నాడో అనుకునేలా నవ్వుతున్నాడు కనుక ఈ మాట వేయటంలో ఉద్దేశమిది.

ఎందుకు నవ్వుతున్నాడు?

ఇంత జాలి కలిగిన వాడివి అంత గొప్ప మాటలు ఎందుకు వాడావు అనా ? లేకపోతే ఈ చర్చ ఏదో ఇంట్లో చేసుకుని ఇక్కడికి రావచ్చుకదా ! ఇక్కడికొచ్చాక ఎందుకు అనా ? అప్పుడు ద్వేషం ఆక్రమిస్తే ఇప్పుడు రాగం ఆక్రమించిందా, రెండూ ప్రమాదకరమే అనా ? ప్రహసన్నివ అనే మాటలో ఎన్ని పెట్టాడో వ్యాస దేవుడు.

ఇవ అనే దానికి వికారం ఉన్నా, ఆనందం మాత్రం నిర్వికారం. అలాంటి నిర్వికార మైన ఆనంద స్వరూపుడైన కృష్ణ పరమాత్మ పలుకుతున్నాడు. ఇక్కడ కృష్ణ ఉవాచ అని కాని వాసుదేవ ఉవాచ అని కాని లేదు. మొత్తం గీత అంతా భగవాన్ ఉవాచ అని వస్తుం ది. ఈయన భగవానుడు అని తేల్చి చెప్తున్నాడు. వ్యాసదేవుడు ఇందులో అంటే షడ్గుణైశ్వ ర్య సంపన్నుడు అని అర్థం. షడ్గుణములు అంటే సమగ్రమైన ఐశ్వర్యము, ధర్మము, యశస్సు, శ్రీ, జ్ఞాన వైరాగ్యములు అను ఆరు గుణములు మూర్తీభవించిన వాడు ఆయన. పైగా భగవాన్ శబ్దానికి  మరొక అర్థం చెప్పారు శాస్త్రవేత్తలు. భగవాన్ అంటే ఆరూ తెలిసిన వాడు అని ఆరూ అంటే మూడు జంటలు ఆరు. ఒక జంట ఉత్పత్తి ప్రళయం చైవ, రెండవ జంట భూతానాం ఆగతిం గతిం. మూడవ జంట వేత్తి విద్యాం అవద్యంచ ఉత్పత్తి ప్రళయం చైవ జగత్తు యొక్క ఉత్పత్తి, ప్రళయ జ్ఞానం కలవాడు, ఎప్పుడు పుడుతున్నది. ఎప్పుడు పోతున్నదీ ఆయనకే తెలుసు. అలాగే జీవుడి రాకపోకల వ్యవహారాలన్నీ ఆయనకీ తెలుసు. మనకి రావటం, పోవటం తెలుసుకాని ఎలా రావాలో, ఎప్పుడు పోవాలో ఇలాంటి వేవీ తెలీదు. అందుకే ఈశ్వరుడిని కర్మఫల ప్రదాత అన్నారు.

కర్మ చేస్తున్నాం కాని ఫలం ఏమిటో తెలీదు. ఫలం ఆయన యిచ్చేది. అది మనకి ముందు, ముందు అర్థమయ్యేలా చెప్తాడనుకోండి. అలాగే విద్యావిద్యలు తెలిసినవాడు. మనకున్నది విద్యో, అవిద్యో తెలియదు. ఎవరు జ్ఞానో, ఎవరు అజ్ఞానో తేల్చి చెప్పలేని అజ్ఞానులం మనం. బంధించేది అవిద్య, విడిపించేది విద్య, ఆ రెండూ ఆయనకి తెలుసు. అందుకే ఆయన గోపాలుడు అయ్యాడు. ఆవుల్ని ఎప్పుడు కట్టాలో, ఎప్పుడు విప్పాలో తెలుసు. వాటిని కట్టకపోయినా ప్రమాదమే, విప్పేసినా ప్రమాదమే. ఎప్పుడు కట్టాలి, ఎంతమేరకు కట్టాలి ఆయనకి తెలుసు. టై కట్టుకోవటం లాంటిదిది. లూస్‌గా కడితే చూడటానికి బాగుండదు. గట్టిగా కడితే పెట్టుకోవటానికె వాడుండదు. అందుకే ఈ ఆరు తెలిసిన నీకే శరణుఅనుకుంటే విడిపించటం పని ఆయనే చూసుకుంటాడు. భగవానుడి శబ్దంలో ఇంత అర్థం ఉంది. భగవాన్ అనే శబ్దానికి శాస్త్రం ఇలా రెండు అర్థాలు యిచ్చింది. ఇది కృష్ణుడికే భగవాన్ శబ్దం అయింది. ముకుంద ఉవాచ, గోవింద ఉవాచ, వాసుదేవ ఉవాచ లాంటి వేవీ వాడకుండా, ఇన్ని శబ్దాలూ కలిగిన భగవాన్ ఉవాచ వాడాడు వ్యాసుడు.భగవాన్ అంటే సాక్షాత్తు పరమేశ్వరుడే ఈయన అని ఆయన ఉద్దేశం. అది అర్థం చేసుకోవాలంటే భాగవతం చూడాలి. ఆయన కృష్ణస్తు భగవాన్ స్వయం అని చెప్పేశాడు. ఆ పరమాత్ముడు అన్ని అవతారాల అంశావతారములు, కళావతారములు ఇవన్నీ దాల్చాడు. మొదట్లోనే కృష్ణస్తు భగవాన్ స్వయం అని చెప్పాడు. అందుకు ఆయన ఆ పుస్తకానికి ఏం పేరు పెట్టాడు ? భాగవతం. భగవానునికి సంబంధించింది కనుక భాగ వతం. భాగవతం అంటే ఆయన దృష్టిలో కృష్ణకథే ! అందులో నరసింహ కథ, వామన కథ చెప్పారంటే, ఇన్నీ ఎవడు ధరించాడో ఆయన కృష్ణుడే అని తేల్చి చెప్పటం ఆయన ఉద్దేశం.

(సశేషం)

మనం ఎక్కడ కన్ఫ్యూస్ అయిపోతామోనని దీనికి భగవద్గీత అని పెట్టాడు. భాగవతం ఎందుకంటే భగవానుని చరిత్ర! భగవద్గీత ఎందుకుంటే భగవంతుడి యొక్క ఉపదేశం. భగవాన్ శబ్దం రెండు చోట్ల వాడాడు. క్లైభ్యం మాస్మగమః

అన్నప్పుడు కూడా భగవాన్ ఉవాచ అని ఉందికదా! అప్పుడు చెప్పకుండా ఇప్పుడెందుకు చెప్తున్నారు అని అడగవచ్చు మీరు! ఎందుకంటే అసలు ఉపదేశం ఇప్పుడు కనుక శ్రీ భగవాన్ ఉవాచకి అర్థం చెప్పుకున్నాం.

ఇక్కడ ఈ శ్లోకం చాలా ముఖ్యమైన శ్లోకం. మనకి బాగా పాప్యులర్ అయిపోయింది. అదొక ప్రమాదం. బాగా పాప్యులర్ అయితే దాని విలువ మనకి తెలియదు. సూర్యుడంతటివాడికే విలువ తెలియకుండా పోయింది. సూర్యుడు అనేది ఎంత ఆశ్చర్యకరమైన విషయం. మనం సూర్యుడొచ్చాడంటే ఆశ్చర్యపోతున్నామా? లేదు! అలాగని అర్థమయిపోయాడా? లేదు. ఆశ్చర్యపోకపోవటానికి రెండు కారణాలు ఉండాలి. అర్థమయిపోతే ఆశ్చర్యం కాదు. రెండో కారణం అలవాటయి పోవటం. సూర్యుడు మనకి అలవాటయి పోయాడు! ఆశ్చర్యపోవటం నేర్చుకుంటే మనకు అడుగడుగునా పరమాత్మ అందుతుంది. ఆశ్చర్యమే పరమాత్మ, అది కూడా కృష్ణుడు తర్వాత చెప్తాడు. ఎప్పుడో రాబోయేది ఇప్పుడు ఎందుకు చెప్తున్నారు అంటే ఇప్పుడు కొంత తెలుసుకుంటే అప్పుడు అసలు అర్థమవుతుంది. ఈ శ్లోకం యొక్క గొప్పతనం చెప్పటానికి ఈ మాట చెప్తున్నాను. బాగా అలవాటైన మాట అంటే అది విన్నదేలే తర్వాత ఏమిటి అంటాం. విన్నది కాదు మనలో ఉన్నదా అని ఆలోచించుకోవాలి. మనలో అది బలంగా ఉంటే బాధలేదు. ఎన్నో గొప్పశబ్దాలు మనకి నిత్యం అలవాటైపోయి, వాటి గొప్పదనాన్ని అనుభవించలేకపోతున్నాం. అలాంటి వాటిలో సచ్చిదానందం అనే మాట ఒకటి. ఈ మాట తెలీదా అంటే తెలుసు! మాట యొక్క గొప్పతనం

మాత్రం తెలీదు. కారణం అలవాటై పోవటం వల్ల. అలవాటైపోతే దాన్ని అతి తేలిగ్గా తీసే స్తాం.

ఇప్పుడు చెప్పబోయే శ్లోకాన్ని అతి తేలిగ్గా తీసేయవద్దని చెప్పటానికే ఇంత ఉపోద్ఘా తం.

అశోచ్యావన్వగోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే

గతాసూనగతాసూంశ్చ నూనానుశోచంతి పండితా 2 - 11

గీతను రెండు రకాలుగా వింటున్నవారు ఉండచ్చు. ఒకటి కాలక్షేప శ్రవణం, రెండు శ్రద్ధా పూర్వక శ్రవణం. అలాగే గీతను పారాయణం చేసేవాళ్లు కొందరుంటారు. పరమా త్ముని మాటలు కనుక ఇవి మామూలు మాటలు కావు, మంత్రాలు. మరి మంత్రాలని ఇంత తేలిగ్గా వింటామా? అందుకే పూర్వం ఉపనిషత్తునైనా, గీతనైనా మడికట్టుకు చద వాలనేవారు. మడికట్టుకోమన్నారంటే అది నీ యొక్క శ్రద్ధను తెలియజేస్తుంది. దాని కోసం నువ్వు సర్వశిద్ధుడై, శరణాగతుడై ఉండాలి. ఏవో అక్షరాలు కదా, ఏదో చెప్పటం కదా అనుకుంటే అర్థమయ్యేది కాదు బ్రహ్మవిద్య! అదేం పెద్ద బ్రహ్మవిద్యా అంటాము కదా, అంటే బ్రహ్మ విద్యకి ఎటువంటి లక్షణం ఉండాలి? శ్రద్ధ ఉండాలి. ఆ శ్రద్ధలో భాగమే నియమం. అలా నియమంగా పారాయణం చేసేవాళ్లకి భగవద్గీత మంత్రం. మంత్రంలో ఋషులు చెప్పుకోవాలి, ఛందస్సు చెప్పుకోవాలి. అలా ఇంకా చాలా చెప్పుకోవాలి. బీజ మని, కీలకమని, అంగన్యాస కరన్యాసములని చాలా ఉన్నాయనుకోండి. మరీ అంత చాదస్తానికి పోయినా ప్రమాదమే, అసలు లేకపోయినా ప్రమాదమే. ప్రతిదానికీ బ్యాలె న్సింగ్ పాయింట్ ఒకటుంటుంది.

దీనికి ఋషి ఎవరు? వేదవ్యాసో భగవాన్ ఋషిః ఈ మంత్రమునంతటిని దర్శించి నవాడు వేదవ్యాసుడు. ఛందస్సేమిటి అనిష్టింఛందః దైవము ఎవరు? పార్థసారథియైన శ్రీకృష్ణుడే దైవం. ఇక అటుపై దీనికి బీజమేమిటి?

'అశోచ్యానన్యశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే.

ఇది బీజం అని ఇక్కడ చెప్పాడు. మంత్రంగా చెప్పే శాస్త్రంలో ఈ శ్లోకాన్ని బీజమంత్రంగా చెప్పారు. బీజం అంటే ఏమిటి? విత్తనం. బీజం నుంచే మొత్తం చెట్టంతా మొలకెత్తుతుంది. భగవద్గీత అనే మహావృక్షానికి ఇది బీజప్రాయమైన శ్లోకం. ఇక్కడ నుంచి మొదలు పెట్టాడాయన. అంటే మొదట్లోనే చాలా ఉందన్న మాట.

అర్జునా నీలో రెండు దోషాలున్నాయన్నాడు, మొదటి దోషం 'అశోచ్యా నన్వశోచస్త్వం' రెండవది ' ప్రజ్ఞా వాదాంశ్చ భాషసే'. 'అశోచ్యాన్, అన్యశోచః త్వమ్' -'త్వమ్' అంటే నువ్వు, 'అన్యశోచః' ఏడుస్తున్నావు, దేని గురించి 'అశోచ్యాన్' - దేనికోసం ఏడవకూడదో దానికోసం ఏడుస్తున్నావన్నాడు. దేని కోసం ఏడవాలో దానికోసం ఏడవాలి, కాని నువ్వు దేనికోసం ఏడవకూడదో అది చేస్తున్నావు. అది మొదటి దోషం. రెండవ దోషం ఆ ఏడ్చిన ఏడుపును మేధాశక్తిగా తెచ్చి చూపించుచున్నావు నీవు. నువ్వు ఆడిన మాటలన్నీ కూడా ప్రజ్ఞావాదములు. ధర్మపన్నాలు పలుకుతున్నావే అంటాం కదా అలాంటిదన్నమాట. బుద్ధిమంతుని వలె మాట్లాడటం, లేదా నీబుద్ధికి ఏది అందుతోందో అదే మాట్లాడటం. బుద్ధికి అతీతమైన ఒక శక్తి ఉంది. అది శాస్త్రమనేటువంటిది. బుద్ధికి కూడా అతీతమైనది జ్ఞానం, శాస్త్రం. నీ బుద్ధికి అందినదే జ్ఞానమనుకుని దాన్నే తీర్మానిస్తూ ఇప్పటివరకూ మాట్లాడినవన్నీ ప్రజ్ఞావాదములు. ఇప్పుడు మనకి కనిపించే వాదనలన్నీ ప్రజ్ఞావాదములే. వాళ్ళ బుద్ధికి తోచిన యుక్తులు పనికిరాదు. దీనినే ఆయన మరొకచోట చెప్తారు. సబుద్ధి శాస్త్రిహి ఆసురీ లక్షణములు గురించి చెపుతూ వాళ్ళ బుద్ధికి తోచిందే శాస్త్రం. శాస్త్రాన్ని

వెయ్యేళ్ల తపస్సుతో గోచరింపచేసుకున్న సత్యాన్ని చెప్తే, నిద్ర తిండి క్షణం కూడా విడిచి పెట్టని ఈ జీవుడు వాళ్లెందుకు చెప్పారో వ్యాఖ్యానిస్తాడు. వీళ్లది ప్రజ్ఞావాదం. యుక్తులతో, చమత్కారంతో సత్యం తెలియదు. శాంతి లభించదు. ఈ ప్రజ్ఞావాదాలలోనే అనేకమంది భయంకరమైన నిర్ణయాలకొచ్చేస్తారు. నీది ప్రజ్ఞావాదం.ఈ ప్రజ్ఞావాదాలలో నువ్వు యుద్ధం చెయ్యనని వెళ్లిపోతే నువ్వు నరకానికి పోతావు జాగ్రత్త. నీ ప్రజ్ఞా వాదాన్ని నిలువరించి, శాస్త్రవాక్యమేమిటో తెలుసుకో, ఆ సత్యాన్ని చెప్పేవాడిని నేనున్నాను. అదీ స్వామి చెప్తున్న విషయం.

ఇలా రెండు దోషాలు నీ వద్ద ఉన్నాయి. ఇవి మనకి చెప్పటం కూడా. మన ఏడుపు లన్నీ దేనికోసం ఏడవకూడదో దాని కోసమే ఏడుస్తున్నాం. ఏడుపు అంటే కన్నీరే కాదు. మన వేదనలు అని అర్థం. మన దిగుళ్లు, మన బాధలు అన్నీ అర్థరహితములు. మనం తెచ్చుకునే తార్కిక వాదనలన్నీ కూడా ప్రజ్ఞావాదములు.

అని చెప్పి గతాసూనగతాసూంశ్చ నాను శోచంతి పండితాః

అన్నాడు. నిజమైన బుద్ధిమంతుడైతే అంటాడు. అంటే ఇద్దరు బుద్ధిమంతులుంటారా అంటే తత్త్వదర్శనము కలిగిన, సత్యము తెలిసిన వారు ఎవరైతే ఉంటారో వారు పండితులు. అటువంటి పండితులు 'గతాసూన, అగతాసూన్, చ' - వెళ్లిపోయినవాటికి గాని, వెళ్లకుండా ఉన్న వాటికి కాని దుఃఖపడరు అన్నాడు. అంటే మనదుఃఖం ఎంత అర్థరహితమో చెప్పేశాడిక్కడ. 'గతాసు' - వెళ్లిపోయిన వాడు, 'అగతాసూంశ్చ' - ఉన్నవాళ్ళు. వెళ్ళిపోయిన వాళ్ళ కోసం ఏడవవలసిన పనిలేదు. ఉన్నవాళ్ళ కోసం అంతకన్నా పనిలేదు. పండితుడైనవాడు ఈ రెండింటికోసం ఏడవడు. మనం ఏడుస్తున్నామే అంటే మనకి ఉన్నది పాండిత్యం కాదన్నమాట. నిజంగా బుద్ధిపండినవాడు ఎవడున్నాడో, ఆ బుద్ధి పక్వమైన వాడు తత్త్వవేత్త. ఇక్కడ పండితుడు అంటే తత్త్వవేత్త అని అర్థం. విషయములన్నీ తెలుసు

కున్న మేధావి ప్రజ్ఞావాది. ప్రజ్ఞావాది వేరు, పండితుడు వేరు. గీతలో పండిత శబ్దం తత్త్వ వేత్త అన్న అర్థంలో వాడబడింది. తత్త్వాన్ని తెలిసినవాడు. బుద్ధివాదాన్ని అతిక్రమించి ఏ పర తత్త్వముందో, దాన్ని తెలిసినవాడు.

ఈ శ్లోకం సారాంశం ఏమిటి?

ఏడవద్దు అని. ఇది సాధారణంగా ఎవరు చెప్తారు? తల్లి చెప్తుంది. కృష్ణపరమాత్మ ఏడవద్దని మొదలుపెట్టి, ఏడవద్దని పూర్తిచేసాడు. మీరు గమనించండి. 'అశోచ్యానన్వశోచ స్త్వం' అని మొదలుపెట్టి 'మాశుచః' అన్నాడు. 'మోక్షయిష్యామి మాశుచ' (18-66) అన్నాడు. మాశుచః అంటే ఏడవద్దు అని అర్థం. ఇక్కడ ఏడవ కూడనిదాని కోసం ఏడవద్దు. రెండూ కూడా ఏడవద్దు అనే చెప్తున్నాడు. ఏడవద్దు అనే రెండు మాటల మధ్యలో ఎలా గుంటే ఏడవకుండా ఉంటామో చెప్పాడు. అదీ గీత అన్న మాట. అందుకు గీతకి పర మార్థం ఏమిటంటే దుఃఖనివృత్తి. దుఃఖం దేనివల్ల వస్తోందో తెలుసుకోవటం, దానికి నిధానమేమిటనేది లోపల సబ్జెక్టు. ఏడుపును పోగొట్టే మంత్రం గీత. అంటే ఆనందాన్నిచ్చే మంత్రం గీత. ఏడుపు అసహజం. ఆనందం సహజం. ఆ సహజమైన, ఆనందస్థితిని అందుకో! ఏడుపు అసహజం అని మొదటే చెప్పేస్తాడు. 'గతాసూనగతాసూంశ్చ' మన ఏడుపులన్నీ ఈ రెండింటిమీద ఉన్నాయో లేదో ఆలోచించుకోండి. వెళ్ళిన పోయిన వాళ్ళు అంటే చని పోయిన వాళ్లు, 'అగత'అంటే బ్రతికున్నవాళ్ళు అని అర్థం తీసుకోవద్దు.

దీనిలో రెండు రకాల అర్థాలు తీసుకోవాలి, ఏమిటవి? గతించిన దాని కోసం దుఃఖించకు. అదీ విశేషం. 'అగత' అంటే ఉన్నదానికోసం, లేదా రానున్నదానికోసం అస లు దుఃఖించకు, ఈ రెండింటికి దుఃఖించకు ఒక అర్థం.

ఇంకో అర్థం వెళ్లిపోయే లక్షణం కలిగింది ఒకటుంది. ఉన్న లక్షణం కలిగింది, ఇంకో టుంది. వెళ్ళిపోయే లక్షణం కలిగినది - దేహాదులు. దేహం కోసం దుఃఖించవలసిన అవ

సరం లేదు. 'అగతా' ఆ వెళ్ళే లక్షణం లేనిది ఒకటి ఉంది. ఆత్మవిషయం. దాని గురించి దుఃఖించ వలసిన పనేలేదు. అది ఇంకోచోట, తర్వాత, స్పష్టం చేస్తాడు. ఈ మాటకి స్పష్ట మైన వ్యాఖ్యానం లాంటి మరో శ్లోకం ఉంది కనుక ఈ అర్థం తీసుకోవచ్చని రామానుజుల వారు చెప్పారు. దేహాదులకి వికారం కలగటం దాని లక్షణం. దాని గురించి దుఃఖించవల సిన పనిలేదు., ఆత్మ - అవికారి అందుకే అగతా' అని చెప్పబడుతున్నది. అవికారి అయిన ఆత్మగురించి గాని, వికారియైన దేహాదుల గురించి గానీ, పండితుడైన వాడు దుఃఖించడు అని చెప్పి, ఆ పాండిత్యం యివ్వటానికి ప్రయత్నిస్తున్నాడు.

ఉన్నదేమిటి, వెళ్ళేదెవరు? ఇవి దేనికి పరిమితం చేసి ఆలోచిస్తున్నాం, ఏ విషయం లో గ్రహించాలో మళ్ళీ స్పష్టంగా తర్వాతి శ్లోకంలో చెప్తున్నాడు.

నత్వేవాహం జాతు నాసం నత్వం నేమే జనాధిపాః

నచైవ న భవిష్యామః సర్వే వయమతః పరమ్ 2-12

నేను గాని, నువ్వుగాని 'జనాధిపాః' - నువ్వు చూస్తున్న రాజులుగాని, ఒకప్పుడు లేని వారు కారు అంటున్నాడు. 'నేను ఒకప్పుడు లేనివాడను కాను' ఎప్పుడూ ఉన్నవాడినే. అది నా ఒక్కడి ప్రత్యేకత కాదు, నువ్వు కూడా ఒకప్పుడు లేనివాడవు కావు, అందుకే 'నత్వేవా హం జాతునాసం నత్వం'. మొదట 'అహం'. నేను ఒకప్పుడు లేనివాడను కాను. నేనొక్కడి నే కాదు నువ్వు కూడాను. మన యిద్దరిమేనా అంటే ఇక్కడ ఉన్న వాళ్ళందరి విషయం. ' జనాధిపాః' - రాజులు మాత్రమేనా అంటే అక్కడ ఉన్నవాళ్ళు రాజులు కనక వాళ్ళ గురిం చి చెప్పాడు. ఇతని ఏడుపు వాళ్ళ గురించి కనుక వాళ్ళ గురించి చెప్తున్నాడు. 'ఇమే జనా ధిపాః' ఇక్కడ కనబడుతున్న వాళ్ళంతా ఒకప్పుడు లేనివాళ్ళు కాదు. ఇప్పుడు కనబడుతు న్నారు కనుక ఇప్పుడు లేనివారు అనలేం. ఇప్పుడూ ఉన్నవాళ్ళే, ఒకప్పుడూ ఉన్నవాళ్ళే.

ఆ తర్వాత?

నచైవ నభవిష్యామః సర్వే నయమతః పరమ్

భవిష్యత్తులో కూడా లేని వారము కాదు అని చెప్తున్నాడు. మన దృష్టి త్రికాల దృష్టి. మనం ఒక పాయింట్‌లో నిలబడి, అటూ ఇటూ చూస్తాం. దేశం కాని, కాలం గానీ మూడు విధాలుగా చూస్తాం. మనం ఉన్నచోటు, మనం చుట్టూ ఉన్న చోటు, అంటే మన వెనక, మన ముందు అని అర్థం. వెనక గతం, మనం ఉన్నది వర్తమానం, మన ముందు న్నది భవిష్యత్తు ఉన్నది అనేది అటుంచి అటా, ఇటా, ఎటు? అంటే అప్పుడూ, ఇప్పుడు, ఎప్పుడూ ఉన్నవాళ్లమే అంటున్నాడు. ఎప్పుడూ ఉన్న వాళ్ళమే, అంటే ఇలా ఉన్నవాళ్ళం కాకపోవచ్చు కాని ఉన్న వాళ్ళం. అదీ విశేషం.

ఈ ఒక్క మాటలోనే 'తత్ త్వం అసి' అనే మాట స్పష్టంగా చెప్పదల్చుకున్నాడన్నది అర్థమవుతోంది కదా! అయితే ఇక్కడ ఆయన ఉద్దేశం - దేహాది వికారాలకు సంబంధిం చిన వారి గురించి చెప్పటం లేదు. ఈ కృష్ణుడు, ఈ అర్జునుడు, ఈ క్షత్రియుల ఉపాధు లతో చెప్పటం లేదు. ఈ ఉపాధులలో తన్మయమై పోయిన జీవుల గురించి, వాళ్ళలో స్ఫురిస్తున్న నేను అనే తత్త్వం గురించీ చెప్తున్నాడాయన. ఆత్మదృష్ట్యా నీవుగా, నేనుగా, రాజులుగా చెప్పబడుతున్న వాడెప్పుడూ ఉన్నాడు. ఈ మాటనే శంకరులు అన్నారు.

త్వయి, మయి సర్వత్రైకో విష్ణు

రత్వ్యర్థం కుప్యసి మయ్య సహిష్ణుః

భమ సమచిత్తః సర్వత్ర త్వం

వాంఛ స్యచిరాద్యది విష్ణుత్వం భజగోవిందం ।

'త్వయి, మయి, అన్యత్ర' - నువ్వు, నేను, మరొకరు - ఇదే గొడవ మనకి. మనకి మూడు పురుషులున్నాయి. ప్రథమ, మధ్యమ, ఉత్తమ. అవతల వాడు అంటే నువ్వు, నేను కాక మిగిలిన ప్రపంచం. ఈ మూడూ కూడా ఎప్పుడూ ఉన్నవే అని తాత్పర్యం. ఇది

మనకి అర్థం కావటానికి ఇంతకు ముందు లేనివాళ్లము కాము. ఇప్పుడు లేని వాళ్ళము కాము, ఎప్పుడూ ఉన్నవాళ్లమే మనము అన్నాడు.

ఎప్పుడూ ఉన్నవాళ్ళము ఎలా అవుతాము?

వెంటనే ఈ ప్రశ్న వస్తుంది - ఇదంతా వేదాంతంలోకి వెళ్లక్కరలేదు. కేవలం లౌకిక మైన విశ్లేషణతో చెప్తున్నాడు కృష్ణపరమాత్మ. ఏవి ఒకప్పుడు లేవనుకుంటున్నావో అవి నువ్వు కావు కనుక, ఉన్నవాడివే! ఏది ఒకప్పుడు లేదో అది నువ్వు కావు అని అర్థం. ఏది లేదో అది ఇప్పుడు వచ్చింది. ఇప్పుడు నువ్వని ఏదనుకుంటున్నావో అది నువ్వు కాదు అని కదా అర్థం. ఇప్పుడు ఫలానా దేహంలో ఉన్న నీ గురించి కాదు నేచెప్పేది. నువ్వుగా ఏ చైతన్యం వ్యక్తమవుతుందో, నేనుగా ఏ చైతన్యం వ్యక్తమవుతుందో, ఇక్కడున్న రాజులు గా ఏ చైతన్యం వ్యక్తమవుతోందో అది ఎప్పుడూ ఉన్నదే అని చెప్పదల్చుకున్నాను అని చెప్తున్నాడు.

మరి దాన్ని నేను ఏ విధంగా నమ్మటం?

దాన్ని యుక్తిగా వివరిస్తున్నాడు. ఇది చాలా చక్కటి శ్లోకం. ఇది కూడా ప్రాచుర్యం ఉన్నదే.

దేహినోస్మిన్ యధాదేహే కౌమారం యౌవనం జరా

తథా దేహాంతర ప్రాప్తిః ధరస్తత్ర న ముహ్యతి 1 - 13

ఇక్కడ తాను చెప్పదల్చుకున్న విషయాన్ని ముందక్కడ పెట్టేశాడు. తర్వాత దాన్ని బ అర్థమయ్యేలా చెప్తున్నాడు.

ఆత్మ తత్త్వం అంటే ఏమిటి?

అది ఒక్క శ్లోకంలో చెప్పేశాడు. అది 'త్రికాలావాద్యము' అంటే మూడు కాలాల లోనూ నశించని వస్తువు ఆత్మతత్త్వము . అది ఒకచోట పరిమితమై లేదు. సర్వవ్యాపకమై

ఉన్నది. అందుకే నీలో, నాలో, రాజులలో! దాన్ని అర్థం చేసుకోవటమెలాగో చెప్తున్నాడిక్కడ. ముందు ప్రపంచం విషయం పక్కన పెట్టి, మన సంగతి ఆలోచిద్దాం. 'దేహినోస్మిన్' - ఇది మన విషయమా అంటే దేహం ఉన్న వాళ్ళందరి గొడవే. అందుకే ఇది ఒక్క అర్జునుడి గొడవ కాదు, మన గొడవ అయింది. 'దేహినోస్మిన్ యథాదేహే'

ఇక్కడ విభజన లేదా సంఖ్య అనేది ఇక్కడ మొదలయింది. 'దేహినః' అన్న మాటలోనే సంఖ్య పెట్టాడాయన. 'దేహినః' అంటే దేహము కలవారు అన్నాడు. అదీ విశేషం. 'దేహము కలవారు' అన్నమాటని కొంచెం ఆలోచించండి మనం ఎప్పుడైనా మనని గురించి ఇలా అనుకున్నామా? మనమే దేహం అనుకున్నాం తప్ప, మనకొక దేహముంది అనుకున్నవాళ్లం కాము.

దేహినః అనటంలోనే రెండున్నాయి. ఏమిటవి?

దేహము, దేహి. సంఖ్య చేసేదేమిటంటే విడదీసి చూపి, రెండూ ఒక్కటే అని చెప్తుంది. విడివిడిగా చూపించి, విడివిడిగా ఉన్న వాటిల్లోది ఒక్కటని చూపించటానికే దేహము, దేహి అని విభజన చేస్తున్నాడిక్కడ. దేహము కలవారందరూ ఈ దేహమునందే ఎన్ని అవస్థలు దాటివచ్చారో ఆలోచించండి - కౌమారం, యౌవనం, జరా - బాల్యము, యవ్వనము, ముసలితనము అనే మూడు అవస్థలు దాటి వచ్చాం.

ఇప్పుడు నీ వయస్సెంత అంటే అర్జునుడి వయస్సు 80 ఏళ్లు. ఇప్పటి కాలంలో అయితే వెళ్ళి పోవల్సిన సమయంలో ఉండచ్చు. కాని అర్జునుడిది యోగ నిష్టా గరిష్టమైన శరీరం గనక, ద్వాపరయుగ కాలానికి చెందిన వాడు గనక ప్రౌఢ యవ్వనంలో ఉన్నట్టున్నాడు. ఆయనకి వార్ధక్యం ఉంది కాని 'జర' లేదు. జర అంటే జీర్ణించుట, కృశించుట అని అర్థం. వార్ధక్యం అంటే పెద్దరికం అని కూడా! పెద్దరికం ఉండచ్చు. అది తగ్గనవసరం

లేదు. 'జరా' అంటే బలం తగ్గినవాడు అని అర్థం. అప్పట్లో 80 ఏళ్లవాడు యవ్వనుడి కిందే లెఖ్ఖ.

నువ్వు పదేళ్లప్పుడు ఇదే తేదీన ఏం చేసావ్ అంటే గుర్తులేదంటావు. అప్పుడు నువ్వు లేవా అంటే ఉన్నాను కాని గుర్తులేదు అంటావు. కాని ఆ చిన్నప్పటి ఫొటో చూపించి ఇది ఎవరు అంటే నేనే అంటావు. ఆ రూపం వేరు, ఈ రూపం వేరు అంటే ఒప్పుకుంటావా? లేదు, అదే నేను అంటావు. అప్పుడు నేను అనే ఏ భావముందో, ఆ నేను అనే భావాన్ని ఈ దేహమందు ఆరోపించి, దేహంలో వచ్చిన మార్పులన్నీ కూడా నేను అనే దానిలో తన్మ యం చెంది, అప్పటినేను, ఇప్పటినేను ఒక్కటే అని తీర్మానించిరాసుకున్నావు గనుక నువ్వు బాలుడివి అని ఒప్పుకున్నావు. అలాగే యవ్వనావస్థలో ఎంతో విఱ్రవీగుతాం. ఎవరై నా ఖల్లు ఖళ్ళు మని దగ్గితే మా యింట్లో ముసలాయనలెండి అంటాం. అలా అన్న వాళ్ళం, మనం ఆ స్థితికి వెళ్లిన తర్వాత మరొకడి చేత అలా అనబడతాం. అలా అనబడు తూన్నప్పుడు కూడా, ఎవరైనా కదిలిస్తే 'ఆ రోజుల్లోనండి' అంటూ ఆ తీపి జ్ఞాపకాలు నెమరు వేసుకుంటున్నాం కదా! అంటే ఆ యవ్వనపు అనుభూతిలే నాదిగా, నేనుగా చెప్పు కుంటున్నామంటే ఈ పరిణామాన్ని మనం ఎంత సహజంగా తీసుకున్నాం! మనం బాల్యం వెళ్ళిపోయినప్పుడు అయ్యో నా బాల్యం వెళ్ళిపోయిందే అని ఏడ్చామా? కృష్ణపరమాత్మ అదే చెప్తున్నాడు. నీ శరీరంలో బాల్యం పోతే దుఃఖపడలేదే,యవ్వనం పోతే దుఃఖపడలేదే. వార్ధక్యంలోకి వస్తే దుఃఖపడలేదే, ఇవి ఎలాగైతే నీ అవస్థల పరిణామాలనుకున్నావో అలాగే 'తథా దేహాంతర ప్రాప్తిః' మరొక దేహానికి వెళ్ళటం కూడా మరొక పరిణామమే తప్ప నాశనం కాదు.

మరి వెళ్ళుతున్నది ఎవరు?

నేను, నేను, నేనని ఏది చెప్తున్నావో అదే వెళుతోంది అక్కడికి, మరో దేహంలోకి. అది మనం ఒప్పుకోలేమే! అది ఒప్పుకోలేని వాడివి బాల్యం నుంచి యవ్వనానికి, యవ్వనం నుంచి వార్థక్యానికి మారటం ఎలా ఒప్పుకున్నావు? అంటే ఈ మార్పులు ఈ దేహంలో జరిగిన అనుభవాలు గనుక ఒప్పుకుంటున్నాను గానీ, దానికి సంబంధించిన జ్ఞాపకం ఉంది గనుక ఒప్పుకుంటున్నాను గానీ, ఆ దేహాంతర ప్రాప్తిని ఎలా ఒప్పుకుంటాను అనచ్చు మనం. సరే ఈ దేహంలోనివి కూడా అన్నీ గుర్తులేవు కదా, మరి అలాంటప్పుడు నేను మాతృగర్భంలోంచి రాలేదు అనగలమా అని ప్రశ్నించుకుంటే అనలేము. ఈ దేహం ఎందులోంచి వచ్చిందో ఆ స్థానమే గుర్తులేదే, ఈ దేహంలో గుర్తుపెట్టుకోవలసిన ఒక ప్రాథమికావస్థే నీకు గుర్తులేదే, మరి ఈ దేహానికి అవతల ఉన్నటువంటి అవస్థ నీకెక్కడ గుర్తుకొస్తుంది? అలాంటప్పుడు జన్మలు లేవనటానికి నువ్వెవడివి? మొత్తం లోకాన్ని పరిశీలించాం కనుక, గర్భంలోంచి రానిది ఎవడూ ఉండడు గనుక, నేను కూడా గర్భంలోంచి వచ్చాను అనుకున్నదే తప్ప నువ్వు అనుభవంతో తెలుసుకున్నది కాదు కదా! అందుకే ప్రతిదీ ప్రత్యక్ష ప్రమాణం కాదు. అవతలి వారి అనుభవాలు, లేదా గతానుభవాలు బట్టి ఒక నిర్ణయానికొస్తున్నాం మనం. కనుక తర్కంలో ఆలోచించినా కూడా ఈ జన్మలో కలిగిన గర్భావస్తే నీకు గుర్తు లేనప్పుడు, జన్మాంతర విషయం నీకు ఎలా గుర్తుంటుంది? కాని గుర్తులేనిది నువ్వు లేదని అనలేవు కదా! చిన్నప్పటి విషయం గుర్తులేనంత మాత్రాన, అప్పుడు నువ్వు లేవా అంటే ఒప్పుకోలేమే, అప్పటి విషయంలో గుర్తులేకపోతే - అని అనటానికి లేదు.

అయితే గుర్తు అనేది ఎక్కడి నుంచి వస్తోంది.

గుర్తు అనేది మెదడుకి సంబంధించిన విషయం, జీవుడికి సంబంధించింది కాదు. ఇది తెలుసుకోలేక చాలా మంది జన్మలు లేవు అంటారు. మెదడు ఏదేహానికాదేహమే.

జన్మల్లోకి మారేది కాదు. జీవుడు మారుతున్నాడు, చైతన్యం మారుతోంది, మెదడు మారటం లేదు. మెదడు ఈ దేహం కోసమే ఏర్పడింది కనక, ఈ దేహానికి సంబంధించిన విషయాలు మాత్రమే గుర్తుపెట్టుకుంటుంది. ఆ మెదడులో మెమరీ సెల్స్ కొన్ని మిగులుతాయి, కొన్ని చచ్చిపోతాయి. అందుకే గత జన్మలు గుర్తులేవు అంటే అప్పటి మెదడుకాదు ఇది. అందుకు గర్భావస్త గురించి ఎలా అంగీకరించావో, జన్మాంతరావస్థల గురించి కూడా అలా అంగీకరించాలి. అందుకే 'తథా దేహాంతరప్రాప్తిః' అందుకే మరణమంటే ఏమిటి అంటే అదొక పరిణామమే తప్ప నాశనము కాదు. నాశనము అనుకుంటే నీలోనే బాల్యము నశించింది అనటం లేదే! దీన్నెలా పరిణామంగా అంగీకరించావో, మరణాన్ని కూడా అలా అంగీకరించు అంటున్నాడు. జార్జి బెర్నాడ్ షా బాగా చెప్పాడు. మన గ్రంధాల్ని బాగా అధ్యయనం చేసిన ప్రాశ్చాత్య మేధావులు చాలామంది ఉన్నారు. మన గ్రంథంలోని ఔన్నత్యాన్ని అంగీకరించగలిగారు. మరణం అంటే ఏమిటో కాదు నిద్రే అన్నాడు. ఎలా అంటే ఈ శరీరంలో నిద్ర పోయి ఈ శరీరంలో లేవటం నిద్ర.మరణం ఈ శరీరంలో నిద్ర పోయి, మరో శరీరంలో నిద్రలేవటం అన్నారు. అంత చక్కగా తెలియచేశారు. మనం నిద్ర పోయేటప్పుడు పొద్దున్న లేస్తామన్న ధైర్యంతోనే పడుకుంటున్నాం, పొద్దున లేస్తున్నాం. అలాగే దీన్ని కూడా సహజంగా చూడు అంటున్నాడు.

చెప్పటం తేలికే, చూడడం కష్టం అంటే సత్యంగా బ్రతకటం ఎంత కష్టమో తెలుస్తోంది. సహజంగా, సత్యంగా బ్రతకమని చెప్పేదే వేదాంతం.

***

అత్యంత సహజమైన దాన్ని, అత్యంత సత్యమైన దాన్ని, అత్యంత సులభమైన దాన్ని మనం అత్యంత క్లిష్టం చేసుకుని అబ్బో మనవల్ల కాదు అన్నాం. క్లిష్టమనేది కల్పితం. సత్యం సహజం, పరిణామం సహజం. ఇది తెలిసిన వాడు దుఃఖించడు.

మరి ఈ సుఖదుఃఖాలు ఎక్కడ్నుంచి వచ్చాయి?

దానికి జవాబు తర్వాతి శ్లోకంలో చెప్తున్నాడు.

మాత్రా స్పర్శాస్తు కౌంతేయ శీతోష్ణసుఖదుఃఖదాః ।

ఆగమాపాయినో నిత్యాః తాంస్తితిక్ష స్వ భారత । 2-14

ఇక్కడ చాలా గొప్పమాట వాడాడు. 'తితీక్ష వహించు' - సహనం వహించు. సహనం దేనికి అన్నది ప్రశ్న. సుఖదుఃఖముల యందు చలించకుండా ఉండటానికి సహనం కావాలి. ఒక సుఖం రాగానే పొంగిపోవటం, దుఃఖం కలిగిందని క్రుంగిపోవటం, ఈ రెండూ కూడదు. అది అర్థం చేసుకోవటానికి పునాది వేసుకుంటూ వెళ్ళాడు. మొదటి శ్లోకాన్ని కట్ చేసుకుని రెండోదానికి రావద్దు. ఆ తీగనలా కొనసాగించాలి.

శీతోష్ణ సుఖదుఃఖములున్నాయే, ఈ ద్వంద్వాలు మాత్రా స్పర్శాఅన్నాడు. స్పర్శ అంటే అనుబంధము అని అర్థము. ఏ అనుబంధము? మాత్రా స్పర్శా - మాత్రలకు కలి గిన అనుబంధం. మాత్రలంటే ఇంద్రియములని అర్థం. ఈ ఇంద్రియములకు కలిగిన స్పర్శ చేత శీతోష్ణములు, సుఖదుఃఖములు కలిగాయి అంటున్నాడు, ఇంద్రియములకు స్పర్శ అంటే, ఆ ఇంద్రియాలు వేటిని అంటుకుంటాయి? ఇంద్రియాలు అంటుకునే వాటిని ఇంద్రియార్థములు అంటారు. అంటే విషయములు అని అర్థం. అంటే ఇంద్రియ ములు విషయములతో స్పర్శపొందటం చేత అని అర్థం. ఇలాంటి స్పర్శ చేత శీతము, ఉష్ణము, సుఖము, దుఃఖము అనేవి కలుగుతున్నాయి.

ఇదెలాగో పరిశీలిద్దాము.

ఇప్పుడు వేడి ఉందని ఎలా తెలిసింది? బయట ఉన్న ఉష్ణత అనే దాన్ని మన శరీరం స్పర్శ పొందింది కనుక వేడి తెలిసింది. ఇది మాత్రా స్పర్శా! ఎక్కువ వేడైతే దుఃఖము, తగినంత చలియైతే సుఖం, ఎక్కువ చలియైతే దుఃఖము.ఈ రెండూ కలగటానికి కారణమేమిటి? ఇంద్రియములకు విషయములతో ఏర్పడిన ఎటాచ్‌మెంట్!

అయితే ఇది శాశ్వతమా?

కాదు అని మనకి తెలుసు. వేడియే సుఖము అని తీర్మానించగలమా? చలికాలంలో తీవ్రమైన చలికి వణికిపోతున్నప్పుడు వెచ్చగా కంబళి దొరికనప్పుడు ఎవరైనా సుఖమంటే ఏమిటి అని అడిగితే అప్పుడు వేడియే సుఖము అంటాము. కాని అప్పట్నుంచి వేడే రావటం మొదలుపెడితే తట్టుకోగలమా? నిజంగా వేడి మొదలెడితే ఏసీ కోసం, ఫ్యాన్ కోసం, చన్నీళ్ల కోసం పరుగులు పెడతాం. అంటే అప్పుడు మారిపోయిందే? అప్పుడు చలియే సుఖం అనుకుంటాం, కానీ ఇలా ఏసీలోనే చలికాలంలో కూడా ఉంచితే బాబోయ్ అంటాము. అలా శీతము, ఉష్ణము ఆయా కాలాలబట్టి మారిపోతున్నాయే, ఇవి ఎలాంటివంటే 'ఆగమాపాయినా' - వచ్చీపోయేవి అంటున్నాడు. సత్యాన్ని ఎంత చక్కగా చెప్పాడో, మన జీవితాన్ని మన ముందు ఎలా పరచిచూపిస్తున్నాడో చూడండి కృష్ణపరమాత్మ! ఇందులో ఒక్క వేదం కొటేషన్ ఇచ్చాడా? మన అనుభవానికి రాని విషయమేదైనా చెప్పాడా? మన అనుభవంలోంచే చెప్తున్నాడు అదీ విశేషం. తల్లి పిల్లవాడికి వాడి అనుభవంలో ఉన్న విషయాలే బోధిస్తుంది.

చెప్పదల్చుకున్నది ఆత్మతత్త్వమే! 'నత్వే వాహం జాతు వాసం...' అన్నమాటలో అక్కడ నిలబెట్టి ఉంచాడు. దాన్ని అర్థం చేసుకోవటానికి అనుభవాల్లోంచి తీసుకెళ్తున్నాడు. ఆత్మ విషయంలో మనం చాలా పొరపడిపోయాము. ఆ పొరపాటు అలాగే కొనసాగిపోతోంది. ఆత్మ అంటే ఈ దేహం, ఈ దేహంలో వ్యవహరింపబడేవన్నీ ఆత్మలే అనుకుంటు

న్నాము. అది కాదని చెప్పటానికి దేహము, దేహి అనీ ఈ రెండింటిని విభజించి మనకు అర్థమయ్యేలా చూపిస్తున్నాడు.

శీతోష్ణములు, సుఖదుఃఖములు అని ఎందుకు అన్నాడు. శీతోష్ణములు శారీరక ధర్మాలు, సుఖదుఃఖములు మనోధర్మములు లేదా అంతఃకరణ ధర్మములు.

మరి మాత్ర అని ఎందుకన్నారు?

మాత్ర అంటే దేహమునకు సంబంధించిన ఇంద్రియములే మాత్రలా? అంతఃకరణ, అంటే మనసు కూడా ఇంద్రియమే! అంటే మనస్సుకు కలిగిన సుఖ దుఃఖములు కూడా ఇందులో చెప్పబడింది.

మాత్రలయందు అని ఎందుకన్నారు?

మాత్ర అంటే కొలుచునది అని అర్థం. మనం వేసుకునే మాత్రలకు కూడా ఆ పేరు ఎందుకు వచ్చిందంటే ఒక ఔషధాన్ని ఒక కొలతతో తీసుకుంటాము కాబట్టి. మాత్ర అంటే గుండ్రముగానో, గొట్టముగానో ఉంటుందని కాదు. డోసేజ్ అని అర్థం. డోసేజ్ అంటే ఒక పరిమితిని విధించునది. అంటే మన ఇంద్రియాలు కూడా ఒక పరిమితిని విధించేవే! శబ్దాన్ని చెవి అనే పరిమితితో మనం వింటున్నాం, అంటే చెవి ఎంత వినగలదో అంత వింటున్నాం. కాని, శబ్దం ఎంత ఉందో అంత వినటం లేదు. అవునా, కాదా? కొంచెం ఆలోచించండి. అలాగే దృశ్యము ఎంత ఉందో అంత మనం చూడట్లేదు, ఎంత చూడగలమో అంత చూస్తున్నాము. మన ముందు దృశ్యమానమైన విశ్వం ఎంత ఉంది? అంతా చూస్తున్నామా? నేను ఈ గది పరిమితి ఎంత ఉందో, అంతే చూస్తున్నాను కారణం? నా కంటికి ఇంతమేరకు విస్తరించే లక్షణం మాత్రమే ఉన్నది, 'మాత్రమే' అన్నమాట కూడా అంటున్నాం కదా! 'మాత్రమే' అంటే 'మతి' అని అర్థం. మానము విధించునది మాత్ర. మానము అంటే కొలత. మన ఇంద్రియములన్నిటికీ కూడా కొలత ఉన్నది. కొలత కలిగిన ఇంద్రియ

ములతో, స్పర్శ కలిగిన విషయముల వల్ల శీతోష్ణ, సుఖదుఃఖములు అనుభవిస్తున్నాము. ఇవి 'ఆగమాపాయినో' - వచ్చి పోయేవే! వచ్చి, పోయేవాటి విషయంలో సహనం వహించి ఉండు. వీటికి చలించిపోకు! అలాగని పరిష్కారం చూడకు అని కాదు అర్థం! వాటిని సహించటం నేర్చుకో! అంటే వాటిలో తన్మయం చెందిపోకు. అవి వచ్చి వెళ్లిపోయేవే! దీనినే సమత్వము అంటాము.

యం హి న వ్యథయం త్యేతే పురుషం పురుషర్షభ
సమదుఃఖ సుఖం ధీరం సో మృత త్వాయకల్పతే 2-15

'ఆగమాపాయినో' కలిగిన సుఖదుఃఖములు ఎటువంటి పురుషుని కదిలించలేవో, వాడే ధీరుడు. ఈ వచ్చిపోయేవి ఎవడిని చలింప జేయలేవో వాడు ధీరుడు. అలాంటి ధీరుడే సమదుఃఖసుఖం - సుఖ, దుఃఖాలయందు సమానంగా ఉన్నవాడు. వాడే 'సమ అమృతత్వాయ కల్పతే' - అమృతత్వాన్ని పొందటానికి అర్హుడు. అమృతత్వం అంటే శాశ్వ తత్వం. శాశ్వతమైన ఆనందస్థితి పొందటానికి అర్హుడన్నమాట. శాశ్వతత్వం అంటే ముందే చెప్పాడు - ఇంతకు ముందు ఉన్నవే, ఇప్పుడూ ఉన్నవే, తర్వాత ఉన్నవీ అన్నాడు. ఆ శాశ్వతమైన ఆత్మ తత్వాన్ని పొందటానికి ఎవడు అర్హుడు. ఎవడైతే ఈ వచ్చీపోయేవాటికి సమదుఃఖ స్థితిలో ఉన్నాడో అటువంటి ధీరుడు అన్నాడు. ధీర శబ్దం. ఉపనిషత్తులో వాడ బడింది. అలాంటి ధీరుడు దొరకటమే చాలా కష్టం. మనం ధీరుడు, వీరుడు అని చాలా మందిని పొగుడుతాం, ఆ ధీరత్వం, వీరత్వం లెఖ్ఖలోకి రాదుకూడ. ఈ ధీరుడ్నే తర్వాత వివరంగా చెప్తాడు. ఈ ధీరుడ్నే స్థితప్రజ్ఞుడు అంటారు. స్థిత ప్రజ్ఞుడ్ని అర్థం చేసుకోవటానికి కావలసిన పునాది ఈ ధీరత్వమంతా, అందుకే ఆ ధీరం అన్నమాట చక్కగా సరిపోయింది.

ఈ ధీరమనే మాటని కాళిదాసు కుమార సంభవంలో చాలా చక్కగా చెప్తాడు. వికార ములు కలిగించే విషయములు జరుగుతున్నప్పటికీ కూడా ఎవడు వికారం చెందకుండా

ఉంటాడో వాడు ధీరుడు అన్నాడు. అంతేకాని ఒకడు ఏడిపిస్తే ఏడ్చి, నవ్విస్తే నవ్వేవాడికి వ్యక్తిత్వమేది? వికారములు కలిగించే పరిస్థితుల్లో కూడా వికారము కలుగకూడదు. పరిస్థితులలా ఉన్నాయి, ఏం చేయను అంటే లాభం లేదు. చలింపచేసే పరిస్థితుల్లో కూడా చలింపనివాడే ధీరుడు. ఈ నిర్వచనం కాళిదాసు మహాకవి కూడా ఇచ్చాడు. ఇక్కడ ఒక కథ లేదు, ఉదాహరణ లేదు, పోనీ అందని విషయమా అంటే అందుబాటులో అనుభూతిలో ఉన్న విషయమే చెప్తున్నాడు, అయినా అటు వెళ్ళలేక, ఆవులింతల వైపు వెళ్తున్నామంటే అవస్థ ఏమిటి? వేదాంత విషయానికి, మన ప్రాపంచిక విషయానికి సమన్వయం ఏమిటి అనే ప్రశ్న వల్ల, ఇది మనకి సంబంధించినది కాదు అని నిశ్చయమైపోయాము, అవునా, కాదా?

'నేను ఏదో ఖాళీగా ఉన్నాను కృష్ణా, కాస్త వేదాంత విషయం చెప్పు, ఏదో రామా, కృష్ణా అనుకుంటాను' అని రాలేదు అర్జునుడు, అది గుర్తుపెట్టుకోండి. అర్జునుడు యుద్ధం చేయటానికి వచ్చి, మోహితుడై అడిగాడు. ఈ మోహం మనకి బాగా ఉన్నది, ఇప్పటికీ ఉంది, కాబట్టి ఆయన ఎంత అలర్ట్‌గా వింటున్నాడో, మనం కూడా అంత అలర్ట్‌గా వినాలి. ధర్మాచరణ చేసేవాడికి వేదాంత హృదయం ఉండాలి.

ధర్మం ఎప్పుడు చేస్తారు?

పదవీ విరమణ తర్వాత చేసేది కాదు. ఏక్టివ్‌గా ఉన్నవాడికోసం కానీ, పాసివ్‌గా ఉన్నవాడి కోసం కాదు ధర్మం. కనుక మనం బ్రతుకు ఉన్నప్పుడే, బ్రతుకుతున్నప్పుడే, బ్రతుకుతూ ఉన్నప్పుడే భారతీయ వేదాంతం కానీ, బ్రతుకు చివరకొచ్చి మంచం మీద పడుకున్నవాడికి వేదాంతం కాదు! ఎలా బ్రతకాలో చెప్పేది వేదాంతం అది చెప్పాడు కృష్ణ పరమాత్మ! అందుకు వేదాంతం! ఆత్మజ్ఞానం అనేది వ్యవహారానికి సంబంధించినది కాదు అని అనుకోవద్దు అన్నది కృష్ణపరమాత్మ చెప్పదల్చుకున్నది.

ఒక ధర్మం చేసేటప్పుడు ఆత్మజ్ఞానం ఏ విధంగా సహకరిస్తుందో కొంచెం ఆలోచించండి. తద్వారా ఈ ఆత్మజ్ఞానాన్ని ప్రతి కాలేజీ ఎడ్యుకేషన్ నుంచి అందజేయాల్సిన అవసరం ఎంత ఉందో మీకే తెలుస్తుంది. ఆత్మ జ్ఞానం లేకపోతే ధర్మం నుంచి ఎలా భ్రష్టుడవుతాడో, ఆత్మజ్ఞానం ఉంటే ఎలా ధర్మబద్ధుడవుతాడో చూద్దాం.

మనం ధర్మం నుంచి ఎందుకు భ్రష్టులవుతున్నాం?

'నేను కాదండి' అనుకోవద్దు. పైకి చెప్పక్కర లేదు కానీ మీలో మీకే తెలుసు, ఎవరు ఏ ధర్మం నుంచి భ్రష్టులవుతున్నారో! సుఖలాలస వల్ల భ్రష్టులవుతున్నాము.

తల్లిదండ్రుల్ని చక్కగా చూసుకో అన్నారు ఆయన తిరగగలిగినన్నాళ్లు ఆయన వల్ల అనుభవించాము. ఇప్పుడు ఆయన ఎవరికీ అవసరం లేని పరిస్థితిలో ఉన్నాడు. ఇప్పుడు ఆయనకి సేవ చేయటం వల్ల సుఖం ఉందా? సుఖం కన్నా దుఃఖం కనిపిస్తోంది. కదల్లేని వారికి ఎన్ని సేవలు చేయాలి, ఎంత టైమ్ స్పెండ్ చేయాలి, ఎంత కష్టపడాలి? ఇవన్నీ చేయటం దుఃఖమే కదా! కనక ఇక్కడ దుఃఖం కనిపిస్తోంది కాని సుఖం కనిపించటం లేదు. ఈ ఆత్మవిషయాన్ని వదిలేసి, కేవలం సుఖదుఃఖాల్నే పట్టించుకుంటే, మనం తల్లి తండ్రులకు సేవ చేయాల్సిన అవసరం లేకుండా పోతుందా లేదా? కాని నిన్ను ఆ తత్వము నందు ఏది నిలబెడుతుంది! ఈ సుఖమూ, దుఃఖమూ పోయేదే, ఈ ఆత్మ ఒక్కటే మిగిలేది, నేను ఈ సుఖదుఃఖాలనే చూస్తే శాశ్వతమైన ఆత్మని కోల్పోతాను అనేటువంటి ధార్మికమైన ఆత్మచింతన దేనివల్ల కలిగింది? ఆత్మఅనేది ఒకటుందనే ఎఱుక వల్ల కలిగింది కదా! ఆ ఎఱుకని ఇస్తున్నాడు కృష్ణ పరమాత్మ.

శాశ్వతమైన ఆత్మ ఒకటి ఉంది సుమా, అది నిలబడాలంటే సుఖ దుఃఖాల్లో సమానమైన స్థితిలో ఉండి, ధర్మాన్ని ఆచరించు అంటున్నాడు - చిట్టచివరికి అది లింకు. ధర్మం ఆచర - యుద్ధం చేయి, యుద్ధం చేయి - యుద్ధం చేయి అంటే కర్మచేయి, కర్మచేయి -

ఏ కర్మ అంటే కర్తవ్య కర్మ. కర్తవ్యకర్మలని తప్పించటానికి సుఖదుఃఖములనేవి పక్కన కనబడుతున్నాయి. ఆ సుఖదుఖాలు కాదు లెఖ్ఖ. నువ్వు చెయ్యాలి గనుక చెయ్యి.

ఈ ధర్మమే లేకపోతే ఈ సమాజం ఈ పాటికి ఉండేది కాదు. కేవలం సుఖదుఃఖాల కోసమే చూస్తే భార్యాభర్తల బంధాలు కూడా నిలబడవు. అప్పటికి కలిగిన దుఃఖంతో భర్త కు విడాకులిచ్చి, ఇంకెక్కడో సుఖం ఉందనుకుని, అతన్ని పెళ్ళిచేసుకుని, తర్వాత ఆ భర్త కు కూడా విడాకులిచ్చేస్తూ, అలా కేవలం సుఖదుఃఖాలే చూసుకుంటూ ఉంటే, ధర్మం ఎక్కడ నిలుస్తుంది. ఇవన్నీ 'ఆగమా పాయినో' అని తెలిసినప్పుడు, ఇవన్నీ వస్తూ పోతుం టాయి కానీ, ఆత్మ దీనికి అతీతంగా ఉంటుంది దాన్ని కాపాడుకోవటానికి ధర్మముంది, దానియందు నిశ్చలంగా ఎవడు ఉన్నాడో వాడు ధీరుడు, అలాంటి ధీరుడుగా ఉండు అర్జునా అని చెప్తున్నాడు. వీడు నావాడు నేను యుద్ధం చేయను అనకూడదు. నీ కర్తవ్యం యుద్ధం చేయటం. ధర్మరక్షణ కోసం యుద్ధం చేయాల్సిన బాధ్యత నీమీద ఉంది.

ఎప్పుడైతే ఈ కర్తవ్య నిష్ట అయితే ఉంటుందో, అప్పుడు ఈ ప్రపంచంలో అవినీతి కూడా ఉండదు. ఆత్మజ్ఞానాన్ని అనేకే రంగాల వైపు తీసుకెళ్లవచ్చు. ఉదహరణకి రాజకీయ రంగంలోఅసలు ఎక్కువ వేదాంతం రాజకీయ రంగానికే చెప్పాలి. ఎందుకంటే కావల్సి నంత భ్రష్టుల్ని చేసే భోగమంతా వాళ్ళ చుట్టూ ఉంది. ఎవడి దగ్గర భోగం ఉంటుందో వాడికే యోగం నేర్పాలి. అన్నం బాగా ఉన్నవాడికే ఎంత తినాలో, ఎంత కంట్రోల్ ఉండా లో చెప్పాలికాని తిండే లేని వాడికి చెప్పి ఏం లాభం ? అందుకని ఎక్కడ భోగం ఉందో, దానికి అడ్డులేని అధికారం ఉందో, అక్కడే ఆత్మజ్ఞానం చాలా అవసరం. అందుకే కృష్ణు డు చెపుతున్న ఆత్మజ్ఞానం అన్నీ వదులుకున్ని ఏదో ఒక చెట్టుకింద నేర్చుకునే ఆత్మజ్ఞానం కాదు ప్రపంచంలో తిరిగేవాడికి పనికి వచ్చే ఆత్మజ్ఞానమే ఇది.

ఈ శరీరాన్ని కేవలం ఉపాధిగా మాత్రమే స్వీకరించి, తద్వారా ఈ ఆత్మ శాశ్వతమని అది నేనని దానితో తాదాత్మ్యం చెంది, అది మళ్ళీ దెబ్బతినకుండా కాపాడబడాలి అంటే నా ధర్మాన్ని, సుఖ దుఃఖాలకి చలించకుండా కాపాడుకోవాలి అని తెలుసుకున్నవాడు పాలకుడైతే ఆదేశం బాగుపడుతుంది. ఆ దేహమే నేననుకుంటే ఆదేహం యొక్క భోగం కోసం నాకు సంపాదన కావాలి. ఇది ఇక్కడుండి పోయేది కనుక ఎవరు చూడవచ్చారు అనుకుంటాం. కాని కృష్ణుడేం చెప్పాడు? ముందుంటాం, తర్వాత ఉంటాం. మన బ్రతుకులు పుట్టుకలో మొదలయి, చావుతో అంతరించేది కాదు. పుట్టుక, చావుని దాటి విస్తరించాయి అని చెప్పటం చేత ఆ ఎఱుక గాని మనకు ఉంటే పాపం మాట అనుకుం టాం. దేహాత్మ భావంతో చేసిందే పాపం. దేహము నేను అనుకోవటం వల్ల కదా దీని సుఖం కోసం అన్యాయం చేసైనా సంపాదిద్దామను కుంటున్నాము. అలాగే ఈ దేహంతో పెట్టుకున్న స్వజనం కోసం ఎక్కడెక్కడో సేవ్ చేస్తున్నాం, దొంగ ఎక్కౌంట్లు మెయిన్టైన్ చేస్తున్నాం. ఈ స్వజనం అనే బుద్ధి ఈ ధర్మాన్ని మనని ఆచరింపనివ్వద్దు' ఆత్మజ్ఞానం లేకపోతే స్వధర్మానికి కూడా విఘాతం కలిగిస్తుంది.

అంటే ఆత్మజ్ఞానం కలిగిన వాడు స్వధర్మాన్ని చాలా చక్కగా చేయగలడు. ఇది నా విధి. సుఖదుఃఖాలు నాకు అనవసరం అనే స్థితిలో ఉంటాడా. 'ఆగమా పాయినో నిత్యాః ఇవన్నీ వచ్చి పోయేవే, ధర్మమొక్కటే శాశ్వతం. ఇప్పుడు నీకు అందుబాటులో ఉం ది కదాని సుఖలాలస కోసం తప్పు చేస్తే దాని పరిమితికూడా చాలా చిన్నది సుమా ! నిన్న టి దాకా సుఖమనిపించేది రేపటికి దుఃఖం కావచ్చు. అలాగే ఇవాళ్టికి దుఃఖమనిపించేది రేపటికి సుఖం కావచ్చు. ఒకప్పుడు అయ్యో అనుకున్నా, తర్వాతెప్పుడో ఆ రోజు అలా జర గపోయివుంటే, ఈ రోజిలా ఉండేవాడ్నా అనుకున్న సందర్భాలు జీవితంలో ఎన్నున్నాయో ఒక్కసారి ఆలోచించండి.

ఈ ఆగమాపాయినో అన్నమాటలో ఎంత సత్యమున్నదో! వేదాంతాలన్నీ విన్నవే ! కొత్తగా ఏమీ లేవు. కొత్త మాటలు చెపితే వినవద్దుకూడా. కొత్త చాలా ప్రమాదం. మనం పాతవాళ్ళం కనుక పాతవే వినాలి. కాని విన్నదాన్ని వంట పట్టించుకోవాలి. ఈ సత్యాన్నీ, ఈ వేదాంతాన్నీ బాగా వంట పట్టించుకోవాలి. ప్రతి రంగంలోనూ ఈ ఆత్మనాత్మ వివేకం చాలా ముఖ్యం. అప్పుడు ఈ సుఖ దుఃఖాలు అశాశ్వతం అని తెలుసుకుని, నువ్వు చేయవలసింది చేసినప్పుడే శాశ్వతమైన సుఖాన్ని పొందుతావు.

నాసతో విద్యతే భావో నాభావో విద్యతే సతః

ఉభయోరపి దృష్టోంతః త్వనయోస్తత్త్వ దర్శిభిః 2 - 16

'నాసతో విద్యతేభావో - అసత్తు, సత్తు అని రెండు విచారణలు చెప్తున్నాడు. ఇవేవో శబ్దాలనుకోవద్దు. అసత్తు అంటే లేనిది. సత్తు అంటే ఉన్నది. ఆత్మ ఎప్పుడూ ఉన్నది అనే మాట ఒకటి ఉన్నది. ఎప్పుడూ అనేదానికి నిత్యత అంటున్నాం. కాని కృష్ణుడు సత్ అన్నాడు. సత్, నిత్యం చూడటానికి అర్థం ఒకటే అయినా, చిన్న సూక్ష్మ బేధం ఉంది. ఎప్పుడూ అంటే అది కాలానికి సంబంధించింది. మనకి కాలంతో దేన్నైనా కొలవటం అలవాటయిపోయింది. నిన్నా, మొన్న, ఇవాళ, రేపు అంటూ కాలాతీతమైన దాన్ని ఊహించలేం. మొదట్నుంచి మనకి ఫ్రేములు పెట్టడం అలవాటు. ఇక్కడా, అక్కడా, ఎక్కడో అని ఇంకో ఫ్రేము. ఇలా ఫ్రేముల్లో పెట్టి ఆలోచించటాన్ని పరిచ్ఛిన్న దృష్టి అంటారు. దీని ద్వారా మనం ఆత్మ ఎప్పుడూ ఉన్నది అంటున్నాము. ఎప్పుడూ అన్నమాట తీసేసి, ఉన్నది అన్న మాట తీసుకోవాలి. ఎప్పుడైతే ఎప్పుడూ అన్నది వాడామో ఇంకా కాలం పట్టుకుని వేలాడినట్టే! అందుకని ఆత్మ ఉన్నది అంటే చాలు ఉన్నది అంటే సత్!

ఎప్పుడూ అన్నమాట దీర్ఘంగానో, స్వల్పకాలంగానో మాట్లాడాలి కాని, ఉన్నదాని గురించి కాదు. ఒక చీమకి అది బ్రతికే కొన్ని గంటలే చాలా పెద్దకాలం. మనకి వందేళ్ళు

బ్రతికితే చాలా కాలం బ్రతికాడండి అంటాం. మనకన్నా చెట్లే ఎక్కువ కాలం బ్రతుకుతాయి. 350 ఏళ్ళు క్రింటి చెట్టు. వెయ్యేళ్ళ కిందట చెట్టు గురించి మాట్లాడతాం. అది మొన్నటి దాకా గట్టిగా ఉంది కాని మొన్నటి తుఫానులో ఏడిపోయింది అంటాం. అంటే ఎక్కువ కాలం ఉండటమే గొప్ప అయితే, ఆ చెట్టు చాలా గొప్పది.

మరి ఏమిటి గొప్ప ? ఇంద్రియ జ్ఞానమా ?

గాడిదలకి మనకన్నా చాలా గొప్ప ఇంద్రియ జ్ఞానం ఉంది. బుద్ధి లేనివాడిని గాడిదా అంటాం, కాని గాడిదకున్న శక్తి గాడిదకీ ఉంది. ఈ మధ్య గాడిదల మీద ఆధారపడే వాళ్ళు తగ్గిపోయారుగానీ, వాటిని పోషించి బ్రతికేవాళ్ళు చెప్తారు. గాడిద కొన్ని రోజుల తర్వాత రాబోయే తుఫాను స్పర్శని తను పొందగలదుట. కొంతకాలం తర్వాత వచ్చే తుఫాను వల్ల కొంత మార్పు వస్తుంది. ఆ మార్పుకి కావాల్సిన చిన్న మార్పు ఇప్పుడే మొదలవుతుంది. నిజమే కదా! ఇవాళ మనకి ఒక రోగం పూర్ణ దశలో బయట పడిందనుకోండి, దానికి కావలసిన అసలు లక్షణం మొదలే ఉంది కదా ! అందుకే మొదట్లోనే పరిహారం చేసుకోవాలంటారు. అలాగే ఈ వాతావరణ మార్పుకి కావాలసిన కంపన ఎక్కడో మొదలవుతుంది. అవి మానవ ఇంద్రియాలు పట్టుకోలేవు. దాని ఇంద్రియం పట్టుకోగలదు. పట్టుకుని అది ఒక స్పందన వ్యక్తం చేస్తుంది. దాన్ని గ్రహించగలడు దాని యజమాని.

అలాగే మనం చూడలేని రాత్రిని చూడగలిగే గుడ్లగూడ ఉంది. అందుకని ఇంద్రియముల కున్న శక్తిని బట్టి మనం గొప్ప వాళ్ళం అనుకునేందుకు లేదు ఇంద్రియముల శక్తులు, బుద్ధి శక్తులు మాత్రా స్పర్శలు. వాటి కున్న పరిమితుల మేరకు అవి పొందుతూ ఉంటాయి. వీటన్నిటినీ కూడా సాక్షిగా చూడ గలిగిన స్థితి ఆత్మది. అది నువ్వు అని తెలుసుకో ! అది శాశ్వత మని తెలుసుకో ! అది శాశ్వతం గనుక దానికి శాశ్వతంగా నిలబడా

లంటే శాశ్వతమైన ధర్మాన్ని నువ్వు పాటించాలి, నీ కర్తవ్య ధర్మం నుంచి నువ్వు తప్పి పోకు అంటున్నాడు.

అందుకే 'సమదుఃఖ సుఖం ధీరం' అనేమాట కేవలం వేదాంతం చదువుకునే వారికి మాత్రమేకాదు. వివేకంతో బ్రతకవలసిన వాళ్ళందరికీ అవసరమే. అందుకే నిత్యానిత్య వస్తు వివేకాన్ని వివరంగా చెప్తున్నాడు.

'తితీక్ష' అనే గొప్ప గుణాన్ని ఇందులో బోధిస్తున్నాడు. ఇది బాగా గుర్తుంచుకోవాల్సిన విషయం. తితీక్ష అంటే సహించు అని అర్థం. ఆ సహించటమే సమదుఃఖ సుఖం కేవలం సుఖమూ, దుఃఖమే చూసుకున్నట్లయితే ఇన్ని ధర్మాలు మనకి మిగిలేవి కావు. అవునా,కాదా? రాముడు తన సుఖాన్నే కోరుకుంటే అలా చేయగలడా ? సీత సుఖదుఃఖాలకే తలవంచితే అశోకవనంలోఅంత ధైర్యంగా కూచోగలిగేదా ? నేను చెప్పదలుచుకున్నదేమిటంటే వేదాంతం ఎంత ప్రాక్టికలో చూడండి అని. ఇప్పుడు కనిపించే సుఖం పట్లో , దుఃఖం పట్లో ఒక నిర్ణయానికి రాకు, శాశ్వత సత్యం నుంచి నువ్వు తప్పి పోకు అంటున్నాడు. అది మనకి ఎన్ని ఘట్టాల్లోనో కనిపిస్తుంది.

***

మహానుభావుడైన హనుమంతుడు సీతాన్వేషణ చేసేటప్పుడు ఎంత తిరిగాడో ఎంత అవస్థ పడ్డాడో ఆయనకే తెలుసు. అంతఃపురం తిరిగాడు, ప్రతి ఇల్లూ తిరిగాడు, లంకంతా తిరిగాడు. సీత కనబడలేదు. నేను సాధిస్తానని ప్రగల్భాలు పలికి వచ్చాను. దొరకలేదే అనుకున్నప్పుడు ఏమనుకున్నాడో తెలుసా ? చచ్చిపోతే బాగుండునని. అప్పటి దుఃఖం పట్టి ఒక నిర్ణయానికి వచ్చి, అది అమలు పరిచి ఉంటే ఎంత ప్రమాదం అయి ఉండేది ? అప్పుడు అతను తనను తాను ప్రశ్నించుకున్నాడు. చావు అనేది దేనికి ? ఆత్మకి కాదు. దానికి మరణమే లేదు. అలాంటప్పుడు ఈ దేహాన్ని నేను చంపితే ఎంత పాపం ? చంపినంతమాత్రాన జీవితం పోతుందా ? మళ్ళీ కొనసాగుతుందే అని. అప్పటి దుఃఖం పట్టి నేను పోవాలి అనుకుంటే, ఆ దుఃఖం పోయి, నువ్వనుకున్న సుఖం వస్తే, అప్పటికే నువ్వు పోయి,ఆ సుఖం అందుకునే యోగం నీకెక్కడుంది. అందుకే గొప్ప మాట చెప్తాడు వాల్మీకి. 'జీవన్ భద్రాత్' అని. బ్రతికుంటే సుఖములు చూడవచ్చు అన్నాడు. అప్పటి అశుభానికి భయపడితే రానున్న శుభాన్ని చూడటానికి అవస్థ అయిపోతుంది. సుఖదుఃఖాలకు చలించని వాడిని ధీరుడు అనటంలోని విశేషం అది. ఆయన అదే పని చేసుంటే తర్వాత అశోక వనంలో సీతని చూడగలిగి ఉండేవాడా ? అప్పటి అవస్థకి లొంగి ఉంటే, తర్వాత అవస్థ పొంది ఉండేవాడా ? ఏది పట్టి ఆపింది ఆయన్ని ? సుఖదుఃఖాలకి చలించని ధీరుడు గనక నిలబడ్డాడు.

ఆత్మహత్య చేసుకునే ఉద్రేకం ఉన్న వాళ్ళకి కూడా ఆత్మజ్ఞానం బోధిస్తే వాళ్ళు కూడా ఆగుతారు. అందుకే ఆత్మ జ్ఞానాన్ని కేవలం వేదాంత కాలక్షేపం అనుకోవద్దు. జీవితంలోని ప్రతి అణువులోను, ప్రతి అంశంలోను, ప్రతి కదలికలోనూ మనకి ఉండవలసింది ఆత్మా నాత్మ వివేకం. అది ఉన్నప్పుడే మన స్వధర్మంలో నిలబడగలం. ప్రపంచాన్ని నిలబెట్టగలం.

అందుకు ఉన్నది ఏదో అది లేనిది కాదు లేనిది ఏదో అది ఉన్నది కాదు అన్నాడు. 'అసేతో విద్యతే భావయః' లేనిదానికి ఉనికి లేదు, ఉన్నదానికి లేకపోవ టం లేదు అన్నాడు. అంటే ఆత్మకి లేకపోవటమే లేదు, లేని లక్షణం కలిగిన ఈ దేహానికి ఉండిపోయే లక్షణం కూడా లేదు అని చెప్పదల్చుకుని, సర్వవ్యాపకమైన ఈ ఆత్మ తత్త్వం ఉన్నది, అది అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూ ఉన్నది, ఉండటమే దాని లక్షణం అని తెలిసే, ఇక మారేది ఏమిటి అంటే మన దేహంలో వచ్చే పరిణా మాలు. ఈ మార్పుల్లో ఒకటిగానే దేహాంతర ప్రాప్తి కూడా జరుగుతుంది. మరణము అనేది ఒక పరిణామమే తప్ప నాశనం కాదు. అది దేహానికే తప్ప, ఏ ఆత్మ చైతన్యం వల్ల దేహం పనిచేస్తుందో, ఆ దేహికి మాత్రం దేహ నాశనం నాశనం కాదు అని చెప్పి, ఉండేటటువంటి ఆ సద్వస్తువుని గ్రహించటానికి, ఈ దేహంతో ఉన్నటు వంటి అను భవాలు ఎలా ఉంటాయో చెప్తూ

మాత్రా స్పర్శాస్తు కౌంతేయ శీతోష్ణ సుఖదుఃఖదాః

ఆగమా పాయినో నిత్యాః తాంస్తితిక్షస్వ భారత! 2-14

తితీక్ష అంటే సహసం అనుకున్నాం కదా ! సహనమనే వాడచ్చుకదా, తితీక్ష అని ఎందుకు వాడాడు అంటే సహించే లక్షణం ఉన్నవి చాలా ఉన్నాయి. వర్షాన్ని, ఎండని బజారులో ఉన్న ఎనుబోతులు చాలా సహిస్తాయి. అలాగే సుఖదుఃఖాలని కూడా అనేక మంది సహిస్తూ ఉంటారు కనుక అటువంటి సహనం కాదు ఇక్కడ చెప్పేది. జ్ఞానము కలిగినటువంటి ఎరుకతో కూడి సుఖదుఃఖాలకి చలించిపోకుండా, ధర్మములో ఉండి, సహజస్థితిలో ఉండటం.

ఇక్కడ జ్ఞానము, ధర్మము అని రెండు విషయాలు చెప్తున్నాడు. జ్ఞానము అంటే ఆత్మ విషైక జ్ఞానము గ్రహించి వీటిని సహించటం ఒకటి, అలాగే వీటికి

చలించిపోయి ధర్మము వీడకుండా ఉండే సహనము ఒకటి. ఆ సహనాన్ని ఇక్కడ తితీక్ష అంటున్నాడు.

ఆగమా పాయినో నిత్యాః - నిత్యములు కాని సుఖ దుఃఖములు వచ్చి పోయేవి. చలిఅని ఏడవము. దానిని సహించటానికి ప్రయత్నిస్తాము. అదే విధంగా జ్ఞానంతో, ధర్మనిష్టతో సహించటాన్ని చెప్తున్నాడిక్కడ. ఇప్పుడున్నది వెళ్ళిపోతుందన్న ఎఱుక మనకుంది కాబట్టి!

ఆగమా పాయినోః అనే మాటని ఎప్పటికప్పుడు గుర్తు తెచ్చుకోవాలి. అరణ్యా కాండలో ఒక కథ ఉంది. ఇది నిజంగా భారతంలో లేదు కాని, మనకోసం పెద్దలు చాలా కథలు ధర్మరాజు మీదో, అర్జునుడి మీదో, భీముడు మీదో చెప్పి పెట్టినవి ఉం టాయి. అవి ప్రమాణంగా తీసుకోవద్దుకాని, జీవితానికవసరమైన ఉపదేశాలుంటాయి అందులో.

ఒకసారి అరణ్యవాసంలో ధర్మరాజుండగా, శ్రీకృష్ణ పరమాత్మ అతని దగ్గరికి వచ్చి, యోగక్షేమాలు కనుక్కొన్నాడు. అప్పుడు ధర్మరాజు కృష్ణ పరమాత్మతో, 'స్వామీ ఒక్కోసారి దుఃఖం పొంగి పొర్లి పోతుంది, ఒక్కోసారి సంతోషం కూడా పట్ట పగ్గాలు లేకుండా వస్తుంది. ఆ సమయాల్లో వాటిని తట్టుకోవటానికి నాకేదైనా మంత్రాన్ని ఉప దేశించ' అన్నాడు. ఒక పత్రం తెమ్మని, దాని మీద లేఖినితో రాసాట్ట. 'ఇందులో ఒక మంత్రం ఉంది, నువ్వు తట్టుకోలేని పరిస్థితి వచ్చినప్పుడు తీసి చూసుకో' అన్నాడు. అలాగే ఒక కష్టం వచ్చినప్పుడు తీసి చూస్తే, 'ఇది ఇలాగే ఉండదు' అని ఊరట. దాంతో ధైర్యం వచ్చింది. వస్తోంది, పోతోంది అనగానే ఒక ధైర్యం వచ్చింది నేను తట్టు కోగలను అని అలాగే సంతోషపు పొంగులోను, ఈవిచారపు క్రుంగులోనూ అది చూసి తట్టుకుని నిలబడగలిగాడు. ఈ కథ నిజమో కాదో అన్న విషయం పక్కన పెట్టి, ఇది

ఇలాగే ఉండదు అనే ఎఱుక ధర్మ రాజు కెంత ఉందో మనం తెలుసుకోవాలి అంత అరణ్య పర్వంలో కూడా, ఇంత గొప్ప వాళ్ళమే, రాజసూయ యాగం చేసి సమస్త సామంతరాజులచేత పాదాభివందనాలు పొంది, అడవిలో కూచుని ఏడుస్తున్నామే అనుకోలేదు ఆయన. దుఃఖం వచ్చినా కూడా, 'తితీక్ష ' సహనంతో కర్తవ్యాన్ని ఆలో చిస్తూ అరణ్య పర్వాన్నంతా సాధన పర్వంగా మలచుకున్నాడే తప్ప ఆయన కుంగి పోలేదు. రాజసూయ యాగం చేసినప్పుడు ఉన్న భోగాలు ఏమయ్యాయి ? వెళ్ళిపో యాయి. ఇప్పుడీ పరిస్థితీ అంతే. ఈ వచ్చీ పోయే సుఖ దుఃఖాలతో తన్మయుడై పోవ టం కాదు  తన ధర్మం తను చేసుకుంటూ ఉండి, సుఖ దుఃఖాలకి చలించకుండా ధర్మం ఆచరించటం ఆయన్ని ధర్మము నందు నిలిపింది, తత్త్వము నందు నిలిపింది. ఈ సూత్రం కృష్ణ పరమాత్మ దేనికి చెప్తున్నాడు ?

ధర్మనిష్ఠకలిగి ఉండాలన్నా, తత్త్వనిష్ఠ కలిగి ఉండాలన్నా ఈ సూత్రం చాలా ముఖ్యం. సుఖంగానీ, దుఃఖంగానీ వెంట వెంట వచ్చే బంధువులు. రెండింటికీ ఒక దానితో ఒకటి బంధం ఉంది. మనం మాత్రం ఒకటే కావాలనుకుంటాం.  ఇవి ఎప్పుడూ పోయేవి కావు. పోయేక చూద్దాం అంటే కుదరదు సుఖాలు అనుభవిద్దాం, దుఃఖాలని తరిమి కొడ్దాం ఆ తర్వాతెప్పుడో ధర్మం గురించో , తత్త్వం గురించో ఆలో చిద్దాం అంటే ఇవి పోయేవీ కావు, ఉండేవీ కాదు. వాటి మానాన అవి వస్తూ ఉం టాయి, పోతూ ఉంటాయి. మన మానాన మనం చేయవలసినవి చేస్తూ ఉండాలి. అది ఎలా ?

అన్నమయ్య దాన్ని బాగా చెప్పారు

కడలుడిపి నీరాడగా తలచువారలకు

కడలేని మనసునకు కడమ ఎక్కడిది ?

సముద్రంలో స్నానం చేయటానికి వెళ్ళినవాడు ఎంతకీ స్నానం చేయటం లేదు. పక్క వాడు వచ్చి ఎందుకు చేయటం లేదు అంటే, కడలు ఉడిపి, నీరాడగా తలుచుకుం టున్నాను అన్నాడు. అంటే తరంగాలు తగ్గాక వెళ్ళి స్నానం చేద్దామనుకుంటున్నాను అన్నాడు. ఓరి మూర్ఖుడా, అవి తగ్గేవి కావు, నువ్వు వెళ్ళాల్సిందే అన్నాడాయన. తగ్గేక వెళ్ళటం కాదు, అవి మీద పడుతూ ఉంటే, వాటితో పాటు కొట్టుకుపోకుండా ఉంటే ఆ ధృఢత్వం ఏమిటో నువ్వు యుక్తితో తెలుసుకుని, చెయ్యాల్సిన స్నానం చేసి వచ్చేయి. అదీ విషయం.అక్కడ ఎలాగయితే ఆ యుక్తి అవసరమో, ధర్మమునందు, తత్త్వము నందుకూడా ఆయుక్తితో ఉన్నప్పుడే, ఈ జీవితాన్ని మనం సాధనగా మలు చుకోగలము. లేకపోతే ఈ జీవితంలోంచి మరో జీవితంలోకి, అందులోంచి మరో జీవి తంలోకి కొట్టుకుపోవటం జరుగుతుందే తప్ప ఒడ్డుకు చేరటం ఉండదు.

ఈ ఆగమాపాయినో నిత్యాః అనే విషయం చాలా ముఖ్యమైనది తాంస్తితిక్షస్వ అనేది చాలా గొప్పమాటయింది.

సమ దుఃఖ సుఖం ధీరం సోమృతత్యాయకల్పతే 2 - 15.

ఒక గుడ్డివాడిని భోజనానికి పిలిస్తే మనం రెండు పీటలు వేయాలి. అతను ఒక్కడూ రాలేడు కాబట్టి ఇంకొకతన్ని తోడు తీసుకు వస్తాడు. అలాగే సుఖమూ, దుఃఖమూ కూడా జంటగానే వస్తాయి. ఏ ఒక్కటీ రాదు. ఇది తెలుసుకుని ప్రవర్తించే వాడే హాయిగా ఉంటాడు సుమా అని చెప్తున్నాడు.

మనం దుఃఖం వచ్చిందంటే, అది కోరుకుంటే వచ్చిందా? దుఃఖం కోసం ఏమన్నా మొక్కులు మొక్కుకున్నామా? లేదే? దానంతట అదే వచ్చిందికదా!అలాగే సుఖం కూడా ఏమి కూడా మొక్కుకోకుండా వస్తుంది.

మరి ప్రయత్నం దేనికి?

దుఃఖం కోసం కాదు, దుఃఖం నుంచి విమోచనం గురించీ కాదు. నీ ధర్మము కోసం ప్రయత్నించాలి. ఇంకొక ప్రయత్నం తత్త్వం కోసం! తత్త్వమూ, ధర్మమూ కోసం ప్రయత్నిస్తూ, వాటి యందు నిష్ఠుడివై ఉండి, సుఖదుఃఖములను లక్ష్యంగా పెట్టుకోకు అని చెప్పటం.

యం హిన వ్యధయం త్యేతే పురుషం పురుషర్షభ 2-15

ఏ పురుషుడ్ని ఇవి వ్యధ పెట్టవో వాడే ధీరుడు. వాడే అమృతత్త్వం పొందటానికి అర్హుడు. వాడు ఆత్మ తత్త్వాన్ని గ్రహించగలడు. వాటితో పాటు కొట్టుకు పోయే వాడికి నిలకడెక్కడ ? నిలకడ లేని వాడికి తానేమిటో నిలబడి చూసుకుని, ఆలోచించుకునే తీరికెక్కడ ? అందుకు పురుషర్షభ. త్వం పురుషం ధీరం అనే మాటలో ఓ పురుష శ్రేష్ఠుడా, ధీరుడైన పురుషుడంటే వీడు అని చెప్తున్నాడు అర్జునునితో కృష్ణ పరమాత్మ, ఆ మాట చూడండి ఎంత గొప్పగా ఉందో. 'పురుషర్షభ' అంటే పురుష శ్రేష్ఠుడా ? నువ్వు కూడా శ్రేష్ఠుడివనిపించుకోవాలంటే అలాటి ధీరుడిగా ఉండు నాయనా అని సంబోధనలోనే అంత చక్కగా ఉపదేశం చేస్తున్నాడు.

అటు తర్వాత

నాసతో విద్యతే భావో నాభావో విద్యతే సతః

ఉభయోరపి దృష్టోంతః త్వనయోస్తత్త్వదర్శిభిః 2 - 16

ఇది ఇంతకుముందు చెప్పినటు వంటి నత్యేవాహం శ్లోకం లాంటిది. ఇందులో రెండు విషయాలు చెప్తున్నాడు. ఆత్మ అనాత్మ!

ఏది ఆత్మ ఏది అనాత్మ ?

దేహాన్ని నువ్వు ఆత్మగా అనుకుంటున్నావే, అది పరిణామమమై దేహంలో ఉన్న దేహి మాత్రం అపరిణామం. అది మార్పు చెందదు. ఆత్మానాత్మల విమర్శ

ఇక్కడ చేస్తున్నాడు కృష్ణ పరమాత్మ. అందుకు మళ్ళీ ఇక్కడ ఆత్మ తత్వాన్ని చెపుతూ నాసతో విద్యతే.. ఇక్కడ ఈ శాస్త్రం ఆత్మతత్వ విజ్ఞాన శాస్త్రాన్ని అవతరింప జేయటానికి కారణం, అర్జునునిలో రెండు దోషాలు చూసాడు కృష్ణ పరమాత్మ. ఆ రెండు దోషాలకి అసలు మందు ఇవ్వబోతున్నాడు. నీకు నిజంగా దుఃఖం కలిగింది. దుఃఖ విమోచనానికి యుద్ధం నుంచి పారిపోవటం మందు కాదయ్యా. వ్యాధి ఒకచోట ఉంటే, మందు ఇంకోచోట వేస్తామా? పాపం ఒక పిల్ల వాడికి ఏదో పురుగు కుట్టి, మంట పెడ్తోందిట. తండ్రికి చెప్తే, వెళ్ళి డాక్టరుని మందు అడిగాడుట. ఆ డాక్టరు ఎక్కడ పురుగు కుట్టిందో, అక్కడ మందు వేయి అన్నాడుట. ఆ తండ్రి అతి తెలివికి పోయాడు. కుర్రవాడిని పురుగు ఎక్కడ కుట్టింది అని అడిగితే ఆ మూల కుట్టింది అన్నాడుట వాడు. తండ్రి ఆ మూలకి పోయి మందు వేసాడు. అదా అర్థం ? ఎక్కడ కుట్టిందో. ఆ చోటు పట్టుకోవాలి. ఆ అసలేమిటో తీసి చూపిస్తున్నాడు.
నాసతో విద్యతే భావో.

ఇతని దోషం ఏమిటి? గీతా శాస్త్రం అవతరించటానికి కారణం ఏమిటి?

యామునాచార్యులవారు, రామానుజాచార్యుల వారి గురువు గారు. అళవందార్ అంటారాయన్ని. ఆయన గీతా సారాన్ని రాస్తూ ఒక చక్కని మాట చెప్పారు. అర్జునునికి వచ్చిన దోషం ఏమిటంటే స్నేహమూ, కారుణ్యమూ అనే దోషం వచ్చింది అన్నారుట. వీటిని దైవీ గుణాలంటారు కదా, దోషం ఎందుకు వచ్చింది అని అడిగితే ప్రతిదీ గొప్ప గుణమే. ఏదీ తక్కువ కాదు. తక్కువైతే భగవంతుడి సృష్టిలో ఉంచడు దాన్ని. కోపం కూడా గొప్పగుణమే. స్నేహం కూడా గొప్ప గుణమే. ఆ గుణము యొక్క గొప్పగాని, తక్కువగాని దేని బట్టి తెలుస్తుంది ? దాని యొక్క స్థాన ప్రటితం బట్టి తెలుస్తున్నది.  ఇవి ఆస్థానములు. అసందర్భములు చూపవలసిన టైములో

చూపాలి. చూపకూడని సమయంలో చూపకూడని వారి మీద స్నేహ కారుణ్యాలు చూపకూడదు. కారుణ్యం యొక్క అప్లికేషన్ తెలియక పోవటం వల్లనే ఈ జాతి ఈ దౌర్భగ్యానికి వచ్చింది. అందులో సందేహం లేదు. అందుకే ఈ చెంపకొడితే మరో చెంప చూసేవాడు, గీత గురించి మాట్లాడ్డానికే అర్హత లేదు, అటువంటి వాళ్ళు గీతని పట్టుకుని చెప్పటం వల్లే దేశానికి ఈ గతి పట్టింది.

అక్కడ ఉన్నవాళ్ళు తెలివితక్కువవాళ్ళు అనుకున్నావా ? అతని దోషాలు మళ్ళీ చూస్తే మొదటిది అస్తాన స్నేహ కారుణ్యం. రెండవది ధర్మాధర్మ ధియాకులం. ఏది ధర్మమో, ఏది అధర్మమో తేల్చలేని అయోమయంలో పడ్డ బుద్ధి. ఈ రెండింటి కార ణంగా ఇచ్చేయాలా జ్ఞానం? ఈ రెండు దోషాలున్నా, అతనిలో ఉన్న గొప్ప దనం పార్థం ప్రపన్నం బుద్ధిస్యా ! ప్రపన్నుడయ్యాడు గనుక శాస్త్రావ తరణం.

అతను చెప్పదలుచుకున్న శాస్త్రాన్ని చక్కగా ప్రతిపాదించి, అనాత్మని ఊదుతూ ఆత్మని చూపిస్తున్నాడు. నివురిని ఊది నిప్పుని  చూపించినట్లుగా ! అనాత్మ తత్త్వాన్ని నేతి నేతి నాయితి, నాయితి అని ఊది ఏది అసలు తత్త్వమో చూపిస్తున్నాడు. ఆత్మ తత్త్వం అలా తెలియవలసిందే కాని, ఇది అని తెలియవలసింది కాదు ఆత్మ అంటే ఇది కాదు అని చెప్పగలమే తప్ప, ఇది అని ఎవరూ చెప్పలేరు.

ఎందుకు చెప్పలేరు?

'ఇలాగని వివరించలేను, చాలా స్వానుభవైక్యవేదమే' అన్నారు త్యాగరాజ స్వామి! అది అనుభవైక వేదము. ఆ అనుభవం అందుకోవటానికి ఇది కాదు. ఇది కాదని నిషేద వచనములే వేదం చెపుతుంది తప్ప ఇదే అని సాక్షాత్తుగా చెప్పలేదు అంటే తాత్పర్య దృష్టా ఆత్మ తత్త్వం వేదం చేస్తున్నది కాని సాక్షాత్తుగా వేదం కూడా చెప్పలేదు. అది నీ విచారణతో, నీ సాధనతో, వేద వాక్యమిచ్చే మార్గాన్ని అనుసరించి

తెలుసు కోవాల్సిందే తప్ప ఆత్మ అనే పదార్థం ఎక్కడో దుకాణంలో ఉంటే, వేదం వెళ్ళి కొనుక్కొచ్చి చేతికి ఇవ్వదు.

అలా నిషేద వాక్యంతో స్పష్టం చేస్తూ, అసత్తుకి ఉండటం లేదు, సత్తుకి లేక పోవటం లేదు అన్నాడు. అసత్తు అంటే అనాత్మ అయిన ఈ దేహానికి ఉండటమనేది లేదు. అది మనకి స్పష్టంగా తెలుసుకాని, దీనిని ఉంచాలని ప్రయత్నిస్తున్నాం. ఇక ఏది ఉన్నదో దానికి లేకపోవటం లేదు. ఈ విషయం అందరికీ తెలిసిన నిత్యసత్యం. దీనికి కృష్ణుడు కావాలా, ఉపనిషత్తుకావాలా ? కాని అత్యంత సూక్ష్మమైనది కనుక దానిపై ఆలోచన ఎవరు గ్రహించగలుగుతున్నారంటే తత్త్వదర్శిభిః సూక్ష్మ దర్శనము కలిగి నటువంటి తత్త్వవేత్తలు మాత్రమే ఉభయోరపి దృష్టః ఈ రెండింటి గురించి వారు స్పష్టంగా తెలుసుకోగలరు.

మనం అయోమయంలో పడిపోతూ ఉంటాం. ఆత్మ తత్త్వం చెప్పుకునేప్పుడు అనేక అయోమయాలు వస్తూ ఉంటాయి. కాని ఆ అయోమయాలు కూడా మనం తేల్చి చెప్పుకుందాం ! ఆ అయోమయాల వల్ల కూడా మన ధర్మం ఎన్ని తప్పుతోవలు త్రొక్కిందో కూడా అర్థమవుతుంది.

అవినాశి తు తద్విద్ధి యేన సర్వమిదం తతమ్

వినాశమవ్యయ స్యాస్యన కశ్చిత్ కర్తు మర్హతి 2-17

ఏది సత్ అని చెప్పబడుతున్నదో అది 'అవినాశి', దానికి వినాశము లేదు. వినాశము లేని ఆత్మగురించి దుఃఖించవలసిన అవసరం లేదు. వినాశ లక్షణం గలిగిన దేహం గురించీ దుఃఖించవలసిన అవసరం లేదు. మరి దేని గురించి అనవసరంగా ఏడుస్తావు ? ఏది అవ్యయమో దానిని ఎవడూ అవ్యయస్య చేయలేడు - 'అస్య' దీనిని ఆత్మ అనేదానిని, 'వినాశం నకశ్చిత కర్తుమర్హతి' - ఏ ఒక్కడూ నాశనం చేయ

లేడు సుమా అన్నాడు. ఇక్కడ ఆత్మకి ఒక గొప్ప విషయం చెప్పాడు. 'యేన సర్వమిదం తతం' ఏది అంతటా వ్యాపించి ఉన్నదో అది అవినాశయైన ఆత్మ. అది ఇప్పుడు దేహిగా, దేహము నందు ఉన్నది.ఆత్మ అంటేనే 'యేన సర్వమిదం తతం' అని అర్థం.

ఆత్మ శబ్దానికి అర్థమేమిటి ?

లోకంలో మనం ఆత్మ శబ్దాన్ని ఎన్నో రకాలుగా వాడతాము. ఆత్మగౌరవం, ఆత్మ విశ్వాసం, ఆత్మాభిమానం లాంటి శబ్దాలు వినిపిస్తుంటాయి. అవి తీసుకువచ్చి, పరమార్థ శబ్దంగా చెప్పే ఆత్మకి దయచేసి అంటగట్టకండి. ప్రతి శబ్దానికి వ్యవహారంలో ఒక అర్థం ఉంటుంది. శాస్త్ర శబ్దంగా ఒక అర్థం ఉంటుంది. వ్యవహారంలో వ్యవహారార్థమే తీసుకోవాలి కాని, తాత్త్వికార్థం వెతుకుతే చాలా ప్రమాదం. వ్యవహారం అంటే వ్యవహారమే. ఆత్మ అంటే తెలుగులో అర్థం 'తన'. ఆత్మాభిమానం అంటే దేహానికి సంబంధించి వాడే లక్షణమే! నాకూ ఆత్మాభిమానం ఉందండి, నన్నంటే పడతానా అంటాము. ఏ పేరుతో, ఏ రూపంతో, ఏ ఉనికితో వ్యవహరింపబడుతున్నామో దానికి ఆత్మ అని చెప్పారు. అక్కడ దానికి అంతే అర్థం. అక్కడ పరమార్థంలో ఉండే అర్థం అన్వయించుకోవలసిన అవసరం లేదు. ఇది గ్రహించుకోవాలి మనం.

ఇక ఆత్మ శబ్దానికి అర్థం చెప్పుకుందాం. సర్వమిదం తతం ఆత్మ అంటే ఆతనోత్మి, వ్యాప్నోతి ఇతి ఆత్మ వ్యాపకలక్షణం కలది అని అర్థంట. ఆత్మకి దేహి అంటే దేహంలో ఉన్నవాడు. అంటే దేహి వేరు, దేహం వేరు అని అర్థమవుతోందికదా! వాడు గృహస్తు అంటే, గృహమునందు ఉన్నవాడు. అంటే గృహం వేరు, అతను వేరు అనే ఎఱుక మనకి ఏర్పడింది కదా ? అలాగే దేహి వేరు, దేహము వేరు అనే ఎఱుక మనకి స్పష్టం చేస్తున్నాడిక్కడ. ఆత్మానాత్మ వివేకం ఎలా చేసుకోవాలో చూడండిక్కడ.

ఆత్మ అనే పేరు ఎందుకు వచ్చింది ?

వ్యాపక లక్షణం కలిగి ఉండటం చేత అని అర్థం. ఈ ఆత్మ ఎంత వ్యాపిస్తే అంత అవుతూ ఉంటుంది. దేనిపై ప్రసరిస్తే అది ఆత్మ అవుతుంది. అవునా, లేదా ? నేను ఈ దేహమును అనగానే, ఈ దేహమే నేనని వ్యాపించి పోయిందప్పుడే. ఎవ రన్నా ఎంత తెల్లగా ఉన్నావు అంటే ఆహా! అని మురిసిపోతాము. ఎందుకు అంటే నేననే ఆత్మ భావాన్ని దేహమందంతా వ్యాపింపజేసాము ఇది దేహాత్మ. అలాగే మీ బుద్ధి చాలా గొప్పది. మీ మనసు విశాలమైనది అంటే అది కూడా స్వీకరిస్తున్నాం. ఆత్మ యొక్క లక్షణం మనసుకి కూడా వ్యాపించిపోయింది. ఇలాగ మనది కాని అనే కం వైపు ఇది వ్యాపించిపోతూ ఉంటుంది. వ్యాపకలక్షణం కలది అది. అందుకు తెలుసుకోవలసినది ఏమిటంటే సర్వత్రా వ్యాపించి ఉన్నదానిని, ఒకదానియందే పరి మితం చేసి ఇదే నేను, ఇదే నేను అనటం వల్ల వస్తున్న చికాకు. సర్వమిదం తతం అంతటా వ్యాపించి ఉన్నదానికి నాశనము లేదు. నువ్వు దాని యందు ఆరోపించి, తాదాత్మ్యం చెందించి, ఇదే నేను, ఇదే నేను అనుకోవటం వల్ల అది పోతుందని బాధ. ఇప్పుడు నీకు నిజంగా భీష్ముడు, ద్రోణుడు చనిపోతూన్నారని బాధా ? వాళ్ళ గురించి బాధ అయితే, అక్కడ వీధిలో ఎవరికో తాత చనిపోయాడుట. వెళ్ళి బాధపడ్డావా ? ఇక్కడే ఎందుకు నీకు ఏడుపొచ్చింది ? నావాడు. అనే భావన వల్ల వచ్చింది ? వాళ్ళు ఎవరో అయితే నువ్వు బాధపడవు.

మన గడియారం పోతే, ఊరందరినీ నీకు కనబడిందా అని అడుగుతాం. అదే ఇంకెవరన్నా తన గడియారం కోసం వెతుకుతే పిచ్చివాడు గడియారం కోసం ఏడుస్తు న్నాడు అంటాం. అది మనం గడియారం కాదు గనుక. గడియారం, పోవటం అనేదా నిలోనే ఏడుపు ఉంటే విన్న ప్రతివాడూ ఏడవాలి. కాని అందరూ ఏడవటం లేదే ? గడియారం ఎవరిదనుకుంటున్నాడో వాడు ఏడుస్తున్నాడు. అంటే ఏడుపెక్కడుంది ?

నాది అనుకోవటంలో కాని, పోవటం లో లేదు. అందుకు సుఖం కాని దుఃఖం గాని ఆరోపితమే కాని సహజం కాదు. అది ఇక్కడ స్పష్టంగా చెపుతున్నాడు. ఇది నువ్వు తెలుసుకుంటే, అసలు సత్యమేమిటో అది సర్వవ్యాపకమై ఉంది. నాశనము లేనిది. అది నశించి పోతుందని ఏడవవలసిన పనిలేదు.

గీత యొక్క గొప్పదనం ఏమిటి ?

భౌతిక విజ్ఞానానికి, ఆధ్యాత్మిక విజ్ఞానానికి ఉన్న అంతరం ఇక్కడ స్పష్టంగా చూడచ్చు. భౌతిక విజ్ఞానంతో ఎలాగు నశించిపోయేదానికి ఏడవటమెందుకు అనే మాట భౌతికంగా ఎవడైనా అనచ్చు. కాస్త ఆలోచిస్తే, కాని నశించనిది ఒకటి ఉంది అని చెప్పటం వల్ల అది ఇచ్చే ఓదార్పు, అది ఇచ్చే అభయం ఎవరు ఇవ్వగలరు ? అందుకే ఆధ్యాత్మికం అంటేనే ఒక ఓదార్పు. ఇది నశించి పోతుంది అనుకుంటే దాని కోసం పడే తపన, తాపత్రయం ఎక్కువవుతుంది. నేనే దేహం అంటే ఎన్ని దుఃఖాలో ! కాని నువ్వు దేహివి, నువ్వు దీని నుంచి మరో దాని కెళ్తావు అన్నప్పుడు ఎన్ని జాగ్ర త్తలు వస్తాయి ? ఆనందమూ వస్తుంది, అభయమూ వస్తోంది. తద్వారా జాగ్రత్తలూ వస్తాయి, పాపం నుంచి దూరమూ అవుతున్నాం ఈ ఆనందం ఓదార్పు భౌతిక విజ్ఞా నం ఇవ్వలేవు. ఎంత భౌతిక విజ్ఞానం పెరుగుతున్నా, తెలివైన వాడు ఇటే ఎందుకు తిరుగుతున్నాడంటే ఇక్కడ కనిపించే శాశ్వతత్త్వపు వచనం ఒకటి ఉంది. అది చెప్తు న్నాడు.

ఇక్కడ మరియొక్క విషయాన్ని కూడా మనం ఆలోచిద్దాం. మనలో ఈ సర్వ వ్యాపకమైన ఆత్మ ఉన్నది అనటానికి ఒక ప్రబల నిదర్శనం చూద్దాం. ఇదంతా వేదాం తంలే అని బుద్ధిని పక్కకి మరలిస్తే అర్థం కాదు. కేవలం నా విషయం అని ఏకాగ్రత

చూపించారా, అరటి పండు వలిచినట్లు విషయం మీకే స్పష్టమై పోతుంది. ఆలో
చించి చూడండి.

మన అందరికీ నాలుగు లక్షణాలు ఉంటాయి.

1. ఎక్కువ కాలం ఉందామనుకుంటాం

2. ఆనందంగా ఉండాలనుకుంటాం.

3. నేను గొప్ప వాడ్ని , శుద్ధుడిని అనిపించుకోవాలనుకుంటాం.

గొప్పవాడా కాదా అనేది వేరే విషయం. కాని నువ్వు శుద్ధుడివి కాదు అంటే కోపం వస్తుంది. తన శుద్ధతని నిరూపించుకోవటానికి ప్రయత్నిస్తాడు. రామచంద్ర మూర్తి ఇంత గొప్పవాడు అంటే నేను కూడా మొన్న యిలాగే ప్రవర్తించానండి అం టాడు అతను అంటే అతనికి కూడా గొప్పవాడ్ననీ, శుద్ధుడిని అనిపించుకోవాలనే తపన చాలా ఉంది.

4. నా గురించే అనుకోవాలని అనుకుంటాం. దేశమంతా నాగురించే అనుకో వాలి అనుకుంటాం. అంత అనుకునే సీను మనకి లేనప్పుడు ఇంట్లో వాళ్లైనా అను కుంటే చాలుననుకుంటాం.

ఈ నాలుగు లక్షణాలూ ఎందువల్ల అనుకుంటున్నాము ?

ఎందువల్ల అంటే నాకు ఈ నాలుగు లక్షణాలూ సహజం గనుక. ఇది బాగా గుర్తు పెట్టుకోండి. ఏ నాలుగు లక్షణాలో మళ్ళీ పరిశీలిస్తే 1. శాశ్వతంగా ఉండే లక్షణము, ఆనందంగా ఉండటమనే లక్షణం, శుద్ధంగా ఉండే లక్షణం. అంతటా వ్యాపించి ఉండటమనే లక్షణం (దీన్నే కీర్తి అంటాం ఈ లోకంలో). ఈ నాలుగు లక్ష ణాలు సహజం. నాకు సహజం. కాని నేను ఏది అనుకుంటున్నానో దానికిది సహజం కాదే ?

నేను ఏది అనుకుంటున్నాను ?

శరీరం అనుకుంటున్నాను. ఈ ఆత్మానాత్మనిక్కడే జారిపోకుండా ఉంటే స్పష్ట మవుతుంది. నన్ను నేను ఏమనుకుంటున్నాను ? శరీరమనుకుంటున్నాను. కాని ఈ శరీరానికి మొదటి లక్షణం లేదు. ఎప్పుడూ ఉండటం అనే లక్షణం లేదు. ఆనం దంగా ఉండటమనే రెండో లక్షణమూ లేదు. ఆనందం దీని కెక్కడికి ? ఇదొక జడప దార్థం. 'మాత్రాస్పర్శాస్తు కౌంతేయా!' దీనికి మరొక దానియొక్క సంగమం ఏర్పడితే నే తెలుస్తోంది. దీనికి సహజంగా ఎక్కడుంది?

మనం ఈ పక్కనుంచి వెడుతుంటే ఎవరో తిడతాడు మనని ? కాని మనకి వినిపించదు. ఇక్కడ చెవి ఉంది. అక్కడ అరుపు ఉంది. కాని మనకి వినిపించటేదు కారణం? ధ్యాస మరోవైపు ఉంది. పక్కన ఎవరో విని నిన్ను తిడుతున్నాడని చెప్తాడు. వెంటనే వెళ్ళి అరుస్తాం నువ్వు విన్నావా అంటే వినలేదు అంటాం. ఎందుకు ? ఇంద్రి యం ఇక్కడ ఉంది, ధ్వని అక్కడ ఉంది. రెండూ తగల్లేదు. ఈ రెండింటిని తగిలిం చేది మనస్సని ఒకటి ఉంది. అది తగిలించటంవల్ల వచ్చింది. కనుక ఈ శరీరానికి సహజానంద స్థితి లేదు. జడత్వమనే లక్షణం ఉంది. ఇంక మూడవ లక్షణం శుద్ధత దీనికి ఎలాగూ లేదు.పొద్దున్న లేచి రోజుకి రెండో మూడో స్నానాలు చేస్తూనే ఉంటాం. ఇంక వ్యాపించటమనే లక్షణం చూస్తే శరీరం ఇక్కడుంటే అక్కడుండదు. అంటే దేశంలోనే పూర్తిగా వ్యాపించలేదు, కాలంలో అంతకన్నా వ్యాపించలేదు. ఇవాళుంటే రేపుండేదీ కాదు. కనుక వ్యాపకత్వ లక్షణమూ లేదు. కాని ఈ నాలుగూ దీనికుం డాలని ప్రయత్నిస్తున్నాం. వచ్చిన చిక్కల్లా అదే. దేనికిది సహజంగా లేదో, దానికది తేవాలని ప్రయత్నించటం చేతే, అపస్థలన్నీ వస్తున్నాయి.

ఈ నాలుగు లక్షణాలూ అసలు లేవా ?

అసలు లేకపోతే అలా ఉండాలన్న కోరిక నీకుండదు. ఇది కూడా కొంచెం ఆలోచించవల్సిన విషయమే ! నువ్వేమిటో అలాగే నీకు ఉండాలనిపిస్తుంది కాని నువ్వేమిటో తెలుసుకోకపోవటం వల్ల వచ్చిన చిక్కులివి. నువ్వైన ఆత్మ శాశ్వతమైనది. అందుకే నీకు తెలియకుండానే శాశ్వతంగా ఉండాలన్న తపన కలుగుతోంది. అది ఆనందమైనది. అందుకే నీకు ఆనందంగా ఉండాలని కోరిక పుడుతున్నది. అది శుద్ధమై నది అందుకే శుద్ధి అనిపించుకోవాలని కోరిక పుడుతున్నది. అది సర్వవ్యాపకమైనది అందుకే సర్వత్రా నీ గురించే అనుకోవాలన్న కోరిక పుడుతున్నది. కనుక నేను అనబడే అటువంటి ఆ ఆత్మ ఉన్నదే ఏ ఆత్మ ఉండటం వల్ల నేను అనే స్ఫురణ వస్తున్నదో, దానికి సహజంగా ఉన్న లక్షణాలివి కాని అసహజమునందు ఈ నేను అనే భావాలు ఆరోపించుకోవటం చేత, ఈ నాలుగు భావాలూ దానికి రావాలని కోరుకోవటం చేత వచ్చింది ఈ అవస్థ. ఇప్పుడు ఈ అవినాశి అయిన తత్త్వం కొంత అర్థమయింది కదా ! ఏది సత్ అయి ఉన్నదో, ఏది అవినాశి అయిఉన్నదో దానికి సహజ మైనది ఆనందం. దీనికి అసహజమైనది ఆనందం. ఈ రెండింటి యొక్క సంయోగంలో నువ్వు పొరపా టుపడి, దేహమే నేననుకుని, దేహమే ఆత్మ అనుకుని, అవతలి వాడి ఆత్మ ఈ ఆత్మ అనుకుని, ఈ సంయోగ వియోగాలతో అవస్థలు పడుతున్నావు. కాబట్టి సహజమైన నీ స్థితిని తెలుసుకో !

అంత వంత ఇమే దేహా నిత్యస్యోక్తాః శరీరిణః

అనాశినో ప్రమేయస్య తస్మాద్యుధనిస్వ భారత 2-18

ఏది అవినాశో చెప్పాను కదా! ఇప్పుడు వినాశి ఏదో చెప్తున్నాను. అంతవం తయు దేహమేహః అంతవంతములు అంటే అంతములు కలిగినటువంటివి దేహ ములు. అనిత్వః అనిత్యములు. అనాశో యస్వ - అందులో ఉన్నవాడు అనాశి, అప్ర

మేయుడు. వానికి నువ్వు కొలత పెట్టలేవు. ఇది ఏదేహంలో ఉందో ఆ దేహానికి కొలత పెట్టగలవుగాని, ఆలోపల ఉన్న అవినాశికి కొలత బెట్టలేవు.

ఆత్మ అనేవాడున్నాడు ఎంత ఉన్నాడు ?

బొటన వేలంతా ? ఇంట్లో నేనున్నాను అంటే ఫలానా గదిలో ఉన్నాను. అలాగే ఇంట్లో ఉన్నాడు అంటే ఏ మూల ఉన్నాడు అన్న ప్రశ్న వస్తుంది. ఏ మూల లేడో చెప్పు ? దాని లక్షణమే వ్యాపించటం. నీ దేహమంతా ఆయన వ్యాపించి ఉన్నాడు. మరి దేహమంతా వ్యాపించి ఉన్నప్పుడు, మరి దేహం కాదంటా వేం అంటే ఈ చర్మ మాంస, అస్త, ఇంద్రియములు కాదు. దీన్నంతా ఏది వ్యాపించటం వల్ల చలనం వస్తుందో, అది నువ్వని తెలుసుకో అని స్పష్టం చేసి, అది నశించనిది. అది అప్రమే యః అన్నాడు. ప్రమేయము అంటే కొలత కలిగినది, అప్రమేయము అంటే కొలత లేనిది అని చెప్తున్నాడు ఇక్కడ.

కొలత అంటే ఒక పరిమితి భావాన్ని కొలత అంటారు. మనం అనంతాకాశాన్ని కిటికీలోంచి చూసామనుకోండి. మనం అంతకు ముందు ఎప్పుడూ ఆకాశం చూడలే దనుకోండి. ఆ గదిలోనే పుట్టి, ఆ గదిలోనే పెరిగి, ఆ గదిలోనే జ్ఞానం సంపాదించు కుంటే, ఒక్కసారి కిటికీ తెరవగానే, ఆహా నా కిటికీ అంతా నీలంగా ఉంది అంటాం. ఆ నీలం మధ్యలో ఒక ఎండ పడుతూ ఉంటుంది.దానికి ఊచలు కూడా ఉన్నాయి. అందులోంచి ఒక బంగారురంగు కాంతి వస్తోంది. కాబట్టి ఆకాశమంటే ఎంత అంటే ఆ గదిలో కిటికీ అంత ! అవునా, కాదా ? గదిలో ఉన్నంత సేపు అది నిజమే ! కాని అదే నిజమా? అదే నిజం కాదని ఎప్పుడు తెలిసింది ? ఆ గదిలో కూచుని ఎంత ఉప న్యాసం ఇచ్చినా తెలియదు. ఎప్పుడు తెలుస్తుంది ?బయటికి తీసుకువచ్చి చూపిస్తే ! అందుకు మనం అనంతమైన ఆత్మ తత్వాన్ని దేహ పరిధిలో చూస్తున్నాము.

దేనికి మూడు కొలతలుంటాయి. దేశపు కొలత, కాలపు కొలత, వస్తువు యొక్క కొలత.దీన్నే దేశకాల వస్తు పరిచ్ఛేదము అంటారు. ఒక సమయంలో ఒక ప్రాంతంలో, ఒక కొలతలో ఉంటుంది. ఏ వస్తువైనా? ఆత్మ అనేది దేహంలో ఇమిడి ఉంది కనుక దేహంతో తారాత్మ్యం చెందక, దానిలో ఉన్నదాన్ని తెలుసుకో !

యు ఏనం వేత్తి హంతారం యశ్చైనం మన్యతే హతమ్

ఉభే తౌన విజానీతో నాయం హంతి నహన్యతే 2-19

ఇప్పుడిది అర్థమయింది కనుక, నన్ను చంపాడు అనుకున్నవాడు, నేను చంపుతున్నాను అనుకునే ఇద్దరూ ఎంత అజ్ఞానంలో ఉన్నారో అర్థమయింది కదా ? ఎందుకంటే నేను అనే ఆత్మ ఏదయితే ఉందో ఆ ఆత్మ చంపదు, చంపబడదుకూడా! చంపుతున్నాను, చంపబడ్డాను అనుకుంటున్న ఉభయులు కూడా తెలియని వారే అని తెలుసుకో !

న జాయతే మ్రియతే వా కదాచిత్

నాయం భూత్వా భవితా వానభూయః

అజో నిత్యః శాశ్వతో యం పురాణో

న హన్యతే హన్యమానే శరీరే ! 2-20

ఈ శ్లోకం కఠోపనిషత్తులో ఉంది. గీతలో అనేక వాక్యములు ఉపనిషత్ వాక్యములే. కొంతమంది ఉపనిషత్తులోవన్నీ ఇందులో పెట్టారంటారు. కృష్ణాభిమానం ఉన్నవాళ్ళు ఇందులో వన్నీ అందులో పెట్టారంటారు. అక్కడిదిక్కడ పెట్టారా, ఇక్కడిది అక్కడ పెట్టారా, ఇందులో శ్లోకాలు ఏడు వందలా, ఏడు వందల పదా, మూడు వందలా ఈ గొడవలన్నీ ఎవరు ఆలోచిస్తాడంటే, ఎవడికి తత్త్వం అక్కరలేదో వాడు పడ్తాడు. అసలు కావల్సినవాడికి ఈ గొడవ అక్కర లేదు.

ఒక యిద్దరు మామిడి తోటలోకి వెళ్ళారు. అందులో ఒకడు ఎన్ని చెట్లున్నాయి. ఎన్ని రకాలున్నాయి వగైరా వివరాలన్నీ సేకరించాడు. ఇంకొకడు మాత్రం హాయిగా కనిపించిన చెట్టు దగ్గరికి వెళ్ళి హాయిగా పండు తిన్నాడు. ఇద్దరూ బయటికి వచ్చారు. మొదటివాడేమో నేను లెక్క మొత్తం కట్టానన్నాడు. రెండోవాడి దగ్గర ఏ లెక్కా లేదు. మరి ఏం ఉంది ? వాటి రుచి ఉంది అన్నాడుట. అలాగే కొంతమంది లెక్కల దగ్గరే ఆగిపోతే, కొందరు తత్త్వం తెలుసుకుంటారు. మనం ఎలా ఉండాలంటే, రుచి తెలుసుకునే తెలివైన వాడివలె, ఈ శ్లోకమునందు చెప్పబడ్డ అసలు తత్త్వాన్ని గ్రహించాలి. దాన్ని కృష్ణ వచనంగా స్వీకరించాలి.

అది పుట్టినది కాదు, పోయేదికాదు. దాచిత్ ఎప్పుడూకూడాను. నాయం భూత్వా భవితా వానభూయః అది ఒకప్పుడు లేనిది, ఇప్పుడు ఉన్నది, మరొకప్పుడు లేనిది కాదు. అది ఎటువంటిది ? 'అజః నిత్యః శాశ్వతః అయం, పురాణః' నాలుగు లక్షణాలు చెప్తున్నాడు. దానికి జన్మలేదు. నేను ఫలానా అప్పుడు పుట్టాను అంటే దేహం యొక్క పుట్టుక నీ పుట్టుకగా చెప్తున్నావు కాని, అసలు నువ్వనే చైతన్యానికి పుట్టుకలేదు.

ఎప్పటిదో, ఏనాటివాడో, ఈ జీవుడు. అందుకు న హన్యతే హన్యమానే శరీరే ! పోయేటటువంటి శరీరాన్ని బట్టి శాశ్వతుడ్ని నిర్ణయించకు.

వేదావినాశినం నిత్యం య ఏనమజమవ్యయమ్ !

కథం న పురుషః పార్థకం ఘాతయతి హంతి కమ్ 2-21

ఎవడైతే ఈ ఆత్మ అవినాశమని, నిత్యమని, ఆద్యంతములు లేనిదని తెలుసుకున్నాడో, వాడు చంపానని, చంపించానని అవి కంలో ఎలా పడతాడు ? నువ్వు దీని యందు పరిమితమై ఇదే నేనుకుని, ఆ పరిమితమైన వాటితో బంధనంకల మరి

కొందరి పరిమితులపై నువ్వు మోహాన్ని ఆరోపణ చేసుకుని స్వధర్మం నుంచి భ్రష్టుడి ని కాకు సుమా అని చెప్తున్నాడు.

అనాత్మ నిరసనము అంటే అర్థమేమిటి ?

దీన్ని బట్టి ఆత్మానాత్మల వివేకం తెలిసిపోయింది కనుక, వెంటనే అనాత్మని వదిలేసి ఆత్మని అందుకుందాం, శరీరం రోత, ప్రపంమంతా అనాత్మమయం, మాయామయం అనేసుకుని వెంటనే శరీరాన్ని విముక్తం చేసేసుకోవటమో, శరీరాన్ని వదిలేయటమో చేయాలా ? ప్రపంచాన్ని వదిలేయమనో, నిరసించమనో కాదు అనాత్మ నిరసనము అర్థం. ఇక్కడ మనం అర్థం చేసుకోవాల్సింది విశ్వమంతా వ్యాపించి ఉన్నది ఆత్మయే అని.

ఒకావిడ దగ్గర ఒక నగ, ఒక ఉంగరం, ఒక చెవి లోలాకులు ఉన్నాయి. మీ యింట్లో ఉన్న బంగారం తెమ్మంటే ఆమె ఈ మూడూ తెచ్చింది.ఇవి బంగారమా? అంటే అవును ఇవే బంగారం అంది ఆమె. ఒక్కొక్కదాన్ని చూపించి దీన్నేమంటారు, అంటే నగ, ఉంగరం,లోలాకులు అంటూ పేర్లు చెప్పింది. నువ్వు ఏవో పేర్లు చెప్తు న్నావు, నేను బంగారం తెమ్మంటున్నాను అన్నాడు అతను. అయ్యా ఇవే బంగారం అని ఆమె గొడవ. ఇలా ఉంటాయి ఆత్మనాత్మల గొడవ. నగగా, ఉంగరంగా, లోలా కుగా కనిపించేది బంగారమే నన్న ఎఱుక కలిగి ఉండు. అంతే కాని ఇదంతా కలిపి ముద్దచేసి ఇచ్చినా  ముద్ద అంటాడు గాని బంగారం అనడు. భిన్న భిన్నంగా కనపడు తున్నా ఒకే సువర్ణమనే ఎఱుక నీకెలాగ ఉన్నదో , సృష్టిలో వివిధ ఉపాధుల్లో కనిపిస్తు న్నప్పటికీ, ఆత్మ ఒకటే. నగలు మార్చి వేరే నగలు చేసినా బంగారం మారనట్టే, ఉపా ధులు మారినా ఆత్మ మారదు. అన్ని ఉపాధులలో అదే నిండి ఉందన్న ఎఱుక కలిగి

ప్రపంచాన్ని చూడు. ఆత్మానాత్మ వివేకం అర్థం యిదీ ! సర్వవ్యాపకమై ఉన్న ఈశ్వర చైతన్యాన్ని దర్శించటం తప్ప, పరిమిత భావాన్ని విడనాడాలి.

ఆత్మ జ్ఞానంతో ప్రపంచంలో ఎలా ప్రవర్తించాలి ?

పడవమీద వెళ్ళేవాడు నదిలో ఎలా వెళతాడో అలా వెళ్ళాలి. పడవని ఉపాధి అనుకుందాం. ఆపడవలో ఉన్నవాడిని జీవుడు అనుకుందాం. ఆ పడవలో వెళుతున్నప్పుడు, తను పడవ అనుకుని తాదాత్మ్యం చెందితే ప్రమాదమేకదా ? ఒడ్డు చేరే వరకూ పడవలో తనకి కావాల్సిన ఆహారపదార్థాలన్నీ దాచి పెట్టుకుంటాడు. ఈ ఆహార పదార్థాలతో సుఖించి పోతూ, అందులోనే ఉండిపోవాలనుకుంటే, ఉండి పోవటమే జరుగుతుంది. మరిక ఒడ్డుకు చేరడు. అలాగని ఇవి కూడదా అంటే కావాల్సిందే. మనం వెళుతున్న లక్ష్యానికి తగ్గట్టు ఉండాలి. అతనికి ఒడ్డే లక్ష్యం కనక, ఈ పడవ వదిలేస్తాననగలడా ? ఒడ్డుకి చేర్చటానికి పడవ ఎలా కాపాడుకుంటాడో, అలాగ ఈ దేహమనే ఉపాధిలో ఉండగా ఈ దేహాన్ని కాపాడుకోవలసిందే. ఆ దేహానికి విధింపబడ్డ స్వధర్మాన్ని కాపాడుకోవాల్సిందే. ఆ పడవకి కన్నం పడితే, దాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలి. అలాగని పడవనే అలంకరించుకుంటూ కూర్చుంటే, ఒడ్డుకి చేరలేడు. ఆ పడవని అటు వైపు ప్రయాణం చేస్తూనే ఎలా రక్షించుకుంటున్నాడో, ఆ విధంగా అడుగడుగునా జాగ్రత్తపడుతూ లక్ష్య సిద్ధి కలిగి ఉండాలి. ఉపాధి త్యాగము కాదు, ఉపాధి లక్ష్యాన్ని గుర్తించి, ఈ సర్వమూ భగవన్మయమ్, ఆత్మ మయమ్, ఈశ్వర చైతన్య మయమ్ అని ఎఱుకగలిగి ఉండమని చెప్తున్నాడే తప్ప దాన్ని నిరసించ మన్న ఉద్దేశం కాదు. స్వధర్మంలో ఉన్నటువంటి వాడు ఎంత జాగ్రత్తలో ఉండాలో చెప్తూ, ఈ దేహము నువ్వుకాదు అన్న భావాన్ని తీసేస్తే, ధర్మాన్ని ఎంత బాగా

ఆచరించగలం, నాయొక్క శాశ్వతత్వాన్ని నేను ఎంత అనుభవించగలను అనేది చింతన చేయగా, చేయగా దృఢ పడుతుంది.

దేహాన్ని ఎలా విడిచి పెడతాడు జీవుడు ?

బీరువానిండా ఎన్ని బట్టలో ఉన్నా, ఇంకా కొనుక్కోవటానికి వెళ్తాడు. ఎన్ని బట్టలు మారుస్తున్నాడు ? ఎందుకు మార్చావంటే కారణాలు అనేకం. వాడీ, వాడీ విసిగిపోతే కొందరు మారుస్తారు. చిరిగి పోయాయని కొందరు, పనికిరాలేదు, సైజు పెరిగిపోయిందని కొందరు. ఎన్ని బట్టలు మార్చుకున్నా అతను మారాడా ? మనకి అతన్ని ఒక రకం బట్టల్లో చూడటం అలవాటైపోతుంది. వేరే మార్చుకు వెళితే పోల్చు కోలేము మనము. వాడు నేనేరా అని చెప్తాడు. అలా ఎందుకు చెప్తాడు ? ఆ బట్టల్లో ఉన్నదీ, ఈ బట్టల్లో ఉన్నదీ నేనేనన్న స్పృహ వాడికుంది కనుక !

ఇక్కడ కేవలం ఆ స్పృహ లోపమే, దేహం నుంచి దేహం మారగానే ! అంతే గాని ఉన్నవాడు మాత్రం వాడే.

వాసాంసి జీర్ణాని యథా విహాయ
నవాని గృహ్ణాతి నరోపరాణి
తథా శరీరాణి విహాయ జీర్ణా
న్యన్యాని సంయాతి నవాని దేహీ 2-22

దేహాత్మ భ్రాంతిని విడిచి పెట్టటానికి ఎంత చక్కగా చెప్తున్నాడు ! దేహమే నేను కాదనుకున్నవాడు దేహం నుంచి బయట పడాలనీ ప్రయత్నించడు. దేహంలో ఉండి పోవాలనీ అవస్త పడడు. దేహంతో ఏం చేయాలో అది చేస్తూ వెళుతూ ఉంటాడు. తన సమయం వచ్చినప్పుడు వెళ్ళి పోయినా బాధ పడడు, తనతో ఉన్నవాళ్ళ దేహాలు మారి పోయినా బాధ పడడు. అది సహజము అనుకుంటాడు.

అది ఎలా ఉంటుంది ?

చిన్నపిల్లవాడు తన బట్టల మీద మోహం పెట్టుకుంటాడు. నాకు ఆడ్రేస్సే కావాలి అని దేనికో పేచీ పెట్తాడు. నువ్వు దానితో నాలుగు రోజులు క్రికెట్ ఆడావు, మాసిపోయింది నేను తీసేసాను, ఇప్పుడు కొత్తబట్టలు ఇస్తాను వేసుకోరా అంటుంది తల్లి. కాని వాడు కింద పడి దొర్లి ఎలా ఏడుస్తాడో అలాగ ఈ పెద్ద పిల్లవాడి బుద్ధి కూడా అలాగే ఉంటుంది. ఆ ప్రకృతి తల్లి నీ బట్ట చాలా మాసిపోయింది, దానితో ఎంత బాధపడతావు, తీయి, మరో బట్ట ఇస్తాను అంటే ఈ పిల్లవాడి ఏడుపులాగే ఉంటుంది. మన ఏడుపుకూడా అది అజ్ఞానం.

70 ఏళ్ళ వృద్ధుడు ఇప్పుడు వంగి పోయాడు, మంచంలో పడ్డాడు, ఒళ్ళంతా జ్వరం. అయినా డాక్టరు వచ్చాడా, బ్రతికిస్తాడా నన్ను అంటాడు. బ్రతికి ఏం చేస్తావు ? అంటారు. బలవంతంగా చచ్చిపోమని కాదు అర్థం కాని దేనికి బ్రతికే లక్షణం లేదో, దానితోనే తాదాత్మ్యం చెంది పోయి, ఏమైపోతానో అనుకుంటాడు. 90 ఏళ్ళు వచ్చే స్తున్నా ఇంకా అంటి పెట్టుకుని ఉండటం ఎందుకు ? అలాగని ముక్కుమూసుకుని హఠాత్తుగా చచ్చిపోమని అర్థం కాదక్కడ. దీనితో తాదాత్మ్యం చెంది, ఇది పోతుందే అన్న దుఃఖం, వాడు రాలేదే, తీసుకెళ్ళలేదే అన్న దుఃఖం ఉండకూడదు. మరొకడొస్తు న్నాడు తీసుకెళ్ళటానికి, అది ఆలోచించాలి.

అప్పుడు ఎటు చింతన చేయాలి ? చావన్కాలము దాపురించియును

తన్నేవైద్యుడు చికిత్స బ్రోవగలడో

ఏ మందు రక్షించునో, ఏ నేల్పులు కృపజూతురో యంచుదా చింతించునే తా జీవచ్ఛార్థము చేసుకున్న యతియును శ్రీ కాళహస్తీశ్వరా?

జీవచ్ఛ్రార్థము చేసుకుంటాడు యతి యితి అంటే సన్యాసి. సన్యాసికి కర్మ ఉండదు. అదీ విశేషం. సన్యాసికి కర్మచేసేందుకు అర్హత లేదు, తనకి తాను చేసు కోవటానికి లేదు. సన్యాసిగా దీక్ష తీసుకున్నప్పుడే జీవచ్ఛ్రార్థం చేసుకుంటాడు. బ్రతికుండగానే శ్రార్ధం చేసుకోవటమన్న మాట. వాడు సన్యాసి ఎందుకయ్యాడు ? ఆత్మానాత్మవివేకం కోసం. అట్లాంటి వాడు కూడా చివరి సమయం కొచ్చేసరికల్లా తనని ఏ వైద్యుడు చూస్తాడో అంటూ చింతిస్తాడే గాని పరమార్థంబైన నీయందు చింతించరు.

ఏది పరమార్ధము ?

సర్వవ్యాపకమైన, ఆ పరమార్థమైన ఆత్మ తత్త్వం ఉపనిషత్తులు ఆత్మ అంటే భక్తి శాస్త్రం,పరమేశ్వరుడు, నారాయణుడు, అనే పేర్లతో పిలిచినా సర్వవ్యాపకం అదే. భక్తుడు అలా అంటాడు, జ్ఞాని ఇలా అంటాడు. ఎలా అన్నా దేని అంటున్నాడు? ఎవరు అవినాడో, ఎవరు అప్రమేయుడో, ఎవరు శాశ్వతుడో వాడితో తాదాత్మ్యం చెందమని చెప్పటానికి పెద్దవాళ్ళు ఈ విషయాలన్నీ చెప్పారు. ఆ తాదాత్మ్యం చెందా ల్సింది అవినాశమైన వస్తువుతోగాని, వినాశమైన దానితో కాదు అని ఉపనిషత్తు ఎంత చక్కగా చెప్తోందో చూడండి. కృష్ణ పరమాత్మ అదే చెప్తున్నాడు.

ఇంత జీర్ణ శరీరం ఎందుకులే మరొకటి చూద్దాం అనుకోవాలి. అది ఎలా ? తెలివైన వాడికి ఇంటికి రాగానే ఈ చొక్కా మాసిపోయింది. ఇంకోటి వేసుకుంటా నన్న ప్రిపేర్డ్‌నెస్ ఎలా ఉంటుందో, ఆ విధంగా మనం ఇంతకన్నా మరొక ఉదాత్తమైన వస్త్రం వేసుకోవటానికి సిద్ధంగా తయారవగలగాలి. ఈ వాసాంసి జీర్ణాని లో అంత విశే షం ఉంది.

ఇలాంటి వాళ్ళు ఎలా ఉంటారు ?

మనం చొక్కా చిరిగితే అయ్యో అని చతికిల బడి ఏడుస్తున్నామా ? మార్చే స్తాంలే అనుకుంటాం ఎందుకంటే చొక్కా వేరు, నేను వేరు అనే స్పృహ ఉంది కనుక. ఇదే స్పృహ ఆత్మ విషయంలో కూడా మనకి కలిగి ఉన్నప్పుడు, ఇంక చింత ఏల ? అలాంటి స్పృహ కలిగిన వారు ఉన్నారా ? ఎందరో మహానుభావులు ఉన్నారు. వాళ్ళకి దేహంలో తిరుగుతున్నా, దేహం కామని తెలుసు. వాళ్ళు చక్కగా వెళుతూ, వస్తూ ఉంటారు. సమయం వచ్చినప్పుడు డ్రెస్సు మార్చటానికి సిద్ధం. అమృతమయ మైన తాదాత్మ్యం చెందిన వాడు ఏ డ్రెస్ వచ్చిన బాధ పడడు. చైతన్య మహాప్రభువు కూడా అదే అన్నారు.

మమజన్మని జన్మని శ్వరే..... ఎన్ని జన్మలొచ్చినా నీపై భక్తి ఉంటే చాలన్నారు. ఏది శాశ్వతమో, ఆ శాశ్వతంతో నేను తాదాత్మ్యం చెందితేచాలు, జన్మలంటావా అవి అశాశ్వతం. వేసే డ్రెస్సులో ఉన్నా ఆ డ్రెస్సే నేను అనుకోకుండా, నేనే విటో తెలుసు. ఆడ్రెస్సే నేను అని అనుకోవద్దంటే అర్థం, డ్రెస్సువేసుకోవద్దనీ కాదు. శరీరాన్ని నిరసిం చమనీ కాదు, అంతర్గతమైన ఆత్మ చైతన్యమేదైతే ఉందో, అది గ్రహించటం. లోక వ్యవహారం కోసం వస్త్రం ఎలా వేసుకుంటామో, జీవనవ్యవహారం కోసం దేహం అలా ధరించాం. కనుక అంతర్యామి అయిన తాదాత్మ్యవస్తువు, అవినాశ ఆత్మ ఏదైతే ఉందో అది నేను అనే భావనతోనే తన్మయం చెంది ఉండాలి. అది ఇందులో చెప్తు న్నాడు.

వాసాంసి జీర్ణాని తథా దేహాంతర ప్రాప్తిః ఈ రెండింటిని ఒకచోట చూసినప్పుడు, కొంచెం తెలివిగా ఆలోచిస్తే ఒక సందేహం కలగచ్చు. జీర్ణించిన శరీరాన్ని విడిచి పెట్టి నప్పుడు దుఃఖించనవసరం లేదు. బాగానే ఉంది కాని జీర్ణావస్త లేనప్పుడు కూడా శరీ రాన్ని విడిచి పెట్టొంటే దుఃఖించక పోతే ఎలాగా ? కృష్ణ పరమాత్మ ఏమన్నాడు?

వాసాంసి జీర్ణాని జీర్ణించిన శరీరము, జీర్ణించిన వస్త్రములు. ఇక్కడ జీర్ణాణి అంటే జీర్ణించి పోయిన, శుష్కించి పోయిన అని కాదు. ఎప్పుడైనా, ఎవడైనా ఈ దేహాన్ని విడిచిపెట్టాడు అంటే అక్కడితో ఈ దేహానికి పనైపోయిందని అర్థం. అంతే కాని దేహం పండితేనే అనికాదు. ఎప్పుడు వీడికి రాసిపెట్టి ఉందో ఎవరికి తెలుసు ? కొందరైతే నీటుగా, క్లీనుగా ఉన్న డ్రెస్సు కూడా ఇవాళ మార్చేసి, రేపు వేరే వేసుకుంటారు. జీర్ణిస్తేనే మార్చుకుంటున్నారా వాళ్ళు ? వాళ్ళ దగ్గర ఉన్నాయి కాబట్టి వేసుకుంటున్నారు. వాసాంసి జీర్ణాణి కాదు, రోజుకో డ్రెస్సు వేసుకుంటున్న వాళ్ళు కూడా కనిపిస్తారు, లౌకికంలో మనం చూస్తే ! జీర్ణాని అంటే కర్మతో జీర్ణమవుట అని అర్థం అంతేగాని శరీరం కృశించుట అని కాదు. కర్మ ఆ దేహంలో జీర్ణమయినప్పుడు, దానిని విడిచి పెట్టి మరొక దానికి వెళ్ళడు.

ఈ మాటకి ప్రహ్లాదుడు చాలా బాగా చెప్పాడు.

బాలకులార రండు అన్నాడు ఎప్పుడు ? రాక్షసగురువులు రెండు మార్లు చెప్పినా ఒకటే మాట. ఎల్లశరీర ధారులకు అచ్చపు చీకటింబడి మందార మకరంద మాధుర్యామునదేలు అన్ని చెప్పాడు. ఎవరు చెప్పారు నీకు ? ఎవరు చెపితే వచ్చింది అన్నాడు. హిరణ్యాకశిపుడు ఆఖరికి ఒకళ్ళు చెపితే వచ్చిందయితే నీకు నేను ఇంత చెప్పినా వచ్చిందా అన్నాడు. ఇది చెప్తేనైనా పుట్టాలి, సహజంగా నైనా పుట్టాలి. ఏదీ పుట్టలేదంటే నువ్వంత కూరుకుపోయావు నాన్నా అన్నాడు. ఇంక లాభం లేదు మళ్ళీ పాఠం చెప్తాం అని తీసుకెళ్ళారు గురువులు. వాళ్ళ పాఠాలు వాళ్ళు చెప్పారు, ఈయన చెప్పాల్సినవి ఈయన చెప్పాడు పిల్లలకి. ఏమని ? వాసాంసి జీర్ణాని యథా విహాయ చెప్పలేదు. చెప్పుంటే వెంటనే వాళ్ళే మనే వాళ్ళు ? ఓహో అప్పుడు కదా అప్పుడు చూసుకుందాంలే ! వాళ్ళని ఎలా సంబోధించాడో చూడండి.

బాలకులార రండు

మన ప్రాయపు బాలురు కొందరు ఉర్విపై కుదుటగట్టిరొ

మన వయస్సు వాళ్ళు కూడా చచ్చిపోతున్నారన్న విషయం మీకు తెలుసుకదా అన్నాట్ట.అంటే చావనేది ఎప్పుడో వచ్చే విషయం కాదు. నిత్యం సన్నిహితో మృత్యువు. పక్కనే ఉండి లాగుతుంటుంది. దాని పనే అది. జీవితం స్థిరంగా అనిపించటం ఒక భ్రమ. దాని పనే అస్థిరం. స్థిరం ఎవరు ? లోపలున్నవాడు. కదులుతున్న దానిలో కదలకుండా ఉన్నవాడు ఒకడున్నాడు.అందు కాయన్ని స్థానువు అని స్పష్టంగా చెప్తు న్నాడు. కదలని వాడు వాడు. దీనికి కదిలే లక్షణం ఉంది. కదిలే లక్షణం ఉన్న ఈ జీవిని కదలనిది అనుకుంటున్నాం మనం. 99 ఏళ్ళ వాడు కూడా వీల్ ఛెయిర్‌లో తిరుగుతున్నా వచ్చే ఏడు గృహప్రవేశం చేస్తున్నానంటాడు, తను కట్టుకుంటున్న ఇల్లు చూసుకుంటూ ! అప్పుడే ఒక శం వెళితే అతన్ని చూసి పాపం ఆయువు తీరిపోయింది అంటాడు. 77 ఏళ్ళ వాడు వెళిపోతుంటే వాడికి ఆయువు తీరిపోయిందిట, వీడేమో 99 ఏళ్ళ వాడు, వచ్చే ఏడాది గృహప్రవేశం చేస్తాడుట. ఇంతకంటే ఆశ్చర్యం ఉం టుందా అని అన్నాడు ధర్మరాజు. ఇవన్నీ వర్ణిస్తున్నాడు వాసాంసి జీర్ణాని లో ఎప్పుడో వస్తుంది కదా, దీని అస్థిరత్వము ఎలాంటిది ? అస్థిరమైనా స్థిరంలా ఎలా కనబడు తోంది అనటానికి విశ్వనాధ సత్యనారాయణవారు గొప్ప పద్యాన్నే రాసారు.

తెమలంజాలని వాడుగా,

చూచుచు, చూచుచుండ, తలబరువై తూలిపోనైన

దేహముగా, ఎన్ని గిరాట్లు నన్ను విసురుదు క్రీడాసక్త విశ్వేశ్వరా ?

బాగా బలమైన క్రీడాకారుడు వేసిన బొంగరం స్థిరంగా ఉన్నట్టు కనిపిస్తోంది కాని వాడు విసిరేడు, ఇది బొంగరం అన్న జ్ఞానం లేకుండా బొంగరాన్నే చూస్తే ఎంత

స్థిరంగా ఉందో అనుకుంటాం. కాని ఆస్థిరత ఎంత సేపు? చూచుచు, చూచుచుండ, తలబరువై తూలిపోనైన కింద పడిపోతుందే ! అలాగ తూలిపోదు దైహమునైన నన్ను ఎన్ని గిరాట్లు వేస్తావు క్రీడాసక్త విశ్వేశ్వరా? ఒకసారి తూలిపోయిందని ఊరుకున్నాడా? మళ్ళీ తీసి మళ్ళీ చుట్టి, మళ్ళీ వేస్తాడు. ఒక్కొక్క తిరుగుడు ఒక్కొక్క జన్మ. ఎప్పటి కైనా తెములుతావా ? తెమలం జాలని వాడుగా ఎన్ని గిరాట్లు వేస్తావు ? ఇకనైనా ఆపు అని ఎందుకన్నాడు ? తిరుగుతున్న బొంగరానికి చలనం ఉంది కాని నువ్వు స్థిరము. నేను ఇది స్థిరమన్నది భ్రమమాత్రమే. తిరుగుతున్న బొంగరంలో స్థిరత్వ మన్నది ఎంత భ్రమయో, ఈ జీవితంలో స్థిరత్వం కూడా అంత భ్రమే. అది పోవా లంటే ఈ వస్త్రం ఉపమానం చాలా చక్కగా చెప్పాడు.

అయితే జీవిత పరమార్థం తెలుసుకున్న వారు, గొప్పగొప్ప యోగులు శరీరాన్ని కలకాలం భూమీమ్మద ఉంచగలరు. ఇప్పటికీ హిమాలయాల్లో ఉన్నారు. కొన్ని వేల సంవత్సరాల వయసు ఉన్న కొందరు యోగులు. వారిని చూసిన వారున్నారు. ఇంకా మీకు వివరాలు కావాలంటే పరమ హంస రామానంద, మాస్టరు రామ మొదలగు వారు వ్రాసిన యోగశాస్త్రగ్రంధాలు మీరు పరిశీలించవచ్చు. ఇప్పటికీ మహావతార బాబాజీలాంటి కొన్ని వేల యేళ్ళ చరిత్రలున్నవారు కొందరున్నారు. వాళ్ళు పంపించిన యోగులందరూ శరీరం ఇక్కడ విడిచి పెట్టి వెళ్ళిపోయారు. ఆయన మాత్రం ఇప్ప టికీ ఉన్నాడు. కనిపిస్తారుట ఎవరికైనా. అంటే ఇప్పటికీ శరీరాన్ని శాశ్వతంగా ఉంచగ లిగిన వాళ్ళు కొందరున్నారు. కాని వాళ్ళు శరీరంతో తాదాత్మ్యం చెందలేదు. మనం చొక్కా వేసుకున్నా చొక్కా నేనూ అని ఎలా అనుకోమో, వాళ్ళు అలాగే శరీరం నేనూ అనుకోరు. అలాంటి చక్కని చొక్కా వేసుకున్నారు వాళ్ళు అది మాయనిది. అలాంటి శరీరం ధరించినప్పటికీ, యోగశక్తితో అలాంటిది గ్రహించినప్పటికీ కొందరు ఉం

టారు మహాతత్త్వాన్ని వాళ్ళ తపస్సు ద్వారా లోకానికి అందజేయటానికి. తమ శరీరాన్ని తపస్సు చేత, యోగం చేతా దివ్యం చేసుకుని కూడా ఆ శరీరం తాము కామన్న స్పృహతో ఎందరో ఉన్నారు. ఎవరో ఏదో జబ్బు వచ్చి చలితో ఒణికి పోతున్నాడను కోండి. మనకు జబ్బులేదు, మనం చలిని తట్టుకోగలం అనుకున్నప్పుడు, ఈ చొక్కా యిప్పి వాడికిస్తాము. అవునా, కాదా ? ఈ చొక్కా విప్పి ఎందుకిచ్చాము ? ఈ చొక్కా విప్పి ఇచ్చినా నేను ఉంటాను అనే ఎఱుక ఉండటం వల్ల. ఈ ఎఱుక ఎలా ఉన్నదో, అలా వారు దివ్యమైన దేహాన్ని ధరించికూడా, తమ ఆత్మ స్వరూపము అన్న స్పృహలో ఉన్నవారు, మనం చొక్కావిప్పి ఇచ్చినట్లుగా వారు దేహాన్ని ఇవ్వగలరు.

అలాంటి వారు ఎవరైనా ఉన్నారా ?

దదీచి మహర్షి ఉన్నారు. ఆయన వద్దకు అందరూ వెళ్ళి వజ్రాయుధం ఇమ్మ న్నారు. నా దగ్గర ఏ ఆయుధం లేదే అంటే మీ ఎముకలిస్తే ఆయుధం చేసుకుం టామన్నారు. నిజంగా ఇదే మాట మనదగ్గరికి వచ్చి ఎవరైనా అంటే తట్టుకోగలమా మనం ? ముందు వాడి ఎముకలు పొడిఅయ్యేలా కొడతాము, లేదా కొట్టిస్తాము. మరి ధదీచి ఏం చేస్తాడు ? అబ్బా, దేవతలకి నా ఎముకలు ఉపయోగపడతాయి అంటే ఎంత గొప్ప అనుకున్నాడు. మామూలుగా దేహాన్ని విడిచిపెడితే, ఎముకలే మిగిలితే ఎంత కంపు కొడతాయి? కుక్కతిని బాగుపడుతుందేమో అది వేరే విషయం కాని, అవి మిగల్చకుండా తగలబెడతాం. అందరి ఎముకలూ దేనికీ పనికి రాకుండా నుసి అయిపోతే, నా ఎముక లోక రక్షణకి పనికి వస్తుందా, అయితే తీసుకోండి అని విడిచి పెట్టేసాడు శరీరాన్ని. అంటే అతను చనిపోయాడా ? ధదీచికి తనెవరో తెలుసు. తను అవినాశి అయిన ఆత్మ అని. ఇందులో ఉన్న బంధితుడు కాదు. అదీ కృష్ణ పర మాత్మ చెప్పదల్చుకున్నాడు. నేను ఆత్మని అని జ్ఞానం తెలుసుకోవటానికి ఈ శరీరం

పొనక్కరలేదు. శరీరం పోయినా ఉండేవాడొకడు లోపలున్నాడు వాడే నువ్వని తెలుసుకుంటే శరీరం లో ఉన్నప్పుడు కూడా ఆనందంగా ఉంటావు. మోక్షం అంటే ఇంతే.

ఇహైవ, ఇహైవ, ఇహైవ ఇక్కడే, ఇక్కడే, ఇక్కడే. ఈ ఎఱుకే మోక్షం. బంధనంలో ఉంటే ఇదే నేనుకోవటం. మోక్షం కల్పితం కాదు. మోక్షం సహజం.

తెలిసితే మోక్షము

తెలియకుంటే బంధము

కలవంటిదీ బ్రతుకు

అన్నాడు అన్నమాచార్య. వాసాంసి జీర్ణాని.. అర్థం చేసుకోవాలంటే ధదీచి కథ ఒక్కటి చాలు. జీర్ణించనక్కరలేదు. దేహంతో ఉంటూనే దేహంలో ఎంత డిటాచ్డ్‌గా ఉన్నాడో చూడండి. అంత డిటాచ్‌మెంట్ ఎలా వచ్చిందతనికి ? దేహాన్ని డిటాచ్ చేసే సాడా ? డిటాచబుల్ అటాచ్‌మెంట్ అంటారు దీన్ని నిస్సంగుడై ఉండటం అంటారు దాన్ని. దేహాన్ని అంత మలచుకుని, అంత దివ్యంగా చేసుకుని కూడా, దానితో తదాత్మ్యం చెందకుండా, సర్వవ్యాపకమైన పరమాత్మకి తాదాత్మ్యం చెందాడు కనుకనే, అంత ధైర్యంగా ఉండగలిగాడు.

అటువంటి  ఆత్మ లక్షణం ఎలాంటిది ?

నైనం ఛిందంతి శస్త్రాణి నైనం దహతి పావకః

న చైనం క్లేదయంత్యాపో నశోషయతి మారుతః 2-23

అచ్ఛేద్యోయమ దాహ్యోయమ్ అక్లేద్యో శోష్యఏవ చ

నిత్యః సర్వగతః స్థాణుః అచలోయం సనాతనః 2-24

అవ్యక్తో యమ చింత్యోయమ్ అవికార్యోయముచ్యతే

తస్మాదేవం విదిత్వైనం నాను శోచితుమర్హసి 2-25

ఈ మూడు శ్లోకాలు కలిసి ఒక గుత్తిగా చూడండి. ఇందులో వచ్చే విశేషాలు అచ్ఛేద్యః, అదాహ్యః, అక్లేద్యః, అశోష్యః, నిత్యః, సర్వగతః, స్థాణుః అచలః, సనాతన, అవ్యక్తః, అచింత్యః, అవికార్యః ఇన్ని విశేషణాలు చెప్తున్నాడు. మనం అలాంటి వాళ్ళంట. ఇంతగా ఉపనిషత్తులు, భగవద్గీత ఘోషిస్తున్నా ఒప్పుకోలేము మనం! నువ్వు గొప్పవాడివి, నువ్వు తగలబడవు, నువ్వు నిత్యుడివి, నువ్వు శాశ్వతుడివి. నువ్వు అచలుడివి. నువ్వు స్థాణుడువి అని ఎంత చక్కగా చెప్తున్నాడు కృష్ణపరమాత్మ. అది తెలియగలిగితే ఎంత ధైర్యంగా ఉండగలము దానికి ఉదాహరణలు ధదీచి, యోగులు అని చెప్పుకున్నాం. వాళ్ళు ఎప్పటికప్పుడు ఈ దేశంలో ఉంటారు. అలాంటి వారికి ఎప్పుడూ కొరత ఉండదు ఈ పవిత్ర భారతదేశంలో ! అదీ విశేషం.

ఒకప్పుడు అలెక్జాండర్‌కి ఈ దేశానికి దండయాత్రకొచ్చినప్పుడు, సింధూనదీ తీరంలో కళ్యాణదాస్ అనే ఒక మహాయోగి రాయిమీద కూర్చుని కనిపించాడుట. భారతదేశంలో మహాయోగులు ఉంటారని తెలుసు కనుక అతనికి నమస్కరించాడు. కాని ఆయన స్పృహ లేకుండా, వస్త్ర రహితంగానే కూర్చున్నాడుట. 'నేను నీకు చేసే ఉపకారం ఏమిటి ?' అన్నాడు అలెక్జాండర్ ఆయనతో. 'నువ్వు కాస్త పక్కకి వెళ్ళు. అదే చాలు. నేను ఆ సూర్యుడి ఎండ చూస్తున్నాను. నువ్వు అడ్డు ఉన్నావు. అడ్డులేస్తే అదే నువ్వు నాకు చేసే మహోపకారం' అన్నాడుట. 'నేను ప్రపంచాన్ని జయిస్తున్న చక్ర వర్తిని నన్ను నువ్వంత తృణీకార భావంతో చూస్తావా' అంటే 'నిస్పృహచ్య తృణం జగత్' నీ అవసరం నాకు లేనప్పుడు, నువ్వు గడ్డి పరకవే పో ! అన్నాడు. నా అవసరం నీకు లేకపోవచ్చుకాని నన్ను కాదంటే ఏమవుతావో నీకు తెలీదు అని చెప్పి కత్తి తీసాట్ట. కత్తి తీయగానే ఎవర్ని చంపుతావు. నేనెవర్నో తెలుసా ? అంటూ ఈ శ్లోకాలు చదివాట్ట.

నైనం ఛిందంతి శస్త్రాని నువ్వు నన్ను కత్తితో నరకలేవు అగ్నిలో  కాల్చలేవు. నీటిలో ముంచలేవు. గాలితో ఆర్పలేవు నన్ను ! అంటే అర్ధమేమిటి ? నువ్వు కత్తితో దేన్నైతే కొడుతున్నావో, అదికాదు నేను. ఇదీ విషయం ఇది అర్థం చేసుకోవటానికి ఇంతకు ముందు చెప్పుకున్నదే అయినా, ఇక్కడ మరొక మారు గుర్తుతెచ్చుకోండి. భాగవతం తెలుస్తేచాలు అది కూడా భాగవతం ముందు మాట. వెనుక మాట. ఎక్కువ అక్కరలేదు.

ఏమిటది ?

భాగవతం ఎవరు చెప్పారు ? శుక మహర్షి ఎవరికి చెప్పారు ? పరీక్షిత్ మహారాజుకి. చెప్పేటప్పుడు పరీక్షిత్ మహారాజు నన్ను తక్షకుడు కాటు వేయబోతున్నాడు, నా గతి ఏమిటి ? అన్నాడు. చివర్లో ఏమన్నాడు శుకమహర్షి ? నిన్ను తక్షకుడు కాటు వేయడు అన్నాడు. నీదేహం తగలబడటం నువ్వే చూస్తావన్నాడు ఇదేమిటి చిత్రం? ఆయన కాటువేయడంటావు. ఆయన విషంతో నా దేహం తగలబడటం నేనే చూస్తానంటావ్. పరస్పర విరుద్ధంగా  లేదా? అంటే ఈ మాటలో ఉన్న సారస్యం చూడండి? వెంటనే పరీక్షిత్ మహరాజు కూడా 'తక్షకుడు కాటువేయడండి !' అన్నాడు. ఈ విషయం ఎప్పుడర్ధమయింది. 12 స్కందములు, 18000 శ్లోకాలూ విన్నాక అర్ధమయింది గురువుగారికి. కృష్ణతత్త్వం అంతా అర్ధమయ్యాక, 'మీరన్నది నిజమే ! నన్ను తక్షకుడు కాటే వేయడు' అన్నాడు.

అంటే భాగవతానికి ఫలశృతి ఏమిటంటే పాములు కూడా కాటువేయవు అనా అర్థం. అంటే భాగవతం వినకముందు నేను అనే భావాన్ని తక్షకుడు దేనిని కాటు వేస్తాడో, దానితో తాదాత్మ్యం చెందించేసాను. అప్పుడు నువ్వు దాన్ని అలాగే ఉంచి, ఏది అమృత తత్త్వమో ఆ కృష్ణుడిని నాకు చూపించావు. నేనీ దేహాన్ని విస్మరించి,

సర్వగతుడు, నిత్యుడు, శాశ్వతుడు, అమృత స్వరూపుడు, అచలుడు, స్థాణుః, సనాత నుడు అయిన కృష్ణ తత్త్వంతో, అమృత తత్త్వంతో తాదాత్మ్యం చెందిపోయాను నేను. ఆ తాదాత్మ్యం చెందిన అమృత తత్త్వాని తక్షకుడు కాటు వేయలేడు కదా! అంతకు ముందు, ఏమృత లక్షణంతో నేను తాదాత్మ్యం చెందానో దాన్ని కాటువేసినా నాకేం! నేను ఎంత డిటాచ్ అయ్యానంటే నాదేహం తగలబడుతుంటే, నేనే చూసుకోగలిగే స్థితికి వెళ్ళాను అన్నాడు. ఎంత చక్కటి విషయమో చూడండి ! అదీ భాగవతానికి ఫలశృతి ! అదీ భగవద్గీతకి ఫలశృతి.

నీ లక్షణం ఏమిటి ?

నేను నిత్యుడిని ! నేను సర్వగతుడ్ని. నేను స్థాణువుని, నేను అచలుడ్ని. ఈ లక్షణాలు దేహానికి లేదు, లేదు, లేదు! దానికి కల్పించాలని మన బుద్ధినంతటిని ప్రయోగశాలలో వెచ్చించినా దాని ప్రయోజనం లేదు, అని ఏనాడో హిరణ్యకశిపుడు నిరూపించాడు. రావణాసురుడు నిరూపించాడు. అవునా, లేదా ? వీళ్ళిప్పుడు ప్రయో గశాలలో చేస్తే వాళ్ళు తపస్సుద్వారా చేసారు. ఎవరు చేసినా దేనికైతే జర, మరణ లక్షణాలుంటాయో, దాన్ని అజరంగా, అమరంగా ఉంచాలని ప్రయత్నిస్తే అది ప్రకృతి విరుద్ధమే తప్ప, సహజంకాదు. అది చేయాలని ప్రయత్నిస్తే వాడు ఆత్మనే కోల్పో తాడు. అదే జరిగింది కదా హిరణ్యకశిపుడి విషయంలో. నేను శాశ్వతుడిని అని విర్ర వీగాడు. ఏమైందా శాశ్వతత్త్వం? మన కన్నా కొంత కాలం ఉన్నాడంతే! అంతేగదా! చీమలకన్నా మనం ఎక్కువ కాలం బ్రతికితే మనకన్నా ఎక్కువకాలం బ్రతికే వాడు మరొకడు ఉండవచ్చు. ఎవరైనా మరికొంత కాలమే తప్ప, ఎల్లకాలమూ ఉండడు కదా. ఆ ఎఱుక కలిగి, ఈ దేహాన్ని ఒక వాహికగా భావించి, ఎవడు తన ధర్మాన్నీ,

తత్త్వాన్నీ గ్రహిస్తాడో వాడు మాత్రమే శాశ్వతమైన స్థితిని పొందగలడు. ఆశాశ్వతత్త్వాన్ని తెలుసుకో! 'సర్వగతః' అంతటా ఉన్నదది.

'ఆకాశైవ ఆత్మస్వరూపం' అని శంకరులు చెప్పారు. ఆత్మ స్వరూపం ఏమిటి అంటే ఆకాశం వంటిది అన్నారు. ఆకాశమే ఆత్మకాదు, ఆకాశం వంటిది ఆత్మ. ఇది కొంచెం అర్థం చేసుకుందాం. మనకి బోధించటానికి ఉదాహరణలే తప్ప, ఉదా హరణలే పూర్తి సత్యం కాదు. విష్ణువు ఎలా ఉంటాడు అంటే మేఘంలా, నీలంగా ఉంటాడు అంటే మనకి తెలిసిన నీలం మేఘమే కనుక మేఘంతో పోల్చాడు. కాని, విష్ణువు యొక్క కాంతి మేఘాన్ని మించిపోయి ఉంటుంది. మనకది తేలీదే ! అందు కని మేఘము వలె అంటున్నారు! అందుకే ఆత్మని అర్థం చేసుకోవటానికి ఆకాశం వలె అన్నారు కాని ఆకాశము కాదు ఇక్కడ.

ఆకాశంతో ఎందుకు పోల్చారు ?

ఆకాశం ఎలా సర్వ వ్యాపకమయి ఉంటూ, దానిలోనే అనేకములున్నా, ఏ వికారములూ అంటకుండా, దానిలో ఉన్న వాటన్నిటికీ ఆసరమై ఎలా ఉందో, అలాగే ఈ ఆత్మ అనేక శరీరములందు ఉన్నా, శరీరపు వికారములు లేవీ దానికి అంటకుండా సర్వ వ్యాపకములై ఉంటుంది. నిజానికి ఆత్మ ఆకాశం కంటే సూక్ష్మం. మనకు తెలిసినంత మేరకు అత్యంత సూక్ష్మం ఆకాశం. ఎంత సూక్ష్మం అయితే అంత వ్యాపిస్తుంది. అదీ విశేషం. ఎంత స్థూలమైతే అంత వ్యాపకలక్షణం దాని కుండదు. ఆత్మ అత్యంత సూక్ష్మం గనుక సర్వత్రా వ్యాపించింది. ఎంత సూక్ష్మం అంటే ఆకాశం కంటే సూక్ష్మం. నీకు చెపితే అర్థమయ్యే సూక్ష్మ వస్తువు ఆకాశం కనక ఆకాశంతో పోల్చారు 'ఆకాశం వత్' అని చెప్తున్నారు.

అది ఎలా ఉంటుంది ? అంటే దేనితో చెప్తావ్ ? నోటితో ! ఈ నోరెక్కడిది ? ఈ దేహం లోదే ! చైతన్యమనేది ఉండటం వల్లే పని చేస్తోంది ఈ దేహం. కాని ఆ చైతన్యాన్ని ఈ నోరు చెప్పలేదు. ఎలాగు ? కంటితో నువ్వు చూస్తున్నావు కాని కన్నుని చూడలేనట్లుగా అదే విధంగా ఏ చైతన్యంతో ఇంద్రియాలు పనిచేస్తున్నాయో, ఆ చైత న్యాన్ని ఇంద్రియాలు తెలుసుకోలేక పోతున్నాయి కనుక. నువ్వు వ్యక్తం చేస్తే ఇంద్రి యాలతోనే చేస్తావు. ఇంద్రియాలతో చేస్తే అది ఆత్మవిషయం కాదే ! అవ్యక్తః అహం.

ఇలా ఒకొక్కటి వివరంగా ఆత్మ లక్షణం గురించి చెప్తూ, ఇంకో వైపు నుంచి ఆలోచిద్దాం అన్నాడు. ముందే మూడు విభాగాలు చేసి కృష్ణ పరమాత్మ చెప్పిన విష యాలు గుర్తుండే ఉంటుంది.

అనార్యజుష్టమ్, అస్వర్గమ్, అకీర్తికరం అన్నాడు.

ఇంతవరకూ చెప్పిందంతా అనార్యజుష్టమ్, ఆర్యులైనవారు ఒప్పుకోరు. ఎందుకు? ఆర్యులు ఆత్మానాత్మ వివేకం కలిగినవారు. అల్టిమేట్ రియాల్టీ ఎవరికి తెలుసో, వాళ్ళ కోణం లోంచి చెప్పాలి. అందుకు ముందు అల్టిమేట్ రియాల్టీ చెప్తు న్నాడు. ఆర్యులు ఎలా ఆలోచిస్తారో చెప్తున్నారు. ఆ బుద్దేలేని భౌతిక వాదుల ప్రకా రంగా చూసినా కూడా నువ్వు యుద్ధం చెయ్యాలి.

అదెలాగు ?

అథ చైనం నిత్య జాతం నిత్యం నామన్యసే మృతమ్

తథాపి త్వం మహాబాహో నైవం శోచితుమర్హసి. 2-26

దేహాత్మల తారతమ్యాలు తెలుసుకోలేకపోతే ప్రత్యక్షప్రమాణాలే తప్ప ఇతర ప్రమాణాలు అంగీకరించని చారువాకులవలె అనుకుంటే, అప్పుడు కూడా నువ్వు దుఃఖింపవలసిన అవసరం లేదు.

ఎందుకు ? నీకు నాకు తెలిసిన ప్రత్యక్ష పురాణం ఏమిటి ?

జాతస్యహి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మమృతస్యచ

తస్మాదపరిహార్యేర్థేన త్వం శోచితు మర్హసి. 2-27

పుట్టిన వానికి మరణం తప్పదు. మరణించిన వానికి పుట్టుక తప్పదు. ఇది ప్రత్యక్ష ప్రమాణం. దీనికి ఒక శాశ్వత వస్తువు ఉన్నది అని చెప్పివప్పించవలసిన పని లేదు కదా! ఈ దేహం పుడుతుంది, పోతుంది అన్నది ప్రత్యక్ష ప్రమాణం. పుట్టి పోయే లక్షణం ఉన్న దేహం కోసం ఏడవటమెందుకు ? ఆకారణంగా నువ్వు ఆలోచించినప్పటికీ కూడా ఇది నాశనమే అని చెప్తున్నాడు.

ఇక్కడ రెండు దోషాలు ఉంటాయి ఏమిటీ అసంభావన, విపరీత భావన. ఉన్నదాన్ని ఉన్నట్టుగా తెలుసుకోలేక పోవటం ఒక దోషమయితే, దాన్ని మరోలా అనుకోవటం ఇంకొక దోషంట. ఆ రెండు దోషాలూ పోగొట్టటానికై ఆత్మ యొక్క అసలు స్వరూపాన్ని చెపుతున్నాడు ఇందులో కూడా 'జాత స్యహి ధృవో మృత్యుః' అందరూ ఒప్పుకుంటారు. కాని 'ధ్రువం జన్మ మృతస్యచ' అన్నప్పుడే వచ్చింది గొడవ. అప్పుడు చారు వాకులు ఒప్పుకున్నారేమో, ఇప్పటి చారువాకులు అసలొప్పుకోరు దీనిని. ఎందుకంటే ప్రపంచం మొత్తం మీద పునర్జన్మమీద విశ్వాసం గల మతాల్లో మనది ప్రధానంగా కనిపిస్తుంది. ఇతరులకి నరకము, స్వర్గము, పరలోకము అంతే కాని ఈ జన్మ పరంపరల అనుభవాలు లేవు. అంటే సరియైన జ్ఞానం లేదు అని అర్థం అంతే! వాళ్ళు లేదన్నంత మాత్రాన లేకుండా పోదు. అందరికీ ఉండేవే ! సూర్యుడు లేడు అన్నంత మాత్రాన సూర్యుడు లేకుండా పోడు. వాడు చూడలేకపోయాడు అని అర్థం. అలాగే జన్మపరం పరలు లేవు వాళ్ళ మతంలో. ఇదేదో బాగుంది, కాబట్టి అక్కడికి మారిపోతాను అనుకోకూడదు. ఇక్కడ వాడికి తెలియదని అర్థం కాని ఇది

లేదని కాదు. వాడిక్కూడా తప్పదు మళ్ళీ పుట్టటం మళ్ళీ చావటం. ఈ దేశంలో తెలుసుకున్నారు. చక్కగా తెలుసుకున్న జ్ఞానులున్నా ఈ దేశంలో పుట్టి, ఇంత వివేకం గల ఈ మతం నుంచి వెళ్ళవలసిన అవసరం లేదు కదా మనకి.

జనన మరణ వ్యవస్థల గురించి ఇంతకు ముందే చెప్పుకున్నాం గర్భ గోళం యొక్క అవస్థతో పోల్చి. ఇంకా ఎన్నో ఆలోచిస్తే మనకే తెలుస్తాయి. ఒక జీవికి జీవిత కాలం చెయ్యటంతోనే సరిపోతోంది అనుభవించటానికి టైమెక్కడ ? అవునా! కాదా ?

కర్మసిద్ధాంతం అంటే ఏమిటి ?

చేసిన దానికి అనుభవించి తీరతావు. ఎంత గొప్ప మాట ఇందులో కొంత మంది అర్థం చేసుకోలేక అనేక రకాలుగా మాట్లాడుతారు. చేసిందానికి అనుభవించక తప్పదు కనుక అంటే, ఎప్పుడో గత జన్మలో చేసింది ఇప్పుడు ఈ జన్మలో అనుభవిస్తున్నావు అంటే నువ్వు చేసిందానికి ఎప్పటికైనా అనుభవిస్తావు అని కదా అర్థం. అటువంటప్పుడు అది కర్మని ప్రేరేపిస్తుందా, కర్మనుంచి దూరం చేస్తుందా ? అది అకర్మనీతి ఎలా అవుతుంది ? దీన్ని అర్థం చేసుకోలేక మన అపూర్వ తత్త్వాన్ని , మత మనుకుని. దీన్ని దెబ్బతీయాలని కొందరు ప్రయత్నించి మాట్లాడుతూ ఉంటారు.

ఒకసారి హైందవమతం మీద అభిమానం ఉన్న ఒక ఆయన నా దగ్గరికి వచ్చి, గీతని విమర్శిస్తూంటే నాకు చాలా కోపం వచ్చిందండీ అన్నాడు 'ఏమిటి విమర్శించాడు, మీకిందుకు కోపం వచ్చింది ?' అని ప్రశ్నిస్తే 'హైందవులు కర్మ సిద్ధాంతాన్ని నమ్ముతారు భగవద్గీత అందుకే వచ్చింది. ఏదొచ్చినా కర్మ, కర్మ, కర్మ అంటారు. అందుకు కర్మవైపు సుముఖులని చేయకుండా మనుష్యులని సోమరులని చేసేస్తుంది అన్నారు. నేను అప్పుడు నేను ఫలాని శ్లోకంలో ఇలా అన్నాడు. ఫలాని శ్లోకంలో అలా అన్నాడు అని బోధించి వచ్చా'నన్నారు.

'అదంతా అనవసరంత' అన్నాను . 'ఎందుకు ? భగవద్గీత చెప్పింది కృష్ణుడు ఎవరికి చెప్పాడు? కర్మ చేయను అని ఎవడైతే ఆయుధం వదిలాడో వాడికి చెప్పాడు. భగవద్గీతంతా విన్నాక కర్మ చేస్తాను బాబూ అన్నాడు అతను. అందుకని భగవద్గీత పుట్టిందే కర్మ చేయమని ప్రేరేపించటానికి. స్పష్టంగా కనిపిస్తోంది అక్కడ. కర్మ నుంచి విముఖుడిని ఎలా చేస్తోంది ? అందుకని పెద్దగా వాదించనక్కరలేదు. భగవద్గీత విన్నాక అర్జునుడు ఏం చేసాడో చూస్తే స్పష్టంగా తెలుస్తోంది'. మనమతం పేరిట చేసే విమర్శలన్నీ కూడా కేవలం అజ్ఞాన జనితములే. కాస్త యింగిత జ్ఞానం ఉపయో గిస్తే అక్కడికక్కడే సమాధానం చెప్పవచ్చు. కాకపోతే ఎవరైనా ఏదైనా అనగానే ఉక్రోషం వచ్చి, బుద్ధి పనిచేయక మనని అన్నాడే అనుకుంటాం. ఇంత పరిపూర్ణమైన జ్ఞానం ఎక్కడా ఉండదు. అందుకు నిస్సందేహంగా, మనం పూర్ణ జ్ఞానమున్న మతం లో ఉన్నాం. అలాంటి వివేకవంతులైన ఆచార్యులున్న పరం పరలో ఉన్నాం. అందు లో సందేహం లేదు. అందుకే ఈ దేశంలో మట్టి పిసుక్కునే వాడిని కూడా దేవుడె క్కడా ఉన్నాడు ? అంటే పరలోకమునందు అనడు. అంతటా ఉన్నాడంటాడు ధైర్యం గా. అదీ ఈ దేశంలో నరనరాల్లో ప్రవహిస్తున్న బ్రహ్మజ్ఞానం.

ఇక్కడ చాలా తొందరగా వస్తుంది ముక్తి, ఎందుకు ?

ఎండిన కట్టెకి అగ్ని తగిలిస్తే తొందరగా వెలుగుతుంది. భారతదేశంలో పుట్టిన వాడు కాస్త సాధన చేస్తే తొందరగా ముక్తిని పొందగలడు. దానికి కారణం ఆచా ర్యులు వేసిన పునాది. భగవద్గీత చెప్తున్నాను కనుక భగవద్గీత ఒక్కటే చెప్తున్నా ననుకో వద్దు. ఏ ఉపన్యాసం చెప్పుకున్నా భగవద్గీతే ! అందులో సందేహం లేదు. రామాయ ణం గాని, భాగవతం గాని, శివతత్త్వంగాని గణపతి తత్త్వం గాని, కృష్ణ తత్త్వం గాని,

రామ తత్త్వం గాని, విష్ణుతత్త్వం గాని, ఏదైనా ఈ దేశంలో భగవద్గీతే ! అక్కడొకటి ఇక్కడొకటి చెప్పడు భారతీయ ఋషి. ఎక్కడైనా ఒక్కటే చెప్తాడు.

అది ఏమిటి ?

సర్వ వ్యాపకమైన ఆత్మని తెలుసుకో ! అది తెలుసుకున్నాక నీకు శాంతి లభిస్తుంది అని. ఆత్మనాత్మవివేకం మొత్తం గ్రంధాలన్నీ చెప్తున్నాయి. ఆ జ్ఞానం గ్రహించటానికి ఇప్పుడు మనం భగవద్గీతని ఆధారం చేసుకున్నాం.

ఫక్తు భౌతిక వాదిగా కూడా మాట్లాడుతూ స్వధర్మంలో నిలవటానికి కృష్ణ పరమాత్మ మాట్లాడుతున్న విషయాలు చూడండి.

అవ్యక్తాదీని భూతాని వ్యక్తమధ్యాని భారత
అవ్యక్త నిధనాన్యేవ తత్ర కా పరిదేవనా 2-28

భూతాని అంటే భూతప్రేతాలని కాదు అర్థం. భూతాని అంటే ప్రాణులు. కలిగినవి అని అర్థం. ఇవి 'అవ్యక్త ఆదీని' ఆది అవ్యక్తము. ఇవి పుట్టేయని మనకి తెలుసు కాని ఎలా పుట్టాయన్న విషయం మనకి తెలియదు. మధ్య వ్యక్తం వ్యక్త మద్యాని భారత అవ్యక్త ఆదీని , వ్యక్త మధ్యాని దీని ఆది అవ్యక్తం, మధ్య వ్యక్తం పోనీ తర్వాత 'అవ్యక్త నిధానాని', ఇది పోయేది ఎక్కడికో అది అవ్యక్తం నువ్వు దేహం అనుకుంటే ,' తత్రకా పరిదేవనా ?' ఎక్కడ్నుంచి వచ్చావో తెలియదు, ఎక్కడికి పోతావో తెలీదు. పోతే ఏడవటమెందుకు ? అని ఎంత చక్కగా చెప్తున్నారు.

'తత్రకా పరిదేవనా అంటే ఏమిటి ?

ఈ మాట అరణ్యపర్వంలో మరొకచోట, శాంతి పర్వంలో కూడా చెప్పబడుతూ ఉంటుంది. అంటే భగవద్గీతలో మాటలు భారతం అంతా పరచుకున్నాయి అని అర్థమన్నమాట. ఎందుకంటే భారతమే కృష్ణస్య రూపం కనుక. కనపడని దాన్నుంచి

వచ్చింది, కనబడని దాని లోనికి పోతోంది. అటువంటిది నీది కాదు కదా, ఎందుకు దుఃఖం ? అది నీది కాదు, నువ్వు దాని వాడవు కావు అని స్పష్టంగా చెప్తున్నాడు. దేహంతో గతులమైనప్పుడే ఇది నేను అని ఆ జన్మలో అటాచ్‌మెంట్ పెట్టుకుని దుఃఖిస్తున్నాం కాని జన్మపరంపరల వెనక్కి వెళితే

ఎవ్వరెవరి వాడీ జీవుడు

ఎవ్వరికి ఏమౌనో ఈ జీవుడు

ఎందరికి కొడుకు కాదీ జీవుడు

వెనకందరికి తోబుట్టుడీజీవుడు

ఎందరిని భ్రమరింపడీ జీవుడు

దుఃఖమెందరికి కావింపడీ జీవుడు

ఎవడికెవడు? ఈ జన్మలో స్త్రీ, గత జన్మలో పురుషుడవ్వచ్చు, రానున్న జన్మలో పురుషుడవచ్చు అందుకే స్త్రీ జన్మకి ఓటు వేస్తామంటే ఈ జీవుడు తర్వాతజన్మకేమవుతాడో! అలాగే పురుష జన్మ గొప్పది అంటే వాడి తర్వాతి స్థితి ఏమిటి ? అందుకు ఇప్పటి ఈఅవస్థ అనుకోవాలి తప్ప ఇదే శాశ్వత అవస్థ అనుకోటానికి వీలు లేదని అంత స్పష్టంగా చెప్పినప్పుడు ఇప్పటి అవస్థని ఎంత జాగ్రత్తగా వినియోగం చేసుకోవాలో అర్థం చేసుకోవాలి !

కనుక వ్యక్తి  ఉపాధిలో ఎలా మెలగాలి?

ఉపాధికి సంబంధించిన ధర్మాన్ని ఆచరిస్తూనే, తన యొక్క అసలు స్థితిని మర్చిపోకుండా అశాశ్వత్వాని తెలుసుకోవాలి. ఆద్ అంతేచ యన్నాస్తి వర్తమానేతి తద్ధతా !

అన్నాడు. ఆది అంత్యములలో లేనిది మద్యములో ఉందనుకోవటం కేవలం ఒక భ్రమ. అది కూడా వచ్చిపోయేదే. ఇది తెలుసుకో ! ఆది, అంతములలో ఏదుందో దానికే శాశ్వతత్త్వము గాని, ఆది, అంత్యము తెలియని దానికి శాశ్వతత్త్వము లేదు సుమా! ఆద్యంతములు తెలియనది దేహము మాత్రమే కనుక దానికి శాశ్వతత్వము లేదు.

సర్వగతమై ఆత్మ ఎలా ఉంది ?

తిలతైలవత్ - తిలయందు తైలము వలె ! ఎంత బాగా చెప్పారు చూడండి. నువ్వుల్లో నూనెలాగా అంటాడు. నూనె కనిపించదని నువ్వులని అబద్ధమంటామా? అదే విధంగా ఆత్మ సర్వగతమై వ్యాపించి ఉంది. మరి దీని గురించి చెప్పుకున్నప్పుడు ఎంత ఆశ్చర్యం కలుగుతుంది? అవునా? లేదా? నగ గురించిన జ్ఞానం తెలిసింద నుకోండి. దాన్నిండా బంగారమే అచలమై, స్థాణువై ఉందని!ఎంత ఆశ్చర్యం మనకి ? ఇంత ఆశ్చర్యకరమైన విషయం తెలుసుకుంటే ఇంకెంత ఆశ్చర్యం ? ఆ ఆశ్చర్యంలో ఉండి పోతేనే ఆనందం. ఆ ఆనందం పడటం చేతకాదు. కనుక ఆశ్చర్యంలో ఉండ లేకపోతున్నాము. పిల్లవాడికి అన్నీ ఆశ్చర్యమే! ఒక తూనీగ రెక్కలల్లాడిస్తూ వెళుతూ ఉంటే ఆశ్చర్యంగా చూస్తాడు. మనకది ఆశ్చర్యం కలిగించదు. తద్వారా మనం ఆనం దం నుంచి దూరమయిపోయాం. ఆశ్చర్యమే ఆనందాన్ని కలిగిస్తుంది. అందుకే సృష్టి లో అసలైన ఆశ్చర్యం ఏమిటో తెలుసుకుంటే ఆత్మ అనేది పెద్ద ఆశ్చర్యకరమైన విష యం. సర్వగతం, స్థాణువు అయినటువంటి ఆశ్చర్యకరమైన విషయాన్ని తెలుసుకుం టే అంతకు మించిన ఆనందం లేదు. అందుకే దానిగురించి చెప్పుకుంటున్నవాళ్ళు ఆశ్చర్యంగా చెప్పుకుంటారు.

ఆశ్చర్యవత్పశ్యతి కశ్చిదేనమ్

ఆశ్చర్యవద్వదతి తథైవ చాన్యః

ఆశ్చర్యవచ్చైన మన్యః శృణోతి

శ్రుత్వాప్యేనం వేదన చైవ కశ్చిత్ 2-29

నువ్వు సర్వగతుడికి, నువ్వు స్థాణుడివి అంటే ఎంత ఆశ్చర్యం ? యేనం అంటే వీడిని ! వీడిని అంటే ఆత్మను. వీడు అన్నాడు కనుక ఆత్మ మొగ వాడు అనుకోవద్దు దయ చేసి ఇక్కడ పోల్చటానికి వీడిని అని చెప్తున్నారు. చెప్పుకుంటున్న వాళ్ళలో ఒకడేమో ఆశ్చర్యంగా చూస్తాడుట. ఇంకొకడు ఆశ్చర్యంగా చెప్తాడుట.

ఆశ్చర్యంగా చెప్పటం అంటే అర్థమేమిటి ?

ఆత్మగురించి ఎప్పుడు చెప్పుకున్నా ఆశ్చర్యంగా చెప్పటమే ! ఆశ్చర్యము అంటే ఇంద్రియముల అనుభవమునకు అందనిదిగా అర్థం చేసుకోవాలి మనం. మన అను భవానికి అందినదాన్నే ఆశ్చర్యం , అద్భుతం అంటామా లేదా ? ఒకడు గాల్లోంచి వస్తువుని సృష్టించాడు. ఆశ్చర్యం అన్నాం. ఎందుకు ? అందుబాటులో లేనిదీ, మనం చెయ్యలేనిదీ గనుక. ఇంద్రియములకు అందని అద్వితీయం గనుక. ఆత్మ అనేదాన్ని గురించి ఎవరు మాట్లాడినా ఆశ్చర్యం గానే మాట్లాడతాడు, ఆశ్చర్యంగానే వింటాడు, ఆశ్చర్యంగానే చర్చిస్తాడు. కాని ఎవరూ దాన్ని పూర్ణంగా తెలుసుకోలేరు.

తెలుసుకోలేరు అంటే అర్థం తెలుసుకొనేది, అది విడిగా లేవు గనుక ! అంటే, ఇంద్రియాలతో గ్రహించలేనిది అని దీని ఆంతర్యం.

దీనికి సరిగ్గా మంత్రం మనకి ఉపనిషత్తుల్లో కనిపిస్తుంది. 'శ్రవానాయాపి బహువిద్యోనలభ్యః' విన్నా చాలా మందికి తెలియదు అన్నారు. వింటే తెలిసి పోయేదా ఈ తత్త్వం ?

వేదము చాలదు

వేరే శాస్త్రములు ఏదియు చాలదు

ఇది నీమాయ

అన్నాడు అన్నమాచార్య. ఎన్ని చదవలేదండి ? ఎన్ని చదివినా అసలుది తెలియదుట. చదువులలో మర్మమెల్ల చదివితి తండ్రి అనే చదువు లేనంత వరకూ లాభం లేదు.

ఉపనిషత్తులో ఏం చెప్తున్నాడు ?

బాగా విన్నప్పటికీ అనేక మంది చేత ఏది దొరకదో అది ఆత్మ అన్నాడు. బహువిః అనేక మంది చేత! అంతేకాని ఎవరికీ దొరకదు అనలేదు. అలాగే విన్నప్పటికీ అందరికీ ఏది తెలియదో, ఆశ్చర్యంగానే లభించుచున్నదది అని. ఉపనిషత్ వచనం అదే పద్ధతిలో ఇక్కడ గీతలో ఈ శ్లోకం. గీతకి ఉపనిషత్తుకి ఆ అవినావభావ సంబంధం లేక ఏక సత్యం తెలుస్తుంది. ఆత్మ విషయం ఎప్పుడూ ఆశ్చర్యమే! మనం చెప్పుకునేది ఆశ్చర్యంగా చెప్పుకోవటమే తప్ప, దాన్ని తెలుసుకోలేము అని చివరికి చెప్తున్నాడు. శ్రుత్వాప్యేనం వేద నచైవ కశ్చిత్ ఇలాగ ఆశ్చర్యంగా చెప్పుకునేవాడుగాని, ఆశ్యర్యంగా వినేవాడుగాని, ఆశ్చర్యంగా అనుకునేవాడు గాని దాన్ని తెలుసుకున్న వాడు కాడు అన్నాడు. చెప్పటం, వినటం, అనటం అనేవి ఇంద్రియముల పనులు. కనుక వీటితో తిరుగుతున్నంత కాలం అది తెలిసేది కాదని ఒక అర్థం.

ఇంకో అర్థం శంకర భగవత్పాదుల వారు దీన్ని వ్యాఖ్యానిస్తూ చెప్తున్నారు. ఏమని ? ఆత్మజ్ఞుడు అనేటటువంటివాడు ఆశ్చర్యమైన వాడు అన్నారు. అదీ విశేషం. యేనం అంటే వీడు అని చెప్పామే ! వీడు అంటే ఆత్మజ్ఞుడు అన్నారు. ఆ ఆత్మజ్ఞుడు గురించి మనం  ఆశ్చర్యంగా చెప్పుకుంటాం, ఆశ్చర్యంగా వింటాం, ఆశ్చర్యంగా అంటాం కాని తెలుసుకోలేం! మనం అందరం భోజనం చేస్తాం ఇది ఆశ్చర్యం కాదు. ఎందుకూ ? అందరికీ కనిపించిపోయింది కనుక ! అందరికీ అలవాటే కనుక. కానీ ఒకడు మూడు సంవత్సరాలై భోజనం చేయలేదు, రికార్డులో కెక్కాడని పుస్తకం వస్తుంది. అంటే అర్థమేమిటి ? మన మెవరం చేయలేదు. వాడొక్కడే చేసాడు గనుక వాడ్ని ఆశ్చర్యం అన్నారు. అందుకు ఇక్కడ ఆశ్చర్యం అంటే ఆత్మజ్ఞాని బహు అరుదు అని చెప్పటం ఇక్కడ ఉద్దేశం. ఆత్మజ్ఞాని అంత తేలిగ్గా దొరకడు. సృష్టిలో కబుర్లు చెప్పేవాళ్ళు చాలా మంది దొరుకుతారు, ముచ్చట్లాడే వాళ్ళు చాలా మంది దొరుకు తారు, ఆత్మ గురించి ప్రవచనాలు ఇచ్చేవాళ్ళు చాలా మంది దొరుకుతారు, ఆత్మ గురించి వినేవాళ్ళు దొరుకుతారు గాని ఆత్మజ్ఞుడు అంత తేలిగ్గా దొరకడు ఈ మాట

బహూనాం జన్మనామంతే జ్ఞానవాన్ మాం ప్రపద్యతే
వాసుదేవః సర్వమితి  స మహాత్మా సుదుర్లభః    7-19.

అని మరొక చోట చెప్పాడాయన. సర్వత్రా వాసుదేవుడు అనేటటువంటి మహా త్ముడు సుదుర్లభుడు. అంత తేలిగ్గా దొరకడు అని చెప్పాడే అదే ఇక్కడ అంటే ఆత్మ జ్ఞానం అంత తేలిగ్గా దొరికే వస్తువు కాదు. అలాంటి జ్ఞాని కూడా అంత తేలిగ్గా దొరక డు. కనుక ఆత్మజ్ఞాని అరుదైన వాడు అనేక వేలల్లో ఒకడుంటాడు అన్నాడు కృష్ణపర మాత్మే!

మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యాతతి సిద్ధయే

యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్వతః 7-3

అందుకే గీతలో ఒకటంటూ ఉంటే మరొకటి వెళ్తుంది. మీరు సాంఖ్య యోగం చెప్తున్నారా, అప్పుడెప్పుడో మరొక యోగం వస్తుంది అది చెప్తున్నారా ? మేము ఇప్పుడు కొంత యోగం చెప్పమన్నాం, అప్పుడు ఆ యోగం చెప్పమన్నాం. ఆ యోగా ఇందులో తెస్తే కష్టం కదండీ అంటారేమో!

గీతలో ఏ యోగంలోనన్నా ఒకటే మాట చెప్తున్నాడు. దాన్ని మనం అర్థం చేసు కోవటానికి వివిధ విధాలుగా చూపిస్తున్నాడు. అందుకని ఇదే విషయం మరో ఉప న్యాసంలో చెపితే అప్పుడు చెప్పారు గదండీ అనద్దు. లేదా అప్పుడు చెప్పండి ఇప్పుడు చెప్పారు అని కూడా అనుకోవద్దు. కృష్ణపరమాత్మ ఎప్పుడు చెప్పినా ఒక్కటే మాట. ఎందుకంటే సత్యం ఒక్కటే మాట! అందుకే ఎంత స్పష్టంగా చెప్తున్నాడు ? ఆత్మజ్ఞుడు అనేక వేలల్లో కూడా అరుదు అని చెప్తున్నాడు. 'వాసుదేవ సర్వమితి' వాసుదేవుడే సర్వము అనే మహాత్ముడు సుదుర్లభ! దుర్లభ అంటేనే దొరకడు. సుదుర్లభ అంటే దొరకటమే కష్టము అన్నాడు. అసలు లేడని కాడు. ఉంటాడు. ఆశ్చర్యవత్ వాటే వండర్ ? సృష్టిలో ఆశ్చర్యమంటే ఆత్మజ్ఞుడే పెద్ద వండర్. వండర్‌ని సాధించి రికార్డు కెక్కాలని చాలా మంది తపన పడతారే ! నిజంగా మనం ఆశ్చర్యం నెలకొల్పాలంటే ఆత్మజ్ఞానం సంపాదించుకోవాలి. అదే జీవితానికి పరమలక్ష్యం. ఎవరూ సాధించలేనిది సాధించాలనే కదా అందరి తాపత్రయం ? నిజంగా ఆ తాపత్రయమే, ఆ ఛాలెంజే కనుక మనకి ఉంటే ఆశ్చర్యంగా మనం మారదాం. ఆత్మజ్ఞులం అవుదాం ! ఆ లక్ష్యం పెట్టుకోండి. సుదుర్లభుడు అన్నాడు గనుక ఎందుకండీ ప్రయత్నం అనద్దు.

ఇక్కడ బోలెడు గేమ్స్ పెట్టాం, ఇందులో ఫలాని గేమ్‌లో ఫస్టు రావటం చాలా కష్టం అంటే నిజమైన చురుకైన కుర్రవాడు ఆగేమ్ ఆడిసాధిస్తానంటాడా లేదా ?

గెలిచే గేమేదైనా చెప్పండి అంటే వాడిలో శక్తి అంతే అని అర్థం. వాడికి ఎంత ఛాలెంజ్ ఉందో, ప్రతి జీవికి కూడా ఈ దేహం అనే ఉపాధి ఉంది. ఆశ్చర్యంగా మారటానికి ఛాలెంజ్ చేయాలి. అందుకు ఆత్మజ్ఞుడివి కమ్మన్నాడు. ఎలాగూ సుదుర్లభం కనుక ఆత్మ గురించి ఆలోచించకు,యుద్ధం చేసేయ్ అని చెప్పటం కాదు ఆయన ఉద్దేశం. యుద్ధం మానేయ్ అనికూడా కాదు. ఆశ్చర్యకరమైన జ్ఞానాన్ని అందుకో! ఆశ్చర్యవంతుడవవు. సర్వజనులూ ఆశ్చర్యంగా చెప్పుకునే వాడివి అవు.

ఎప్పుడైనా తల్లి బిడ్డని ఏమంటుంది ?

'సమానానాం ఉత్తమ శ్లోకోస్తు' అని వేదమే చెప్పింది. నీ సాటివారిలో నువ్వు నెంబర్ వన్ కావాలి అని. అవునా, కాదా ? ప్రతి వాడికీ నంబర్ వన్ కావాలి ! నంబర్ వన్ అంటే ఆశ్చర్యం! ప్రతివాడికీ ఆ రంగంలో నీలాటి వాడు లేడండి అనిపించుకోవాలనిపిస్తుంది. మీరు చాలా బాగా చెప్పారండీ, మీలాగా ఇంకో ఆయన చెప్పారండీ అంటే అప్పుడే వీడు నీరసపడి పోతాడు. ఎందుకు ? ఆశ్చర్యం అనిపించుకోవాలని. అన్నిటికన్నా గొప్ప అచీవ్‌మెంట్ ఏమిటంటే ఆత్మజ్ఞానమే ! దాన్ని సాధించు అని చెప్తున్నాడు కృష్ణపరమాత్మ. అదీ ఆశ్చర్యావత్.. అన్ని శ్లోకంలో ఉన్న అంతరార్థం. అది మనకు అనుగ్రహించమని, ఆశ్చర్యానికే ఆశ్చర్యమైనటువంటి ఆ పరమాత్మని ఆశ్రయిద్దాం.

ఇందునుండి మనం మూడు విషయాలు గ్రహించాలి. ఏమిటవి ?

ఆత్మ ఆశ్చర్యకరమైన వస్తువని మొదటిది. రెండోది ఆత్మజ్ఞుడు ఆశ్చర్యకరమైనవాడు, అరుదైన వాడు అని. మూడోది అటువంటి అరుదైన లక్షణం సాధించటమే మన జీవితానికి లక్ష్యంగా పెట్టుకుని ప్రయత్నించాలి.

సృష్టిలో ప్రతి వాడికి ఆ రంగంలో నీలాంటి వాడు లేడండీ అనిపించు కోవాల నిపిస్తుంది. సాహిత్యరంగంలో మీలాంటి వాడు లేడండీ అని కవిసామ్రాట్ బిరుదిస్తే ఆనందం. ఆ మధ్య ఒక గ్రంధావిష్కరణ సభకి వెళ్ళటం జరిగింది. పుస్తకం ఎవరు రాసారో తెలీదు. ఇటువంటి పుస్తకం మరొకటి కనిపించదు, నభూతో నభవిష్యతి అని చెప్తున్నాడొక వక్త. ఎవరండీ ఈయన అంటే ఆ పుస్తకం రాసినాయనే అని చెప్పారెవరో! ఇలాంటి తాపత్రయం ప్రతి వాడికీ ఉంటుంది. నాలాటి వాడు ఇంతకు ముందు లేడు, ఇక ముందు రాడు అని లేడన్న విషయం కొంచెమన్నా అంగీకరించవచ్చేమో గాని రాడు అని ఎలా చెప్పగలరు ? అంతకు ముందు కొందరు  కవిసామ్రాట్‌లు ఉన్నారు కదా మరి మీ సంగతి ఏమిటి అంటే నేను సర్వయుగ సామ్రాట్‌ని అన్నాడు.

అలాగ ఒక మహాత్ముడింటికి ఆయన భార్యస్నేహితురాలు వెళ్ళినప్పుడు ఇన్ని బిరుదులున్నాయి కదా ఎవరిచ్చారు?అని అడిగితే, ఒకరిస్తే మేము పుచ్చుకుంటామా, మేమే పెట్టుకున్నాం అంది. అలా ప్రతి వాడికీ కూడా వాడు అగ్రగామిగా ఉండాలని తాపత్రయం. కాని ఆశ్చర్యకరమైన వ్యక్తి ఎవరు అంటే ఆత్మజ్ఞాని నీకు నిజంగా ఆశ్చర్యకరంగా ఉండాలంటే అలా ఉండు. కాని మనం ఎప్పుడూ ఆ ప్రయత్నం చేయమే ? ఒక రమణ మహర్షి దగ్గరికి ఎందుకు వెళ్తాం ? ఆయన ఆశీర్వచనం చేస్తే మేడలు వస్తాయనో, ఇంకేదో వస్తుందనో కాని ఆయన మేడలో ఉన్నాడా ? గొప్ప వాడనుకుని వెళ్ళిన వ్యక్తి ఎలా ఉన్నాడు, ఎక్కడ ఉన్నాడు అని ఎప్పుడైనా ఆలోచిం చామా? నిజంగా ఆశ్చర్యకరంగా ఉండాలంటే, రమణ మహర్షిలా ఉండాలనో, రామకృష్ణ పరమహంస వలె ఉండాలనో, ఒక శంకరుల వలె తయారవ్వాలనో ఎప్పు డన్నా అనుకున్నామా ? ఎందుకు ? అది అవాలని మనం అనుకోలేదు.

కొంతమంది అంటారు, ఆత్మజ్ఞానం విషయం చెప్పటం తేలికేనండీ, ఆచరించటం కష్టమండీ అని, కష్టమైన భావం సాధించటమే గొప్పకదా ! దీనిలో మరొక విషయం ఏమిటంటే ఆత్మజ్ఞానం అతి తేలిగ్గా దొరికి పోవాలనే తాపత్రయం. మనం సృష్టిలో ప్రతిదీ కష్టపడి సాధిస్తాం, సాధించాలని అనుకుంటాం! కాని అతి తేలిగ్గా సాధించాలనుకున్నది దేవుడ్ని మాత్రమే! అవునా కాదా మీరు ఆలోచించి చూడండి! అయ్యా! ఇది సాధన అంటే ఇంకేదైనా తేలిక మార్గం ఉందా అండీ అంటాం. మేడీ ఈజోనో, ఇన్‌స్టంట్‌గానో కావాలి ! లోకంలో ఇంకేదైనా సాధించటానికి ఇన్‌స్టంట్ మార్గాలు కనిపెట్టవచ్చేమో కాని భగవంతుడి విషయంలో కాదు. ఎందుకంటే అది సహజమైన విషయం. సహజత్వానికి ఎప్పుడూ అడ్డదారులుండవు. అసహజత్వానికే ఉంటాయి. కాని మనం ఎప్పుడూ భగవత్ విషయం (ఆత్మ విషయం అన్నా, భగవత్ విషయమన్నా ఒకటే) సాధించటం తేలిక కాదు. అంత తేలికకానిది ఎందుకండీ అన్నవాడికి సృష్టిలో ఏదీ లభించదు.

యోగాసనం క్లాసుల కెళ్ళి రెండో రోజే ఆ కాళ్ళు వంచటం అదీ ఎవరి వల్ల సాధ్యమవుతుందండీ అంటే ఏం సాధించగలదు ? కాస్త నడుం వంచటానికి సిద్ధపడ్డవాడే ఆరోగ్యంగా ఉండగలడు. ఈ జీవితంలో ఉండి, ఈ జీవితంలో పోయే ఆరోగ్యం కోసమే ఇంత అవస్థపడాల్సివస్తోందే , మరి శాశ్వతమైన పరంపద ప్రాప్తి కోసం ఎంత కష్టపడాలో తేల్చుకోండి. కష్టపడటానికి జంకి, తేలిగ్గా ఆయన దొరకలేదని ఆయన్ని నిందిస్తే లాభమేమిటి ? జపం చేస్తూ, మాల ఒకసారి తిప్పగానే నాకేం అనుభవాతి లేదండీ, ఆయన ఉన్నాడో లేడో! అంటే సరిపోయిందా ? ఎంత తపించాలి, ఎంత ఏడవాలి ? నాకు దేవుడు కనబడటం లేదండీ, అందుకే నమ్మటం లేదండీ అంటే నువ్వు నమ్మి సాధిస్తే గాని కనబడడు. నీకు కనబడి నమ్మించు కోవాల్సిన అవసరం

ఆయనకి లేదు. ఆయన్ని సాధించవలసిన అవసరం నీకుంది. అంత తేలిక్కాదండీ అంటే అర్థం అది నాకంత ముఖ్యం కాదని అర్థం. ఈ ఆత్మవంచనపు మాటలు, పరమార్ధ తత్వాన్ని తెలియనివ్వవు. అందుకే సాధకుడు తపించవలసినదే. సాధన చేయవలసినదే! అన్నిటికన్నా కష్టసాధ్యమైనది అంత స్పష్టమైనదాన్ని తెలుసుకోవటమే! అంత తేలికైన దాన్ని తెలుసుకోవటమే! ఎందుకంటే అతి దగ్గరిది తెలుసుకోవటమే అతి కష్టం. అది మనకు తెలుసు.

మన ముఖం చూసుకోవటానికి మనం నానా అవస్థలూ పడాలి. పది మంది ముఖాలు చూడటానికి ఏ అవస్థలూ పడనక్కరలేదు. కారణం అది మనమే కనుక ! మన మనుకునే దేహంలో మన ముఖం చూడటానికి మన మెలా అవస్థపడుతున్నామో మనదే అయిన ఆత్మ తత్వం తెలుసుకోవటానికి అంతే అవస్థ పడాలి. ముఖం చూసుకోవటానికి దర్పణమెలా సహకరించిందో ఆత్మ తత్వాన్ని తెలుసుకోవటానికి శాస్త్రవాక్యాలు సహకరిస్తాయి. అయితే దర్పణంలో చూసిన ముఖమే ముఖం కాదని మనకు తెలుసు. మన ముఖానికి దెబ్బతగిలిందనుకోండి. అది ఎక్కడ తగిలిందో దర్పణం మనకి చూపించింది. అప్పుడు మందు పెట్టాలి దెబ్బకి. నా ముఖం నాకు కనిపించ లేదుకనుక నేను ఇక్కడ పెట్టను, దర్పణంలో ఉన్న ముఖానికి పెట్తాను అంటే తగ్గుతుందా ? అందుకు ఆత్మ విషయం తెలుసుకునేటప్పుడు శాస్త్రాలు దీని గురించి సూచన చేస్తాయే తప్ప అందులో కనిపించేదే దైవం కాదు. అది నీ విషయం ! భగవద్ ఉపాసన బాహ్యములోంచి అంతరంలోకి చేయవలసిన సాధన అని చెప్పుకునేది అంత తేలికైన విషయం కాదు.

\- సశేషం

పార్వతి దేవి పరమేశ్వరుడికోసం హిమవద్ పర్వత ప్రాంతంలో ఘోరమైన తపస్సు చేస్తోంది. అప్పుడు మహర్షులందరూ వెళ్ళి, అమ్మా ఇటువంటి తపస్సు నభూతో నభవిష్యతి అన్నారు. ఇందాక చెప్పిన కవి విషయంలో అనకూడదు కాని అమ్మవారి విషయంలో చెప్పచ్చు. ఋషులకి అనంత కాల విషయం మీద అవగాహన ఉంది కనుక, భవిష్యత్‌దృష్టి ఉంది కనుక అన్నారు. అంత గొప్ప తపస్సు చేస్తున్నానని ఆవిడా అనుకోలేదు. ఋషులు ఒక సందేహం వెలిబుచ్చారు, తల్లీ! పరమేశ్వరుడు, నువ్వు వేరు కాదు. ఆ విషయం మాకు తెలుసు. ఇప్పుడు లోక లీలల కోసం నువ్వు, ఆయనా విడివిడిగా ఉండటం. నువ్వు ఆయనకోసం తపస్సు చేయటం ఇవన్నీ కూడా మీరిద్దరూ చేస్తున్న లీల అనికూడా మాకు తెలుసు. నీకు ఎప్పుడూ ఆయన వశ్యుడే కదా! మరి నువ్వెందుకు ఇంత తపస్సు చేస్తున్నావ్ అంటే ఆవిడ ఒక మాట చెప్పిందిట. శివుడి లాంటి వస్తువుని అంత తేలిగ్గా లభించాలనుకోవటం అత్యంత కష్టసాధ్యం. అంతే కాదు ఆయనంత తేలిగ్గా ఎవడూ లభించడు.

పరస్పర విరుద్ధంగా లేవా ?

లోకంలో మనం తేలిగ్గా లభిస్తాయనుకునే వాటికి నానా యాతనలు పడి సంపాదించుకుంటున్నామని మనకి తెలుసు. ప్రతి చిన్నదానికి మనం పడుతున్న వేదన ఎంత ఉంది ? ఎన్ని బాహ్యములు అమర్చుకోవాలి ఒక్క బాహ్యాన్ని సాధించటానికి ఒక పంట పండించాలన్నా, ఒక వస్తువు సంపాదించుకోవాలన్నా ఎన్ని అనుకూలింప చేసుకోవాలి మనం? ఎందరు మనుష్యులని లొంగదీసుకోవాలి ? ఎన్ని రాజీలు పడాలి ? ఎన్ని వస్తువుల్ని తెచ్చుకోవాలి ? ఎందరి కాళ్ళు పట్టుకోవాలి, ఇష్టం ఉన్నా

లేకపోయినా ? లోకంలో ఏది సాధించాలన్నా ఇన్ని అమరాలి. కాని పరమాత్మ విషయంలో ఏ బాహ్యపు అమరికలూ అవసరం లేదు. కేవలం అంతః విషయం. నీకాయన ఏదిస్తే అది చాలు. భావన ఇచ్చాడు, పట్టుకో తరించిపోతావు. చేతులిచ్చాడు, పూజించుకో తరించిపోతావు. ఆ చేసే దేదో, అదే కావాలని ఏకాగ్రతతో చేస్తే సులభంగా దొరికేవాడు భగవంతుడొక్కడే ! ఇదే బాహ్య ప్రయత్నాలు  ఏవీ సులభంగా అవవు. భావన ద్వారా గాని, ఏకాగ్రత ద్వారా గానీ, పట్టుదల ద్వారా గాని దొరికేవాడు పరమాత్మ ఒక్కడే. లోకంలో వస్తువు కోసం చూపించే పట్టుదలలో కొంత చూపించినా తరించిపోతావు.

అనేక పురాణ గాధలు ఈ విషయం చెప్పటానికి అనేక వివరాలిచ్చాయి. ఒకాయన తన ప్రియురాలితో కలిసి అరణ్యంలో విహరిస్తున్నాడు. ఆమె అనేక రకములైన మణులు, రత్నాలు నాకు ధరించాలని ఉంది అన్నదిట. మెప్పుకోసం అతడు పడ్డ యాతన చూడాలి! అతను తిరగని చోటు లేదు. అలా వెళుతుంటే ఒక పుట్టకనబడింది. ఆ పుట్టలోంచి రెండు మణులు కనిపించాయట ప్రకాశిస్తూ ! ఈ మణులెక్కడా చూడలేదే, ఇవి ఇస్తే ఆమె ఆనందిస్తుందని చెప్పి, ఒక ముల్లు గుచ్చి తీయబోతే అబ్బా అని ఒక ఆక్రందన వినబడింది. ఏమిటా అని అది తొలిచి చూస్తే ఒక యోగీశ్వరుడున్నాడందులో! ఆయన తేజోమయమైన నేత్రాలు గోచరిస్తున్నాయి. ఆయన సమాధిలో ఉన్నాడు. నన్ను క్షమించమని ఇతను కోరితే, క్షమించాను గాని, నన్నెందుకిలా పొడిచావు అన్నాడు. కారణం ఇదీ అని చెప్పాడు. ఆయన వెంటనే చేతులతో అలా అనుకున్నాడు, నేత్రాలు మామూలుగా అయ్యాయి. కాని నీకసలు నేత్రాలు సరిగా పని చేయటం లేదు. ఇంత తపన పడి అడివంతా తిరిగి వచ్చావు. నీ ముఖమూ

వాడిపోయి ఉంది, జుట్టు చెరిగిపోయింది, ఎంత తిరిగావు ? అంటే ఏం ఫర్వాలేదండీ ! ఇంత శ్రమపడి, ఆవిడకి రత్నాలు ఇస్తే, ఆవిడ ఒక్క నవ్వు నవ్వితే చాలు నాజీవితానికి అన్నాడు. ఇప్పటి చలనచిత్రాల్లో కూడా వాళ్ళెన్ని ప్రయత్నాలు చేసారో, ఎన్ని త్యాగాలు చేసారో, అది ఆదర్శవాదంగా చూపిస్తే మనం చప్పట్లు కొడుతూ, చూస్తాం. ఇందుకోసం పడ్డ శ్రమలో నువ్వు కాసింత పడిఉంటే ఆ జగజ్జనని నీకు కనబడి ఉండేది కదా అన్నాడు. ఆ మాట అతనిని కదిలించి, ఆ అమ్మవారి కోసం తపస్సు చేసి, సాక్షాత్కారం పొంది, సత్యమేదో తెలుసుకుని సర్వభోగములు విడిచిపెట్టాడు. అతని పేరు ఇంద్రకీలుడనే గంధర్వుడు. ఆయనకి తపస్సు చేసినటువంటి ప్రదేశం బెజవాడలో ఉన్న ఇంద్రకీలాద్రి, అక్కడ వెలసిన కనకదుర్గమ్మ అని కథ మనకి చెప్పబడుతోంది.

దీని ఆంతర్యం ఏమిటి ?

భగవంతుడు అత్యంత కష్టసాధ్యమైన వస్తువు. అత్యంత సులభ సాధ్యుడు అందుకే విష్ణు సహస్ర నామంలో

సులభ స్సువృత స్సిద్ధః

సులభుడు అని చెప్తూనే

దుర్లభో దుర్గమో దుర్గో దురావాసో దురారిహ

ఆయనే ఏమిటీ ఈ పరస్పరము అంటే ఆ పరమాత్మ విషయం తెలిసిన వారు ఆశ్చర్యాదతృశ్యతి అని చెప్పబడుతూ అటువంటి ఆత్మ విషయం నీలో ఉంది. సృష్టిలో అన్ని వండర్స్‌కి మించిన వండర్ మనలోనే ఉంది. ఈ మహాశ్చర్యాన్ని తెలియక బయట ఏవో ఆశ్చర్యాలు తెలుసుకోవటానికి నేను సెవెన్ వండర్స్ చూసేసానండీ అంటాం. అసలు వండర్ ప్రపంచమంతా వ్యాపించి నీలో ఉందో ఆ ఆశ్చర్యాన్ని

తెలుసుకో ! ఆ ఆశ్చర్యాన్ని తెలుసుకున్నవాడే గొప్పవాడు ఆ ఆశ్చర్యము ఎలాంటిది?

దేహీ నిత్యమవధ్యోయం దేహే సర్వస్య భారత

తస్మాత్ సర్వాణి భూతాని న త్వం శోచితుమర్హసి 2-30

అతను నిత్యుడు, అవధ్యుడు ఎవరూ వధించలేడు. 'దేహే సర్వస్య' సర్వ జీవులయందు ఉన్నటువంటి వాడు. భారతా అని అర్జునుని సంబోధిస్తున్నాడు. ఆనాడు భారత అని అర్జునుని సంభోదించాడు. ఇప్పుడు భారతా అని ప్రతి భారతీయుడ్ని కృష్ణుడు చేస్తున్న హెచ్చరికగా తీసుకోవాల్సి ఉంది. తస్మాత్ సర్వాణి భూతాని ఇలా సర్వభూతములయందు, ఉన్నటువంటివాడు ఆయన. నత్వం శోచితుమర్హసి ఏ జీవి కొరకు కూడా నువ్వేడవ వలసిన పనిలేదు. నువ్వు ఏడిచి ఉద్ధరింపబడవలసిన జీవి ఎవరూ లేరు.

లోకాన్ని ఉద్ధరించటానికి మనమెవరము ?

లోకోద్ధరణకోసం అవతరించాము అని చాలామంది అంటూ ఉంటారు. వాళ్ళకి మెహమాటం వేస్తే మరికొందరి చేత అనిపిస్తూ ఉంటారు. కాని లోకాన్ని మనమెవరం ఉద్ధరించలేం. లోకం మనది కాదు లోకేశ్వరుడిది. ఆయన ఉద్ధరించుకుంటాడు. మనం మన ఉనికిని సార్ధకం చేసుకుంటే చాలు. ప్రయత్నం చేయటమే లోకాన్ని ఉద్ధరించినంత. ఇదీ విశేషం. ఎవరిపని వారు చేయటమే లోకోద్ధరణ. ఎవరూ ఏ త్యాగాలు చేయనవసరం లేదు.

నువ్వు ఎవరికోసం ఏడవకు. వీడిని నేను చంపేస్తే వీళ్ళు చనిపోతారేమో ననే ఆ పిచ్చి ఏడుపుతగదు. నత్వం శోచితు మర్హసి నువ్వు ఏడవటానికి అర్హుడవుకాదు.

ఏమని ప్రారంభించాడు ?

'అశోచ్యానస్య శోచస్త్వం' మళ్ళీ ఏమని చెప్తున్నాడు ? 'నత్వం శోచితు మర్హసి' మీరు గీతలో వెతికితే ఏడవద్దు అనే మాట ఎన్నో మార్లు వస్తుంది. కృష్ణ పరమాత్మ గీతా బోధ ఎన్ని రకాలుగా చేస్తాడు ? ఒక మిత్రుడిలా, ఒక తల్లిలా, ఒక తండ్రిలా ఒక గురువులా, ఒక దైవంలా చేస్తాడు. అంటే కృష్ణుడంటే ఏమిటి ? ఒక తల్లి ఆయనే, ఒక తండ్రి ఆయనే, ఒక గురువు ఆయనే, ఒక మిత్రుడు ఆయనే, ఒక దైవం ఆయనే. అన్ని ఆయనలో ఉన్నాయి. సృష్టిలో మనకి అన్ని విడివిడిగా కనిపిస్తాయి. ఒక్క ఆయనదగ్గరే ఇవ్వన్నీ కలిసి కనిపిస్తాయి. అందుకే కృష్ణ పరమాత్మ మాట అంత గొప్పది. 'నత్వం శోచితు మర్హసి' నువ్వు ఏడవటానికి తగినవాడవు కావు అన్నాడు. ఇది గొప్ప మాట. ఏడవద్దు అనటం ఒక విషయం. ఏడవటానికి తగినవాడవు కావు అనటం గొప్ప విషయం. మనందరం ఏడవటానికి పుట్టలేదు. ఏడుపు అసహజం దుః ఖం అసహజం. ఆనందమే మన సహజలక్షణం. సహజంగా ఉండు. ఏడవకు. అగ్నికి నువ్వు మండు, నీరు కారకు అని చెప్పాలా ? మండటం దాని సహజలక్షణం. మన సహజ లక్షణం ఆనందం. దాని పైన దుఃఖం అజ్ఞానం వల్ల వచ్చింది. ఏడవటం నీకు తగదు అంటున్నాడు. ఏడవకు అనటం లేదు ఇదీ విశేషం.

కొన్ని సందర్భాల్లో ఎవరైనా ఏడుస్తూంటే ఏం చేస్తాం, ఈ సమయంలో ఏడవక, తప్పదు కాని ఏడవకు అంటాం. అంటే వాడు ఏడవటానికి తగినవాడు కానీ ఏడుపు ఆపుకోవాలి. కాని కృష్ణుడు అలా అనలేదు. ఏడవటానికి కారణం ఉంది కాని ఏడవకు అనటం లేదు. ఏడవటానికి తగినవాడవు కావు అంటే ఏడవటానికి కారణమే లేదు అనవసరంగా ఏడుస్తున్నావు అని చెప్పుతున్నాడు. అదీ ఆ మాటలో ఉన్న తేడా! అదీ కృష్ణుడి మాట. అంత పదునుగా ఉంటుంది. ఎక్కడా బెసగదు. అందుకే భగవద్ గీత!

ఆమాట భగవానుని పలుకు. భగవానుని ఉవాచలు ఇంత గొప్పగా ఉంటాయి. నీ సహజ లక్షణమైన ఆనందమేమిటో అది తెలుసుకో ! క్రమ్ముకు వస్తున్న మోహం వల్ల దుఃఖం వస్తున్నదే దాన్ని విదిలించుకొట్టు అని చెప్తున్నాడు.

ఇక్కడితో ఆయన అనార్యదృష్టం అస్వర్గ్యం, అకీర్తికరం అన్న దాంట్లో అనార్యదృష్టం పూర్తయింది. ముందు చెప్పుకున్నట్టు ఆర్యులు అంగీకరించరు. నీ మార్గాన్ని అన్నాడు. ఆర్యులు అంటే జ్ఞానసంపన్నులు. వాళ్ళకున్న జ్ఞానమేమిటి ? ఆత్మానాత్మల స్పష్టమైన ఎఱుక కలిగిన వారు ఆర్యులు. ఆత్మని అనాత్మగా, అనాత్మని ఆత్మగా భ్రమించరు. ఆత్మనేది లేదనుకోవటం భ్రమ. దేహాదులకి ఆత్మ లక్షణాలనాపాదించటం మరొక దోషం. ఆత్మలక్షణాలంటే ఇవి శాశ్వతమనుకోవటం, వీటికి ఆనందం ఉందనుకోవటం, ఇవేవో గొప్పవనుకోవటం, వీటికి ఆనందం ఉందనుకోవటం, ఇవేవో గొప్ప వనుకోవటం, ఇవన్నీ అనాత్మలక్షణమందు, ఆత్మ దర్పణమందు ఆరోపించుట అన్నమాట. ఈ దోషములు లేకుండా ఉండాలి. ఇది మొదట చెప్పాడాయన.

మొదటిది అనార్యదృష్టం, రెండవది అస్వర్గ్యం, మూడవది అకీర్తికరం కాని మనకు బాగా అర్ధమయేవి అకీర్తికరం, అస్వర్గ్యం. అనార్యదృష్టం తరువాతి విషయం. కాని ఆయన ప్రారంభం అనార్యదృష్టం నుంచి తెచ్చాడు.అంటే అన్నిటికన్నా ముఖ్యమైన విషయం అనార్యదృష్టం కాకూడదు. అంటే ఆర్యులు అంగీకరించని మార్గం మనం తొక్కకూడదు. ఆత్మనాత్మల వివేకం కలిగిన మహాత్ములు ఏ మార్గంలో వెళ్ళారో అదే మార్గంలో వెళ్ళాలి. ఈ మాటే భారతంలో మరొక చోట. మహాత్మా ఏనగత సమర్థా అని చెప్పారు. అంటే మహాత్ములు వెళ్ళిన మార్గం మన మార్గం. మహాత్ములు అంటే

ప్రతిష్ఠ పొందిన వాళ్ళు కాదు. మహాత్ములు అంటే ఆశ్చర్యవత్పశ్యతి కశ్చిదేనమ్ అని చెప్పబడినవారు. కొంతమంది వాళ్ళలా ఉందామని ప్రయత్నించిన వాళ్ళున్నారు. ప్రయత్నించారనటం కన్నా వాళ్ళలాగా చెలామణి అవాలనుకునేవారు ఉన్నారు అని అనుకోవచ్చు. ఒక యోగి దగ్గరికి ఎన్నో కార్లు వెళితే, ఆయన దగ్గరికి అంతమంది వెళ్ళారు అంటే ఇది ఎంతో బాగుంది కదా, నేనూ అలా ఉంటే బాగుండును అని తయారయ్యేవాళ్ళు కొంతమంది ఉంటారు. అంటే వారిని లక్ష్యంగా చేసుకోవటం వేరు, వారివలె కనిపిద్దామని ప్రయత్నించటం వేరు వీళ్ళనే

జటిలో ముణ్డీ లుంఛిత కేశా

కాషాయాంబర బహుకృతే వేషః

పశ్యన్నపి చన పశ్యతిమూఢో

హ్యదరనిమిత్తం బహుకృత వేషః ॥ భజగోవిందం అన్నారు

ఆశ్యర్య వత్పశ్యతి కశ్చిదేనమ్ లా ఉన్నామని వీధికో దుకాణం పెట్టేవాళ్ళున్నారు. వీళ్ళని చూసి ఆద్యాత్మమార్గాన్ని నిందించే ప్రయత్నం కూడా కొంతమంది చేస్తూఉంటారు. బోగస్ సర్టిఫికెట్లతో చలామణి అయ్యేవాళ్ళని కష్టపడి డాక్టరుగా అయిన వాళ్ళతో పోల్చటం తగదు కదా ! అలాగే ఉదర నిమిత్తం అలాటి వేషాలు వేసుకున్న వాళ్ళని చూసి ఆధ్యాత్మరంగాన్ని శంకించటం కూడా అలాటి దోషమే!

కనుక అచ్చమైన ఆశ్చర్యవంతులైన మహాశయులకి నమస్కరించుకుని, తర్వాత విషయం చెప్తున్నారు. స్వధర్మం గురించి అంటే ఆత్మనాత్మ వివేకంనుంచి, అది పక్కకి పెట్టి ఇక్కడికి రమ్మనటం లేదు. భగవద్గీతలో బాగా గుర్తుపెట్టుకోవాల్సిన విషయం ఏమిటంటే ఒక విషయం ప్రస్తావన పూర్తయి, రెండో విషయం చెప్పటం మనకి

సులభంగా అర్థంచేసుకోవటానికి ఏర్పాటు చేసిన విభజనే కాని, అక్కడ కది, ఇక్కడికిది మాత్రం కాదు.

ఉదాహరణకి మనం శరీరం గురించి చర్చించాలంటే, ముందు బైటికి కనిపించే స్థూలేంద్రియాలని చర్చించి, ఆ తర్వాత సూక్ష్మవిషయమైన ప్రాణం గురించి చెప్తాను అంటే అదో విషయం , ఇదో విషయం అనుకుంటే తప్పేకదా! దేన్నది విడివిడిగా చూడవద్దు. ప్రాణదేహ సంబంధం వలె, ప్రతి దానికీ ఒకదాని కొకటి కంటిన్యుయేషన్. ఒకదాన్లోంచి మరొక దానిలోకి వెళ్ళాలే తప్ప, దాన్ని అక్కడ వదిలి వెళ్ళిపోకూడదు. మన బుద్ధికి అంతా ఒక్కసారి వదిలితే, అది అందుకోవటం కష్టం గనుక, బుద్ధికున్న పరిమితి దృష్ట్యా, మనం విభజనగా చూస్తున్నాం. అంతేగాని, విభజన అక్కడ లేదు.

ఇక్కడ సంధిగా మనం చూసుకోవాల్సిన శ్లోకం

దేహీ నిత్యమవధ్యోయం దేహే సర్వస్య భారత
తస్మాత్ సర్వాణి భూతాని న త్వం గోచితుమర్హసి 2-30

దేహానికున్న లక్షణమే నాశన లక్షణం కనుక దేహమునందున్న అవినాశి అయిన తత్త్వంతో నిరంతరం అనుసంధానం కలిగి ఉండాలి అనే దీనికి తాత్పర్యం చెప్పారు. మహాత్ములైన వాళ్ళు దేహములను యోగసిద్ధితో కలకాలం నిలుపుకునే శక్తి ఉన్నప్పటికీ లోకంలో ధర్మం కోసం నిలుపుతారే తప్ప వాళ్ళకి ఆ దేహంతో మోహం లేదు. ఎక్కడో గుహలో ఉన్న రమణమహర్షి అక్కడే ఉంటే ఆయన సిద్ధి ఆయన పొందేవాడు. ఎందుకు వెలుపలికి వచ్చాడు ? ఆయన కేం ప్రయోజనం ? ఆయన ద్వారా పరమేశ్వరుడు ఇలాంటి వాళ్ళని లోకానికి చూపించి, సత్యం ఆత్మవిషయం, జ్ఞానం కేవలం గ్రంథంలోనే కాదు, దానికి తార్కాణంగా ఈ భారతదేశంలో ఉన్నారు అని

చూపిస్తూనే ఉంటారు. వాళ్ళూ పేరు కోసం ఆశించరు.

ఘోరక్‌నాథ్ లాంటి కొందరు యోగులు, ఈ శరీరాన్ని ఇంకా ఎంతోకాలం ఉంచటానికి ప్రయత్నించారుట. వారికి కొందరు యోగులు కలిసి ఇలాంటి యోగిక ఫీట్స్ చేయద్దు, యోగ విన్యాసాలు చేసి, శరీరాన్ని కాపాడి, అందరికీ చూపిద్దామన్న ప్రయత్నం చేయవద్దు అని బోధించారు. అందుకు ఈ సిద్ధులతో, మహిమలతో ఈ దేహాన్ని శాశ్వతంగా ఉంచటం కూడా సిద్ధికాదు. పూర్ణమైన ఆత్మజ్ఞానం గ్రహించటమే తప్ప ఈ దేహాన్ని కలకాలం ఉంచటమే గొప్పతనంగా ఈ దేశం ఎప్పుడూ భావించలేదు. అమృతం తాగిన దేవతలను కూడా గౌరవించలేదు భారతీయ వేదాంతం. అదీ విశేషం. అమృతం తాగిన  దేవతలు ఎక్కువ కాలం ఉంటున్నారు కాని ఆత్మజ్ఞత అన్నది ఉన్నవాడినే గౌరవించింది ఈ దేశం. వేదంలోనూ మొదలైన చోట్ల దేవతలను తక్కువగా చూపినట్లు కనిపిస్తుంది.

దానికి కారణం ఏమిటి ?

వాళ్ళు అమృతం కోసం తాపత్రయపడ్డారు. అమృతం అంటే ఎక్కువ కాలం ఉంచేది. కాని అసలైన అమృతమైన ఆత్మ విషయం ఉందే అది వాళ్ళకి అర్థం కాలేదు. సుఖయోగీంద్రుడు భాగవతం చెప్తుంటే, దేవతలు అమృతం పట్టుకుని వచ్చారుట. ఎందుకు వచ్చారు మీరంతా ? అని సుఖయోగీంద్రులు అడిగారు. మాకు ఆభాగవతామృతము కావాలి, దాని బదులుగా ఈ అమృతం ఇస్తాం అన్నారుట. మీరెంత కాలం ఉంటారో నాకు తెలుసు. మీరు మళ్ళీ రావాల్సిన వాళ్ళే కాని ఈ అమృతం తాగితే ఇక రాము. ఆ పరమమైన స్థితికి వెళతాము. అందుకని ఈ అమృతానికి వెలకట్టద్దు. పొండి అన్నాడు. ఆత్మవిద్య అలా  అమృతం చూపి తెచ్చేది కాదు, అన్నీ

వదిలి గ్రహించవలసిన గొప్ప విద్య అది. ఈ భౌతికమైన విషయాలు వేటితోనూ పోల్చలేనిది ఆత్మజ్ఞానము. ఆత్మజ్ఞుడు దేనికీ వెరవడు. అది కూడా గొప్ప విశేషం. అతను అచ్ఛేద్యోయం, అదాహ్యోయం, అక్లేద్యేయం అనే సర్వాత్మతత్త్వంలో సంలీనమవుతాడు.

అహంకారం రెండు విధాలు ఏమిటవి ?

ఈ దేహంతో సాధించిన వాటిని చూసుకుని, ఇంత వాడిని అంత వాడిని అనుకోవటం ఒకటి. నేను ఫలానా వజ్రయోగంతో ఒక మందు తిన్నాను గనుక, నేను ఎంత కాలమన్నా బ్రతకగలను అని ఒకడు చెప్తాడు. ఒకాయన ఆ మధ్య నా ఆయువు రెండు వందల ఏళ్ళు, మీరు డైరీలో రాసుకోండి అన్నాడు. ఎందుకంటే నేను చేస్తున్న యోగ చికిత్స విధానాలు అంత గొప్పవి అన్నాడు. కాని పాపం ఎక్కడో వెళుతుంటే ప్రమాదం జరిగి వెళ్ళిపోవటం కూడా జరిగింది. అంటే అతను ప్రమాదాదులు లేకపోతే రోగాదుల వల్ల మరణం రాకుండా ఉంటాను అనుకున్నాడు. మరణం రోగాదుల వల్ల వస్తుందనుకున్నాడు అతను. కాని మరణం ఎలాగన్నా రావచ్చు. తేలుతో, పాముతో, దిగులుతో, దొంగలతో, దొరలతో, శస్త్రాలతో దేనితోనైనా రావచ్చు. మరణం అంటే ఈ మార్గంలో వస్తుందనుకుని ఈ మార్గాన్ని బాగుచేస్తుంటే మరో మార్గంలో వస్తుంది. అది ఎవరికి తెలుస్తుంది ? అన్ని మార్గాలూ బాగా తెలుసుకుని నాకింక మరణం లేదని ధీమాగా కూర్చున్న హిరణ్యకశిపుడు ఏమయ్యాడు, రావణాసురుడు ఏమయ్యాడు? ఎంత కాపాడుకుందామనుకున్నా దీని లక్షణమే చావు లక్షణం. ఆ చావు లక్షణంతో తన్మయుడవయి పోయి, ఆ అమృత తత్త్వంతో తాదాత్మ్యం చెందటం మర్చిపోతున్నావు నువ్వు. దానితో తన్మయత్వం చెందితే వచ్చే అహంకారం చాలా

గొప్పది. అహం బ్రహ్మాస్మి అనే అహంకారం అది. ఇది అహం దేహోస్మి అనే అహంకారం. ఈ రెండు అహంకారాలకి అంత తేడాలున్నాయి. అహం బ్రహ్మాస్మి అనేవాడు దేనినీ లెక్కపెట్టడు. వాడు ఎన్ని కాలాలు చూసాడో, ఎందరిని చూసాడో ఇది బాగా పట్టించుకోవటానికి పురాణ కథల్లోంచే అన్నీ తీసుకుందాం.

ఒకసారి ధర్మరాజు గొప్ప అశ్వమేధ యాగం చేసారు. ఇది ఉన్నకథే, కల్పిత కథ కాదు. అంత అశ్వమేధ యాగం చేసినప్పుడుగుఱ్ఱం వెంట అర్జునులు మొదలైన వాళ్ళు వెళ్ళారు.

అశ్వమేధ యాగం అంటే ఏమిటి ?

గుఱ్ఱాన్ని ఎవరైనా గ్రహిస్తే వాడిని కూడా ఓడించాలి. అలా అందరినీ జయించి అశ్వమేధ యాగాన్ని నిర్వర్తిస్తారు. తద్వారా ఏమిటంటే ఒక ధార్మిక పాలన కింద అన్నీ తేవాలన్న ఉద్దేశంతో ఆనాడు క్షత్రియులు చేసిన విశేషం. కలియుగంలో ఆ పేర్లు పెట్టి కూడా చేయటానికి వీలు లేదు. అది మహాపాపం అని కృష్ణుడే చెప్తున్నాడు. అది ఆ యుగం వరకే!

ఇక్కడ జరుగుతున్న దేమిటంటే అశ్వం వెంట అర్జునుడు మొదలైన వారితో కృష్ణ పరమాత్మ నేనూ వస్తానన్నాడుట. ఆయన వస్తే అంతకన్నా కావల్సిందేమిటి ? కాని ఆశ్చర్యమేమిటంటే ఆ అశ్వం ఒక ద్వీపం వద్ద, ఒక మహర్షి వద్ద ఆగిపోయింది. మహర్షిని జయించాలి కదా! కాని ఆయనేమో నేను దీనిని బంధిస్తే కదా మీరు నన్ను జయించటానికి అన్నాడుట. ఎవరు మీరు ? అని అడిగితే నేనిప్పటి వాడినా, ఎప్పటి వాడినో, అని ఒక కథ చెప్పాడు. ఒక సారి నేను నా యోగ మార్గంలో క్రమంగా బ్రహ్మదేవుడి దగ్గరికి వెళ్ళాను. ఆయన నాలుగు ముఖాలతో కనిపించాడు. ఆయనేమో

నేను చతుర్ముఖ బ్రహ్మని సర్వ బ్రహ్మాండాల కధిపతిని అని చెప్తున్నాడు. ఇంతలో ఒక గాలి విసిరికొట్టితే, మేం యిద్దరం మరొక బ్రహ్మాండంలోకి వెళ్ళిపడ్డాం. అక్కడ ఎనిమిది ముఖాల బ్రహ్మ కనబడ్డాడు. ఆయనకి నమస్కారం చేసుకుంటుంటే, మళ్ళీ ముగ్గురం కలిసి ఎగరగొట్టబడ్డాం. ముగ్గురం వెళ్ళి 16 ముఖాల బ్రహ్మని చూశాం, ఇంకో బ్రహ్మాండంలో. మాకు ఆశ్చర్యం వేసింది, ఇన్ని బ్రహ్మాండాలు ఉన్నాయా, ఇందరు బ్రహ్మలు ఉన్నారా అని. అలా జరగ్గా జరగ్గా క్రమంగా మేము ఒక పరంధామానికి చేరుకున్నాం. ప్రతి బ్రహ్మ నేనే వాడిని అని అహంకారంలో చెప్పేవాడు తక్షణం గాలికొడ్తోంది. ఎగిరిపోతున్నారు. ఇలా అహంకారం ప్రదర్శించటం, గుంపు మొత్తం ఎగిరిపోవటం జరుగుతోంది. చివరికి వాళ్ళు వెళ్ళినచోట సహస్రముఖమైన మహా తేజస్సు గోచరించిందిట. ఆయన మాత్రం ఏ మాత్రం అహంకారం చూపకుండా, మహానుభావుల్లారా మీరందరూ వచ్చారా, మీకు నేనేమివ్వగలను అంటూ లేచి వచ్చారుట. ఇక్కడ ఎవరూ ఎగరలేదు. ఇక్కడ కూడా ఎగరటానికి సిద్ధంగా ఉన్నారు, అలవాటయిపోయింది కదా ! కాని ఇక్కడ ఎగరటానికి చోటులేదు. ఇది సర్వోన్నత స్థానం అన్నాడుట. నువ్వెవరు అంటే విరాట్ పురుషుడైన శ్రీమన్నారాయణుడు అతను. సర్వబ్రహ్మాండములకు పైన ఉన్నవాడు ఏ అహంకారము లేకుండా వీరిని ఎంత వినయంగా చూసాడో చూసారుకదా ? ఆ అహంకారం ఎవరికి ఉంటుంది ? ఎమ్టీ వె సల్స్ మేక్ మచ్ నాయిస్ అంటారు. ఖాళీ పాత్రలకే గడబడ ఎక్కువ.

ఈ అహంకారముల అల్లకల్లోలములు, అలజడులు ఎన్ని చెప్పినా పోవే? ఆ పరమాత్మని చూడండి, ఆ వినయం చూడండి.

వెనకటి బ్రహ్మలు వేవేల సంఖ్యలు

ఎనసి బ్రహ్మాండములు ఏలిరట

ఎందరు బ్రహ్మలో, ఎన్ని బ్రహ్మాండములో ఎన్ని కల్పాలో ఎందరు బ్రహ్మలో ఎందరు వెళ్ళి పోయారు ఈ కాలంలో

పెరగొని వారల పేరులు మరచిరి.

వాళ్ళ పేర్లేనా ఎవరికైనా గుర్తున్నాయా ?

మనుజ కీటముల మరెవ్వరెరుగు ?

ఐదేళ్ళ పదవి. ఎన్నికల్లో గెలిస్తే బ్రహ్మాండములు గెలిచినంత ఫోజులు, మొత్తం ప్రపంచాన్ని మార్చేస్తానన్న సీను. మళ్ళీ ఐదేళ్ళయిపోతే అడుక్కోవటాలే ! అహంకారాల పరిమితులే ఐదేళ్ళు, ఇలాటి మనుజ కీటముల మరెవ్వరెరుగు ? అన్నాడు అన్నమయ్య. మరెవరికి తెలుసు ?

హరియే ఎరుగును ఇందరికి బ్రతుకులు.

హరికే అన్నీ తెలుసు మరి మనమేం చేయాలి ?

ఇరవురగ ఈతని నెరిగితే మేలు.

మనం ఈతనిని తెలుసుకుంటే చాలు. అంత గొప్పవిషయం. అన్నీ ఆయనకి తెలుసు. మనం ఆయన్ని తెలుసుకుంటే చాలు. అది విడిచి పెట్టి ఆయన్ని తెలుసుకోకుండా ఇవన్నీ తెలుసుకోవటానికి ప్రయత్నిస్తే ప్రయోజనం లేదు ఎన్నని తెలుసుకుంటావ్, ఏమని తెలుసుకుంటావ్ ? చీమ గురించి తెలుసుకోవటానికి జీవితాలు అధ్యయనం చేసి థీసిస్ రాస్తాడొకడు. అంటే చీమ జీవితాధ్యయనానికో ఒక మహాత్ముడు జీవిత కాలం ఖర్చుపెట్టాల్సినంత విజ్ఞానం పెట్టిన ఆ పరమాత్మ ఎంత గొప్పవాడు ? ఆ విషయం ఆలోచించామా ?

సర్వజ్ఞత అంటే ఏమిటి ?

సర్వజ్ఞుడు అంటే అన్నీ తెలిసినవాడుకాదు. అంత పొడుగున్నావ్, పాము మంత్రం తెలియదా అన్నాట్ట ఎవరో? వేదాలన్నీ చదివావ్, ఆ మాత్రం పప్పు ఉడికించలేవా ఇదేం శాస్త్రం అంటుంది భార్య ఎందుకు ? ఆమెకు పప్పు ఉడకపెట్టటం బాగా తెలుసు. పప్పు అవసరం వచ్చేసరికి అంత వేద పండితుడూ మూర్ఖుడైపోయాడు ఆమె దృష్టిలో. కాబట్టి సర్వజ్ఞుడు అంటే అర్థం సర్వమూ ఆయనే అని తెలిసిన వాడు. సర్వము ఒక్కటే, ఆ పరమాత్మయే అని తెలిసినవాడు. సర్వమూ అంటే పరమాత్మ. సర్వజ్ఞుడనిపించుకోవాలన్న తాపత్రయం ఉందికాని అది కాలేని విషయం. మరి తెలివైన విషయం ఏమిటి ? ఆయనయే అని తెలుసుకోవటం. అవినాశి అయిన వస్తువుని తెలుసుకున్నవాడు తెలివైనవాడు అని చెప్పి ఆ తెలివితో ప్రయత్నించాలన్న విషయాన్ని ఇక్కడి వరకూ వివరించారు.

ఈ 31 వ శ్లోకం నుంచి స్వధర్మాష్టకం అని చెప్పచ్చు. ఎందుకు ?

8 శ్లోకముల్లో స్వధర్మం గురించి చెప్తున్నాడు. మొదట చెప్పిన అనార్యదృష్టంలోనే దీని భాగంగా చెప్పవచ్చు. లేదా అస్వర్గ్యం అని కూడా చెప్పవచ్చు. ఎందుకంటే స్వధర్మం ఆచరించటం అనేది ఫలాపేక్షరహితంగా ఆచరిస్తే ఆర్య దృష్టం. ఫలాపేక్షగా చేస్తే వాడు నశించిపోడు, పతనం కాడు అలాగని పరమార్థం లభించదు తర్వాత జన్మల్లోనైనా క్రమంగా వచ్చే అవకాశం ఉంది. దీన్ని అనార్యదృష్టంగానూ భావించవచ్చు. అస్వర్గ్యం కించా భావించవచ్చు. స్వధర్మం విడిచి పెడతానంటే ఆర్యులు అంగీకరించరు కాబట్టి అనార్యదృష్టం. స్వధర్మాన్ని విడిచి పెడితే నరకానికి పోతాడు కాని ఉత్తమ గతులకి వెళ్ళడు కాబట్టి అస్వర్గ్యం అని కూడా తీసుకోవచ్చు. కాబట్టి ఈ స్వధర్మం

మాట ఈ రెండింటి భాగంగా తీసుకోవచ్చు.

స్వధర్మ మపి చావేక్ష్య న వికంపితుమర్హసి

ధర్మ్యాద్ధి యుద్ధా చ్ఛ్రేయో న్యత్ క్షత్రియస్య నవిద్యతే   2-31

ఇది గీతలో ప్రధానమైన విషయం. ఇంత గీత చెప్పవలసి వచ్చింది ఇందుకోసమే! తత్త్వమూ, ఆత్మజ్ఞానమూ యివన్నీ పక్కన పెట్టు. స్వధర్మము అని ఆలోచించేనా ఆపేక్ష ఆలోచించినా, గ్రహించినా, దర్శించినా 'నవికంపితుమర్హసి' యుద్ధం నుంచి కదలరాదు. ఎందుకంటే ధర్మ్యాద్ధి యుద్ధాచ్ఛ్రేయోన్యత్ ఉత్తమ క్షత్రియునికి ధర్మమునకై చేసే యుద్ధం కంటే శ్రేయస్సు లేదన్నాడు. యుద్ధం కంటే శ్రేయస్సు లేదంటే సింహాసనం ఎక్కిన దగ్గరినుంచి ఎవరి మీదకు యుద్ధానికి వెళ్దామా అని కాదు. ధర్మార్థమై చేసే యుద్ధము కంటే క్షత్రియునికి శ్రేయస్సు లేదు అంటున్నాడు. అదీ విశేషం.

ఇక్కడ మనం శ్రద్ధ గురించి స్వధర్మం గురించి శ్రేయస్సు గురించి చూడాలి.

యచ్ఛ్రేయః స్యాన్నిశ్చిత బ్రూహి తన్మే

శిష్యస్తే హం శాధిమాం త్వాం ప్రపన్నమ్.   2-7

అన్నాడు కదా ముందే ! ఏది నాకు శ్రేయస్సో అది చెప్పమన్నాడు. ఆ శ్రేయస్సు ఏమిటో అది చెప్పేసాడు. దీనితో అయిపోయింది. గీతా ప్రవచనాలు ఇక్కడితో అయిపోయింది అనవచ్చా ? కూడదు. ఎందుకంటే, జీవితం ఉన్నంత వరకూ చెప్పుకోవలసినవి ఉంటూనే ఉంటాయి.

శ్రేయోన్నత్ ఇంతకు మించిన శ్రేయస్సు లేదని చెప్పేస్తాడు స్పష్టంగా.

శ్రేయస్సు అంటే ఏమిటి ?

ఇది చాలా విశేషమైన పదం. ఏది శాశ్వతమైన సుఖానికి, ఉత్తమమైన సుఖానికి

హేతువో అది శ్రేయస్సు. ఏది సద్గతికి హేతువో అది శ్రేయస్సు. ప్రేయస్సు వేరు. ప్రేయస్సు అంటే ప్రియమైనది. శ్రేయుస్సు అంటే హితమైనది. ప్రియమైన దానికన్నా, హితమైన దాన్ని ప్రియంగా చేసుకోవటం ముఖ్యం. ప్రియమైన దాన్ని శ్రేయస్సుగా భ్రమించేకన్నా, శ్రేయస్సునే ప్రియమైనదిగా భావించటం గొప్పవిశేషం. ఏది శ్రేయస్సో, ఏది శాశ్వతయుతమో దాన్ని ప్రియంగా భావించేవాళ్ళనే భక్తులని , ధార్మికులని , యోగులని, మహాత్ములని అంటారు. మనకి శ్రేయ మార్గమైన ఆధ్యాత్మకి మార్గంపై ఎన్నో బోధలు చేయాలి, ఎంతో నచ్చ చెప్పాలి. ఎందుకంటే మనం దాన్ని ప్రేయో మార్గంగా అనుకోవటం లేదు కనుక. కాని ఒక ప్రహ్లాదుడి వద్దకో, ఒక మీరాబాయి వద్దకో వెళ్ళి ఇన్ని చెప్పక్కరలేదు. ఏది శ్రేయస్సో, వాళ్ళకదే ప్రేయస్సు. శ్రేయస్సే ప్రేయస్సవటం చాలా గొప్ప విషయం, కాని ప్రేయస్సే శ్రేయస్సవదు అది బాగా గుర్తుపెట్టుకోండి.

చిన్నపిల్లవాడికి ఆవకాయ ముద్ద ప్రేయస్సు అవచ్చు కాని అది శ్రేయస్సు కాదన్న విషయం తల్లికి తెలుసు. తల్లి ఎందుకాపిందన్న విషయం పెద్దయ్యాక తెలుస్తుంది కాని అప్పుడు తెలియదు. అజ్ఞాన భావనలో ఉన్నంతకాలం ఆధ్యాత్మిక భావనే శ్రేయస్సు అన్న విషయం అర్థం కాదు, పసిపిల్లవాడికి ఆవకాయ హితం కాదని తెలియనట్లుగా! అందుకు నీకు ఇంతకు మించిన శ్రేయోమార్గం వేరే లేదు సుమా అని చెప్పేస్తున్నాడు.

పైగా క్షత్రియుడైన వాడి కర్తవ్యం చెప్తున్నాడు. ఏమిటిది ?

భారతా అనే మాట మనని సంబోధిస్తున్నట్టుగా తెలుసుకోవాలి. మన వేదాంతం మొదటితో ఆగిపోయింది ఈ మధ్యకాలంలో. కలియుగం వచ్చిన తర్వాత

కలే వేదాంతిన సర్వే

అని ఒక మాట ఉంది. కలియుగంలో వేదాంతం మాట్లాడే వాళ్ళు అంతా యింతా కాదు. ఇలా వేదాంతం మాట్లాడే ఈ జాతి నిర్వీర్యం అయిపోయింది. అందులో సందేహం లేదు. వేదాంతం మాట్లాడి అన్నాను ఇక్కడ. వేదాంతం తెలుసుకుని స్వధర్మం నుంచి భ్రష్టం కాకుండా ఉండాలి. స్వధర్మం నుంచి భ్రష్టత పొందుతూ వేదాంతం మాట్లాడే వాళ్ళు చాలా మంది ఉంటారు. అలాంటి వారిని పరమాత్మ అంగీకరించడు. నిజంగా వేదాంతం వస్తే, వేదాంత జ్ఞానంతో నీ స్వధర్మం చేయి. అదీ చెప్పదలుచుకుంది గీత. అది ఎప్పుడూ నీకు బోధగా ఉండాలి. ఇప్పుడందులో భారతా! భారతీయుడైన వాడు తెలుసుకోవాల్సిందేమిటంటే ఈ క్షాత్రాన్ని మళ్ళీ ఉద్ధరించుకోవాలి స్వధర్మంగా. అది బోధిస్తున్నాడాయన. అంతేగాని, అవతలి వాడు ఎన్ని అవకతవకలు చేసినా క్షమ చాలా గొప్పదండీ. శాంతి చాలా దయామయమైనది. అంతటా ఉన్నది ఒకే పరమాత్మ, ఇంక నేను చంపేదేమున్నది, చచ్చేదేమున్నది, కనుక నేను చంపను అనకూడదు. ఈయనేం చెప్తున్నాడు? అంతటా ఉన్నది ఒకే పరమాత్మ అక్కడున్నదీ, ఇక్కడున్నదీ ఒకటే. చంపేవాడు లేదు, చచ్చేవాడు లేదు. కనుక చంపు అన్నాడు. కనుక చంపకు అనలేదు, కనుక చంపు అన్నాడు. అది విశేషం. ఎంత తేడా ఉంది చూడండి ఈ రెండింటికీ.

ధర్మమనేది రిలేటివ్ టర్మ్ ఎలా ?

ఎవడైతే 'క్షతార్ధ త్రాయతే' ఇది క్షత్రియః క్షాత్రం. సమాజానికి దెబ్బతగలకుండా కాపాడే రక్షణ స్థానంలో ఉన్నవాడికి వేదాంతం బోధించటం కన్నా పాపం మరొకటి లేదు. బార్డర్‌లో నిలబడి శత్రువుతో యుద్ధం చేసేవాడి వద్దకి వెళ్ళి అందరినీ క్షమించి వదిలేయ్, అంతటా ఉన్నది ఒకే ఆత్మ! అని చెప్తే అంతకు మించిన పాపపు గురువు

మరొకరు దొరకరు మనకి.

అలాంటిది వేదాంత విజ్ఞానం కాదా ?

అది నువ్వు తెలుసుకుంటే, అంతటా ఉన్నది ఒకే ఆత్మ. అది ఎలాగూ నశించనిది కనుక వీడీ దేహ వ్యవహారంలో సమాజానికి భంగం అవుతున్నాడు కనుక, నా ధర్మంగా వీడిని కొట్టినా నాకేం దోషం లేదనే జ్ఞానం వస్తుంది. వేదాంత విజ్ఞానాన్ని ఎలా అప్లై చేయాలో చెప్తున్నాడు కృష్ణపరమాత్మ. అది ఇక్కడ గ్రహించితే ఈ జాతి ఈ నిర్వీర్య స్థితికి వచ్చేది కాదు. ఎప్పుడైతే రక్షణ బాధ్యత వహించవలసిన క్షాతు స్థానంలో ఉన్నవాడు, ఆక్షాత్ర ధర్మాన్ని విడిచిపెట్టి, నమ్మినవారిని అర్ధరాత్రి విడిచి పెట్టి వెళ్ళి, నేను జ్ఞానిని అయ్యాను అని అహింసని పొరపాటుగా అర్థం చెప్పి దేశానికి బోధించాడు. అప్పుడు పతనమైంది భారత దేశం. దాని అప్లికేషన్స్ ఎన్ని రకాలుగా వచ్చాయంటే, క్షత్రియుడనైన నేను ఎంత హింస చేసాను. ఇవేవీ అక్కరలేదు. అని అహింసకి వెళ్ళిపోతే, అప్పుడు రెండో మారు పతనమైంది భారతదేశం. క్రమక్రమంగా శత్రువులు మన దేశంలోకి వస్తూ ఉంటే వాళ్ళనే నెమ్మదిగా లోపలకి ఆహ్వానించి, ఇప్పుడు వాళ్ళే మన గ్రంథాలని విమర్శిస్తుంటే పట్టుకుని చూస్తూ ఉండటానికి కారణం క్షాత్ర దేహం, స్వధర్మాన్ని అర్థం చేసుకోలేక వేదాంతాన్ని అపార్థం చేసుకోవటం వల్ల వచ్చిన దురవస్థ ఇక్కడి దాకా మనని తీసుకువచ్చింది.

ఉత్తిష్ఠ భారతా అన్న కృష్ణ వచనమే మళ్ళీ సమాధానంగా తీసుకుంటే కృష్ణ పరమాత్మ ఏం చెప్తున్నాడు ?

క్షత్రియుడివైన నీకు స్వధర్మం ముఖ్యం సుమా ? ఇక్కడ స్వధర్మం అనే మాట చాలా స్పష్టంగా చెప్తూ రాజుకి ఏది గొప్ప అవకాశం అంటే ధర్మం రక్షించటం కోసం

యుద్ధం చేయటం అనే అవకాశం దొరికిందని రాజు సంతోషించాలి అన్నాడు. అదీ విశేషం. రాజుకి ఎప్పుడూ ధర్మార్థ యుద్ధం చేయగలగటం ఒక యోగం. దాని కోసం ఉన్నవాడికి ఆ పని చేయగలగటం ఎంత ఆనందం.

ఒక పోలీసాఫీసరుకి కేసులు లేవుట. ఒక కేసు రాగానే ఆనందించాడు. డబ్బులు సంపాదించవచ్చు అన్న ఆనందం కాదు, ఇప్పుడు నేను ధర్మం చేయగలను అని. అలాగని అతని స్వధర్మం పెంచటానికి ఎక్కువ కేసులు ఇద్దామని ప్రయత్నించకూడదు మనం. అతని ఉద్దేశం ఏమిటంటే ధర్మరక్షణకి నేను ముందుండాలనే ప్రిపేరెడ్‌నెస్ అది కనిపిస్తోంది.

క్షత్రియుడు అంటే క్షతార్థ త్రాయతే దెబ్బనుంచి కాపాడేవాడు. ఏమిటి దెబ్బ ? ధర్మానికి తగిలినదెబ్బ నుండి సమాజాన్ని కాపాడటానికి ఎవడు కేటాయింపబడ్డాడో వాడా పని చేయవలసినదే! అందుకు నీకు ఇదే ధర్మం. పైగా

యదృచ్ఛయా చోప పన్నం స్వర్గద్వారమపావృతమ్

సుఖినః క్షత్రియాః పార్థ లభంతే యుద్ధ మీ దృశమ్ 2-32

ఉత్తమమైన స్వర్గం లభించాలంటే ఏ యజ్ఞాలో, యాగాలో అందరూ చేస్తారు. కాని 'యదృచ్ఛయా' ఏ మాత్రం ప్రయాస లేకుండా యుద్ధం చేయాలనే యజ్ఞం దొరికింది అన్నాడు. 'స్వర్గద్వారమపావృతమ్' స్వర్గద్వారం తెరిచేటటువంటి ధర్మం కనుక సుఖినః క్షత్రియాః పార్థ లభంతే యుద్ధమీదృశమ్ ధన్యులైన క్షత్రియులకే దొరుకుతుంది ఇలాంటి యుద్ధం అన్నాడు.

కృష్ణ పరమాత్మ ఎందుకోసం అవతరించాడు ? ఈ యుద్ధం ఏర్పాటుకోసం అవతరించాడు. రాక్షసులందరూ రాజులుగా పుట్టి భారమై పోయినప్పుడు వాళ్ళందరినీ

ఒక చోట సమీకరించటానికి కృష్ణుడెన్ని వ్యూహాలు పన్నాడో, మొదటినుంచి పరిశీలిస్తే తెలుస్తుంది. ఆయన అవతారమే అందుకోసం. భూమాత వెళ్ళి అడగటం కనిపిస్తుంది. ఇది ఒక ప్రధాన ప్రయోజనం. ఇక జీవులకి, యోగులకీ, గోపికలకీ కృష్ణుడిచ్చిన ప్రయోజనాలు చాలా ఉన్నాయి. ఆయన ఇచ్చిన కైవల్యం చాలా ఉంది. అది వేరే విషయం. ఇక్కడ ధర్మరక్షణ అనే అవతార ప్రయోజనం

పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్

ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే !4-8

అనే ప్రధాన ప్రయోజనం నెరవేర్చిన శ్రీకృష్ణపరమాత్మ చెప్తున్నాడు. ఏమని ? క్షత్రియుడే కదా ఆయన చేయలేడా? ఆయనా చేసాడు. నువ్వు చూస్తున్న భీష్ముడు ఎవరు ? నీపాటి తెలివైన వాడు కాదా ? నీకాయనెంత స్వజనుడో, నువ్వు ఆయనకంత స్వజనుడివి. దుర్యోధనాదులు యుద్ధానికి సిద్ధపడ్డారంటే అర్ధముంది. కాని ఈయనెందుకు సిద్ధపడ్డాడు ? యుద్ధం ఆయనకి కొత్తా ? ఇప్పటికి ఎందరితో యుద్ధం చేయలేదు ? పరశురాముడితో కాశీనాధుడితో చేయలేదా ? నువ్వు చెప్పినట్టుగా ఈ రక్తపు కూడు తినటం కన్నా భిక్షమెత్తుకోవటం మేలు అంటే రక్తపు కూడు తినని క్షత్రియుడెవరు ? ఇక్కడయితే నీకు స్వజనుడు అన్నమమ కారం వచ్చింది. భీష్ముడు యుద్ధోన్మాదంతో చేయలేదే ? ధర్మపరమైన, ధర్మరక్షణకే చేసిన యుద్ధం అది చాలా అవసరం సుమా!

మాది అహింసాత్మక రాజ్యం శాంతి యుత రాజ్యం, ఆకారణం చేత మేము రక్షణ కోసం ఏమీ జాగ్రత్తలు తీసుకోము అంటే చాలా ? నీకు అహింసా సిద్ధాంతమే! కాని అవతలివాడికో! మనం చీమను, దోమను కూడా చంపం. కాని అవి చంపటానికి

వచ్చినప్పుడు ? అందుకు రక్షణకోసం శక్తిని , క్షత్రియాన్ని వినియోగించగల ఒక వ్యవస్థ ఎప్పుడూ అవసరం. సమాజానికీ, వ్యక్తికీ కూడా అవసరమే.

కృష్ణ పరమాత్మ చేసిన ఏర్పాట్లలో వీళ్ళందరూ పావులే. దుర్యోధనాధులు కూడా ఆయన ప్లాన్ చేసి పంపించిన వాళ్ళు. అంతేకాని దుర్యోధనుడు పాపాత్ముడు అనటానికి లేదు. వాటిలో ఆ పాపపు ప్రవృత్తి చేత దానివైపు ఆకర్షింపబడే వాళ్ళు కొందరు వస్తారు. దుర్గంధం ఉంటే కొన్ని క్రిములొస్తాయి, సుగంధం ఉంటే కొన్ని క్రిములొస్తాయి. అటూ, ఇటూ క్రిముల్ని పిలిపించి అన్ని క్రిముల్ని నాశనం చేయటం ఈ మహాకాలుని యొక్క లక్ష్యం. అందుకు వాళ్ళని పిలిపించాడు. ఆయన అలా పంపించిన వాళ్ళలో దుర్గంధం లాంటి వాడు జరాసంధుడు.

వాడు మొదటిసారి దండయాత్ర చేసినప్పుడు ఏం జరిగింది ?

నిమిషాల మీద వాళ్ళ సైన్యం మొత్తం దెబ్బతింది. బలరాముడు వాడ్ని బంధించాడు కూడా. అతన్ని వదిలేయమన్నాడు. దయతో వదిలాడనుకున్నారా ? అనవసరమైన దయచూపించడు శ్రీకృష్ణుడు. అప్పుడేమన్నాడో తెలుసా ? వీడ్ని వదిలేస్తే వీడు నాకు చాలా సహకరిస్తాడు. ఇప్పుడు కొంతమందిని పట్టుకొచ్చాడు. వాళ్ళ పని పూర్తి చేసేసాం, నాకు శ్రమ తప్పించాడు లేకపోతే నేను ఒకొక్క దుర్మార్గపు రాజుని వెతుక్కుంటూ రావాలి. వీడిని వదిలితే వీడే తీసుకొస్తాడు. ఎందుకంటే దుష్టుడికి, దుష్టుడే స్నేహితుడు. అలాంటి వాడు మళ్ళీ యుద్ధానికి వెళ్దాం రా అని మరో 100 మందిని తెస్తాడు. నాదగ్గరికి తీసుకు వస్తే అక్కడిక్కడే క్లీన్ చేసుకోవచ్చు నేను. అందుకని వదిలేయ్ అన్నాడు. వదిలేస్తే మళ్ళీ వచ్చాడు. అలా 17 మార్లు సహకరించాడు కృష్ణ పరమాత్మకి.

కృష్ణ పరమాత్మ ప్రణాళిక అది. ఆ ప్రణాళికలో భాగంగా పుట్టి నువ్వు పారిపోతానంటే ఎలా ? అందుకే నిన్ను బ్రాహ్మణుడిగానో, వైశ్యుడిగానో పుట్టించలేదు. క్షత్రియుడిగా ఎందుకు పుట్టించాను ? ఎక్కడో తపస్సు చేసుకుంటున్న బ్రాహ్మడిని చేయమనటం లేదా ? క్షత్రియుడిగా ఉన్న నువ్వు చేయాలి. అందుకు నువ్వు వెళ్ళి కరతల బిక్ష కరతల వాసం చేస్తానంటే నేను ఒప్పుకోను! కాదు నాకు జ్ఞానం వచ్చింది అంటే జ్ఞానంతో యుద్ధం చేయి అంతే. జ్ఞానం రాలేదు, యుద్ధం చేయి, ఎంత గొప్పగా చెప్పాడు చూడండి. ఇదే భగవద్గీత యొక్క సారం. గొప్ప వేదాంతినండీ అంటే వేదాంతంతో ధర్మం చేయి, కాదండీ అయితే ఎలాగో స్వధర్మం చేయి. యుద్ధం చేయి, ఇంతకి మించిన శ్రేయస్సు, లేదు సుమా!

స్వర్గ ద్వార మపావృతమ్ ఎందుకు చెప్పాడు ?

అందులో అస్వర్గ్యం అనే మాట చెప్తున్నాడు. ఆయనే టైటిల్ పెట్టి, ఆ టైటిల్ కింద విషయాన్నంతా వివరిస్తున్నాడు చూడండి. విషయాన్ని ఎలా వివరించాలో కూడా ఆయన దగ్గరే నేర్చుకోవాలి చూడండి. ఈ రోజు ఒక వ్యాసం రాయాలంటే శీర్షిక పెట్టి, సబ్ హెడ్డింగ్‌లు రాస్తే స్పష్టంగా అర్థమవుతుంది. స్పష్టత ముఖ్యం. కృష్ణ పరమాత్మ అనార్యదృష్టం అస్వర్గ్యం, అకీర్తికరం అని చెప్పటం ఒక విషయంలోంచి ఇంకో విషయంలోకి తీసుకెళుతున్న విధానం చూడండి. ఎంత వేదాంత విజ్ఞానాన్ని చూస్తున్నామో, గురువైన వాడు విద్యని ఎంత క్రమంగా, ఎంత అర్థవంతంగా, ఎంత అందంగా అందిస్తున్నాడో చూడండి. కృష్ణ వందే జగద్గురుం. అయన్నుంచి ఎంతో నేర్చుకోవాలి. పర్‌ఫెక్షన్ అంటేనే కృష్ణుడు. ప్రతిదానిలో పర్‌ఫెక్షన్. ఇప్పుడు చెప్తున్న నిస్సంగంగా క్షత్రియధర్మం చేయటం ఆయనదగ్గరే నేర్చుకోవాలి. యాదవులకి

పాలనార్హత లేదు. అందుకే పాలించలేదు ఆయన. కింగ్ మేకరే తప్ప కింగ్ కాలేదాయన. శాస్త్రోచితమైన రక్షణ వ్యవస్థలో వాళ్ళకి భాగం ఉంది. అది ఎక్కడక్కడ చేసుకుంటూనే ఉన్నాడాయన. ఎన్ని వ్యూహాలు పన్నాడు. ఏ ఒక్కరి మీద రాగం లేదు, ద్వేషం లేదు. నేను చెప్తున్న ధర్మానికి నేనే నిదర్శనం. నేను కాదు నన్ను నమ్ముకున్న భీష్మాదులు కూడా నిదర్శనం. నువ్వేదో తెలివైన వాడివనుకుని నీకు పుట్టుకొచ్చిందే బుద్ధి ! అక్కడున్న భీష్ముడ్ని చూడు, కృపాచార్యుడుని చూడు, ద్రోణాచార్యుడిని చూడు. వీళ్ళందరూ మూర్ఖులు అనుకుంటున్నావా ? వాళ్ళకి ఇది గొప్ప మార్గం అని తెలుసు.

ఇప్పుడు క్రమంగా అస్వర్గ్యం అకీర్తికరం దగ్గరికి తీసుకు వెళ్తున్నాడు సబ్జెక్ట్ని. నువ్వు యుద్ధం చేసేముందు ఒక మాట అన్నావు.

అహోబత మహత్ పాపం కర్తుం వ్యవసితా వయమే

యద్రా జ్యసుఖలోభేన హంతుం స్వజనముద్యతాః 1-45

మనం ఎంత పాపం చేయటానికి వచ్చేసాం యుద్ధభూమికి అన్నాడు. దీని వల్ల మనకి పాపమే వస్తుందని పెద్దపెద్ద స్టేట్మెంట్లిచ్చాడు. అందుకు కృష్ణ పరమాత్మ అంటున్నాడు, నువ్వు యుద్ధం చేయకపోతే పూర్తి పాపానికి పోతావు. జాగ్రత్త అన్నాడు. యుద్ధం చేయకపోతే పాపం పోతుందనుకుంటున్నావు కాని యుద్ధం చేయకపోతేనే పాపం వస్తుంది. అదీ విషయం. అక్కడ అర్జునుడు అహోబత మహత్ అన్నమాటకి ఇక్కడ సమాధానం చెప్తున్నాడు.

అథ చేత్త్వమిమం ధర్మ్యం సంగ్రామం నకరిష్యసి

తతః స్వధర్మం కీర్తించ హిత్వా పాపమవాప్స్యపి 2-33

అందువల్ల నువ్వు కీర్తిని పోగొట్టుకుంటావ్, పాపాన్ని పొందుతావు జాగ్రత్త.

స్వధర్మాన్ని విడిచిపెట్టిన వాడికి సద్గతి మాట అటుంచి ఉన్నది కూడా పోయి, దుర్గతి పాలు అవుతావు జాగ్రత్త. స్వధర్మ భ్రష్టత్వాన్ని భారతీయ వేదాంతం సహించదు. అంత స్పష్టంగా చెపుతూ

అకీర్తిం చాపి భూతాని కథయిష్యంతి తేఽవ్యయామ్

సంభావితస్య చాకీర్తిః మరణాదతిరిచ్యతే 2-34

అకీర్తికరం అనే మాట ఉంది కదా! లోకంలో అపకీర్తి రాకుండా చూసుకోవాలి. కొందరు నేను లోకానికి భయపడనండీ అంటారు. లోకానికి భయపడని వారు ఇద్దరు. ఒకరు పరమాత్మ యందే లక్ష్యం కలిగినవారు. ఇంకొకడు పాపాత్ముడు. ఎవడేమనుకున్నా పేపర్లో వీడికిన్ని కుంభ కోణాలున్నాయన్నా ఏం ఫర్వాలేదు, నాదగ్గర డబ్బు ఉన్నంత వరకు నా పదవి పోదు అంటాడు. ఇలాంటి వాడిని యోగీశ్వరుడంటామా చెప్పండి ? పాపాత్ముడు అంటాము. కనుక మనని పాపం నుంచి ఆపటానికి పరమాత్మ లోకం అనేదానికి సృష్టించాడు. కనుక లోకంలో అపకీర్తి వస్తుందనైనా కొందరు పాపం చేయకుండా ఉన్నారు. కొంతమంది నేను లోకోపవాదానికి భయపడనండి అంటారు. ఇంకా కొందరు అతి తెలివికి పోతారు, నేను లోకానికి భయపడనండీ, లోకేశ్వరుడికే భయపడతాను. ఆయన ఎలాగు కనబడడని వీడు అనుకుంటున్నాడు కనుక. కానీ లోకం వేరు, లోకేశ్వరుడు వేరు కాదు, లోకమంతా లోకేశ్వరుడి మయమే! కొంత మంది తాగకుండా, తిరక్కుండా ఉన్నారంటే లోకాపవాదుకి వెరచి అలా ఉన్నారు. అంటే సెల్ఫ్ కంట్రోల్ లేని వాడిని ఏది ఆపింది ? ఈ లోకం ఆపింది. అందుకు లోకాన్ని చాలా గౌరవించాలి. లోకంలో అపకీర్తి వస్తే రానీ అని ఏనాడూ లోకాన్ని తూలనాడకూడదు. లోకంలో సత్కీర్తి కలిగి ఉండాలి.

ఇక్కడ కీర్తి అనే విషయం వచ్చింది కనుక కీర్తి లోకానికి సంబంధించింది కనుక ఈ చర్చ చేస్తున్నాం. కొంత మంది స్వధర్మ నిష్ఠులైన వారికి ఈ లోకం తీరులు మారుతూ ఉంటాయి. ఆ తీరులు మారినప్పుడల్లా ఎక్కడ పాపులారిటి దెబ్బతింటుందో నని స్వధర్మం దెబ్బ తిన్నవాళ్ళు ఉంటారు. ఉదాహరణకి ఎక్కడా తినను, ఎక్కడా తాగను అని ఒక నియమం పెట్టుకుంటారు. అలాగే కూడనివి తినను, తాగను అని నియమం పెట్టుకుంటారు. కాని ఒక పదిమంది ఆ పనే చేసిన వాళ్ళు కనబడ్డారనుకోండి లోకమంటే ఏమిటి యూనివర్స్ మాత్రమే కాదు మన చుట్టూ ఉన్నది కూడా ! చుట్టూ ఉన్నవాళ్ళు కాస్త తీసుకోండి అంటాడు. నేను తీసుకోనండి అంటే అక్కడికి మేమేందో చెడిపోయినట్టు, మీ రేదో చెడనట్టు, మీరు మహాత్ములయినట్టు, అంటూ మొదలెట్టారు. వ్యవస్థ ఎలా మారిపోయిందంటే అది అసలు ఉండటమే గొప్ప విషయం అన్నట్టుగా! అంతకు ముందు తల్లి దండ్రులకి తెలియకుండా చాటుగా తాగేవాళ్ళు, లోకం ఏమనుకుంటుందో అనుకుని భయపడే వాళ్ళు. ఇప్పుడు ఏకంగా ఇళ్ళల్లోనే పెట్టుకుని, పిల్లలని కూడా పక్కన పెట్టుకుని చర్చ చేయటం. ఏమన్నా అంటే ఫ్రెండ్లీగా ఉండాలి పిల్లలతో.

లోకోప వాదానికి లోకాన్ని పాలించే వాడు ఎప్పుడూ జాగ్రత్తగా ఉండాలి. రామచంద్రమూర్తి కూడా లోకోపవాదం రాకుండా చూసుకున్నారు కీర్తి కోసం ఇంత పని చేసాడా ? పాలించేవాడు ధర్మంగా ఉండటమేకాదు, ధర్మంగా కనబడాలి. అదీ విశేషం. ఆ ధర్మం ధర్మంగా కనబడటానికి ప్రయత్నించాలి. ఏదైనా వంక కనపడితే, ఏ రూపం వల్ల తనుచేసిన పని అధర్మంగా కనబడిందో, దాన్ని కొంత దూరం చేసి, తన

పవిత్రతను ఋజువు చేసి, తర్వాత దాన్ని నిరూపణని చేయచ్చు. ఎవడు ఏమనుకున్నా నేను నేనే అనేటటువంటి కుంభకోణాల పాలకులొచ్చినప్పుడు మనకు రాముడు ఎక్కడ అర్థమవుతాడు ? లోకోపవాదం లోకం యొక్క కీర్తి కూడా ఎంత మేరకు అవసరం అనేది కృష్ణపరమాత్మ మనకు చెప్తున్నాడు.

అకీర్తించాపి భూతాని కథయిష్యంతి తేఽవ్యయామ్

సంభావితస్య చాకీర్తిః మరణాదతి రిచ్యతే 2-34

నీ అపకీర్తి భూమి మీద స్థిరంగా నిలిచిపోతుంది సుమా అని చెప్పాడు చూసారా? క్షత్రియుడు తన స్వధర్మాన్ని విడిచి పెట్టి వెళ్ళిపోతే దానివల్ల వచ్చిన అపకీర్తి గురించి ఈ భూతములన్నీ అనుకుంటాయి అన్నాడు. భూతములంటే మానవులే కాదు! స్వధర్మభ్రష్టుడైన పాపాత్ముడిని పంచభూతాలు కూడా నిందిస్తాయి. అదీ విశేషం. భూతములన్నీ అంటాయిట కీర్తికి ఎంత స్థిరత్వముందో, అపకీర్తికి ఇంకా ఎక్కువ స్థిరత్వముంటుందని. నీ అపకీర్తికి కూడా కాలములుంటాయి. భూతములుంటాయి అంటే పంచభూతములు కూడా నీ అపకీర్తికి అల్లల్లాడిపోతాయి. ఆ అధర్మం నుంచి మిమ్మల్ని రక్షించేవాళ్ళెవరా అని తపించిపోతాయి. మేమున్నామని క్షత్రియుడు ముందుండాలి ఎప్పుడూ! అలా కాకుండా వీళ్ళు ధర్మరక్షణ నుంచి తప్పి పోతే, ఆ భూతములు కూడా బాధపడతాయి, శపిస్తాయి. ఆ కారణం చేత అపకీర్తి అనేది మిగిలిపోతుంది సుమా! దాని కన్నా మరణం మేలు !

ఇప్పుడు నువ్వు యుద్ధం నుంచి వెనక్కి వెళ్ళిపోతే నీసాటి వాళ్ళందరూ ఏం మాట్లాడతారో తెలుసా ?

భయాద్రణా దుపరతం మంస్యంతే త్వాం మహారథాః

యేషాం చత్వం బహుమతో భూత్వా యాస్యసి లాఘవమ్   2-35

ఇప్పటివరకూ అర్జునుడంటే వాళ్ళకి నీ మీద శత్రుభావం ఉన్నప్పటికీ చులకన భావం లేదు. నువ్వేమిటో అందరికీ తెలుసు. గడగడలాడతారు నువ్వంటే. దుర్యోధనుడిక్కూడా నువ్వంటే భయం, కర్ణుడికి కూడా నువ్వంటే భయం. కాని ఆ భయాన్ని కప్పి పుచ్చుకుని నేను న్నానులే జాగ్రత్తగా ఉండు, అని దుర్యోధనుడుని ఇక్కడిదాకా తెచ్చాడు. కౌరవసేనలో వాళ్ళందరినీ భయపెట్టే స్థానంలో ఉన్నది అర్జునుడొక్కడే. ఎందుకంటే ఆయన దగ్గర తపశ్శక్తి, అస్త్రశక్తి, బాహు పరాక్రమం అన్నీ ఉన్నాయి. కృష్ణుడు అందుకే ఆయన ఒక్కడి దగ్గరే ఉన్నాడు. అదీ విశేషం. విజయుడ్ని ప్రధానంగా పెట్టాడు.

భారతంలో అనేక చోట్ల కనిపిస్తుంది. ఏవైనప్పటికీ కూడా నేను అర్జునుడినే చూస్తాను. అర్జునుడికంటే నాకు ప్రియమైన వాడు మరొకడు లేడు అన్నాడు. ఎందుకంటే తాను సాధించుకున్న అవతార ప్రయోజనాల్లో ప్రధాన ఉపకరంగా వాడదల్చుకున్నది తన అంశయైన నరుడు అర్జునుడు. అటువంటి అర్జునుడు, జగదేక ధానుష్కుడు, పేరులోనే విజయుడు, ఫల్గుణుడు. పిడుగులనే భయపెట్టివాడు, అటువంటి ఆయన పట్ల ఇంత వరకూ అందరికీ గౌరవమే ఉన్నది. మహారథులు, అతిరథులు అయినటువంటి భీష్మద్రోణాదులందరూ ఇంత వరకూ గౌరవిస్తున్నారు. ఇప్పుడు గాని నువ్వు యుద్ధం మానేస్తే నువ్వు వేదాంతి అయిపోయావనో, కరుణామయుడి వైపోయావనో వాళ్ళు బిరుదులివ్వరు. పిరికివాడైపోయి యుద్ధం నుంచి పారిపోయావంటారు. కృష్ణ పరమాత్మ ఎంత ప్రాక్టికల్‌గా మాట్లాడుతున్నాడో చూడండి. అందుకే వేదాంతి చక్కగా లౌకిక జ్ఞానం ఉన్నవాడే అవుతాడు. మన మనుకునే లౌకిక

జ్ఞానం లేకపోవచ్చు (కుట్రలు వేయటం ! ఇటూ అటూ తిప్పటం లాంటివి) కాని, లోకం యొక్క పూర్తి అవగాహన ఉంటుంది. ఏం చేస్తే ఏది వస్తుంది. ఏం వస్తే ఏం జరుగుతుంది అనే పూర్ణ అవగాహన ఉంటుంది.

ఎందుకు ?

బ్రహ్మవిద్య పూర్ణవిద్య. పూర్ణవిద్యలో లోక విద్య ఒక చిన్న భాగం. అందుకే అది కూడా తెలుస్తుంది. ఆ కారణం చేతనే ఇక్కడ చాలా స్పష్టంగా చెప్తున్నాడు. వాళ్ళు నీ గురించి ఏం మాట్లాడతారు తెలుసా ?

అవాచ్య వాతాంశ్చ బహూన్ వదిష్యంతి తవాహితాః

నిందంతస్తవ సామర్థ్యం తతో దుఃఖతరం ను కిమ్ 2-36

వాళ్ళు శత్రువులు. నువ్వు పారిపోతే నీ గురించి అవాచ్య వాదులవుతారు. మాట్లాడకూడని మాటలన్నీ నీ గురించి మాట్లాడుతారు సుమా. నీ సామర్థ్యాన్నే నిందిస్తారు. అంతకంటే దుఃఖం ఏముంటుంది ?

ఇక్కడితో మూడింటిని క్లారిఫై చేసేసాడు. ఏమిటవి?

అనార్యదృష్టం, అస్వర్యం, అకీర్తికరం అర్జునా ! నువ్వు యుద్ధం మానేయటాన్ని మూడు ఏంగిల్స్‌లోనుంచి చెప్తున్నారు. ఫిజికల్ లెవల్, మారల్ లెవల్, స్పిరిచ్యువల్ లెవల్. భారతీయ ధర్మం ఏవిధంగా పెట్టబడిందీ అంటే మూడు కలిసుండే ధర్మమే ధర్మం. విడివిడిగా లేదు. మిగిలిన దేశాల్లో లోక వ్యవహారం వేరు, వేదాంతం వేరు. అంటే ఫిలాసఫీ వేరు, స్పిరిచ్యుయాలిటీ వేరు, మెటీరియల్ అవుట్ లుక్ వేరు. ఒక్క భారత దేశంలోనే అన్ని సమన్వయింపబడతాయి, అన్నీ సమగ్రంగా ఉంటాయి. ఆ వ్యవస్థ యిక్కడ ఋషులు ఏర్పాటు చేసారు. భారతీయ ధర్మంలో, ధర్మాచరణలోనే

వేదాంతం ఉంది, విజ్ఞానమూ ఉన్నది, లౌకికమూ ఉన్నది. అన్నీ కలబోసిన ఒక సమగ్రమైన వ్యవస్థ ఋషులు ఏర్పాటు చేసారు. ఆ వ్యవస్థని పదిల పరచటానికి కృష్ణ పరమాత్మ అవతరించాడు. అదే స్థాపకాయితి ధర్మస్య అంటే ధర్మస్థాపన అంటే అది. ధర్మసంస్థాపనార్థాయ అంటే ఉద్దేశం అది. భారతీయ వ్యవస్థ లోక వ్యవహారం కోసం ఏర్పాటు చేసిన వ్యవస్థ మాత్రమే కాదు. లోక, పారలౌకిక, పారమార్థిక ప్రయోజనములు మూడూ నెరవేర్చే పరిపూర్ణ వ్యవస్థ! ఋషులు ఏర్పరచిన భౌతిక జీవన విధానం. ఏదో ఒక దృక్పథంలో చూస్తే అర్థం కాదిది. సమగ్రంగా కలిపి చూడాలి. కలిపి చూడటమెలాగో కృష్ణ పరమాత్మ ఎంత చక్కగా చెప్పాడో చూడండి.

కృష్ణ పరమాత్మ ఎటువంటి గురువు ?

సమన్వయ కర్త ! సమన్వయం చేసేవాడే జగద్గురువు కాని విడదీసి చేసేవాడు కాదు. విడదీసి చూసే సంస్కృతి కూడా పడమటి గాలుల్నుంచే వచ్చిందని మనకు తెలుసు ! డివైడ్ అండ్ రూల్ ! ఆఖరికి శరీరాన్ని కూడా స్పెషలిస్ట్ల పేరుతో దేనికది ముక్కలు చేసి పరిశీలిస్తున్నారు. ఒకదానితో ఒకదానికి ఉన్న అనుబంధం కూడా మర్చిపోతున్నారు. ప్రత్యేక అధ్యయనం చేయటం మంచిదేకాని, అన్నిటిలో ఉండే సంబంధం కూడ తెలియాలి. అందుకే భారతీయ ధర్మం ఇంత సమగ్ర మయినది. దాన్నే కృష్ణ పరమాత్మ చెప్తున్నాడు. ఆదియైన, సనాతనమైన ఆర్యధర్మమేదో దాన్ని ప్రతిష్ఠిస్తూ మొత్తానికి చెప్పదలుచుకున్నదేమిమి? యుద్ధంలో మరణించావా ? ఎందుకంటున్నాడిలా ? ఏమో ! కొందరు బయటికి వేదాంతంతో చెప్పొచ్చు గాని అసలు భయమేమిటో ! ద్రోణాదులని, వీళ్ళందరినీ చూసి నేను ఉంటానో లేదో నని డౌటు వచ్చిందా ! ఏం ఫర్వాలేదు. అలా కూడా మందలించవచ్చు. ఎందుకంటే ఈ

సృష్టిలో అసలు కారణం ఒకటి, మనం చెప్పే కారణం ఒకటి. పెద్ద హిపోక్రసీ ఉంటుంది మీరే ఆలోచించండి. ఒకడి మీద మనకి చాలా ద్వేషం ఉంటుంది కాని బయటికి రాదు. ఒక చోట కలుస్తాం వాడిని నవ్వుతూ పలకరిస్తాం. వాడేదో చిన్న పొరపాటు చేస్తాడు వెంటనే అవతలి వాడు ఇంత తప్పు చేసావ్ అంటాడు. అనగానే 'అవునండీ, వీడు చేసాడు నేనూ చూసాను అంటాం. ఇది చాలా తప్పుకదండీ ! వీడు గతంలో కూడా ఇలాంటివే చేసాడు అని మొదలెట్టాం. తెల్సినవాడెవడైనా నీకు వాడి మీదే ముందే కడుపుమంట ఉంది కదా, దొరికింది కదాని వడ్డిస్తున్నావు అంటే ఛఛ నాకదేం లేదు, నేను చాలా ప్యూర్ అంటాం. వాడు చేసింది అధర్మం, నేను ధర్మం మాట్లాడుతున్నాను అంటాం. ఎన్ని ధర్మ పన్నాలు, ఎన్ని లాజిక్కులు చెప్పినా తెలివైన వాడికి తెలుస్తుంది ఇది నిజం కాదు, వీడికి కడుపులో మంట ఉంది వాడి మీద అని! ఇలాటి లాజిక్కులు ధర్మపన్నాలు అన్నీ కూడా మన బలహీనతలు కప్పి పుచ్చుకోవటానికి. మన తప్పులను, కప్పిపుచ్చుకోవటానికే ! ధర్మ శాస్త్రాలలో ఉదాహరణలు కూడా మనమిస్తాం. అందుకని అర్జునుడు అలా క్కూడా మాట్లాడాడా ? అయిఉండవచ్చు, దానిక్కూడా మందు ఇస్తున్నాడు కృష్ణ పరమాత్మ.

హతోవా ప్రాప్స్యసి స్వర్గం జిత్వా నా భోక్ష్యసే మహీమ్
తస్మాదుత్తిష్ఠ కౌంతేయ యుద్ధాయ కృత నిశ్చయః 2-37

మరణిస్తానని భయపడుతున్నావా ? ఏం ఫర్వాలేదు. మరణిస్తే స్వర్గానికి పోతావు. బ్రతికితే రాజ్యాన్ని అనుభవిస్తావు. ఈ రెండు కారణాలు చాలు యుద్ధం చేయటానికి. మరణభయంతో ఆగనక్కరలేదు. మరణించేవి దేహాలు కాదు అని ఇవ్వన్నీ చెప్పినా, మరణభయంతోనూ ఆగకు, వాళ్ళను చంపేస్తాననీ భయపడకు. ఏది జరిగినా నీకు

మంచిదే! అలాంటి ఒక యోగం ఒక్క యుద్ధంలోనే, అదీ క్షత్రియుడి కుంది. అదీ విశేషం కనుక ఆయన చెప్పేడు కనుక అందరం వెళ్ళి కొట్టేస్తాం అనకూడదు. తత్ స్థానంలో! అంటే అక్షణ స్థానంలో ఉన్నవాడు అని అర్థం.

స్వధర్మమంటే ఏమిటి ?

స్వధర్మమంటే ఏమిటో స్పష్టమైన అవగాహన కలిగి ఉండటం  చాలా అవసరం. స్వధర్మానికి నది ఉపమానం తీసుకుందాం. ఒక నదిలో పడవప్రయాణం చేస్తున్నాడు ఒకడు, నది ఒడ్డుకి చేరటానికి. ఇదే నదికి పారలల్‌గా ఒకరోడ్డు ఉంది. దానిమీద కారులో ఈలవేసుకుంటూ నడుపుకుంటూ వెళ్తున్నాడు ఒకడు. ఇద్దరూ ఒకరికి ఒకరు కనిపిస్తున్నారు. నదిలో ఉన్నవాడు నేను నదిలో ఉన్నాను కనుక, నాది పడవగనుక, నేను ఇలాగే నడపాలి అనుకుంటే ఏ బాధా లేదు. కాని కొంత సేపటికి చిన్ని అసూయ వచ్చింది. బాధలెలా వస్తాయో చూడండి. వాడే చేయాలా, నేనెందుకు చేయకూడదు? అక్కడ వస్తాయి. అదే స్వధర్మ భ్రష్టత్వం. కలి పురుషుడు దానికి పెడతాడన్నమాట.

రామాయణంలో కథ గుర్తుందా ?

రాముడు, లక్ష్మణుడు, సీతా వెళ్తున్నప్పుడు ఒక చోట కొచ్చేసరికి ఈయన వన్నీ నేను మోయాలా అనుకుని లక్ష్మణుడు, ‘ఏయ్ ఇంద తీసుకో? నీ ఎక్కువేమిటి, నా తక్కువేమిటి’ ? అన్నాడు. ముందు మోయటానికి లాజిక్కేముంది ఇప్పుడు మోయక పోవటానికి లాజిక్కేముంది ? కొంత దూరం వెళ్ళాక, ‘అయ్యో రామచంద్రా నువ్వు మోస్తున్నావే నేను నీ సేవకుడిని ఉన్నానే’ అని మళ్ళీ తీసుకున్నాడుట. రామచంద్రుల వారు నవ్వుకున్నారుట. సీతమ్మవారు, ‘అప్పుడేమో అలా అన్నాడు, ఇప్పుడేమో ఇలా అన్నాడు. అప్పుడూ నవ్వి ఊరుకున్నావు, ఇప్పుడూ నవ్వి ఊరుకున్నావేం’ అంటే ఆయన

వచ్చిన చోటంతా రాక్షసులందరూ నివాసమున్న చోటు వాళ్ళ ఎనర్జీ అక్కడ నిండిపోయింది, ఆ గాలి తగిలి బుద్ధి పుట్టిందిలే అన్నాడుట రామచంద్రమూర్తి.

అలాగే కలియుగంలో ప్రవేశిస్తే వాళ్ళ ఎక్కువేమిటి, నాతక్కువేమిటి ? నేనెందుకు చేయకూడదు అని స్వధర్మాన్ని విడిచిపెట్టి పరధర్మం మీద ఆసక్తి కలిగి, స్వధర్మం భ్రష్టత్రం కలుగుతుంది. పరధర్మం ఆచరణ చేయటమనే నిషేదాత్మక కర్మాచరణ చేయటం వస్తుంది. తద్వారా నాశనమనేది వస్తుంది. కృష్ణ పరమాత్మకి అది తెలుసు.

కలియుగ మనేది ఒకటి రాబోతుంది, అక్కడ ఈ కన్ఫ్యూజన్లు చాలా ఉంటాయి. వేదాంతంలో కొందరు, వేదంతో కొందరూ విడిపోతారు. భౌతికత్వంతో మరి కొందరు విడిపోతారు, ఈ స్వధర్మాలు, పరధర్మాలు మొత్తం అటూ ఇటూ అయిపోతాయి. అప్పుడు తరించాలని ఎవడైనా ఒక్కడు అనుకుంటే వాడికి నామాట పనికి కావాలని అర్జునుని పెట్టుకుని మనకోసం చెప్పాడు. అదీ విషయం.

ఇక్కడ నువ్వేమిటి అన్నది గమనించాలి. నదిలో వెళుతున్నవాడి విషయానికి వెనక్కివస్తే, ఈ నదిలో వెళ్తున్నవాడు నేను నదిలో వెళ్తున్నాను గనుక నాకు తగ్గట్టు నేను వెళుతున్నాను అనుకుంటే ఫర్వాలేదు. రోడ్డుమీద వెళ్తున్నవాడు అలాగే అనుకున్నా ఫర్వాలేదు. కాని పొరపాటున నదిలో వాడు, 'వాడు చక్కగా ఏసి వేసుకుని ఈల వేసుకుంటూ డ్రైవ్ చేస్తున్నాడు. వాడి భుజానికి సమస్య లేదు నాకు మాత్రం ఈ తెడ్డు ఒక సమస్య. నా కెందుకు' అని ఆ రెండు తెడ్లనీ పారేసి ఈల వేసాడనుకోండి, ఏమవుతాడు వాడు ? నదిలో వెళ్ళే పడవలో ఉన్నవాడి లక్ష్యమూ ఒడ్డుకి చేరటమే, కారులో వెళ్ళే వాడి లక్ష్యమూ ఆ ఒడ్డుకి చేరటమే! కాని వాడు రోడ్డుమీద ఉన్నాడు కనుక, కారులో వెళుతున్నాడు. వీడు నీటిలో ఉన్నాడు కనుక వీడికి నీటి ధర్మం

తెలియాలి, పడవ ధర్మం తెలియాలి, ఆ పడవకీ నీటికీ అనుగుణంగా తాను ఎలా మలచబడాలో తెలియాలి. రెండూ తెలియాలి. నదిలో కూడా ఎన్ని తేడాలున్నాయో చూడండి. ఒకడేమో షిప్పులో వెళ్ళిపోతాడు. ఒకడేమో మోటార్ బోట్‌లో వెళ్ళుపోతాడు. వాళ్ళు హాయిగా వెళ్ళి పోతున్నారు, నేనేమో తెడ్డు వేసుకుంటూ కూర్చోవాలా అంటే ఏం చేస్తాం, నువ్వు ఆ దారిలో వచ్చావ్, హాయిగా వెళ్ళు ! దానిలో ఎంత ఎలర్ట్‌గా వెళ్ళగలవో అంత జాగ్రత్తగా వెళ్ళి, దాన్ని కాపాడుకుంటూ వెళ్ళు! లక్షమేమిటి ? ఒడ్డు. అలాగే కారులో ఉన్న వాడు ఆ సుఖానికి మురిసిపోయి, నిద్రపోయాడనుకోండి వాడు వెళ్ళగలడా? అలాగే వాడు, వీడితో పోల్చుకోకుండా చక్కగా వెళ్ళిపోతే లక్ష్యానికి చేరగలడా, లేదా ? తాను ఉన్న చోటు, తాను ఉన్న ఉపాధి, దాని కనుగుణమైన ధర్మంతో, లక్ష్యం ఈశ్వరుడి మీద పెట్టుకున్నవాడు తప్పకుండా చేరతాడు అదీ స్వధర్మమంటే! ఎక్కువ తక్కువ అందులో లేవు. అది మనం అర్థం చేసుకుంటే వర్ణాశ్రమ ధర్మాలు అర్థం అవుతాయి, లోకంలో ఉన్న హోదాలు అర్థమవుతాయి. వాడెక్కువ ఏమిటి, నా తక్కువ ఏమిటి అనుకోకుండా నీ కర్తవ్యం తెలుసుకో! పోటీలనవసరం. సృష్టిలో ఎవడికి వాడే ! పోలిక వల్ల స్వధర్మ భ్రష్టత్వం వస్తుంది. నువ్వేమిటో నువ్వు పరిశీలించుకోవటానికే సమయం చాలనప్పుడు, అవతలి వారితో నువ్వు పోల్చి చూసుకుని, గొడవలు దాకా ఎందుకు ? స్వధర్మం గురించి తెల్సుకోవాల్సిన విషయం ఇది.

స్వధర్మమంటే మనకి స్పష్టమైన అవగాహన కలగాలంటే ఏం చేయాలి ?

మన మేమిటి అనుకోవాలి. ఆత్మవిషయం వదిలేయండి. 'ఆత్మ సర్వగతః' ఎవరో అన్నారు అంతా ఒకటే అయినప్పుడు ఈ నియమం, ఆ నియమం అంటూ

పట్టింపులేమిటి ? ఏదైనా తినచ్చు, ఎక్కడికన్నా వెళ్ళచ్చు కదా అని. కాని ఆత్మ అసలు తినదు తెలుసా ? ఆత్మకి తిండే అక్కరలేదు. తినేది దేహం! ఏదైనా తినచ్చు అంటే నిప్పులు నోట్లో వేసుకుంటావా ? కనుక ఆత్మజ్ఞానం తెలియటం ఆత్మ దృష్ట్యా సర్వసమం కాని దేహం దృష్ట్యా సర్వసమం కాదు. ఇది తెలియక వేదాంతం చెప్పిన సర్వసమాత్వాన్ని అర్థం చేసుకోలేం. సమత్వ మనే దాన్ని సమన్వయంతో తెలుసుకోవాలే తప్ప సాంకర్యంతో తెలుసుకునేది కాదు. సాంకర్యం వేరు. సమన్వయం వేరు ! ధర్మసాంకర్యం ఏర్పడకూడదు. కృష్ణ పరమాత్మ ఘోష అంతా అదే ! లేకపోతే ఇంత గీత పుడుతుందా? సాంకర్యం కాదు సమన్వయం. సమత్వం సమన్వయంలోనే తప్ప సాంకర్యంతో కాదు. అంత చక్కగా ఆయన చెప్తున్నారు.

స్వధర్మం గురించి ఇంకా అర్థం కావాలంటే చూడండి!

ఇద్దరు వ్యక్తులు రెండు పెట్టెల్లో బంధింపబడ్డారు. ఒకడు గాజు పెట్టెలో బంధింపబడ్డాడు, ఇంకొకడు ఇనపపెట్టెలో బంధింపబడ్డాడు. ఇప్పుడు వాళ్ళిద్దరినీ వెలికి తీయాలి. ఎలా తీస్తారు ? ఇద్దరూ మనుష్యులే ! దెబ్బతగిలితే ఇద్దరికీ రక్తం వస్తుంది. ఇద్దరికీ ప్రమాదమే ! కాని వాళ్ళని ఎలా వెలికి తీయాలి ? తెలివైన వాడు ఎలా తీస్తాడు ? వాళ్ళు ఏ పెట్టెల్లో ఉన్నారో మర్చిపోకూడదు. ఇనప్పెట్టెలో ఉన్నవాడికి కొంచెం వెనక్కి వెళ్ళండి, నేను సుత్తితో కొడతాను అని బయటినుంచి అరిచి గట్టిగా సుత్తికొట్టి తీస్తాడు వాడిని. కాని అదే మోటు తనమే గాజు పెట్టెలో ఉన్నవాడికి చూపిస్తే వాడు బయటికి రానక్కరలేదు. వాడిని గాజుని కోసే బ్లేడు లాంటిది తెచ్చి దానితో జాగ్రత్తగా కోసి బయటికి తెచ్చారు. అవునా లేదా ? లక్ష్యం ఏమిటి ? ఇద్దరినీ కాపాడటమే! ఇద్దరినీ కాపాడటమే! కాని విధానమేమిటి ? చాలా తేడా ఉంది.

అందరి లక్ష్యం పరమాత్మ అందుకు సందేహం లేదు. అందుకే శాస్త్రం కూడా ధర్మాన్ని సాపేక్ష మన్నది. ఈ ఉపాధులకి అనుగుణంగా ధర్మం ఉంటుంది కాని ఎక్కువ తక్కువలుగా ధర్మం లేదు. స్త్రీ ధర్మం పురుష ధర్మం అని చెప్పారంటే ఎందుకంత వైషమ్యం అంటే వాళ్ళ వైషమ్యం గురించి చెప్పటానికి మన ఎఱుక ఎంత ? స్త్రీ పురుష బేధాలు, వర్ణాశ్రమ బేదాలకి అతీతులు ఋషులు. కాని మనం తన్మిబద్ధులం. ఈ పెట్టేలోంచి బయటికి రావటానికి ఉపాయాలేమిటో చెప్పారు, ఆప్త వాక్యాలేమిటో చెప్పారు. శాస్త్ర వాక్యాలు ఇవి. మిడి మిడి జ్ఞానంతో వాడిని కాదనరాదు. ఎప్పుడో విజ్ఞానంతో వచ్చినప్పుడు ఋజువవచ్చు. కాని ఇప్పుడే మిడిమిడి జ్ఞానంతో కాదంటే చాలా ప్రమాదానికి గురవుతాం. స్వధర్మమంటే ఒక వ్యక్తి ఏ ఉపాధిలో ఉన్నాడో ఆ ఉపాధి కనుగుణమైన ధర్మాన్ని పాటించటం. అది ఎలా పాటించాలి ?

ముందు మానవో పాధిలో మనమున్నాం కనుక మానవోపాధి గతమైన శరీరధర్మం అది ప్రకృతి పరంగా అది చేస్తున్న వీడి బుద్ధి వేరు, జంతువుల బుద్ధి వేరు. కనుక ఈ ఉపాధిలో ఉన్నవాడికి ప్రాధమిక విభజన స్త్రీ, పురుషుడు ఆ తరువాత ఏయింట్లో పుట్టాడో, ఆ యింటి ధర్మం . పరంపరాగత మైన ఒక ధర్మం ఉంటుంది. ఆ యింటికి కులాచారపరంగానైతే నేమి, మరి ఒక పరంగానైతే నేమి, రాబడిన పరంపర ఒకటి ఉంటుంది. ఆ ధర్మాన్ని పాటించుకోవాలి. ఆ తర్వాత వాడు తల్లితండ్రులకి బిడ్డ, అన్నదమ్ములకి సోదరుడు, అక్కచెల్లెళ్ళకి సోదరుడు, ఒక వర్ణానికి చెందిన వాడు. ఒక ఆశ్రమానికి చెందిన వాడు ఇవన్నింటినీ వాడు ఫుల్‌ఫిల్ చేసినప్పుడే స్వధర్మాన్ని పాటించిన వాడవుతాడు బ్రహ్మచారి బ్రహ్మచర్యాన్నే చేయాలి. సరదాగా గృహస్థాశ్రమం చేస్తానంటే కుదరదు. గృహస్థా శ్రమంలో ఉన్నవాడు సరదాగా సన్యాసం చేస్తానంటే కుదరదు.

ఒకళ్ళ ధర్మం ఒకళ్ళు చేయకూడదు. వృత్తులంటారా ? వృత్తులు వేరు, ధర్మములు వేరు. ఇవి తెలియక చాలా మంది కన్ఫ్యూజ్ అయి గీతసారాంశం ఏమిటంటే నీ వృత్తి నువ్వు చేసుకో అన్నది కనుక నేను పొద్దున్న లేచి, ఇంకో ఆలోచన లేకుండా రాత్రి 12 వరకూ నా ఆఫీసులో నా ఎక్కౌంటులే చూస్తాను. అదే నాకు వర్షిప్ అంటే కుదరదు. వర్క్ ఈజ్ వర్షిప్, డ్యూటీ ఈజ్ గాడ్ ఈ డైలాగ్‌లన్నీ చాలా వచ్చాయి. కాని నిజానికి ఆ సమయంలో ఈశ్వరుడిని స్మరించాడా ? ఆ పని లావాదేవీలలో, వాటిలో పుట్టే రాగద్వేషాలు, ఆట్రిక్కులు, ఆ వచనాలు ఇవన్నీ చేసేస్తూ వర్క్ ఈజ్ వర్షిప్ అన్నారు గనుక నేను గీతని పాటిస్తున్నాను అని ఎప్పుడో పలవరింత మాట అన్నవాడు కర్మయోగి కాదు. నిజంగా కర్మని యోగంగా చేసేటప్పుడు ఎక్కడా పొరపాటున కూడా లోకంకోసం పాపం చేయకుండా, పాపం వల్ల లాభం వస్తుందన్నా కూడా పాపానికి పోకుండా ఉంటాడు. ఎందుకంటే పరమేశ్వరుడు ఉన్నాడు, శాశ్వతమైన ఆత్మ ఒకటి ఉంది అనే ఎఱుక ఉన్న వాడు పాపానికి పోడు.

ఏం చేస్తామండీ, అది వ్యాపార ధర్మం అంటారు. అది వ్యాపార ధర్మం కాదు, వ్యాపార లక్షణం. లక్షణం వేరు, ధర్మం వేరు. లాభం రావాలని పాపం చేసి కర్మయోగం కింద జమకట్టేస్తే ఒప్పుకోం. కర్మ చేయటం వేరు, కర్మయోగం వేరు, దుష్కర్మ చేయటం వేరు. వీటిని అర్థం చేసుకోక కన్ఫ్యూజ్ అయి పోతూంటాం మనం. అలా జాగ్రత్తగా తెలుసుకోవాల్సిన విషయాలివి.

వృత్తి చేసేసి, స్వధర్మం చేసామనుకోవద్దు, బిడ్డగా, భర్తగా, తండ్రిగా, అన్నగా, వర్ణధర్మంతో ఆశ్రమ ధర్మంగా పాటిస్తూ వృత్తిని కూడా ఆ ధర్మంతో పాటించటం కలిపి స్వధర్మం అవుతుంది. అంతేకాని, అవన్నీ విడిచిపెట్టి, అదొక్కటి చేసి స్వధర్మమండీ

అంటే నీకు డబ్బు మీద ఉన్న తీవ్రమైన తపనతో, వర్కహోలిక్‌గా అయిపోయి ఇదే శాశ్వతమనుకుని చేసి, దానికి స్వధర్మం అనే అపార్థం కృష్ణుడి వచనాలకి కల్పించుకుని, భ్రష్టపడవద్దు.

ఉదయం లేచి, సంధ్యావందనం చేయకుండా పరిగెడుతాడు, క్యారేజ్ సర్దేసుకుని, ఏం చేస్తామండీ స్వధర్మం అంటాడు. అదెంత స్వధర్మమో ఇది కూడా స్వధర్మమే, టైమ లేదండీ ఒకమాట ఆటైము లేనివాడికి టీవీ ముందు, గంటలు గంటలు కూర్చుని, రిమోట్ నొక్కే తీరికెలా వచ్చింది? అనుష్టానానికి సమయం లేదు అనటం ఆత్మవంచన మాత్రమే. ఎన్నిటికి సమయం లేదు, ఎంత వేస్ట్ చేస్తున్నాం ? మనసుంటే మార్గం ఉంటుంది. పది నిముషాలు చేయవలసిన అనుష్టానానికి మరో పది నిముషాలు ముందు లేస్తే సరిపోతుంది. కాని ఆ కొద్దిపాటి ధర్మం నిన్ను ఎంత కాపాడుతుందో నీకు తెలీదు. ఆ ధర్మం ఆయన కోసమా ? మనం తరించటానికే ! ఇందాక అద్దం పెట్టెలో వాడిని, ఇనుప పెట్టెలో వాడిని జాగ్రత్తగా తీయటం ఎవరికోసం, తీసే వాడికోసమా ? వచ్చేవాడికోసం.

స్వధర్మమంటే ఇంత విస్మృతి అయినది. స్వధర్మం అంటే ఎలా గుర్తుంపబడుతున్నామో దానికి తగ్గట్టు ప్రవర్తించటం. సమాజంగా ఫలానా వాడిగా గుర్తింపబడుతున్నాం, ఇంట్లో పిల్లవాడిగా గుర్తింపబడుతున్నాం. ఇవన్నీ దేహ ధర్మములే, ఒప్పుకుంటాం. కాని అందులో ఉన్నంతకాలం దాన్ని పాటిస్తూ, భవదర్పణ బుద్ధితో చేయాలి. జ్ఞానముంటే జ్ఞానంలేదా, నా స్వధర్మం నేను చేస్తున్నాను, నా తల్లిదండ్రులని నేను చూస్తున్నాను. ఇలా ఇవి చేస్తే చాలు, నువ్వు పాపానికి పోవు. స్వధర్మం కీర్తించ హిత్వా పాపమవాప్స్యపి ఇంత చక్కగా చెప్పి

హతోవా.. కౌంతేయా 2-37

మాటిమాటికి కౌంతేయా, భారతా ఈ రెండుమాటలు మీకు కనబడతాయి. మాత్రాస్పర్శాసు కౌంతేయా అక్కడకూడా. చివరి మాట మళ్ళీ భారతా!

ఎందుకు ఇవి మార్చి మార్చి చెప్తున్నారు ?

స్వధర్మం గుర్తుచేయటానికి ! భరతుల వంశంలో పుట్టావు. కుంతీదేవి పుత్రుడివి. అటూ ఇటూ కూడా వంశసుద్ధి కలగినవాడవు. ఉభయులు కూడా క్షత్రియులు. వాళ్ళ కొడుకువు నువ్వు. కనుక భారతా, కౌంతేయా అనటం లో నీ స్వధర్మం గుర్తు తెచ్చుకో! ఇంత విస్తృతమైన స్వధర్మం పట్ల అవగాహన. కలిగి, అంత చక్కటి వ్యవస్థని ఏర్పరచింది భారతదేశం. మళ్ళీ చెప్పుకోవటమేమిటంటే స్వధర్మంలో ఎక్కువ, తక్కువలు లేవు. ఎవరి బాధ్యతని వాడు సక్రమంగా నిర్వర్తించినప్పుడు వాడే ఎక్కువ. బాధ్యతని తప్పినవాడెవడైనా వాడు భ్రష్టుడే ! అదీ గీత చెప్పిన తీర్మాణం. ఎక్కువ, తక్కువలు కల్పితములే కాని, స్వధర్మాచరణ, ఈశ్వర బుద్ధిగా చేసిన వాడే ఎక్కువ అని చెప్పటం.

ఇక్కడ వరకూ లౌకికంగా చెప్పినట్టు ఉంటుంది. అస్వర్గ్యం, అకీర్తికరం, కాని మళ్ళీ ఏది చెప్పాడో అక్కడికి తీసుకు వెళ్తున్నాడు. అసలు లక్ష్యమైన అనార్యదృష్టం నుంచి విషయముందే అది ముఖ్యం మనకి. ఆర్యులు ఒప్పుకునే ఆత్మజ్ఞాన మార్గమే ముఖ్యం. అందుకే

సుఖ దుఃఖే సమే కృత్వా లాభాలాభౌ జయాజయౌ

తతో యుద్ధాయ యుజ్యస్వ నైవం పాపమవాప్స్యపి 2-38

ఇందాక ఏమన్నాడు ?

పాపానికి పోతావన్నాడు ! ఇప్పుడు నైవం 'పాపమవాప్స్యసి' ఆ బోధించటం

చూడండి. అవసరమైనప్పుడు గొంతుపెంచుతున్నాడు. అవసరం లేనప్పుడు తగ్గిస్తున్నాడు. అంటే ఆయన ఉద్దేశం నిందించటమో, అవమానించటమో, కసురుకోవటమో కాదు. కాపాడుకోవటము. అదీ విశేషం. విషయాన్ని గట్టిగా నొక్కి చెప్పేటప్పుడు వచ్చేది అరుపు. అది నిందించటం కాదు. అలాగే తరవాతి మాట, ఇలా చేయి నాయినా పాపానికి పోవు. అలా చేస్తే పాపానికి పోతావు లో కాఠిన్యం ఉంది. ఇలా చేస్తే పాపానికి పోవులో ఓదార్పు ఉంది. రెండూ చెప్తున్నాడు ఇక్కడ. కొట్టి, మందు రాస్తుంది తల్లి.

'హతో వా ప్రాప్స్యసి స్వర్గం'. చెప్పేశాక, నేను చచ్చిపోతానని భయపడతా ననుకున్నావా అని అంటాడేమోనని, కాదు నువ్వు జ్ఞానస్థాయిలోనే మాట్లాడావని నేను అనుకుంటా ? అదే నిజమైతే సుఖదుఃఖాలని సమంగా భావించి, లాభాలాభాలు జయాజయాలని కూడా సమంగా భావించి యుద్ధం చేయి. స్వధర్మం చేసే వాడు దాని వల్ల ఏమొస్తుందా అని ఆలోచించకుండా స్వధర్మం చేయటమే వాడి కర్తవ్యం ఏదీ రాదు అనుకోవటానికి నువ్వెవరివి ఏదో వస్తుందనుకోవటానికి నువ్వెవరివి, నీ పని పని చేయటమే. దాన్ని పరిపూర్ణంగా చేయి. భగవంతుడిచ్చిన సర్వశక్తులూ దానిలో వినియోగించి, పవిత్రత, నిష్పాపము కలిగిన బుద్ధితో దాన్ని నిర్వహించు. 'తతో యుద్ధాయి యుజ్యస్వ' యుద్ధానికి సిద్ధపడు. 'నైవం పాపమవాప్స్యసి' దాని వల్ల పాపం నీకంటదు. ఇప్పుడు యుద్ధాచరణ వల్ల నీకు పాపం రాదు. ఎందుకు ?

పాపం ఎప్పుడొస్తుంది, పుణ్యం ఎప్పుడొస్తుంది ?

మనం ఏ పని చేసినా పాపం కోసమో, పుణ్యం కోసమో చేస్తాము. పాపం కోసం చేయకపోయినా చేసిన పనిని బట్టి అదొస్తుంది. అందుకోసం సృష్టిలో చాలామంది

పాపఫలం కోరుకోరు కాని పాపమే చేస్తారని, పుణ్యఫలం కోరుకుంటారు కాని, పుణ్యం చేయరని ప్రసిద్ధ శ్లోకం ఉంది భారతంలో.

పుణ్యాశ్చ ఫలం నిశ్చంతి, పుణ్యంనిశ్చంతి. పుణ్యఫలమేమిటి ? సుఖం. అది అందరికీ కావాలి. కాని పుణ్యం మాత్రం చేయరు. పాప ఫలమేమిటి ? దుఃఖం. అది ఎవరికీ అక్కర లేదు. కాని చేసేది మాత్రం పాపం. ఒక విత్తనం వేసి మరో చెట్టురావాలంటే ఎలా వస్తుందండి ! కాని ఇప్పుడు వ్యవస్థ ఎలా ఉంది ? పాపం చేసైనా సుఖపడదామని ఉంది. పాపం చేస్తే సుఖం రాదు. సుఖం లాంటిది వస్తుంది. తర్వాత దుఃఖంగా మారిపోతుంది. చక్కగా ఆవకాయ తింటే బాగానే ఉంటుంది. తర్వాత ఏం జరుగుతుందో మనకు తెలుసు. గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులని పోషించటానికి చక్కగా పనికొస్తుంది. అలా ప్రతి దానికి ఒక వ్యవస్థ ఉంటుంది.

ఇక్కడ ఏం చెప్తున్నాడు ?

పనిని లెక్క పెట్టకుండా అనలేదు చూడండి. సుఖదుఃఖాలు లాభాలాభాలు, జయాజయాలు (ఇవన్నీ ద్వంద్వములు) వీటన్నిటినీ పట్టించుకోవద్దు అన్నాడు కాని పనిని పట్టించుకోవద్దు అనలేదు. అది పట్టించుకోకుండా పనిచేయి అన్నాడు. అంటే ఆ పనికి కావాల్సిన పరిపూర్ణమైన జ్ఞానము, పరిపూర్ణమైన శ్రమ, పరిపూర్ణమైన యుక్తి అన్నీ చెయ్యి. సమ దృష్టితో చెయ్యి! ఆ స్వధర్మము నిన్ను పాపాలకు తీసుకు వెళ్ళదు సుమా! అన్నాడు.

కర్తృత్వం ఉన్నచోటనే పాపం కాని, పుణ్యం కాని ఉంటుంది. ఏకర్మకైనా! కర్తృత్వ అహంకారమే పాపపుణ్యాలని తీసుకు వస్తుంది. కర్తృత్వం చేస్తూ నేనిది చేస్తున్నా, నాకిది కావాలి అని అంటే పాపం గాని, పుణ్యం గాని అంటుకుంటాయి,

వాడు చేసిన కర్మ బట్టి నీది నిజంగా అతీత స్థితి, నీకు ఏదీ అక్కరలేదు అనుకుంటే పనిని విడిచి పెట్టనక్కరలేదు. సమదృష్టితో పని చేయి అని బోధించాడు.

సమేకృత్వా అనే మాట గీతకి చాలా ముఖ్యమైనది. గీత అంతా కూడా సమత్వయోగం అని చెప్పవచ్చు. సమబుద్ధి అనే దాని గురించి గీత తెలియజేస్తోంది. దానికి ప్రారంభంగా ఇక్కడ 'సమేకృత్వా సమం సుఖదుఃఖేషు' అని అంతకు ముందు కూడా చెప్పబడింది. వాడినే ధీరుడు అంటాడనికూడా చెప్పబడింది. వ్యక్తిని ధీరుడిగా మార్చటానికే భగవద్గీత ఆవిర్భవించింది.

దీనిని సాంఖ్యము అని చెప్తారు అన్నారు.

సాంఖ్యము అంటే ఏమిటి ?

సాంఖ్యము అంటే ఆత్మ తత్త్వప్రతిపాదన అని చెప్పి, దీనిని సాధించే ఉపాయం ఒకటి ఉంది, దానిని నీకు బోధిస్తున్నాను అన్నాడు. ఆ ఉపాయం సుఖదుఃఖే సమే కృత్వా అని బీజ ప్రాయంగా చెప్పాడు. అది మనకర్థమయ్యే వృక్ష ప్రాయంగా మనకి చెప్పబోతూ బీజం వృక్షంగా మారుతున్న ఆ మధ్య స్థితిని, తర్వాతి శ్లోకంలో చెప్తున్నాడు

ఇప్పుడు సాంఖ్యయోగం అవుతోంది మనకి. ఆ పేర్కొన్న పూర్తి సార్థకత. ఈ శ్లోకంలో మనకి అంద జేస్తున్నాడు. కనుక గీత గొప్ప విషయం అంతా ఈ శ్లోకం నుంచి మనకి ప్రాక్టికల్ అవుతోంది.

ధీరత్వం ఏమిటి ?

సమత్వబుద్ధే ధీరత్వం. సుఖదుఃఖాలలో, లాభాలాభాలలో, జయాజయాలలో సమంగా ఉన్నవాడినే ధీరుడు అన్నారు. ఇది సాధ్యమేనా అంటే అసాధ్యాన్ని సాధ్యం చేసుకున్నప్పుడే గొప్పదనం కదా! అందుకు సాధ్యం చేసుకోవాలి. అన్నీ మనం

సాధించుకునే పుట్టలేదు. ప్రతిదాన్ని సాధింపచేసుకున్నాం. అలాగే ధీరత్వ స్థితిని కూడా సాధింపచేసుకోవాలి అని బోధిస్తున్నాడు కృష్ణ పరమాత్మ.

అలా సమ దృష్టితో చేస్తే నిన్ను పాపం అంటదు అన్నాడు. అహోబత మహత్పాపం అని అర్జునుడు అన్నదానికి ఇక్కడ సమాధానం ఇస్తున్నాడు.

పాపం అంటే ఏమిటి ?

విధిని వదిలి వేయటం, నిషేదాన్ని ఆచరించటం పాపం. మరేమిటో కాదు. చెయ్యవలసిన దాన్ని విడిచిపెట్టుట, చెయ్యకూడనిదే చేయుట అనేది పాపానికి ప్రధానమైన నిర్వచనం. తద్వారా ఏ దోష మేర్పడుతుందో ఆ దోషాన్ని పాపము అని అంటారు. ఇప్పటి వరకూ చెప్పి, దీని యొక్క సారాంశాన్ని ఎలా జీవితంలోకి అన్వయించుకోవాలి, ఆ యోగాన్ని ఎలా అవలంబించాలి, ఏ విధంగా సాధన చేయాలి. తర్వాతి శ్లోకంనుంచీ, అంటే 39 నుంచీ చెప్తున్నాడు స్వామి.

ఏషాతేఽభి హితే సాంఖ్యే బుద్ధిర్యోగే త్విమాం శృణు

బుద్ధ్యా యుక్తో యయా పార్థ కర్మబంధం ప్రహాస్యసి 2-39

ఓ పార్థా ఇప్పటి వరకు సాంఖ్యే బుద్ధిః సాంఖ్యము నందు బుద్ధిని నీకు తెలియచేసాను. అభిహిత్ అంటే చెప్పబడినది. సాంఖ్యము నందు బుద్ధి నీకు చెప్పబడినది. సాంఖ్యము అంటే ఏమిటి ? 'శుద్ధాత్మ తత్త్వ విజ్ఞానం సాంఖ్యమిత్ అభివిద్యతే' అని ప్రధానమైన నిర్వచనం ముందే చెప్పుకున్నాము. శుద్ధమైన ఆత్మ విజ్ఞానాన్ని సాంఖ్యము అంటారు. దాన్ని నీకు తెలియజేసాను. ఇప్పుడు యోగమునందు బుద్ధిని నీకు తెలియజేస్తాను.

ఈ రెండూ పరస్పర విరుద్ధంగా కనిపించటంలేదా?

ఇప్పటివరకు సాంఖ్యము అని తెలియజేసానే దాన్ని సాధించే ఉపాయాన్ని ఇప్పుడు చెప్తున్నాను అంటున్నాడు. యోగమంటే ఉపాయము అని అర్ధము. యోగబుద్ధి, సాంఖ్యబుద్ధి, జ్ఞానానికి సంబంధించిన వివేకము సాంఖ్య బుద్ధి. దాన్ని ఏ విధంగా సాధించాలో , ఏవిధంగా జీవితంలోకి అనుసంధానించుకోవాలో అది యోగబుద్ధి. అంటే సాంఖ్యమనేది థియరీ అనుకుంటే, యోగమనేది ప్రాక్టికల్.

జ్ఞానం చాలా ఉన్నది. ఇదంతా కొత్తగా కృష్ణుడు చెప్పినదేనా ?

అంతకు ముందు వేద మాత ఉపనిషత్తులో బోధించిన జ్ఞానమే. ముందే చెప్పుకున్నాము. కొత్త బోధలేవీ పనికిరావని. పరమాత్మ సనాతనుడు. ధర్మం సనాతనం. జ్ఞానం  సనాతనం. సనాతనమైన పరమాత్మ సనాతనమైన జ్ఞానాన్నే బోధించాడు. ఈ సనాతనమైన జ్ఞానాన్ని మనకు ఉపనిషత్తులు బోధిస్తున్నాయి. అది సాంఖ్యం. సమ్యక్ క్షాతం సాంఖ్యం అని ముందే అర్థం చెప్పుకున్నాం. సమగ్రమైన జ్ఞానం ఏదో అదే శుద్ధాత్మ తత్త్వం విజ్ఞానం.

ఇప్పటి వరకూ చెప్పానుకదా ! దానిని ఏవిధమైన యోగముతో అన్వయించుకోవాలో చెప్తున్నాడు. జ్ఞానం తెలియటం వేరు, దానిని జీవితం లోకి మలుచుకోవటం వేరు. అదీ విశేషం. ఉపనిషత్తులను వల్లె వేసేవారు, చాలా తేటగా దానిని అర్థం చేసుకున్నాం అనిపించుకునేవారు, దానిని బోధించేవారు కూడా కనిపిస్తారుకాని, దానిని జీవితంలోకి దించుకోవటం ఒక కళ.

ఒక అతను నిద్రపోతున్నాడు. రాత్రి యింట్లో దొంగలు పడ్డారు. భార్య లేపి, ఏమండీ, దొంగలు పడ్డారు, చప్పుడు విన్నారా ? అంటే తెలుసు తెలుసు అన్నాడుట. మళ్ళీ వాడు లోపలికి వచ్చాడండీ అంటే తెలుసు, తెలుసు అన్నాడుట. అటు తర్వాత,

పెట్టె తీసుకు పోతున్నాడంటే తెలుసు, తెలుసు అన్నాడుట. తెలుసు, తెలుసంటే ఏం ప్రయోజనం ఏం చేసాడు ? అదే విధంగా మనకన్నీ తెలుసు అనుకుంటే చాలదు, దాన్ని అమలు పరచి, దానికి ప్రతిక్రియ చేయటం కావాలి. అదేవిధంగా ఏ జ్ఞానమనే కళ ఉన్నదో, ఆజ్ఞానాన్ని జీవితంలోకి ఎలా మలచుకోవాలనే కళ ఏదో, ఆ యోగమేదో ఇప్పుడు చెప్పబోతున్నాను విను అన్నాడు.

దీనినే మన వాళ్ళు స్వామి ఇక్కడినుంచి కర్మ యోగం బోధిస్తున్నాడు అన్నారు. కర్మయోగం అనగానే కొంతమంది అపార్థపు వ్యాఖ్యలు చేసారు. భగవద్గీత మీద చాలా వ్యాఖ్యలు వచ్చాయి. ఒక గొప్ప గ్రంథం యొక్క లక్షణమే అది. దానిపై అనేక రకాల వ్యాఖ్యలు వస్తాయి. ఇన్ని వ్యాఖ్యానాలు రావటం ఎంత ఉపయోగకరమో అంత ప్రమాదమైనవికూడా. వాళ్ళ బుద్ధికి తోచినవి చెప్తారు. వీటికి కొలబద్ధ ఉండాలి. అది ఏమిటంటే సనాతనమైన వేదాంత శాస్త్రము యొక్క కొలబద్ధ, ఇతర పురాణములు, ఇతర శాస్త్రములు ఏవి శాస్త్రీయములో, వైదిక సంప్రదాయ బద్ధములో వాటి ఆధారంగా మనం ఇక్కడ అర్థం చేసుకోవటానికి ప్రయత్నించాలి.

జ్ఞానయోగం వేరు, భక్తియోగం వేరు, కర్మయోగం వేరని పొరపాటు మాటలు మాట్లాడతాము. కాని అర్జునునికి ఇంతవరకూ జ్ఞానాన్ని సాంఖ్యాన్ని చెప్పి జ్ఞానయోగానికి అర్జునుడు అర్హుడుకాడు. కనుక కర్మయోగాన్ని చెప్తున్నాను అని అన్నాడని కొందరం వ్యాఖ్యానం రాసారు. ఇది చాలా పొరపాటు. అర్జునుడికి అక్కరలేనిదయితే అంతవరకు ఆ ఉపన్యాసాన్ని ఎందుకు ఇవ్వాలి ? ఆ మాత్రం తెలియదా కృష్ణ పరమాత్మకి ? జ్ఞానయోగం, కర్మయోగం రెండు వేరు కాదు. ఇక్కడ జ్ఞానం యొక్క స్వరూపాన్ని చెప్పాడు. ఆ జ్ఞానాన్ని నువ్వు నిష్కామ కర్మతో ఎలా అందుకోవాలో ఆ

యోగాన్ని చెప్తున్నాను అని వివరిస్తున్నాడు ఇక్కడ. నిష్కామ కర్మయోగాన్ని యిక్కడ వివరిస్తున్నాడు అని అర్థం. యోగబుద్ధి అంటే నిష్కామ కర్మయోగము అని మనం ఇక్కడ అర్థం చేసుకుంటే తెలిసిపోతుంది.

ఇక్కడ కర్మయోగం చెప్తున్నాదంటే కర్మ బంధనకారి. అవునా! లేదా! కర్మచెయ్యటం వల్ల దానికి ఫలంగా, వాసనగా మిగిలి, అది మళ్ళీ మరో జన్మలోకి తీసుకు వెళ్ళి, అక్కడ్నుంచి మళ్ళీ కర్మ వల్ల మళ్ళీ జన్మల్లోకి వెళ్ళిపోతూ ఉంటే మరి బంధన కారియైన కర్మని ఆచరించమని చెప్పటం ఏమిటి ? అంటే బంధనకారియైన కర్మని బంధనం కలగకుండా ఆచరించటం ఎలా అనేదే ఉపాయం. ఆ ఉపాయాన్నే యోగం అని చెప్పారు, దాన్ని ఇక్కడ చెప్పబోతున్నాడు.

కర్మయోగం అన్నారు. కర్మాచరణ కాదు. ఇదీ విశేషం. కర్మ ఆచరించిన మాత్రాన కర్మయోగము కాదు. కర్మ లంపటత్వం వేరు, కర్మ యోగం వేరు. కర్మనాచరించిన వారందరూ కర్మయోగులు కారు. ఏ విధమైన బుద్ధితో ఆ కర్మని ఆచరిస్తే ఆ కర్మ యోగమై జీవితలక్ష్యమైన జ్ఞానాన్ని సాధింపచేస్తుందో అదీ యోగం.

జ్ఞానమంటే ఏమిటి ?

జ్ఞానమంటే ఒక విషయం తెలుసుకోవటం కాదు. ఒక సత్యాన్ని అనుభూతం చేసుకోవటమే జ్ఞానము. ఉపనిషత్తులు, గీత చెప్పేది అదీ! తెలుసుకోవటం కాదు, తెచ్చుకోవటం. అది ఇవ్వబోతున్నాడు స్వామి.

ఈ నిష్కామ కర్మ యోగం ఎలాంటిది ?

దాని లక్షణం ఇక్కడ చెప్పుతున్నాడు. సాంఖ్య జ్ఞానానికి అనుకూల మైనటు వంటి కర్మ చేసే నేర్పు ఏది ఉందో అది యోగబుద్ధిని దాన్ని యిప్పుడు చెప్పబోతున్నాడు.

అంటే అనుభవంలోకి దింప బోతున్న కళని యివ్వబోతున్నాడన్నమాట.

నేహాభి క్రమనాశోஉస్తి ప్రత్యవాయో నవిద్యతే

స్వల్పమస్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్ 2-40

ఈ కర్మయోగం గొప్పతనం చెపుతున్నాడు. నిష్కామ కర్మ యోగం ఎలాంటిది?

'దీనికి నేహాభిక్రమనాం శోస్తి' ఏదయినా ఒక పద్ధతి గాని, ఉపాయంగాని అవలంబిస్తే, దాన్ని ప్రారంభించిన తర్వాత మొదట్లోనే గండికొట్టటం, ఇబ్బంది లెదుర్కోవటం ఉంటాయి. ఈ యోగంలో అటువంటి బాధలు లేవు సుమా! 'ప్రత్యవాయోనవిద్యతే' మధ్యలో ఆపివేయటం వల్ల కొన్ని దోషాలొస్తాయి కర్మలకి. ఆ దోషాలని ప్రత్యవాయు దోషాలు అంటారు. దానిలో అటు వంటి దోషాలు లేవు సుమా అని చెప్తున్నాడు. నువ్వు నిష్కామ కర్మయోగాన్ని శుద్ధచిత్తంలో ఆచరించినప్పుడు కొద్దిపాటి ఆచరించినప్పటికీ కూడా అది 'త్రాయతే మహతో భయాత్,' 'స్వల్ప మప్యస్య ధర్మస్య!' కొద్దిపాటి ఆచరణ చేత కూడా మహాభయము నుంచి ఇది కాపాడుతుంది. మహా భయము అంటే అజ్ఞానమే మహాభయం.. నరకాదులే మహాభయం. ఈ మహాభయాదులన్నిటి నుంచి ఈ నిష్కామ కర్మ అల్పంగా ఆచరించినా గొప్పగా పనిచేస్తుంది. మనకి ఇతర కర్మల దోషాలు చెప్తున్నాడు. 'నేహాభిక్రమనాశోస్తి ప్రత్యవాయోన విద్యతే'. ఇక్కడ అవిక్రమ నాశము అనే దోషమొకటి. ప్రత్యవాయు దోషము.

ఏమిటా దోషములు ?

ఒకడు పంట పండిద్దామని చూసినప్పుడు మొదట చక్కగా నేలదున్ని ఆరంభంలోనే ఆపేశాడనుకోండి. వాడికి దానివల్ల ప్రయోజనం లభించదు. పంటంతా

చక్కగా వేసి, విత్తనాలు వేసి, నీరుగాని పట్టకపోతే, ఆ పంట చేతి కందదు. కనుక పంట మొదలు పెట్టినదగ్గర నుంచి ఫలం చేతి కొచ్చే వరకు చాలా జాగ్రత్తగా ఉండాలి. ఎక్కడ పొరపాటు వచ్చినా రెండు దోషములు వస్తాయి. అలాగే వైదిక కర్మములలో కూడా ఈ రెండు దోషాలు ఉంటాయి. అది అర్థం చేసుకోవటానికి వ్యవసాయ కర్మని ఉదాహరణగా చెప్పాం.

మనం ఏదో సంకల్పంతో యజ్ఞం చేయబోతాం. యజ్ఞం ప్రారంభించాక ఆ సంకల్పం మధ్యలో వదిలేయరాదు. వదిలేస్తే మహాపాపం. అంతేకాదు ప్రారంభించిన తరువాత మధ్యలో పొరపాట్లు జరగరాదు. కొందరు జపానికి కూర్చునప్పుడు అవతలి వారిని కోపగించుకుంటారు. కొందరు జపమాల తిప్పుతూ బెల్లుకొడితే వస్తున్నాను అని మాల పూర్తి చేస్తారు. ఇవి ప్రత్యవాయ దోషాలు. అది కర్మఫల మివ్వవు సరికదా ఆ కర్మకి దోషాలని కూడా ఇస్తాయి. అలాగ యజ్ఞాలు చేసేటప్పుడు అవి ప్రత్యవాయ దోషాలవచ్చు అందులో ఏదైనా పొరపాట్లొస్తే! అందుకు చాలా జాగ్రత్తగా కర్మచేయాలి. మనం చేసే పూజలు పునస్కారాలు వీటన్నిటికీ కూడా ఈ దోషాలు వచ్చే ఆస్కారం ఉంది. ఎప్పుడు ? సక్రమంగా చేస్తే! ఒక కోరికతో, ఇది నెరవేరాలని ఒక యజ్ఞం గాని, ఒక దీక్షగాని, ఒక మంత్రంగాని చేస్తే వాటికి ఈ రెండు దోషాలు వస్తాయి. చాలా జాగ్రత్తగా ఉండాలి ఈ కర్మల్లో! నిష్కామంగా చేసేవారికి కర్మయందు ఏకాగ్రత ఉంటుంది. ఇదేదో బాగుంది నిష్కామ కర్మలో ఏకాగ్రత అక్కర లేదు అనుకోవద్దు. ఏకాగ్రత ఉంటుంది, పరిపూర్ణత కోసం చేయవలసిన ప్రయత్నాలూ ఉంటాయి. కాని వీటి యొక్క ప్రయత్నాన్ని మించి ఏవైనా లోపాలు జరిగినా, ఆ లోపాలు వీనికి వర్తించవు అటువంటిది నిష్కామకర్మయోగం. దానికి దోషాలుండవు సరికదా, కొద్దిపాటి

ఆచరించినా కూడా మహాభయం నుంచి పోగొడుతుంది అంటున్నాడు. దాని కొక ఫలం చూపిస్తున్నాడు. ఏమిటా ఫలం ? మహా భయం నుంచి పోగొట్టటం.

మహాభయం ఏమిటి ?

తెలివైన వాడికే తెలుస్తుంది అది ఏమిటో! అందుకే 'త్రాయతే మహతో భయాత్' అన్నాడు. అజ్ఞానమే మహాభయం అవిద్యే మహాభయం. దాని నుంచి రక్షించేది నిష్కామ కర్మ యోగమే అని చెప్పి సకామ కర్మని నిందిస్తున్నాడు తర్వాతి వాక్యంలో.

మూడు శ్లోకములు వరసగానే గ్రహించాలిమనం. వీటిల్లో ఒకే విషయం చెప్పబడుతున్నది.

యామిమాం పుష్పితాం వాచం ప్రవదంత్య విపశ్చితః
వేదవాదరతాః పార్థ నాన్యదస్తీతి వాదినః 2-42
క్మామాత్మానః స్వర్గపరా జన్మకర్మ ఫలప్రదామ్
క్రియావిశేషబహులాం భోగైశ్వర్యగతిం ప్రతి 2-43
భోగైశ్వర్య ప్రసక్తానాం తయాపహృత చేతనామ్
వ్యవసాయాత్మికా బుద్ధిః సమాధౌన విధీయతే 2-44

ఇక్కడ చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోవాల్సిన విషయాలు చాలా ఉన్నాయి. కర్మని ఫలాకాంక్షతో చేసేవాళ్ళు విషయం ఇక్కడ చెప్తున్నాడు. రెండు రకాలైన సిద్ధాంతాలుంటాయి. భోగవాదం, త్యాగవాదం.

భోగవాదం అంటే ఏమిటి ?

మనం చేసే పని వల్ల ఒక భోగాన్ని అనుభవించాలి అని. ఇప్పుడు చూస్తున్న జగత్తులో ఉన్న నవ నాగరికత అంతా కూడా భోగవాదనే. కాని భారతీయ సనాతన

సంస్కృతి అంతా కూడా త్యాగ వాదాన్నే చెప్పింది. అది కొంచెం పరిశీలిస్తే మీకే తెలుస్తుంది. అది మన సనాతన ధర్మంలో. సుఖం గురించి ఎవరు చెప్పారు ? అలాగని సుఖం లేదని కాదు. ఎక్కువగా మన నియమాలు, పాలనలు అన్నీ కూడా ఎలా ఉన్నాయి ? తెల్లవారు ఝామున నిద్రలేవటం, స్నానం చేయటం, జపం చేయటం, దేవతారాధన చేసుకోవటం, తల్లిదండ్రులని గమనించుకోవటం. ఇందులో ఎవ్వరికైనా సుఖం ఉందా చెప్పండి ? సుబ్బరంగా 8 గంటల వరకూ పడుకో అంటే చాలా ఆనందంగా ఉంది. ఏదో బ్రాహ్మీముహూర్తంలో నిద్ర లేవాలిట, ధ్యానం చేయాలిట ఏవైనా సుఖం ఉందా ? తల్లిదండ్రులు ముసలి వాళ్ళు, వాళ్ళని పట్టించుకుంటే ప్రయోజనం ఏముంది? వాళ్ళేమైనా సంపాదిస్తున్నారా. వాళ్ళకి ఎంతవరకు గౌరవం.

యావతి ద్విత్తో పార్జన సక్తః

స్తావ న్నిజపరివారోరక్తః

వాళ్ళు సంపాదిస్తుంటే చెప్పండి. వెళ్ళి కాళ్ళైనా పడ్దాం. వాళ్ళ సంపాదనంతా అయిపోయింది. మూల పడుకున్నాడాయన. ఆయన దగ్గరికి వెళ్ళి సేవ చేయటం వల్ల నాకేం లాభం అని అనుకోడు భారతీయుడు. ఎందుకు ? ఇదంతా త్యాగ వాదం. ఆ త్యాగంలోనే వాదానందిస్తున్నాడు. ఆ త్యాగంలోనే ఇంకేదో వస్తుందని కాదు. ధర్మం ఆచరించి తృప్తి పడటం లోనే గొప్ప విశేషం ఉంది. ఈ రోజు ఈ ధర్మం ఆచరించానూ అని తృప్తి పడటం ఉన్నదే అది చాలా గొప్ప స్థితి. ధర్మాచరణే ధర్మానికి ఫలం. అది నిష్కామ కర్మవైపు క్రమంగా దారి తీస్తుంది. ఆ విధమైన బుద్ధి మనకి వచ్చి, శాంతి పొందే విధంగా పెద్ద వాళ్ళు ఒక వ్యవస్థని మనకు ఏర్పాటు చేసారు.

మనలో క్రమంగా భోగలాలస పెరిగి, వీటి ప్రాధాన్యం పెరిగి, క్రమంగా భోగం

వైపు మొగ్గటం వల్ల ఏం వచ్చింది అంటే అశాంతి వచ్చింది. దీని ఫలితం ఎప్పుడో కాదు ఇప్పుడే అనుభవిస్తున్నాం మనం. త్యాగ వాదం శాంతిని ఇస్తుంది. భోగ వాదం అశాంతిని ఇస్తుంది. త్యాగవాదం ఉండటం చేతనే కృష్ణ పరమాత్మ పాండవుల పక్కన నిలబడ్డాడు. మహానుభావుడైన ధర్మరాజు ఏం చెప్పాడు ? నేను ఎప్పుడూ ధర్మాన్ని వ్యాపారంగ చేయలేదు. ధర్మం వల్ల ఏదో వస్తుందని చేయలేదు. ధర్మం ఆచరించటం నా స్వభావం, నేను చేసాను అన్నాడు. అలా చెప్పగలిగాడు మహానుభావుడు. వాళ్ళందరూ కృష్ణుడి యొక్క వాత్యల్యానికి నోచుకున్నారు. అర్జునుడు కూడా అలాంటి వాడే. ఏదో ఆ సమయానికి క్రమ్మిన మోహపు మబ్బుని తొలగిస్తున్నాడు కృష్ణ పరమాత్మ. తద్వారా మనలో ఎప్పుడూ కమ్ముకున్న మోహపు మబ్బుని తొలగించటం జరుగుతుంది జగద్గురువు చేత. ఇక్కడ ఆ భోగవాదాన్ని ఖండిస్తున్నాడు. అప్పటి కాలంలో ఉండే జ్ఞానమేమిటి ? వేద విజ్ఞానం. ఇప్పుడంటే మనం వేదం ముసలివాళ్ళ జ్ఞానమే అనుకుంటున్నాం కానీ వేద విజ్ఞానం మూడు విధాలుగా ఉంటుంది.

ఏమిటది ?

కర్మకాండ, ఉపాసినా కాండ, జ్ఞానకాండ.

ఈ కర్మకాండ లౌకికమైన ఫలితాలు పొందటానికి ఉద్దేశింపబడింది. ఇప్పుడు పుత్రకాముడైన వాడు పుత్రకామేష్టి చేస్తాడు, ధనకాముడైన వాడు మరో యిష్టి చేస్తాడు. ఇలాంటి యజ్ఞములు చెప్పబడ్డాయి. వేదములలో ఇవన్నీ కూడా భౌతికమే! దాని కోసమే కేటాయింపబడ్డాయి. ప్రతియుగంలోనూ మానవుడు సుఖపడ్డానికి అనేక మార్గాలు వెతుక్కుంటాడు అలగే ఇప్పుడు మనం భౌతికమైన ఉపాయాలు అవలంబిస్తున్నాం. మన భౌతికమైన ఉపాయాలు సాధ్యం కానప్పుడు ఈ వైదికమైన,

దైవికమైన ఉపాయాలు అమలు పరచుకుంటున్నాం. కాని వీటి ప్రయోజనాలు ఎటు? భౌతిక ప్రయోజనాల కోసమే వీటిని వినియోగిస్తున్నాం. అప్పుడు కూడా ఆ విధంగా వేద విజ్ఞానాన్ని వినియోగించటం జరిగింది. భారతీయులకున్న విజ్ఞానమే వేద విజ్ఞానము. వేద విజ్ఞానాన్ని యజ్ఞాల ద్వారా కర్మలద్వారా ఆచరిస్తూ, వీటికి ఫలితము ఏమిటి అంటే భౌతికంగా సుఖపడటం, ఇంకా కావాలంటే పారలౌకికంగా సుఖపడ్డం. దీని తర్వాత పరలోకమునందు సుఖించుట. అమృతము, స్వర్గ సుఖములు పొందుట.

'వేద వాద రతాః వేదములందే ఫలితం చెప్పబడింది. వేదములందే వాదించుతూ ఆసక్తి కలవారు 'నాన్యదస్తీతి వాదినః' దీన్ని మించి మరొకటి లేదు అని వాదించే వారు అంటున్నారు. అంటే ఏమిటి ? దీని ఫలితమిది, దీన్ని అనుభవించటానికే మనమున్నాం అంటే ఇక్కడ వేదమున్న శబ్దం వేసారు కనుక ఇదేదో ఆధ్యాత్మికవాదం అనుకోవద్దు. భౌతిక వాదులనే చెప్తున్నాడు కృష్ణ పరమాత్మ. ఇప్పటి భాషలో మనం అన్వయించుకుంటే భోగవాదాన్ని నిరసిస్తున్నాడు స్వామి. నాన్యదస్తీతి వాదినః ఇంతకు మించి మరొకటి లేదు.

ఈ నాన్యదస్తీతి వాదినః అన్న మాట ఏమిటో చూద్దాం. ఇంతకు మించి మరొకటి లేదు అంటే ఏమిటి ? నీకంటికేది కనిపిస్తోందో, నీకు భౌతికంగా ఏది లభిస్తోందో నీ ఇంద్రియాలకి ఏది అందుబాటులో కొస్తోందో నీ మనస్సు ఎంత మేరకు ఊహించగలుగుతోందో, అంతకు మించి ప్రపంచంలో మరొకటి లేదు అని అనుకోవటం ఏదైతే ఉందో దాన్ని నాన్యదస్తీతి వాదం అని అంటారు. దీనినే మీరు భౌతికవాదం అనండి, మెటీరియలిస్టిక్ అవుట్‌లుక్ అనండి, నాస్తిక వాదం అనండి. ఇది అలాంటి బుద్ధి కలిగినటువంటి వేదవేత్తలు కూడా 'యామిమాం పుష్పితాం వాచం ప్రవదంతి'

'పుష్పితాం వాచం' కుసుమించిన మాటలన్నీ మాట్లాడుతుంటారు. అంటే అర్థం ఏమిటి?

ఇది చెయ్యండి, ఇది బాగుంటుంది అనేమాట వింటే మన కెంత బాగుంటుంది? పుష్పితాం వాచం కుసుమంచూడటానికి ఎంత రమణీయంగా ఉంటుందో వాళ్ళ మాటలు కూడా ఆపాత రమణీయములు. విన్న వెంటనే ఆనందం కలుగుతాయి. ఫలాని యజ్ఞం చేస్తే మీకు మంచి జరుగుతుంది, శత్రుబాధలు పోతాయి, సంపదలు వస్తాయి అని చెప్తే వినటానికి ఎంత బాగుంటుందో, అదే వేదానికి ప్రయోజనం, అది మాత్రమే వేదానికి ప్రయోజనం అనటమే 'నాన్యదస్తీతి వాదం.'

అంతకు మించి వేదానికి ఇంకో ప్రయోజనం లేదు. ఈ కర్మ చేయటం, దానికిది ఫలం రావటం అంటే రెండు లక్షణాలు దానికున్నాయి. ఒకటి నాన్య దస్తీతి వాదం, రెండు పుష్పితాం వాచం. వినటానికి చాలా బాగుంది. పరమార్థ మేమిటో, ఆత్మ జ్ఞానమేమిటో ఈ గొడవలు మనకెందుకు ? ఇదేదో చాలా బాగుంది. యజ్ఞములు చేయటం వల్ల ఫలితం వస్తుందంటే పిల్లా, పాపలు గొడ్డూ గోదా, ఇల్లూ వాకిలీ, ఆస్తీ పాస్తీ అన్నీ చల్లగా ఉండటమే మనకి కావాలికదా! ఇది చాలా బాగుంది కదా! అందుకు పుష్పితా వాదం అంటారు.

వారిని కృష్ణ పరమాత్మ ఏమన్నాడు ?

'అవిపశ్చితః' - అంటే పండితులు కాని వారు అని ఉద్దేశం. వేదం గురించి మాట్లాడాలంటే వేదం గురించిన పాండిత్యం ఉంటే కదా మాట్లాడతారు. మరి వాళ్ళని పండితులు కానివారు అని ఎందుకు అన్నాడు ? పండితులెవరో ముందే చెప్పాడాయన. పండితులు ఎవరు ? ఎవరైతే ఆత్మజ్ఞానం కలిగి ఉంటారో వారు అన్నాడు. ఆ స్పృహ లేకుండా ఎవరైతే వేద కర్మాదులని ఆచరిస్తున్నారో వాళ్ళు 'అవిపశ్చితః' వాళ్ళు వివేకజ్ఞాన

శూన్యులు, విచక్షణా రహితులు అని తీర్మానిస్తున్నారిక్కడ. వాళ్ళు పుష్పితమైన వాక్కులే పలుకుతుంటారు. వారికి ఇక్కడున్న సుఖములే కాక 'కామాత్మానః స్వర్గపరాః' కామాత్మానః అంటే కోరికలు తీర్చుకోవటమే ప్రధానంగా కలిగినవారు.

ప్రతివారూ వారికి వారినే తేల్చుకోవాలి, వాళ్ళు కామాత్మానులా, లేక పరమార్థాన్ని కోరుకునేవాళ్ళా ? స్వర్గాదులు కోరుకునే వారు కూడా కామాత్మ కలిగినవారే. అది కూడా కోరికల్లో భాగమే. కాని బ్రహ్మ విద్యకి రెండూ కూడా నిషేదములే. పరలోక సుఖాల కోసం కూచుని సాధనలు చేసేవారిని, భగవద్గీత వేదాంతం అంగీకరించదు. భగవద్గీతను ఉపాసించేవాడికి ఇహలోక సుఖము, పరలోక సుఖము నందు కూడా ఆసక్తి ఉండదు. అదీ విశేషం. వేదాంతం ఆ రెండింటి నీ గర్హిస్తోంది. ఇహ, పర సుఖములకు వెంపర్లాడుతూ వాళ్ళు ఇదే సుఖమని వాదిస్తారు. వారి గతులు ఎలా వెళతాయి ? 'జన్మకర్మ ఫలప్రదామ్' జన్మలకి హేతువులైన కర్మఫలాలు వాళ్ళకి వస్తాయి. ఆ కర్మలకి ఫలంగా, జన్మలు అనుభవిస్తూ ఉంటారు. అది 'క్రియా విశేష బహులాం' అనేక క్రియలతో కూడుకుని, 'భోగైశ్వర్య గతిం ప్రతి' భోగైశ్వరముల కోసమై వారి లక్ష్యములన్నీ వెళుతుంటాం. దాని వల్ల ఏం జరుగుతుందంటే 'భోగైశ్వర్య పుస్తక్తానాం భోగైశ్వర్యముల ఎడలే బుద్ధి పెట్టిన వారికి 'తయాపహృత చేతసామ్' చిత్తం దెబ్బతింటుంది అన్నాడు. ఇది అర్థం చేసుకోవాలి.

చిత్తం అంటే ఏమిటి ?

చిత్తం అంటే మనలో ఏదైతే చైతన్యం ఉన్నదో అది దెబ్బతింటుంది. ఎందుకు? ఇది భోగలాలన, అనుభవించటం వైపు వెళ్ళిపోవటం వల్ల చిత్తానికి శుద్ధత దెబ్బతిని ఆత్మ జ్ఞానం వాళ్ళకి కలగదు వారికి 'వ్యవసాయాత్మిక బుద్ధిః సమాధౌన విధీయతే!'

వారికి సమాధి యందు వ్యవసాయాత్మక బుద్ధి కలగదు అన్నాడు. సమాధి యందు వ్యవసాయాత్మికా బుద్ధి అంటే ఏమిటి ? సమాధి అంటే ఏమిటి ? సమాధి అనగానే మామూలు మనిషికి స్మశానంలో గోరీలు కనబడతాయి. అదా ? దాని మీద బుద్ధి ఉంటే ఏమిటి ? లేకపోతే ఏమిటి ? కనుక అది విడిచిపెడదాం. సమాధి అని కాస్త యోగంతో పరిచయం ఉన్న వాళ్ళకి ధ్యాన సమాధి, అన్న విషయం తెలుస్తుంది. ఇక్కడ యోగ పరిభాషా తీసుకోనక్కరలేదు, ఈ లైకిక పరిభాషా తీసుకోవల్సిన అవసరం లేదు. ఇక్కడి సమాధి అంటే ఆయన చెప్పిన సమబుద్ధే సమాధి. ఈ సమబుద్ధి యందు వారికి వ్యావసాయాత్మికా బుద్ధిః ఉండదు సుమా అని తెలియజేసాడు. అలాగే సమాధి అంటే ఆత్మయందు నిష్ఠుడై ఉండుట అనేది ప్రధానమైన అర్ధం. ఇలా నిష్ఠుడై ఉండటానికి ఏ వ్యవసాయాత్మికా బుద్ధి కావాలో గుర్తుపెట్టుకోవాలి. అది మళ్ళీ వివరిస్తాడు, అప్పుడు ఇంకా వివరణ చెప్పుకుందాం.

బుద్ధి వ్యవసాయాత్మికంగా కావాలి. ఏకాగ్రమై, నిశ్చలమై, అచంచలమై, ఆ ఆత్మయందు నిష్టితమై ఉండే స్థితి వీళ్ళకు రాదు అన్నాడు. ఎవరికి ? వేద వాదరతులకి, సకామ కర్మపరులకి రాదు. ఎందుకంటే ఆయన ప్రధానమైన ఒక యోగం యొక్క గొప్ప దనాన్ని ప్రస్థావించాడు. ప్రస్థావించి దాని యొక్క ఉత్కృష్టత ఏం చెప్పాడు ? 'నేహాభిక్రమ నాశోస్తి' అన్నాడు. మరి దానికి వ్యతిరేక విద్యయైన సకామ కర్మ లోపమేమిటో చెప్పాలికదా! ఒక దాని ఔన్నత్యం చెప్పేటప్పుడు, తత్‌దాని విరుద్ధం ఎందుకొద్దంటున్నామో చెప్పాలి. అదీ ఇక్కడ చెప్తున్నాడు. సిద్ధాంత ప్రతిపాదన ఎంత గొప్పగా చేస్తున్నదో కృష్ణ పరమాత్మ, మనం ఇక్కడ గమనించాలి. ఎంత స్పష్టంగా చెప్తున్నాడు? సకామ కర్మ పరుల అవస్థ ఎలా ఉంటుంది? అలాగని ఒక్కసారి

నిష్కామత్వం వస్తుందా అంటే సాధన మీద తెలుసుకోవాల్సిందే! బ్రహ్మవిద్య కావాలనుకునే వారికి ఖచ్చితంగా కావాల్సింది నిష్కామ కర్మ పరత్వమే!

ఇక్కడ వేదవాదరతాః పార్థ నాన్యదస్త్రీతి వాదినః ఈ శ్లోకాన్ని అర్థం చేసుకునేటప్పుడు వేదాల్ని కాని స్వామి ఏమైనా అంటున్నాడా అనిపిస్తుంది. వైదిక కర్మలని నిందిస్తున్నట్లుగా మనకి అనిపిస్తుంది. అవునా, లేదా ? అలాగే తర్వాతి శ్లోకంలోకి ఒక్కసారి మనం వెళితే

త్రైగుణ్య విషయా వేదా నిస్త్రై గుణ్యో భవార్జున

నిర్ద్వంద్వో నిత్య సత్త్వస్థో నిర్యోగ క్షేమ ఆత్మవాన్. 2-45

దీని వివరణ తర్వాత తెలుసుకుందాం కాని మొదటి వాక్యం - వేదములన్నీ త్రైగుణ్య విషయములు. నువ్వు నిస్త్రైగుణ్యుడివవు అంటున్నాడిక్కడ. అంటే అక్కడ కూడా వేదములు త్రిగుణాత్మములైనవి కనుక, నువ్వు త్రిగుణాతీతస్థితికి వెళ్ళు అంటే వేదములని వదిలేయి అన్నట్టే వినిపిస్తోంది ఇక్కడ చూస్తే వైదిక కర్మలన్నీ బంధన హేతువులవుతాయి ఆత్మ జ్ఞానాన్ని ఇవ్వవు అని చెప్పినట్టు కూడా కలుగుతుంది. అందుకు వెంటనే స్టేట్ మెంట్ ఏమిటీ అంటే కృష్ణుడు కూడా వైదిక కర్మలను అంగీకరించలేదు కనుక. వేదము మనకి పనికిరాదు అనే పాపపు మాట మనం అనగలమా ? ఇక్కడ చాలా జాగ్రత్తగా కృష్ణుడి మాటలు పరిశీలించాలి. పుష్పితాం వాచం అన్నాడు ఆయన. అదీ విశేషం. అవి ఇంకా కుసుమదశలో ఉన్న వాక్కులు. పండినవి కావు. అదీ అర్థం తీయాలి. వేదము యొక్క పండిన అర్థాన్ని వాళ్ళు అర్థం చేసుకోలేరు అని చెప్పదలుచుకున్నాడు కృష్ణ పరమాత్మ.

సశేషం

'పుష్పితాం వాచం' అన్నాడు ఆయన అది విశేషం. అంటే ఇంక కుసుమ దశలోనే ఉన్నాయి. పండినవి కావు. వాళ్ళకి వేదము యొక్క పండిన అర్థాన్ని వాళ్ళు అర్థం చేసుకోలేదు అని చెప్పదలుచుకున్నాడు. అక్కడతో ఆగిపోయారు అన్నాడాయన. వాళ్ళు వేదములయొక్క వాక్కులకి కేవలం ఈ భౌతిక పరమైన, ఐహిక లౌకిక సుఖములకు మాత్రమే పరిమితం చేసి మాట్లడేవారు. 'నాన్య దస్తీతి వాదినః' అంటే ఆ పరిమిత బుద్ధిలో మాట్లాడేవారు కాని వేదము యొక్క పరమార్థం వాళ్ళకు తెలియటం లేదు.

వేదాంతం చెప్పారు కదాని ఇవాళ్టినుంచి తిండి మానేసామా మనం ? ఉదాహరణకి వేద వాక్యములు, వేద కర్మలు అక్కరలేవన్నాడు బాగుంది అనుకోకూడదు. శరీరానికి రుచుల కోసం తినద్దు, బ్రతకటం కోసం తిను ఎవడో చెప్తాడు. ఫలానాది నిషేదం అంటే తిండే నిషేదం అనుకుని మానేస్తున్నామా ? దేని వల్ల శరీరం పోషింపబడుతుందో, దాన్ని మనం స్వీకరిస్తూ, దేనివల్ల యోగము అది చక్కగా ఉంటాయో దానికి ఉచితమైన ఆహారాన్ని స్వీకరిస్తాము. అలాగే కర్మ కూడా వర్జనీయమైన కర్మలని వేదము చెప్పలేదు. వేదము పుట్టినదే వానవిహితం కోసం.

అయితే ఇవి ఎలా చెప్తున్నాయి ?

మనం ఒక ప్రయాణం ఒక లక్ష్యం కోసం చేస్తున్నప్పుడు, ఆ ప్రయాణంలో కొన్ని సౌకర్యాలు చేసుకుంటాం. ఎవరైతే లక్ష్యానికి చేర్చటానికి సంకల్పించుకున్నాం వారే ప్రయాణ సౌకర్యాలన్ని ఏర్పాటు చేస్తారు దోవలో భోజనం నిద్ర సౌకర్యం. ఇవన్నీ ఎంత వరకు ? సౌకర్యంగా వెళ్ళటానికే తప్ప అవే పరమలక్ష్యాలు కాదు కదా! మనం లక్ష్యానికి వెళ్తున్నాం కనుక ట్రైనులో నిద్రపోవటానికి ఏర్పాట్లు చేసుకుంటున్నాం కాని నిద్రపోవటానికే దానికే వెళ్ళటం లేదు.

అలాగే వేదమనే ట్రైను వేదాంతమనే లక్ష్యానికి తీసుకు వెళ్ళటానికి వెళ్తోంది.

వెళ్తున్నప్పుడు మనం హాయిగా ఉండటానికి అనేక మార్గాలు చెప్తోంది. ఈ జీవితంలో, ఈ శరీరావస్థలో ఉన్నప్పుడు కొన్ని విద్యుక్త కర్మలు చేసేటప్పుడు ఎటువంటి ఆపదలు రాకుండా అన్ని అనుకూలించటానికి ఆది భౌతిక, ఆధ్యాత్మిక , ఆతి దైవిక తాపములనుంచి మనని బైట పెట్టటానికి, లోకయాత్ర కోసమై వేదం అనేక ఉపాయాలు చెప్తోంది. అవి వైదిక కర్మలు. కాని అందుకే అనుకోవద్దు. ట్రైను ఉన్నది ఎందుకు అంటే మనకి భోజనం పెట్టి, పడుకోబెట్టటానికే అనుకోవద్దు. అది మన లక్ష్యం తీర్చటానికి ఉందని తెలియాలి. అది తెలియకుండా నాన్యదస్తీతి వాదినః మాట్లాడేవాళ్ళని నిందిస్తున్నాడు. వేద కర్మలని ఆయన నిందించంలేదు, వేద జడులని నిందిస్తున్నాడు. వేదాభాస్య జడః అని మనకొక సంప్రదాయ వాక్యం ఉంటుంది. వేదా భాస్య జడులు అంటే వేదాన్ని అటు నుంచి ఇటు తిప్పుతూ ఉంటారు. ఈ పాండిత్యం మన బుద్ధిని వికసింపచేసే బదులు, ఒక్కోసారి బుద్ధిని సంకోచింప చేస్తుంది. ఇది ఇంతే, అది అంతే అని నిర్ధారణ చేస్తుంది. తద్వారా వాడు దాని యొక్క పరమార్థాన్ని తెలుసుకోని అవస్థ వచ్చే ప్రమాదం ఉంది. ఆ కారణం చేత వాడు సుఖలాలసలోకి వెళ్ళిపోకూడదని, అక్కడితో ఆగిపోవద్దు, వాడు సుఖలాలసలోకి వెళ్ళిపోకూడదని, అక్కడితో ఆగిపోవద్దు, ముందుకు సాగిపో అంటున్నాడే తప్ప కృష్ణ పరమాత్మ వేదాన్ని కాదనలేదు.

భాగవతంలోకూడా కృష్ణుడు ఈ విషయంలో చేసిన ఘట్టాలు కొన్ని గుర్తుకొస్తాయి. భగవద్గీతకి, భాగవతానికి పూర్తి సమన్వయం మనకి కనిపిస్తుంది. అందులో ప్రతి దానికి ఉదాహరణ భాగవతం లోంచి, లేదా కృష్ణ కథలోంచి కనిపిస్తుంది.

రెండు చోట్ల ఆయన ఈ వేద కర్మలని కాదనటం మనకి కనిపిస్తుంది. ఏమిటవి

?

గోవర్ధనగిరిని ఉద్ధరించిన సందర్భం ఒకటి, విప్రులని అనుగ్రహించిన సందర్భం ఇంకోటి. గోవర్ధన గిరి విషయం తీసుకుంటే ఇంద్రుడు కోసం వాళ్లందరూ యజ్ఞం చేద్దామనుకున్నారు. కాని కృష్ణ పరమాత్మ వద్దని చెప్పారు. ఇంద్రుడి వల్ల వర్షాలు పడుతున్నాయి. కాబట్టి చేయాలి అన్నారు. ఇంద్రుడి వల్ల పడుతున్నాయని ఎవరు చెప్పారు ? మనకి ప్రత్యక్షంగా కనిపిస్తున్న ఈ గో బ్రాహ్మణుల వల్లే మనం హాయిగా ఉన్నాము. ఈ గోవుల నన్నిటినీ పోషించేది ఆ గోవర్ధనం! అది ఇచ్చేటటువంటి పచ్చగడ్డి, దాన్నించి పారే జలపాతాలూ వీటి వల్ల పోషింపబడుతున్నాం కనుక. దాన్నే ఆరాదిద్దాం అన్నాడు. దీన్ని చాలా మంది అర్థం చేసుకోలేక కృష్ణుడు ఒక నాస్తికుడని. దేవతలను పూజించవద్దని చెప్పాడని, ఆ కారణం చేతనే కంటికి కనబడే ప్రకృతిని పూజించండి, కంటికి కనబడని దేవతలని ఎందుకు పూజిస్తారు అని అన్నాడని వీళ్ళు వ్యాఖ్యానించారు.

ఇక్కడ ఈ మాటని, ఆ మాటని పోల్చి చూస్తే కృష్ణ పరమాత్మ అంతరార్థం మనకి తెలుస్తుంది. కృష్ణ పరమాత్మ దేవాధి దేవుడుగా భూమి మీద తిరిగిన అవతారం కదా ! కాబట్టి ఇక్కడ ఉంటూనే సర్వ లోకాన్నీ శాసించగలవాడాయన. అందుకే కృష్ణ పరమాత్మ పూర్ణావతారం అయింది. ఇక్కడ ఉంటూనే బ్రహ్మని శాసించ గలడు, ఇంద్రుడిని శాసించగలడు. ఇంద్రాదుల యందు ఒక చిన్న అహంకారం ప్రవేశించింది. ఎందుకు ? మాయచేత ? బ్రహ్మగారు కూడా ఆ మాయ చేతనే కదా అంతకు ముందు తెగలనీ, వాళ్ళనీ దాచిపెట్టటం జరిగింది ! ఇంద్రుడిలో కూడా ఒక మాయ ప్రవేశించింది. ఆ మాయని తొలగించటానికి ఆడిన మాటే తప్ప, యజ్ఞాదులని నిరసించటం అందులో ఉద్దేశం కాదు. అలా అయినట్లయితే, ఇంద్రుడెందుకు వచ్చాడు

ఆయన దగ్గరికి ? వాళ్ళు లేరు, కంటికి కనబడని దేవతలని పూజించటం ఎందుకు అంటే మళ్ళీ ఇంద్రుడొచ్చి దండం పెట్టటం ఉందే ! అంటే కంటికి కనిపించని వారు ఉన్నారనే చెప్తున్నారు కదా అక్కడ.

పూర్వాపర సంబంధం తెలియక చాలా పొరపాట్లు జరుగుతుంటాయి.

అలాగే రెండో సందర్భం మునులందరూ కూర్చుని యజ్ఞం చేస్తుంటే కృష్ణ పరమాత్మ అటు వెళ్ళి, తన మిత్రులు ఆకలి వేస్తోంది, ఆహారం కావాలి అంటే యజ్ఞం జరుగుతోంది కదా అక్కడికి వెళ్ళండి. నేను వచ్చానని చెప్పండి. వాళ్ళు ఆహారం యిస్తారు తీసుకురండి అంటే వాళ్ళు వెళ్ళి అడిగారుట. వాళ్ళు కసిరికొట్టి పంపించారుట. మేము యజ్ఞం కోసం వండుకున్న ఆహారం వాడెవడో వస్తే యిస్తామా అని మందలించారు. ఆ మిత్రులు వచ్చి కృష్ణ పరమాత్మకి ఈ విషయం చెపితే, మీరు మునుల నడగద్దు, ముని పత్నుల నడగండి అన్నాడుట. ఆ ముని పత్నులు సాక్షాత్తూ కృష్ణ పరమాత్మే వచ్చాడా అని తన్మయులై, వారిని వారు మర్చిపోయి, ఆ యజ్ఞము కోసం ఉంచిన ద్రవ్యములన్నీ తీసుకుపోయి కృష్ణ పరమాత్మకి సమర్పించారు. పరమాత్మ వాటిని స్వీకరించిన తర్వాత, ఈ విప్రులందరూ వెళ్ళి పశ్చాతప్తులై స్వామీ యజ్ఞం అంటే నువ్వు యజ్ఞోవైవిష్ణువు యజ్ఞం యొక్క స్వరూపం నువ్వు, యజ్ఞము కర్తవు నువ్వు, యజ్ఞ ద్రవ్యానిని నువ్వు, యజ్ఞ ఫలానివి నువ్వు, యజ్ఞేశ్వరుడివి నువ్వు. అటువంటి నువ్వు సాక్షాత్ వస్తే నిన్ను కాదని వీళ్ళందరూ ఆ కర్మరతులై పోయాము. వాళ్ళే క్షమించమని వేడుకుని మంత్రము, తంత్రము, క్రతువు, యజ్ఞము, ఫలము అన్నీ అయిన నిన్ను తూలనాడాము.

కటకట మోసపోతిమి

కాంతల పాలిటియు బుద్ధిలేదు

అని కృష్ణుని చరణాలు పట్టుకున్నారు. ఇది కూడా మనం ఒక్క సారి గుర్తుతెచ్చుకోవాలి ఈ సందర్భంలో

అంటే అక్కడ కృష్ణ పరమాత్మ దేన్ని నిరసిస్తున్నాడు ? కర్మని నిరసించటం లేదు. కర్మలంపటత్వాన్ని నిరసించాడు. ఇప్పటికీ మనం పరిశీలించినట్లయితే ఈ యజ్ఞ, వేద కర్మలు చేసేవారికి కనబడే అహంకారం గాని, వాళ్ళు చేసే తర్క వితర్కాలు గాని, ఇక్కడ దీనికింతే ఫలితం అని మాట్లాడటంకాని, ఇవన్నీ చూస్తే తత్త్వజ్ఞుడికి కొంచెం బాధ కలుగుతుంది. ఇదా దీనికి ప్రయోజనం ? భక్తి అనే ధాతువు. ఆత్మ తత్త్వ విచారణ లేని వేద కర్మ వృధా అని చెప్పటం కృష్ణుడి యొక్క ఉద్దేశం. అయితే మరి వైదిక కర్మలు మానేయమనా ? దాని ముందే తెలుసుకోవాలి. నిష్కామంగా, నీకు విద్యుక్త ధర్మమైన వైదిక కర్మలను నువ్వు ఆచరించవలసిందే విద్యుక్తము అంటే ఎవరు విధించింది ? విహిత కర్మాచరణ అన్నాడు.

విహిత కర్మాచరణ అర్థమేమిటి ?

శాస్త్రము ఏది విధించిందో దాన్ని విహితకర్మాచరణ అన్నారు. ధర్మ నిర్ణయంలో స్వబుద్ధి పనికిరాదు. శాస్త్ర బుద్ధి కావాలి, అది విశేషం. నీకేది ధర్మమో శాస్త్రం చెపుతుంది. శాస్త్రం ఎందుకిలా చెప్పిందీ అంటు బహుశ ఇందుకు చెప్పి ఉండచ్చు. ఆరోజుల్లో ఈ సదుపాయం లేదుకనుక శాస్త్రం ఇలా చెప్పింది అంటాడు. శాస్త్రం ఎందుకలా చెప్పిందో చెప్పటానికి వీడికి తెలిసిందెంత, వీడి తపస్సెంత ? శాస్త్రం నిర్ణయించిన వాళ్ళు వే యేళ్ళు తపస్సు చేసి ఆ శాస్త్రవాక్యాన్ని చెప్పారు. మనకు ఆ తపస్సులో ఏపాటి ఉందని దాన్ని వ్యాఖ్యానించటం గాని విశ్లేషించటంగాని చేయటానికి?

శాస్త్ర ప్రమాణాన్ని ఎలా తీసుకోవాలి ?

ఆప్త వాక్యంగా తీసుకోవాలి. అంటే ఆప్తులైన వాళ్ళు చెప్పిన మాటగా! మనం ప్రయాణం చేస్తున్నప్పుడు, మనం వెళ్ళవలసిన గమ్యానికి మార్గాలు మూడు చీలికలు గా కనిపిస్తే, ఎటు వెళ్ళాలో తెలియనప్పుడు, ఎవడో ఒక భయంకర వ్యక్తివచ్చి నవ్వుతూ అటు వెళ్ళు అంటే వెళ్ళ. ఎందుకంటే వాడి నవ్వుని అనుమానిస్తాం. వాడి ఆకారాన్ని అనుమానిస్తాం. అలాకాక మనకు ఆప్తుడైన వాడూ, చాలా సౌమ్యుడైన వాడూ ఎదురుపడి ఇలా వెళ్ళు లక్ష్యానికి చేరుకుంటారు అని చెపితే నిర్భయంగా అడుగువేస్తాం. అది తప్ప మరో గతి లేదు మనకి. దేని ద్వారా వెళితే లక్ష్యం వస్తుందో తెలుసుకోవటానికి, ఒకొక్క తోవలో వెళ్ళి ప్రయత్నించటానికి మనకున్న సమయమెంత, ఆయువెంత ? అందుకు ఆ తోవలో వెళ్ళిన ఒక మహానుభావుడెవడో వాడు చెప్తాడు. అలాగ ఏది పరమార్ధమో అటు వైపు ఏ మార్గంలో వెళ్ళాలో, ఎవరు ఎలా వెళితే ఆ మార్గానికి చేరగలరో శాస్త్రం చెపుతుంది.

నిన్ననే చెప్పుకున్నాం నదిలో వెళ్ళేవాడు ఎలా వెళ్ళాలి, రోడ్డుమీద వెళ్ళేవాడు ఎలా వెళ్ళాలో, రోడ్డుమీద వెళ్ళే వాహనం లక్షణాలు, నదిలో వెళ్ళేదానిలక్షణాలేమిటి ? ఇవి తెలిసిన వాడొకడుంటాడు. వారు ఋషులు. వారు చెప్పేవి శాస్త్రాలు. ఆ శాస్త్ర వాక్యంలో ధర్మనిర్ణయం చేసుకుని తద్వారా స్వధర్మాన్ని ఈ లక్ష్యంతో ఏ లక్ష్యం ? పరమాత్మ ప్రాప్తి అనే లక్ష్యంతో కర్మాచరణ చేయాలి తప్ప 'నాన్య దస్తీతి వాదనః' ఈ వేద కర్మకిదే ఫలితం అని చెప్పి దానితో తర్జన భర్జన చేసేటటువంటి వారి విషయం బల్లరాదు అని చెప్పదలుచుకున్నాడు స్వామి.

భారతీయ సంస్కృతికి ఇతర సంస్కృతులకి ఉన్న తేడా ఏమిటి ?

భారతీయుడు ఏ స్థితిలో ఉన్నప్పటికీ కూడా వాడి ఎదుట ఒక లక్ష్యాన్ని చెప్పారు ఋషులు. అందుకే వాడికి శాంతికి అవకాశం ఉంది. ఒకప్పుడు చాలా మంది ఈ శాంతినే ఉద్దేశించి పొందేవారు. ఇప్పుడు మనం పూర్తి భౌతిక వాదం వైపు వచ్చి దూరమైపోతున్నాము. భారతదేశంలో సామాన్యుడినడిగినా మొహమాటానికో లేక డాంబికానికో ఒక మాట చెప్పవచ్చు. నీ జీవిత లక్ష్యం ఏమిటి అంటే పరమాత్మ ప్రాప్తియే నాదీ అంటాడు. కాస్త వివేకం ఉన్నవాడు చెప్పేదీ అదే! పరమాత్మకి వాడు ఏపేరైనా పెట్టుకోనీండి విష్ణువనండి, శివుడనండి విష్ణుసాన్నిధ్యం, శివసాన్నిధ్యం. అది వస్తే చాలండీ అంటారు చాలా మంది. అందుకు తగ్గ యోగ్యత నాకుందా లేదా అన్నది పక్కన పెట్టండి. అదొక లక్ష్యం అంటారు.

అంటే జీవితానికి ఒక గొప్ప లక్ష్యం నిర్ణయించిన తర్వాత మనకి మధ్యలో వచ్చే వేటి మీద కూడా అంత కోరిక ఉండదు. కోరిక నిలవకపోవటం వల్ల మనలో అశాంతి నిలవదు. అవునా, లేదా? చాలా మంది భారత దేశంలో శాంతిగా ఉండటానికి కారణం ఏమిటంటే అంత స్పష్టమైన లక్ష్యం ఒకటుంది ఇక్కడ. ఆ కారణం చేతనే వృద్ధాప్యం వచ్చినా, ఏ ఒక్కరూ పట్టించుకోకపోయినా, శాంతిగా ఉండగలడు మనిషి. ఇంకేముందండీ! ఆ పరమాత్మ పిలుపు కోసం ఎదురు చూస్తున్నాం అనంటాడు ఇక్కడ. ఆ మాటలో ఉన్న అర్థం చూడండి! పరమాత్మ అనే ఆయన దగ్గరకి వెళ్ళాలి అనే తపన చేత వాడి శాంతి పొందుతాడు. ఏ ఒక్కరూ పట్టించుకోకపోయినా, ఆయన నన్ను పట్టించుకున్నాడు అని వీడు ఆయన్ని పట్టించుకుని, ఆనామ మంటోనో, ద్యానం చేసో, కాశీ వెళ్ళో, అయోధ్య వెళ్ళో, తిరుపతి వెళ్ళో వృద్ధాప్యాన్ని గడుపుతుంటాడు. ఈ అవకాశం ఇతర సంస్కృతులలో లేదు.

అందుకే వాళ్ళకి ఏం వచ్చింది ?

కొద్ది వయస్సు అయ్యేటప్పటి కల్లా ఈ సంపాదించింది ఏం చేయాలీ భౌతికంగా చూద్దామంటే అవసరం ఎంత మేరకో మనిషి అంతమేరకు అనుకోలేదు. ఎందుకంటే పారమార్థికమైన ఆర్యదృష్టం ఎలాగూ లేదు! రెండవది స్వధర్మమనేది లేదు. స్వధర్మ మనేది లేకపోతే భార్యభర్తా కమిట్‌మెంట్ లేదు, తండ్రీ కొడుకు కమిట్ మెంట్ లేదు, అనుబంధాలకి ఆప్యాయతలకీ ఆస్కారం లేదు. అందుకు ఈ సంపాదించిందంతా ఏం చెయ్యాలి అని ఆలోచించి పాపం ఓ పెంపుడు కుక్కనో, మరో దాన్నో పెంచుతూ, దాన్ని పోషిస్తూ, దానితో టెన్షను నరాలు క్షీణించుకుపోవటాలు లాంటి వేదనలు పడుతూ మళ్ళీ ఇదుగో ఈ తూర్పు వైపు చూస్తూ, ఈ ప్రాచీన భారతదేశాన్ని చూసి మనశ్శాంతి పొందటానికి వాళ్ళు ప్రయత్నిస్తున్నారు అంటే ఎందుకో అర్థం చేసుకోండి. ఇక్కడ జీవితానికో స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించారు ఋషులు అది బహుళ వ్యాప్తం చేసారు మహాత్మ సిద్ధ పురుషులు ఆకారణం చేతనే ఇక్కడ సామాన్యుడు కూడా తన అంతిమ దశలో కొంచెం అయినా శాంతి పొందగలుగుతున్నాడు. అందుకు 'పరమాత్మే ప్రాప్తియే లక్ష్యం' అని నిర్థారించారు గనుక తత్ ప్రాప్తి కోసమై నువ్వు లక్ష్యంగా పెట్టుకున్నప్పుడు ఈ నాన్యదస్తీతి వాదం నుంచి నువ్వు బయట పడుతావు అని చెప్తూ, ఇక్కడ మరొక మాట కూడా చెప్తున్నాడు.

ప్రవదంతి అవిపశ్చితః అని వాళ్ళ మాటలన్నీ కూడా ఈ పరిమితిలోనే మాట్లాడుతూ ఉంటారని వీటినే తర్కవాదాలు అంటారు. తర్కవాదాన్ని కూడా వేదాంతం అంగీకరించదు.

భారతీయ విద్యా విధానమే వేరు. మన దేశంలో విద్యా విధానాన్ని ఏర్పాటు

చేసినప్పుడు పాశ్చాత్యులు ఏది పెట్టారో వాళ్ళు వెళ్ళిపోయిన తర్వాత దాని కొనసాగింపు దాని మీద మార్పులు, చేర్పులు చేస్తున్నాం కాని అసలు భారతీయ విద్యా విధానమేమిటో అర్ధమే చేసుకోలేరు మన వాళ్ళు. దాని వల్ల వస్తున్నాయి, ఇప్పుడు దేశంలో కనిపిస్తున్న విపరీతం. భారతీయ విద్యాస్వరూపంలో తర్క వ్యాకరణ, న్యాయ, మీమాంస అన్నీ ఉన్నాయి. శాస్త్రములన్నీ అధ్యయనం చేసేవాళ్ళు. ఇందులో తర్కం అంటే లాజిక్. ఏదీ విడిచి పెట్టలేదు. అన్ని శాస్త్రాలు ఈ దేశంలో ఉన్నాయి. కేవలం తర్కం చదివేవాడు గాడిదై పుడతాడు అని చెప్పారు. తర్కం తర్వాత చదవాల్సింది వేదాంతం అన్నాడు. అంటే యుక్తిని కాదనలేదు. యుక్తి, లాజిక్, ఆర్గ్యుమెంట్, రీజనింగ్ ఇవన్నీ ఉండాలి అని చెప్పాడు కనుకే తర్కశాస్త్రం చెప్పాడు. నువ్వు లాజిక్, ఆర్గ్యుమెంటుచేస్తూ కూచోవటం కాదు, అది పండించుకుని వేదాంతం వైపు వెళ్ళాలి. నువ్వు అక్కడే ఆగిపోతే పుష్పితాం మాచామ్. అలా కాకుండా వేదాంతం వైపు వెళ్ళు అన్నాడు. దానికే సాంఖ్యం అన్నారు. వేదాంతం వేరు, సాంఖ్యం వేరు. శుద్ధాత్మ తత్త్వం వేరు కాదు. ఇవన్నీ కూడా ఒక్కటే చెప్తున్నాయి.

వేదం ఏం చెప్పింది ?

వేదాంతం చెప్పింది. వేదాంతంలో వేదం అనే మాట ఉందా లేదా ? అంటే అర్ధమేమిటి ? వేదము, కర్మకాండ, ఉపాసనాకాండ, జ్ఞానకాండ, జ్ఞానకాండని వేదాంతం అన్నారు. కర్మ, ఉపాసనా కాండలు వేదములో ఉన్నాయి. ఈ కర్మ అనేది మన ఐహిక ఫలసిద్ధికి, సుఖ జీవనానికి ఋషులు చెప్పిన గొప్ప మార్గములు. అవి కావలసినవే! రెండవది ఉపాసనాకాండ. ఆయా దేవతలని ఉపాసించే విధానము. అందులో మళ్ళీ రెండు విధములు ఉన్నాయి. సకామ, నిష్కామ ప్రేమ పూర్వకంగా ఉపాసించే దాన్ని

భక్తి అంటారు. ఏవైనా కోరికతో ఉపాసించేది కూడా కర్మకాండానుగత్వమే! వేదాంతం అనేది శుద్ధ ఆత్మ జ్ఞానాన్ని చెప్పేటటువంటిది. అదే ప్రధానమయితే వేదం ఇది వద్దని, అది చెప్పచ్చు కదా? ఇది చెప్పి, అది ఎందుకు చెప్పిందంటే ఇది నీలోక యాత్రా విధానానికి, పాప నిర్మూలన చెయ్యమంది.

కర్మకి అందుకే రెండు ప్రయోజనాలున్నాయి. ఏమిటవి ?

చిత్తస్యశుర్ధయే కర్మ, కృతజ్ఞసత్య నివృత్తయే దేవతలని ఎందుకు ఉపాసించాలి ? కర్మలను ఎందుకు చేయాలి? చిత్త శుద్ధికోసం కర్మ చేయి. నాకు ఫలం అక్కరలేదంటే చాలా సంతోషం. నీకు ఫలం అక్కరలేదు కాని నీ చిత్తంలో అశుద్ధం ఉంది అది పోగొట్టుకోవటానికి కర్మ చెయ్యి అది విశేషం. నేను స్నానం చేయనండీ, నాకేం అక్కరలేదు అంటే నీకు అక్కరలేకపోయినా, నీ పక్కన ఉండే వాళ్ళు క్షేమంగా ఉండాలంటే నువ్వు స్నానం చెయ్యి అని చెప్తామా లేదా ? అంటే శుద్ధతకోసం అన్నమాట. చిత్త శుద్ధి కోసం కర్మ చేయాలి అనగానే చిత్తశుద్ధి అంటే ఏమిటనేది ఒక పెద్ద ప్రశ్న. వినటానికి తేలికే.

మనకి సనాతన ధర్మం మీద గౌరవం ఉంటే అది ఏదో కాలక్షేపం అనుకోకుండా ఏకాగ్రత చాలా అవసరం, మననం చాలా అవసరం, జీవితంలోకి తెచ్చుకున్న ప్రయత్నమైనా చాలా అవసరం. తెచ్చుకుంటామో లేదో పక్కన పెట్టండి. ముందు సిన్సియారిటీ ! అది చాలా ముఖ్యం. చిత్త శుద్ధి చాలా ముఖ్యం. ఈ పదం అందరం వాడుతుంటాం. ఎవడో పూజ చేసుకుంటూంటే, వాడిమీద ఏదో అక్కసు వచ్చి, చిత్తశుద్ధి లేని శివపూజ లేలయా అంటాడు. వాడి చిత్తశుద్ధికి వీడెవడు తార్కాణం ?

చిత్తస్య శుద్ధయే కర్మ అంటే చిత్తం మలినం ఎలాంటిది మనకు కూడా తెలియదు.

అదీ విశేషం. మన కడుపులో ఏ రోగమొచ్చిందో, ఏముందో మనకి తెలియక స్కానింగ్‌లకి ఎలాగైతే వెళ్తున్నామో అలాగే చిత్తంలో ఎంత మాలిన్యముందో మనకి తెలియదు. ఇప్పటిదా ఆ మాలిన్యం? కొందరు నా మనస్సు చాలా నిష్కళషమండీ అంటారు. అంటే ఆ క్షణంలో వాడికి ఎవరి మీదా, ద్వేషం లేదు. ఎంత సేపు ? ఆ క్షణం వరకూ.

'చిత్తస్య శుద్ధి' అంటే చిత్తాన్ని ఆవరించుకుని అనేక జన్మల వాసనలు ఉంటాయి. వాటినే మాలిన్యములు అంటారు. వాటిని తొలగించుకోవటానికి వైదిక సంస్కారములు చెప్పబడ్డాయి. జాత కర్మ మొదలుకొని, అంత్యేష్టి వరకు చెప్పబడ్డ కర్మలన్నీ కూడా చిత్తశుద్ధి కోసం చేయబడ్డవే. నాకు కర్మఫలమక్కరలేదు. బంధహేతువు అంటే ఏవైతే కామ్యములు ఉన్నాయో అవి విడిచి పెట్టేయి కాని చిత్తశుద్ధి కోసం నీకు విధింపబడ్డ నిత్య నెమిత్తిక కర్మలు మాత్రం మానరాదు. ఇవి వైదిక కర్మలే! వాటి ప్రయోజనం చిత్త శుద్ధికోసం అని తెలుసుకో!

చిత్తశుద్ధి అయ్యాక జ్ఞానం వస్తుంది కొందరికి. ఆ జ్ఞానం వచ్చాక కర్మని విడిచిపెట్టేస్తాను అంటారు. కర్మ విడిచి పెట్టేస్తాను అన్న స్పృహ ఉన్నవాడు కర్మని విడిచి పెట్టటానికి వీలులేదు. కర్మని మనని విడిచి పెట్టటం కాదు, కర్మ మనని విడిచి పెట్టాలి. ఆ స్థితికి మనం వెళ్ళం. కర్మని విడిచి పెట్టున్నాను అంటే కర్మతో బంధం ఉన్నట్టే కదా! విడిచిపెట్టున్నాను అనే బుద్ధి కూడా ఉండరాదు. అత్యంత సహజంగా అది వెళ్ళవలసిందే గొంగళి పురుగు సీతాకోక చిలుక అయినట్లు! అంతే కాని గొంగళి పురుగు ఆ గూట్లో కూర్చుని నేను తర్వాత ఎగరవలసిన దాన్నే కదా, ఇప్పుడే ఎగురుతాననుకుని గూడుని కొట్టుకుందనుకోండి, ఎగరలేదు సరికదా, అక్కడ కూడా ఎగరలేని స్థితికి అది చేరుకుంటుంది. నిజంగా ఎగర దలుచుకుంటే, నా

అంతిమ అవస్థ అదీ అని తెలుసుకుంటే, దానిని నిష్కామంగా ఆచరించటం చాలా అవసరం. జ్ఞానియైనవాడు కూడా కొన్ని కర్మలని వదలడు. ఎందుకు ? చిత్తశుద్ధికోసం చేస్తాడు. తర్వాత కృతజ్ఞస్య నివృత్తయే!

దేవతల అనుగ్రహం చేత, వాళ్ళిచ్చిన ఈ దేహంతో సాధన చేసాడు గనుక, ఈ దేహం ఉన్నంత కాలం ఏం చేస్తాడు? ఆ ఉన్న ఇంద్రియాలని, వాటిని ఈశ్వరార్పణంగా కర్మ చేయటంలో వినియోగిస్తాడు. ఏదో కావాలని కాదు, మనకేవో ఉన్నాయి గనుక ఎవరెవరికి కృతజ్ఞతలు చెప్పాలో దానికోసం కర్మ చేయవలసిందే. అందుకు వేదవాదతులు, కర్మలంపటులు అంటే కేవలం ఈ భౌతిక మైన భోగముల కోసం, లేదా పరలోక భోగాలకోసం ఉద్దేశించి కర్మ చేసేవారిని నిందించాడు తప్ప అదే విధంగా తన పాండిత్యపు లంపటత్వము, ప్రగల్భము చూపుతూ వాదించే వారినీ, వారి తర్కాన్ని ఈయన నిందిస్తున్నాడు కాని ప్రయోజనమైన వేదాంతాన్ని మాత్రం నిందించటం లేదు. ఈ మాట మనకి భక్తి శాస్త్రంలోనూ, జ్ఞాన శాస్త్రంలో కూడా చెప్పబడుతూ, శంకర భగవత్పాదులే చెప్పారు, ఘటోవా వృథాకంఠక్షోభం, వహతిసరచాతర్కవరచసా! ఏదో తర్క శాస్త్రం మాటలు పట్టుకుని, వాటని ఇటు తిప్పి, అటు తిప్పి వాదిస్తే ప్రయోజనం ఏముంది ? అందుకే భక్తి శాస్త్రం చెప్పిన నారదులు కూడా వాదోనావలంభ్యాః అన్నాడు వాదాల వైపు వెళ్ళవద్దు అని చెప్పారు. ఈ విధంగా ఈ అవిపశ్చిత లక్షణం ఏదైతే ఉందో, పామర లక్షణం, అజ్ఞాన లక్షణం, అవివేక లక్షణం దాన్ని విడిచి పెట్టాలని చెప్తున్నాడు. ఇక్కడ వేదము వేదాంతము ప్రశ్న వచ్చింది కనుక, వేదాంత మంటే ఏమిటో చెప్పాలి.

వేదమనేదానికి చివరి భాగం వేదాంతం. మామూలుగా టెక్నికల్‌గా మనం

నిర్వచిస్తే, వేదాలకి అనేక శాఖలున్నాయి ఒకొక్క శాఖకి చివరి ఉపనిషత్తు అని చెప్పబడుతుంది. దాన్ని వేదముల యొక్క శాఖల చివర చెప్పబడింది కనుక వేదాంతం అంటాం. వేదములకి నాలుగు భాగములు ఉన్నాయి. సంహిత, ఆరణ్యకము, బ్రాహ్మణము, ఉపనిషత్తు, ఈ నాలుగింటిలో ఆఖరి భాగం ఉపనిషత్తు కనుక దాన్ని వేదాంతం అంటాం. వేదము యొక్క అంత భాగము వేదాంతము అని చెప్పబడింది. ఎవరైనా కాస్త వైరాగ్యంగా మాట్లాడితే వేదాంతం చెప్తున్నాడండీ అనటం మనకి అలవాటైపోయింది. ఒక విధంగా వేదాంతం అంటే ఏమిటో పోల్చుకోగలిగే స్పృహ భారతీయుల్లో అంత ఉన్నందుకు సంతోషించాలి మనం. ఇలా అనేక అర్థాల్లోవాడినా, వేదాంతము అంటే చివరి మాట అని తెలుసుకున్నాం.

ఇప్పుడు చివరి మాట అంటే ఏమిటి ?

ఇకపై చెప్పవలసినది ఏదీ లేనప్పుడే దాన్ని చివరిమాట అంటామా లేదా ? ఒకడు వ్యాసం రాసినప్పుడు ఇంట్రడక్షన్, ఎక్స్ప్లనేషన్, డిస్క్రిప్షన్, కంక్లూషన్ ఇస్తాడు. కంక్లూషన్ అంటే అర్థమేమిటి ? ఇంతవరకూ ఇచ్చిన దాని సారాంశం అని కదా అర్థం ? కనుక వేదము కర్మకాండ అన్నీ చెప్పి చెప్పీ, ఒక తీర్మాన మిచ్చింది అలాగే కోర్టులో కూడా రెండువైపుల లాయర్లు వాదించేసాక, చివరి మాట ఎవరిది ? ఈ ఇద్దరి లాయర్లదీ కాదు. జడ్జిది. అతను చివరికి జడ్జిమెంట్ ఇస్తాడు. అంటే లాస్ట్ వెర్డ్ ఎవరిది జడ్జిది. లాస్ట్ వర్డ్ ఏమిటి ? జడ్జిమెంట్. వేదాంతం అంటే వేదము ఇచ్చిన జడ్జిమెంట్. వేదము యొక్క తీర్మానము అని శంకర భాగవత్పాదులు చక్కగా నిర్వచించారు. వేదము ఇచ్చిన తీర్మానము ఏమిటి ? పరమాత్మ ఇచ్చిన ఆసాంఖ్యమే శుద్ధాత్మతత్త్వ విజ్ఞానమే వేదాంతము. దానిని చేరనివ్వనటువంటి, అక్కడిదాకా వెళ్ళకుండా ఆగిపోయిన వేద

కర్మ లంపటత్వమే కృష్ణ పరమాత్మ ఇక్కడ వరకూ నిందించారు. అటు తర్వాత ఎందుకిలా అంటున్నావు అంటే

త్రైగుణ్య విషయా వేదా నిస్త్రై గుణ్యోభవార్జున

నిర్ద్వంద్వో నిత్యసత్త్వస్థో నిర్యోగ క్షేమ ఆత్మవాన్ 2-45

ఇలాంటి భారతీయ సంస్కృతి లాంటి సంస్కృతి ఎక్కడా ఉండదు. నువ్వు దేనితో తరించాలో దాన్ని కూడా వదిలేయి! ఎప్పుడు ? తరించాక! పడవతో ఒడ్డుకు చేరాము. ఇంతవరకు వడ్డుకు చేర్చింది కదా అని ఆ పడవలోనే తిరుగుతానని కూర్చోకు. వడ్డుకు చేరాక ఆ పడవని కూడా వదిలేయి. వడ్డుకు చేరాక ఊర్లోకి వెళ్ళకుండా కూర్చుని, ఇంత వరకూ దానితో ఎటాచ్‌మెంట్ ఉందండీ అనకూడదు.

'ఏనత్యదిసి తస్సదా' అని చెప్పగలిగిన గొప్ప సంస్కృతి మనది. దేనితో దీనిని వదిలారో, దానిని వదిలేయి తర్వాత అన్నాడు. ఎంత గొప్ప మాట అది ? ఇంకా అర్థం కావాలంటే ఒక ముల్లు గుచ్చుకుందనుకోండి! దాన్ని మరొక పదునైన ముల్లుతో తీస్తాం. ముల్లుని, ముల్లుతోనే తీయాలన్నారు కదా! తీసాం, ఈ ముల్లుని పారేసాం ఆ ముల్లు జేబులో పెట్టుకుంటామా? ఇది ఇంకో ముల్లుని తీసింది అనుకోకుండా దానిని కూడా పారేస్తున్నాము కదా! అదే విధంగా వేదాంతమును చేర్చినప్పుడు వేద కర్మ ఉపసమిస్తోంది. అందులోకి చేరి అక్కడితో ఆగకు. దాని ప్రయోజనమేమిటో తెలుసుకో.

త్రైగుణ్య విషయా వేదా... అనటం లోని విశేషమిది. వేదములన్నీ త్రైగుణ్యములు.

త్రైగుణ్యములు అంటే ఏమిటి ?

త్రిగుణములైన విషయములు. త్రిగుణములంటే ఏమిటి ?

సత్వ ,రజ, తమో గుణములు. ఇవన్నీ మనకి అర్థం చేయటానికి తర్వాత ఒక అధ్యాయమే తీసుకున్నారాయన. అప్పుడు చూద్దాం. ఇక్కడ ఒక బీజం వేసారు. సాంఖ్య యోగం తర్వాతి అధ్యాయములన్ని బీజాలు దాచుకున్న యోగము కనుక మనకి ఈ యోగములో తర్వాతి యోగములకి సంబంధించిన అంశాలు ప్రస్తావించబడతాయి. ఎలాగైతే అనార్యదృష్టం, అస్వర్గధాం, అకీర్తి కరం అని ఒక మాట అని, దాని విస్తృతి ఇక్కడ చెప్పబడిందో త్రైగుణ్యములు మొదలైన వాటి విస్తృతి తర్వాత చూస్తాం.

వేదములని ఎందుకు నిరసిస్తున్నాడు ?

వేదములు త్రిగుణాత్మకమైన విషయాలను చెప్తాయి. సత్త, రజ, తమో గుణాల విషయాలే చెప్పాలి. ఈ మూడు గుణాలతో ఉన్న వాళ్ళమే మనం. అవునా, లేదా ? మనం ఉన్నది ఎక్కడ, మన చుట్టూ ఉన్నదేమిటి, మన లోపల ప్రవృత్తులేమిటి అంటే అన్నీ ఈ మూడింటిలోనే కూడుకుని ఉన్నాయి. అవునా, లేదా ? దీని వివరణ చాలా మందికి తెలుసుకనుక ఎక్కువ చెప్పుకోవటం లేదు. భోగలాలస అనేటటువంటిది రజోగుణ సంబంధమైనది. అలాగే జ్ఞానము, వివేకము, తెలివి, బుద్ధి మొదలైనవి సత్వగుణానికి సంబంధించింది. అదే విధంగా మనం చెప్పుకునే తమస్సులో సోమరి తనం, నిద్ర కూడా ఉన్నాయి. ఇవన్నీ వ్యక్తికవసరమే! నిద్ర లేకపోతే ఉండగలమా చెప్పండి ? అదీ మనకి అవసరమే. శారీరక ధర్మాల్లో అది ఒకటి. అలాగే రాజసిక మైన ఇది నాదీ అనే భావమే లేకపోతే జగత్తు నడవదు అసలు. సృష్టి దేని నుంచి వచ్చింది అంటే రజోగుణ ప్రధానమైన బ్రహ్మదేవుడు సృష్టి చేసాడు అంటే ఆ రజోగుణమే లేకపోతే సృష్టి అన్నదే జరగదు. సృష్టి, స్థితి, లయలకు మూడు గుణాలూ అవసరమయ్యాయి. సృష్టిలో ఉన్న మనకీ, సృష్టికే అవసరమైన ఈ మూడు గుణాలని

వివరించి చెప్పేదే వేదం. మనం త్రిగుణములలో ఉన్నంతవరకూ వేదము అవసరమే! కాని ఆ త్రిగుణాలతోనే ఆగిపోకుండా, త్రిగుణాత్మకమైన ఈ శరీరాన్ని త్రిగుణాతీత స్థితిని పొందటానికై నువ్వు వినియోగించుకోవాలి అని పరమాత్మ చెప్తున్నారు ఇక్కడ. అందులో సందేహం లేదు.

త్రిగుణాత్మకమైన ఈ చైతన్యం ఆయన ప్రసరింపజేసిందే!

ఎవ్వనిచే జనించు

జగము నెవ్వని లోపల నుండి, లీనమై

ఎవ్వని యందు, జి

అన్నప్పుడు మూడు పనులూ ఆయన నుండి వచ్చినవే అంటే, సత్వ, రజో, తమః గుణాల వల్ల కదా వచ్చినటువంటివి? ఈ మూడు చేసినప్పుడు ఆయన వీటికి అతీతమా అంటే ఆయన అతీతంగా ఉండి వీటిని చేస్తున్నాడు అతీతం అందుకే? దీని నుంచి మనం కూడా అటు వెళ్ళాలి. వేదము చెప్పే కర్మములన్నీ, ఇహ పరలోక సుఖములన్నీ కూడా రజోగుణ తమోగుణ సత్వగుణ సంబంధమైనవే చెప్తున్నాయి. వాటిని నువ్వు లంపటత్వముతోనే ఆచరిస్తే ఈ త్రైగుణ్యములలోనే కొట్టుకుంటూ సృష్టి, స్థితి, లయ లలో వెళ్ళిపోతూ ఉంటావు. తదతీయమైన ఆయన్ని అందుకోవాలంటే మాత్రం ఈ త్రైగుణ్య విషయాన్ని దాటి నిస్త్రై గుణ్య స్థితికి వెళ్ళాలి.

దీనికి అర్థమేమిటి ?

నువ్వు అక్కడికి చేరాలంటే ఇక్కడ చతికిల పడకూడదు అన్నారెవరో ? అక్కడకి చేరు అన్నాడని చెప్పి, మనం ఇక్కడి నుంచి దూకగలమా ? నడవగలం. ఈ నడిచేటప్పుడు మధ్యలో ఉన్నదేదీ అది కాదు కదా! కనుక దీని ఆధారంగా దానికి

చేరటానికి ప్రయత్నిస్తుంది. త్రిగుణాతీతమైన ఆత్మస్థితి యందు దృష్టి కలిగి, ఈ త్రైగుణ్యములైన విషయములను ఆదిశగా మళ్ళించటానికి ఉపయోగపడే యోగమే నిష్కామ కర్మ యోగం. తద్వారా ఈ త్రిగుణాత్మకమైన బంధం నుంచి విడివడలేవు.

నిర్ద్వంద్వో నిత్య సత్త్వస్థో నిర్యోగక్షేమ ఆత్మవాన్!

సాధన ఎలా వెళ్ళాలి ?      2-45

నిర్ద్వందః. ద్వంద్వములకు అతీతుడై ఉండాలి. అదే విధంగా నిత్య సత్త్వస్థః నిర్యోగ క్షేమః యోగక్షేమములో లేనివాడై ఉండాలి. ఈ మాటలెంత భయంకరంగా వినబడుతున్నాయి ? యోగ క్షేమములు లేకుండా ఉండాలా ? పైగా ఆత్మవాన్ అన్నాడు. ఆత్మవాన్ విషయం పక్కన పెడతాం కాని నిర్యోగ క్షేమం ఏమిటి ? ఒక ఉత్తరం రాస్తేనే యోగ క్షేమములు తెలియజేయవలెను అని అనే వారు పూర్వం. ఇప్పుడు ఉత్తరం రాసే కళ కూడా పోయింది. ఈమెయిలు, ఆమెయిలు వచ్చి ఆ కళలే వెళ్ళిపోయాయి. అది వేరే విషయం. మన సంప్రదాయ మాట అయిన యోగక్షేమములు కూడా వదిలేయమన్నాడు. ఇదేం మాట ? వినటానికి అన్నీ భయంకరంగా ఉన్నాయి. మళ్ళీ ఆయనేమో యోగక్షేమం వహా మ్యహం అంటాడు. ఇంత పరస్పర విరుద్ధంగా ఎవరైనా మాట్లాడతారా ? ఆయన ఆచార్యుడు అయ్యాడా? కొంచెం ఆలోచించాలి ఇక్కడ.

నిస్త్రై గుణ్యస్థితి ఎలాంటిది ?

అక్కడ నిర్ద్వంద్వః అదీ విశేషం. ద్వంద్వమునకు అతీతమైనది. ద్వంద్వములంటే రెండు మన చూపులెప్పుడూ రెండింటిపైనే వెళ్ళిపోతూ ఉంటాయి. హిరణ్యకశిపుడి చూపే రెండింటివైపు కదా! ఈ రెండింటికీ అతీతమైన ఒక సంధ్యాస్థితికి అతను

ఊహించలేదు. కాని అక్కడున్నాడు పరమాత్మ. అందుకు వచ్చాడు. అదెకదా ఆంతర్యం? రెండు కనబడుతుంటాయి ఎప్పుడూ ఇల్లు బయట, వెలుగు చీకటి, సుఖము దుః ఖము, జయం అపజయం, లాభం నష్టం, భోగం రోగం అంతే! ఇలా ఇటొక ఎక్స్‌ట్రీమ్, అటొక ఎక్స్‌ట్రీమ్! కాని ఈ రెండింటికీ మధ్యలో ఒక స్థితి ఉంది. ఇటుకీ, అటుకీ చెందక అటునీ, ఇటునీ కూడా నియంత్రించగలదు ఈ స్థితి. దాన్ని సమస్థితి అని చెప్తారు. ఆ స్థితికి నువ్వు వెళితే, అన్నిటినీ నువ్వు కంట్రోల్ చేయగలవు. ఆ బ్యాలెన్స్‌నే యోగమంటారు అని ప్రతిపాదించదలుచుకున్నాడు. నిర్ద్వలద్వః అంటే ద్వంద్వానికి అతీతుడై కర్మ చేస్తాడు వాడు.

దేని మీద నిలబడాలి ?

దాని మీద నిలబడకు, దీని మీద నిలబడకు అంటే మరి దేని మీద నిలబడాలి ? నిత్య సత్త్వస్థః నిత్య సత్త్వమునందు నిలబడు అన్నాడు. ఇక్కడేమో త్రిగుణాతీతస్థితి అంటే సత్త్వము త్రిగుణములలో ఒకటి కాదా ? ప్రశ్నించాలి కృష్ణుడిని కూడా! ఆయనే స్పష్టం చేసాడు. మరొక చోటకూడా ? అక్కడికీ ఇక్కడికి సమన్వయ పరచుకోవాలి.

నిత్యసత్త్వస్థః అంటే ఏమిటి ?

కొందరం నిత్యము సత్యము నందు ఉండు అని అర్ధము చెప్పుకుంటారు. కాని ఇక్కడ ఆ అర్ధము స్వీకరించవలసిన అవసరము లేదు. స్వీకరించినా తప్పుకాదు. అది ఎలాగో చెప్తాం. నిత్య సత్త్వము అంటే ఏమిటి ? ఎళ్ళ వేళలా ఉనికి కలిగినంది. అది ఏమిటి ? ఆత్మస్థితి. దాని యందు ఉండటం నిత్య సత్త్వము నిత్త్య సత్త్వుడు ఆ పరమాత్మే! ఆ పరమాత్మ యందు నిలకడ కలిగి ఉండి, కర్మ చేస్తే వాడు నిస్త్రైగుణ్య స్థితికి చేరుకుంటున్నాడు గనుక నిత్యసత్త్వస్థుడు వాడు. అదీ విధంగా రజోగుణ,

తమో గుణ సాంకర్యము లేని, సత్త్వగుణాన్ని అవలంబించి సాధకుడై ఉండాలి. సాధన స్థితిలో అది చాలా ముఖ్యమైనది. ఆ గుణంలో ఉంటూ మనం క్రమంగా తరించగలము.

ఈ సత్వగుణం ఎలాంటిది ?

అది కూడా త్రిగుణములలో ఒకటేకదా అంటే ముగ్గురు దొంగలలో అది మంచి దొంగట. అది ఎలాగూ అంటే పరమ హంసగారు ఒకచక్కటి కథ చెప్పారు ఒకసారి. ఒకడు ధనం బాగా సంపాదించి మూట గట్టుకుని, అడవిలోంచి వస్తుంటే ముగ్గురు దొంగలు అటకాయించారుట. మొదటి దొంగ కట్టేసి సొమ్మడిగాడు. ఉత్తినే సొమ్మడగటం కాదు, కొట్టేద్దాం పూర్తిగా వీడు బ్రతికుంటే ప్రమాదం అన్నాడు రెండోవాడు. ఏం చేయగలడు అసహాయుడు ఆ ధనవంతుడు. కాని మూడోవాడు ఆపాడు, వాడు ఇవ్వాల్సిందేదో ఇచ్చేసాడు, కట్టు విప్పేయండి చంపద్దు అన్నాడుట. వీడి మాట కాదనలేక మిగతా ఇద్దరు దొంగలు కట్టువిప్పేసి తప్పుకున్నారు. ఇంక తర్వాత పనంతా ఈ మంచి దొంగ పని. ఆయన నిన్ను వదిలేసాను, వెళ్ళిపో అన్నాడు. నామీద అటకాయించారు, కళ్ళకు గంతలు కట్టి ఇక్కడికి తెచ్చారు. ఇప్పుడు నా ఊరు ఎలా వెళ్ళాలో నాకు మార్గం తెలియదు అన్నాడు. అంటే ఈ మంచి దొంగగారు సరే నేను మార్గం చూపిస్తాలే పద అన్నాడు సరిగ్గా పొలిమేర దాకా వచ్చి అదిగో నీ ఊరు అన్నాడు. ఇతడూ పోల్చుకున్నాడు. ఒకసారి ఇంటికి రండి, కాఫీ తాగుదాం అన్నాడు. అబ్బో! నేను ఊర్లోకి రాను. నేను వస్తే నన్ను పోల్చుకుని జైల్లో పెట్టచ్చు. లేకపోతే నువ్వే నన్ను ఇంటికి తీసుకెళ్ళి, చాటుగా పోలీసులకి ఫోను చేసి అరెస్టు చేయించుతావో? అందుకే నేను అడవిలో ఉంటే క్షేమం, నువ్వు ఊరిలో ఉంటే క్షేమం అన్నాడుట.

అంటే ఈ దొంగకి ఊర్లోకి అనుమతిలేదు. ఈ ముగ్గురి దొంగల్లో వీడు ఎలాంటివాడో సత్త్వగుణం అలాంటిది అన్నాడు. అంటే రజోగుణం, తమోగుణం అడవిలోనే బంధిస్తే, సత్త్వగుణం అక్కడిదాకా చేర్చి వదిలేసింది. అటు తర్వాత వీడు క్షేమంగా వెళ్ళాడు. అందుకు సత్త్వగుణాన్ని అవలంబించి సాధన చేసేవాడు, త్రిగుణాతీత స్థితికి వెళతాడు అని చెప్పటానికే సాదన పరంగా తీసుకుంటే నిత్యసత్యస్థః అనేది ఆ పరంగా వ్యాఖ్యానించిన అర్థాన్ని కూడా మనం తీసుకోవచ్చు.

ఇక నిర్యోగ క్షేమః అంటే ఏమిటి ?

యోగక్షేమం అంటే కృష్ణ పరమాత్మ చెప్పిన లోతు అక్కడ చూసుకుందాం. ఇక్కడ యోగక్షేమాలు వద్దు అంటే ఏమిటో చూసుకుందాం. యోగము, క్షేమము మన భోగములన్నీ ఈ రెండింటిమీదే ఆధారపడి ఉన్నాయి. యోగము అంటే లేని వస్తువు రావటం, క్షేమము అంటే వచ్చిన వస్తువు క్షేమంగా ఉండటం. ఈ ఫలాని వస్తువు లేదు, దాన్ని సంపాదించుకున్నాం. చాలా సంతోషం. ఇంక దాన్ని క్షేమంగా ఉంచుకోవటానికి పడే నానా యాతనలూ మరొక అవస్థ ఇలాగే ఉంటూ ఉంటే ఎప్పటికి కడతేరేను ? అందుకు ఆ త్రిగుణాతీత స్థితిలో ఉన్న ఆత్మజ్ఞానాన్ని పొందినటువంటి వాడు నిర్యోగ క్షేమ భౌతికమైన యోగ వస్తువులు కోరుకోడు, దాని క్షేమం కోసం తపన పడడు.

ఎందుచేత ?

ఆత్మవాన్ ఆత్మవంతుడు గనుక అన్నాడు. ఆత్మవాన్ అనే శబ్దం చాలా దివ్యమైనది. వాల్మీకి కూడా రామాయణ రచనలో అడుగడుగునా ఆత్మంచ అంటూ ఉంటాడు. అదే విధంగా పుణ్యాత్ముడిని ఎవరిని వర్ణించినా ఆత్మవాన్ అన్నాడు దశరధుడికి

కూడా ప్రయోగించాడు. ఆత్మవాన్ అంటే ఒక అర్థం అసహాయుడు అని. ఏ సహాయం లేని వాడని కాదు, ఏ సహాయం అక్కరలేనివాడు అని అర్థం. ఇతరులపై ఆధారపడకుండా, తనయందు తాను ఆధారపడేవాడు అటువంటి ఆత్మవంతులు ఎవరో వారు మహాత్ములు. అదే విధంగా ఆత్మవాన్ అంటే తన స్థితిలో తాను ఉండేవాడు. ఒక బైటి దాని వల్ల ప్రభావితుడు కాకుండా, చలించకుండా, తన స్థితిలో తాను ఉండేటప్పుడు స్వాధీనుడు అంటాడు. ఏమండీ బయటికి వస్తారు అంటే ఎవరో ఒకరు ఉంటేకాని వెళ్ళలేను అనేవాడు ఆత్మవంతుడు కాదు. ఒక మేరకు వాడంతట వాడు కదిలితే ఆత్మవంతుడు. వాడంతట వాడు అంటే కేవలం దేహంతో అని కాకుండా జ్ఞానాన్ని విస్తరింపచేస్తే, తన స్థితి నుంచి తాను చెదరని వాడు. ఒక సుఖ మొచ్చినా, ఒక దుఃఖమొచ్చినా, వెంటనే చలించిపోయేవాడు ఆత్మవంతుడు కాడు. నిర్వంద్వః, నిత్యపత్త్వః, నిర్యోగక్షేమః అనే వాడి స్థితి ఆత్మవంతుడిస్థితి. ఆ స్థితిలో ఉన్నప్పుడే నిస్త్రైగుణ్యః వాడిని నిస్త్రైగుణుడు అంటారు సుమా! ఓ అర్జునా నువ్వు త్రిగుణాత్మకములైన వేదములని విడిచిపెట్టి నిస్త్రైగుణ్య స్థితికి చేరుకో అన్నాడు. ఎంత గొప్ప స్థితి అది వీటి నుండి అక్కడికి చేరుకో! వీటితో ఆగిపోకు అని చెప్పటమే ఆయన పరమ ప్రయోజనం ?

కొన్ని రకాల వాళ్ళు వింటూ ఉంటారు. కాలక్షేపానికి కొందరు, ఆలోచనతో కొందరు, వేరే వ్యాఖ్యానం గుర్తుకు తెచ్చుకునే కొందరు, ఉంటారు. ఈ లోకరీతి అనేక రకాలైన ఫిలాసఫీలు ఎన్నో ఉన్నాయి మనకి. వీటన్నిటిని అన్వయించి చరిత్రగతిని కూడా పరిశీలించి తెలుసుకోవాల్సిన అంశాలు కొన్ని ఉన్నాయి. వేదనింద కూడదు అని మనకి తెలుసు. నాస్తికుడెవరు ? నాస్తికో వేద నిందకః నాస్తికుడంటే వేదాన్ని

నిందించేవాడు అని కదా అర్థం? వేద కర్మ నిరసనం అనేటటువంటిది? వేదమే వేదకర్మని నిరసించుకుంది. అదీ విశేషం.

యజుర్వేదంలో ఒక మంత్రంలోనే చెప్పబడుతుంది. యజ్ఞాలెందుకు చెయ్యటం, నెయ్యికాల్చటం తప్పు, వృధా అని ఏమిటి దీని అర్థం ? యజ్ఞం మానేయమనా ? దాని అర్థం అది కాదు. దానికి తత్త్వం తెలియకుండా కర్మ చేస్తే అది వృధా అని చెప్పటం ఉద్దేశం. చక్కగా చదువుకుని, సంస్కారం ఉంటే చాలా సంతోషం ఇంత చదువూ చదివి ఇలా ప్రవర్తించారేమిటి అంటాం. అలాగే చదువుకున్న వాడికన్నా ఫలానావాడు మిన్న అన్న సామెత కూడా ఉంది లోకంలో! అంతమాత్రం చేత చదువు వృధా అంటున్నామా మనం ? అంటే చదువు తనయొక్క ప్రయోజనాన్ని తను సాధించకుండా ఉన్నప్పుడు అది వృధా అని చెప్పటం. అలాగే వేదము యొక్క ప్రయోజనమైన వేదాంత స్పృహ లేకుండా, వేదకర్మాచరణ జడుఢివలె చేసుకుంటూ పోతే ప్రయోజనమేమిటి అని చెప్పటానికి వేదం అంత స్పష్టత యిచ్చింది. ఇది అర్థం చేసుకోక, అనేక మంది కర్మలంపటులై, వారి వారి స్వార్థ ప్రయోజనాల చేత, ఇతంత్రాకరణములచేత, యజ్ఞముల పేర్లతో భయంకరమైన హింసామార్గాలు అవలంబిచినప్పుడు ప్రతిదీ ఎక్స్ట్రీమే ! దాని బ్యాలన్స్ తెలియనప్పుడు ప్రతిదీ విపరీతానికి దారి తీస్తుంది. ఆ స్థితి వచ్చింది ఈ దేశానికి!

ఒక మహా చక్రవర్తి చేయవలసిన ఒక మహా యజ్ఞాన్ని ఒక పరగణాన్ని పాలించే వాడు నేనూ చేస్తానని కూర్చుంటే తద్వారా వాడు హింసని ప్రేరేపించి అనేక విధములైన ప్రవృత్తులు ఏర్పడి, అసలైన ఆత్మతత్వం, జ్ఞానం అడుగంటి పోయి, కేవలం కర్మలంపటత్వమే పెరిగిపోతూ ఉంటే అప్పుడు ఆ అవస్థలో ఇంక లాభం లేదు, ఈ

వేగాన్ని ఆపాలి అని ఒక మహానుభావుడు వచ్చాడు. ఆ మహానుభావుడు చేసిన తత్త్వబోధ ఏమీ లేదు. నాలుగు విషయాలు. ఆయనకి ఏదో చెట్టుకింద కూర్చుంటే వచ్చిన జ్ఞానాన్ని చెప్పటానికి ప్రయత్నించాడు. ఆయనేం చెప్పాడో, ఆయనేం తరించాడో ఆయన మహాత్ముడే. కాని కలి ఎంత ఘోరమో చూడండి. ఈ కర్మలంపటత్వం విషయం కూడా కలి ప్రవేశించాకే వచ్చింది.

అంతకు ముందు లేదా అంటే అంతకు ముందు యుగాల్లో కొద్దిగా ఉన్నది కలియుగంలో ఎక్కువవుతుంది చెప్పు. అలాగే గత యుగాల్లో మంచి ఎక్కువగా ఉంటుంది, చెడు తక్కువగా ఉంటుంది. ఇప్పుడు చెడు ఎక్కువగా ఉంటుంది. మంచి తక్కువగా ఉంటుంది. లేకుండా ఎప్పుడూ ఉండదు. అర్థం చేసుకునేటటువంటి శక్తి కలియుగంలో తక్కువగా ఉంటుంది. అర్థం చేసుకునే శక్తి ఎంతగా క్షీణించి పోతుందంటే అర్థం చేసుకోలేం కదా అని ఆపుస్తకాన్ని వదిలిపెట్టం. అదే పట్టుకుంటాం, దాన్ని అపార్థం చేసుకుంటాం. పెడర్థాలు తీస్తాం, వాటిని సిద్ధాంతాలకింద తీసుకుంటాం. వాటికి కొంతమంది శిష్యులని తయారు చేస్తాం, కొన్ని సంఘాలు పెడతాం, వ్యాప్తి చేస్తాం ఆ ధర్మాన్ని. అది కలియుగంలో ఎక్కువవుతుంది. అది అప్పటినుంచి మొదలయింది.

కలియుగం ఆరంభమైన కొంత కాలానికి పతనావస్థ మొదలై వేద కర్మ నిరసన మొదలైంది. అహింసే పరమ ధర్మం అని చెప్పుకుని వేదకర్మలని నిరసించి, వైదిక మతాన్ని దెబ్బ తీయటం జరిగింది. అయితే దాని లక్ష్యం అసలు కర్మలంపటత్వం కూడదు, జ్ఞానమనే దాన్ని తెలుసుకోండి అని చెప్పటమే! అతనెవరూ అనేది మీ కందరికీ స్పష్టమే! బుద్ధ భగవానుడు.

ఆ మహాత్ముడు చక్కగానే చెప్పాడు. ఆయన చెప్పినదేదీ వేదాంతానికి విరుద్ధమేం కాదు. అందులో ఏమీ సందేహం లేదు. వేదాంతం చెప్పినట్టు కోరికల్ని నిగ్రహించుకో! నీ కోరికలే సుఖదుఃఖములకు కారణము. ఆయన స్వర్గం గురించి కాని నరకం గురించి గాని మాట్లాడలేదు. అంతేకాని లేవనలేదు. అదీ విషయం ముందు ఇక్కడి గొడవ చూడు. తర్వాత ఆ రెండింటి గొడవ నువ్వు ఇంత కర్మలంపటుడివై తిరుగుతున్నావెందుకు అని చెప్పదలుచుకున్నాడాయన. జ్ఞాని అయిన వాడు ఇంతే చెప్పాడు. ఆ స్థాయిలో ఆయన చెప్పాడు. తదనుయాయులు మాత్రం ఆ స్థాయిని అందుకోలేక మరొక మతాని తయారు చేసుకుంటూ, బుద్ధుడు వేరు, బౌద్ధం వేరు అంటున్నారు. ఇదెవరైనా అధ్యయనం చేస్తే తెలుస్తుంది. అది ప్రధానాంశం కాదు కనుక ఆ మాత్రమే ప్రస్తావిస్తున్నాం. అటు తర్వాత వచ్చిన వన్నీ కూడా వేదకర్మనిరసనమే ప్రధానంగా పెట్టుకుని, వైదిక సిద్ధాంతాలని నిరసించటం మొదలెట్టాయి. క్రమంగా వేదనిరసన వేదాంత నిరసన, పూర్తి వేదవిద్యా నిరసన అయిపోయింది. అవైదిక మతాలు ప్రబలి పోయాయి. అందులో విశ్వం నడవటానికి మూలమైన వైదిక యజ్ఞాలు అన్నీ అంతరించి పోయాయి.

గీతలో పరమాత్మ తర్వాతే చెప్పాడు. యజ్ఞం చెయ్యి, నువ్వు నిజానికి పెద్ద యోగివైనా నశ్చాద్యం కార్యమేవచ యజ్ఞం, దానం, తపః ఇవన్నీ చేయవలసినవే నని ఆయనే చెప్తున్నాడు. ఇక్కడేమో ఇలా చెప్తున్నాడు. ఈ రెండూ అన్వయం చేసుకోవాలి ఈ అన్వయ లోపమే ఈ జాతి అరిష్టానికి ప్రధాన కారణం ఎప్పుడైతే ఈ విధంగా జరిగిందో, మరొక పెడవాదాలు వచ్చాయి, ఇక్కడినుంచి క్రమక్రమంగా! ఇది శాఖోపశాఖలుగా విస్తరించి, నాస్తికం ప్రబలి, 72 దుర్మతాలు వ్యాపించి పోయాయి

క్రమంగా మనలో.

నిజానికి కృష్ణ పరమాత్మ ఏ సిద్ధాంతాన్ని నిరసించలేదు. అది బాగా గుర్తుపెట్టుకోండి. గీత వైష్ణవాన్ని చెప్తోందా, శైవాన్ని చెప్తోందా? ఏమీ చెప్పటం లేదు. ఏ సిద్ధాంతాన్ని అది నిరసించలేదు. ఒక పరమార్థమైన వేదాంత ధర్మాన్ని ప్రధానంగా చూపిస్తూ, అటువైపు ఎలా ప్రయాణించాలో, ఆ ప్రయాణంలో ఎటువంటి ఎఱుక కలగాలో చెప్తున్నాడు పరమాత్మ ఇక్కడ. అంత స్పష్టంగా ఆయన సత్య సిద్ధాంతాన్ని సమన్వయిస్తున్నాడే తప్ప దేన్నీ నిరసించలేదు. కాని ఇందాక చెప్పినట్లు ఒక భాగాన్ని సరిగ్గా అర్థం చేసుకోలేక, వేదాన్నే నిరసిస్తూ ఒక అవైదికమతం, దాన్ని అనుసరిస్తూ మరికొన్ని అవైదిక మతాలూ ఎలా ప్రబలిపోయాయో, అలాగే మనలో కూడా ఆరేడు శాఖలు తయారయిపోయాయి. అవన్నీ కూడా ఇంత ఉదాత్తమైన తత్త్వాన్ని మర్చిపోయి, కేవలం సంప్రదాయాలు, చాంధసాలు, ఇవి మార్చేవా, అవి మార్చేవా, ఈ అలంకారం చేశావా, ఆ అలంకారం చేసావా అని ఇక్కడికే గిరిగీసుకుని, అసలైన తత్త్వజ్ఞానం తెలియనీయకుండా చేసి అవి కొన్ని తయారయి వాటిలో అవి కొట్టుకుంటూ ఉన్నాయి.

ఇలా పడిపోయిన ఈ జాతికి ఏం చేయాలి ?

ఈ రోగాలన్నీ కలిలో ఇలా వస్తాయని తెలిసే, కృష్ణ పరమాత్మ ద్వాపర అంతంలో జరిగిన కురుక్షేత్ర యుద్ధంలో అర్జునుడనేవాడిని పెట్టుకుని ఈ కలియుగం వైపుకి ఒక ఔషధం విసిరాడు. ఆ ఔషధం పేరే భగవద్గీత. ఇలాంటి రోగాలు పుట్టుకొచ్చినప్పుడు, చక్కగా అన్ని అన్వయించుకొని, వైదిక మార్గం నుంచి దెబ్బ తినకుండా, వేదాంతలక్ష్యం వైపు నువ్వు వెళ్ళటానికి నీకు కావాల్సిన సరుకు నేను ఇస్తున్నాను. అది మహా ఔషధులన్నీ ఉన్నటువంటి మహాసంపద ఉంచాను అని

ఇచ్చాడు భగవద్గీత. అప్పటివరకూ ఉన్న వేద విజ్ఞానం, వివిధ వాదాలు అన్ని అందులో ఉన్నాయి. అది విశేషం. భగవద్గీత ఆనాటి కాలపు మాటలే కాకుండా, ఇప్పటికీ ఉండటానికి కారణం ఇప్పటి రోగాలని కూడా తెలుసుకుని, అప్పుడు మందులు సూచించాడాయన. అయితే అందులో మందులున్నాయని చెప్పేవాడు ఒకడుండాలి మనకి.

ఆ ఉండేవాడెవడు ?

మళ్ళీ ఆయనంతటి వాడై ఉండాలి. ఆయనిచ్చిన మందులన్నీ కూడా చక్కగా రాసిచ్చిన వాడు వేదవ్యాసుడు. ఆ కృష్ణుడు చెప్పిన మాటను ఈ కృష్ణుడు మనకి అందించాడు. ఇద్దరూ కృష్ణులే. ఈయన కృష్ణ ద్వైపాయనుడు. ఆయన కృష్ణ పరమాత్మ. అయితే ఇంత చక్కటి మందుని కూడా అర్థం చేసుకోలేక, అపార్థాల జోలికి వెళ్ళిపోతున్నారు. కలి అంతే! ఎంత మంది, ప్రయత్నిస్తూ ఉన్నప్పటికీ, వాడి టైము వాడిది! అలాగని వదలకూడదు. బాగు పడాల్సిందే! ఊర్లో కలరా వ్యాపించినప్పుడు, ఏం చేస్తాం, కలరా రానీ, అని వైద్యుడు ఉపేక్షిస్తే వాడిని అరెస్టు చేస్తారా లేదా చెప్పండి. కలరా ఉన్నా వైద్యులు కలరా రాకుండా ముందు, నయం చేయటానికి మందూ ఇస్తుండాల్సిందే! అప్పుడు కొంతమందన్నా బాగుపడతారు. అందుకే కలియుగం అని ఉపేక్షించకుండా, ఈ కృష్ణ పరమాత్మ ఇచ్చిన మందుని చక్కగా రంగరించి అందజేయటానికి మహాత్ములు వస్తూనే ఉంటారు. అందుకు ఈ కలియుగంలో వస్తున్నటువంటి ఈ 72 దుర్మతాల తాకిడి బాగా ఉన్న కాలంలో, ఈ దివ్యమైన భారతీయ వేదాంత ధర్మం దెబ్బతింటున్న కాలంలో, ఆ నారాయణుడు అప్పుడు రెండు రూపాలతో ఇచ్చిన ధర్మాన్ని మళ్ళీ తిరిగి పునరుద్ధరించటానికి ఆ సదాశివ

శంకర రూపంతో అవతరించాడు. ఆయన మళ్ళీ వచ్చి చూసాడు. ఈ జాతికి ఏది మందు ? ఇందాక చెప్పినట్లు నాన్య దస్తీతి వాదులొక వైపు తయారయిపోయారు. ఈ నాన్యదస్తీతి వాదం లేని, శాఖలు, సంప్రదాయాలు ఏం ఉన్నాయి చెప్పండి ? అందరూ నాన్యదస్తీతే! ఇంతకు మించి మరొకటి లేదు. మా దేవుడ్నే ఉపాసించాడు. మీకు ముక్తి దొరుకును అన్నాడంటే చాలా ప్రమాదం. అది ఎవరన్నా అవనీయండి. అది పడమర గాలుల వల్ల వచ్చిన ప్రమాదాలే. మళ్ళీ ఈ మాటలు అంటూ ఉంటారు. అది స్వధర్మ భ్రష్టత్వం కోసం వచ్చినవి ఇవన్నీ కూడా. ఈ నాన్యదస్తీతి వాదులందరినీ కూడా ఖండిస్తూ, అక్కడితో ఆశిపోవద్దు, సాగిపోండి ఆసాగటానికో లక్ష్యం కనబడాలి కదా! అదుగో వేదాంతం అనే లక్ష్యం ఉంది అని చెప్పి, పూర్తి వేదాంత ధర్మాన్ని ప్రతిష్ఠించటానికై ఆ మహానుభావుడు ఉపనిషత్తులని తీసుకున్నాడు ఏదైతే మూలమైన వేదాంత విద్యో అది తీసుకున్నాడు. మైనటువంటి ఉపనిషత్తులని తీసుకున్నాడు.

## సి.డి. 10

నిష్కామ కర్మ అనే యోగానికి కృష్ణ పరమాత్మ బుద్ధి యోగం అంటున్నారు. సాంఖ్యయోగంలో ఆయన నోటంట పలికిన మాట బుద్ధి యోగం. మరొకచోట కూడా చెప్తాడు తదదామి బుద్ధియోగం అని. ఈ బుద్ధి యోగము అంటే ఏమిటి? సమబుద్ధితో కలిగిన ఉపాయము అని అర్థం. సమబుద్ధి అంటే ద్వంద్వముల ఎడల సమబుద్ధి కలిగి, నిష్కామ కర్మ చేయటం.

నిస్త్రైగుణ్యుడివి అవు అంటున్నాడు కృష్ణపరమాత్మ. దానికి కావాల్సిన దేమిటి అంటే యామిమాం పుష్పితాం వచం ముందే చెప్పాడు.

వ్యవసాయాత్మిక బుద్ధిః ఏకేహ కురునందన!

బహుశాఖా హ్యనంతాశ్చ బుద్ధయో వ్యవసాయినామ్ 2-41

ఇప్పుడు చెప్పిన యోగము నందు నిలవ వలసిన బుద్ధి ఎలా ఉండాలి? 'వ్యవసాయాత్మిక బుద్ధి' మనకి ప్రతిదానికి చిక్కు తెచ్చేది బుద్ధే! ఎన్ని శాస్త్రములు విన్నా కూడా ఇంకా ఇలాగే వెళ్తున్నామంటే బుద్ధిదానియందు నిలకడ చెందక పోవటం. ఈ నిలకడ చెందని బుద్ధిని అవ్యవసాయము అని అంటారు. వ్యవసాయాత్మిక అంటే నిశ్చయాత్మిక అని అర్ధం. ఒక స్పష్టమైన అవగాహన కలిగి, ఒక స్పష్టమైన ఏకాగ్రత కలిగిన బుద్ధిని వ్యవసాయాత్మిక బుద్ధి అంటారు. సంశయము, అశ్రద్ధ, అజ్ఞానము వీటన్నిటితో కూడుకున్నది అవ్యవసాయాత్మి. ఫలాకాంక్ష కలిగిన వారి బుద్ధులన్నీ అవ్యవసాయకములు. ఒక నిలకడ లేని బుద్ధి ఇది. దాని వల్ల చాలా ప్రమాదాలుంటాయి. బహు శాఖా హ్యనంతాశ్చ వాటికి బోలెడు శాఖలుంటాయన్నాడు. అనేక కొమ్మలు అవి ఎన్ని అంటే లెక్కచెప్పటానికి వీలులేదు. ఎన్నో రకాలు. కొంతకాలమిటు, కొంతకాలమటు చెదిరిపోతూనే ఉంటుంది.

వ్యవసాయాత్మిక బుద్ధి అంటే ఆత్మయందు, ఏకాగ్రముగా నిలకడ చెందించి యున్న బుద్ధియని, దీన్ని నిశ్చయాత్మిక బుద్ధి అని ఒకటి, ప్రయత్నపరమైన బుద్ధి అని ఇంకొకటి రెండు అర్థాలు చెప్పుకోవచ్చు మనం. ప్రయత్నపరమైన బుద్ధి అంటే ముందు

చెప్పిన ఆ సాంఖ్యస్థితిని సాధించాలనేటటువంటి పట్టుదలతో తదేక లక్ష్యంగా కృషిచేసే బుద్ధి అటువంటి వ్యవసాయాత్మిక బుద్ధిని ఒక్కదాన్ని పట్టుకో. అది చెప్పేరు కానీ - అంటే అయిపోయింది. అక్కడి నుంచి చెదిరిందా ఆ పతనం ఎక్కడికో తీసుకుపోతుంది.

ఏక అనే శబ్దం చాలా విశేషమైనది. ఏకాగ్రతకి పట్టుదలకి, నిలకడకి చెప్తూంటారు! ఏ మార్గంలో ఉన్నాకూడా ? ఈ ఏకశబ్దమే ఏక భక్తిః విశేష్యతే అని భక్తి యోగంలో వివరించారు. ఇక్కడ మనకి ఏకేహ కురునందన అన్నప్పుడు కూడా ఏకత్వ బుద్ధి గురించి వివరిస్తున్నాడు.

కురునందనా అన్న సంబోధన అర్థం కురువంశంలో ఉద్భవించిన వాడా అనే అర్థమే తీసుకోకుండా, కురు అంటే చెయ్యి, నందన అంటే ఆనంద స్వభావం కలవాడు. చేసేక ఆనందం కాదు, ఆనంద స్థితిలో ఉంటూ చేసేవాడు అని అర్థం. ఇది చెయ్యటం వల్ల ఆనందం వస్తుంది అంటే చేయుటంలో మళ్ళీ లోపముంది. ఏదైతే ఆనందమయమైన ఆత్మస్థితి ఉన్నదో, దాని యందు నిలకడ కలిగి ఈ యోగము చెయ్యి అన్న అర్థాన్ని కూడా కొందరు తత్త్వవేత్తలు వ్యాఖ్యానంలో గ్రహించారు. దాన్ని కూడా స్వీకరించవచ్చు!

మొత్తానికి వ్యవసాయతిక బుద్ధి ముఖ్యం సుమా! అప్ప బుద్ధి ఎవరికి ఉంటుందో, వారికి ఆశయములు అల్పంగానే ఉంటాయి, అవి తీరాక మరొకటి, అలా వెళుతూ వెళుతూ బహుశాఖా... వ్యవసాయినామ్ అని వివరించి, అటుపై త్రైగుణ్య విషయా వేద నిస్త్రైగుణ్యో భవార్జున విషయం గురించి ప్రస్తావించుకుంటూ మనం వస్తూ ఉన్నాం.

ఇందులో త్రిగుణాత్మకము, త్రిగుణా తీతము అనే రెండు స్థితాలు ఉన్నాయి. త్రిగుణాతీత స్థితియే బ్రహ్మజ్ఞానము అని చెప్పబడేది. బ్రాహ్మీస్థితి అని చెప్పబడేది.

దాన్ని చేరమంటున్నాడు. గీత యొక్క పరమ ప్రయోజనం బ్రాహ్మీ స్థితిని అంద జేయుటమే! బ్రాహ్మీ స్థితే సమస్త జీవితానికా లక్ష్యమైనది. బ్రాహ్మీస్థితి అంటే పరబ్రహ్మ భావన యందు తన్మయుడై ఉండుట అని అర్థం. అంటే తదభిన్నుడై పరబ్రహ్మతో ఐక్యమై ఉండుట. అదే గీతా శాస్త్రం యొక్క లక్ష్యం అంతే కాదు సమస్తములైన వైదిక శాస్త్రముల లక్ష్యం కూడా అదే అందుకే దాన్ని ప్రధానంగా చెప్పుతున్నారు.

అలా చెప్పటానికి మనకి రెండు గ్రంథాలు ఉద్భవించాయి. ఒకటి భగవద్గీత, ఇంకొకటి భాగవతం! భాగవతం కూడా ఈ త్రిగుణా తీత స్థితినే ప్రస్థావించింది. భాగవతం అంటే భక్తి గురించి చెప్పంది కాదండీ, అంటే ఏ భక్తి గురించి చెప్పింది? పూర్ణమైన ఎఱుకతో కూడిన భక్తి. అంతేకాని ఒక మౌఢ్యముతో అవగాహన లేని భక్తి అని చెప్పలేదు. జ్ఞానమయమైన భక్తిని సాధించవలసిన భక్తిగా చూపించింది. దానిని సిద్ధభక్తి అంటారు. సిద్ధ భక్తిని ప్రస్తావించటానికి భాగవతం వచ్చింది. అక్కడ భక్తిగా ఏది చెప్పారో, ఇక్కడ జ్ఞానముగా దాన్నే ప్రస్తావిస్తున్నారు. జ్ఞానములో మనము బ్రహ్మము, ఆత్మ, పరమాత్మ అని ఏమంటున్నామో, భక్తిలో తత్‌శబ్దమే భగవత్ వాక్యం అవుతుంది. అది భగవత్ పరంగా చెప్పబడుతోంది. సర్వవ్యాపకము, సర్వగతము, స్థాణువు, అచలము, సనాతనము అయిన ఏ ఆత్మ తత్త్వముందో ఆ ఆత్మ తత్త్వ లక్షణములే మనం భగవంతుని యందు గ్రహిస్తూ ఉన్నది. భగవంతుని యందు తన్మయత్వం చెందించటమనే భక్తి శాస్త్రం కూడా, నిస్త్రైగుణ్యోభవా అని బోధిస్తుంది.

దీని గురించి మనం అర్థం చేసుకోవటానికి భాగవతంలో అనేక ఘట్టాలు మనకి ఉపకరిస్తాయి. అందులో కపిల మహర్షి చేసిన ఉపదేశాన్ని కపిలగీత అంటారు. ఆ కపిలాచార్యుడెవరో, ఈ కృష్ణ పరమాత్మ కూడా ఆయనే కదా! ఇది పూర్వ స్వరూపం !

సాంఖ్య యోగాన్ని చెప్పిన స్వరూపం కూడా అదే? ఆయన కూడా భక్తి గురించి చెపుతూ గొప్ప మాట చెప్పాడు. సగుణ భక్తినుంచి నిర్గుణ భక్తి లోకి వెళ్ళమన్నాడు. అక్కడ కూడా సగుణ, నిర్గుణ అనే మాటలు వచ్చాయి. అవి ఇక్కడ అన్వయించితే ఇంకా స్పష్టమవుతుంది త్రైగుణ్య విషయా వేదా... అంటే త్రిగుణాత్మకమైన స్థితిని దాటి నిస్త్రైగుణ స్థితికి చేరుకో అది నీ లక్ష్యం అని బాగా గుర్తు పెట్టుకోవాలి అదేమిటో అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తే ఈ త్రిగుణాతీత వాసనలు దాటి ఆలోచించటానికైనా మనం ప్రయత్నించాలి. ఈ ఆలోచనలకి సహకరిస్తుంది కపిల మహర్షి చెప్పిన అన్వయం.

భక్తి మొత్తం నాలుగు విధాలు అన్నాడాయన. త్రిగుణాత్మకము అంటే మూడు విధాలయింది. ఈ మూడు విధాలు తెలుసుకుంటే నాలుగోది అర్థమవుతుంది. ఈ మూడు విధాలలో తామసిక భక్తి ఒకటి. అది ఎలా గుంటుందంటే హింసాపరాయణత్వం కలిగి ఉంటుంది. తను ఉద్రేకపడి, అవతలి వాడి నాశనాన్ని కోరుకోవటం, తమో గుణమయిన ప్రవర్తనలతో కూడుకొని ఉండి, ఇటువంటి వాటితో భగవంతుడిని కొలుచుకోవటం. తామసిక భక్తికి ఉదాహరణ భస్మాసురుడు. అలాంటి వారు చాలా మంది ఉంటారు.

ఇక రాజసిక భక్తిని చూస్తే ఒక కోరికలో, ఫలానిది నెరవేరాలని ఆశతో చేసేటప్పుడు ఆడాంభికంగా, ఢంబాచారాలతో ప్రవర్తించేవారిది రాజసిక భక్తి. ఈ రెండూ కూడా బంధన హేతువులే. ఇక అటుపై ఉన్నది సాత్విక భక్తి ఈ భక్తిలో పాపకాశనం కోసం, అంటే చిత్తశుద్ధికోసం, భగవదర్పణ బుద్ధితో చేస్తారు. అటు వంటి భక్తి సాత్విక భక్తి అనిపించుకుంటుంది. ఈ మూడు త్రిగుణములైనవి.

త్రిగుణాతీత మైన భక్తి నాలుగోది. దీన్ని మా భక్తి అనీ, నిద్ధ భక్తి అనీ అంటారు. భాగవతం ఈ భక్తిని ఆదర్శంగా ప్రతిపాదించింది ఈ భక్తిని త్రిగుణాతీత భక్తి, లేదా నిర్గుణ భక్తి ఇది. సగుణ భక్తి, నిర్గుణ భక్తి అంటే ఇదీ దీన్ని సరిగ్గా అర్థం చేసుకోలేక సగుణ భక్తి అంటే భగవంతుడిని సాకారంగా భావించటమనీ, నిర్గుణ భక్తి అంటే ఏ గుణమూ లేనివానిగా భావించటమనీ అంటారు. భావించటమంటూ ఉంటే, గుణమంటూ ఎలాగో ఉంటుంది. భావమే ఒక గుణం కనుక.

సగుణ, నిర్గుణములు అంటే ఏమిటి ?

సత్వరజో, తమ గుణములలో భక్తిని చూపటం సగుణ భక్తి. భాగవత్ ప్రేమ విషయంలో ఏ ప్రయోజనమూ లేని భక్తి ఏదో అది త్రిగుణా తీతము. చివరికి భగవదర్పణం అనే భావం కూడా వాళ్ళకుండదు. అదే విధంగా దీని ద్వారా నేను శుద్ధుడిని అవాలి అనే వాంఛకూడా వారి కుండదు. అత్యంత సహజంగా వారికి ఆ స్థితి ఏర్పడుతుంది. అప్పుడు వారు ఎలా ఉంటారు ? భగవంతుని కథలు గాని, భగవంతుని గుణములుకాని, భగవంతుని దివ్యనామ రూపముల స్ఫురణ గాని వచ్చిన వెంటనే వారిని వారే మర్చిపోతారు. అందులో మరి యొక ప్రయోజనాన్నే కోరుకోరు! అయ్యో నేను శుద్ధుడ్ని కాలేదే అనుకుంటే కదా శుద్ధికోసం ప్రయత్నం ? పూర్ణంగా భగవత్ ప్రేమోన్మత్తుడై ఉంటాడు. అతనికి ఆయన నుంచి ఏ మాత్రూ దూరము ఉండదు. ఎక్కడైనా భగవంతుడిని భావించగలిగి, సర్వే సర్వత్రా తన్మయ స్థితిలో ఉండేవాడు నిర్గుణ భక్తుడు. వాడికి అడుగడుగునా భగవత్ అనుభవమే ఉంటుంది. భగవత్ అనుభవం వల్ల ప్రయోజనమేమిటి అనే మాట లేదు. భగవదనుభవమే ప్రయోజనం. అందుకే స్వయం ఫలరూపత్వాత్ అని నారదులు

చెప్పిన భక్తి సూత్రానికి అదే సరియైన నిర్వచనం. ఆ నిర్గుణ భక్తినే పరాభక్తి అనీ, ఆ నిర్గుణ స్థితిలో చేరినవారినే ఆదర్శభక్తులుగా మనకి చూపిస్తుంది. ప్రహ్లాదుడు, గోపికలు ఆ స్థితికి చేరినవారే.

త్రిగుణాత్మకమైన ఏ లక్షణము వారిలో లేదు. మన గోపికలు ఇవన్నీ కృష్ణార్పణం అని కూడా అనుకోలేదు. అలా అనుకోవటానికి కృష్ణుడు భిన్నంగా కనిపిస్తేకదా ! సర్వమూ కృష్ణ మయమన్న స్థితిలో ఉన్నప్పుడు వేరే ఎవరు కనిపిస్తారు. దీన్ని సిద్ధ భక్తి అంటారు. కాని సాధన స్థితిలో ఉన్న మనం ఒక్కసారి సిద్ధ భక్తి గురించి చెప్పినంత మాత్రమున అది మనకి వంటబట్టుంది అనుకోవటానికి లేదు.

మరి సాధనకేం చేయాలి ?

సాధనకి సత్త్వ భక్తే గొప్పది. సత్త్వభక్తి దేనికి చేస్తున్నాం ? కృష్ణార్పణమనే భావన కోసం, చిత్తశుద్ధికి చేస్తున్నాం? చిత్తస్యశుద్ధయే కర్మ, కృతజ్ఞస్య నివృత్తయే అని చెప్పినట్లుగా చేస్తున్నారు. త్రిగుణాత్మకమైన సాధనలో తామసము, రాజసికము వర్జనీయములు. సాత్త్వికమొకటే మనం స్వీకరించాలి. అయితే సాత్త్విక భక్తిని అవలంబించి అదే ఫలమనుకోరాదు. సాత్త్విక భక్తి వల్ల నిస్త్రైగుణ్య స్థితి వస్తుంది. అక్కడికి వెళ్ళేటప్పటికి సాత్త్విక భావన కూడా నిలవదు. అది సాత్త్వికానికి కూడా అతీతమైన స్థితి. దానినే సత్త్వము అని కూడా అన్నారు. అసలైన నిస్త్రైగుణ స్థితిని సత్వము అన్నారు. ఆ సత్త్వము త్రిగుణాలలో ఒకటైన సత్త్వగుణము కాదు.

నిర్ద్వంద్వో నిత్య సత్త్వస్థో అన్నప్పుడు నిత్య సత్త్వము నందు ఉండు, త్రిగుణాతీతుడవుకా అంటే పరస్పర విరుద్ధముగా కనిపించలేదా ? త్రిగుణాతీతుడవు కా అంటే సత్త్వ గుణాన్ని కూడా అతిక్రమించు అని, మళ్ళీ నిత్యసత్త్వస్థుడివికా అంటే

అర్థమేమిటి ? అంటే సాధన స్థాయిలో నిత్యము సత్త్వ భావనలో ఉండమని అర్థం అంటే అదీ స్వీకరించవచ్చు. కాని కృష్ణుని హృదయం మాత్రం నిత్యసత్త్వస్థుడంటే నిత్యము ఆత్మజ్ఞానమందు ఉండువాడు. దీనికి ప్రమాణం మనకి యోగ వాసిష్టంలో వసిష్ఠుల వారే చెప్పారు. జ్ఞాని యొక్క స్థితి నిత్య సత్త్వము అని. నిత్య సత్త్వము అంటే ఆత్మ స్థితియందుండుట. ఆత్మ స్థితి యందుండుట అంటే భగవంతునికి అభిన్నమైన తన్మయాస్థితి యందుండుట అని అర్థం చెప్పుకోవాలి.

అంతకు ముందు ముగ్గురు దొంగల కథ చెప్పుకున్నాం. ఇప్పుడు కొంత మేరకు అర్థం అయిఉంటుంది మీకు. ఇందులో మొదటి రెండూ పతనానికి హేతువులే ! తామస కర్మ నరకానికే తీసుకుపోతుంది. సందేహం లేదు. ఇంక రాజస కర్మ బంధన హేతువై దుఃఖానికి క్రమక్రమంగా వెళుతుంది. సాత్త్విక మైన భక్తి ఒక్కటే మనని నిస్త్రై గుణ్యంలోకి తీసుకు వెళుతుంది తప్ప అది నిస్త్రైగుణ్యంలోకి రాదు. కనుక సత్త్వగుణం లోనే మనం పూర్ణ భగవదానుభవాన్ని పొందలేము. నిస్త్రైగుణంలోనే పొందగలము. ఆ మంచి దొంగ చేరవలసిన చోటుకి చేర్చాడు కాని వాడు మాత్రం లోపలికి రాలేదు. నిస్త్రైగుణ్యమైన ఆత్మ స్థితిలో ఏ గుణానికీ చోటు లేదు గనుక వాడిక్కడే ఉండిపోయాడు. నిస్త్రైగుణ్యోభవార్జున ఆంతర్యం అందుకే అంత విశేషంగా చెప్పబడుతోంది.

పైగా కర్మలంపతట్వాన్ని బాగా ఖండించాడు కృష్ణ పరమాత్మ. ఎన్ని కర్మ బంధాలు పెంచుకుని, ఫలాపేక్ష పెంచుకుని, మేం ఫలానా కర్మ చేస్తున్నామన్న అహంకారం పెంచుకుంటున్నాం. ఫలాపేక్షని, అహంకారాన్ని విడిచిపెట్టటం జరుగుతుందా అని ప్రశ్నించుకుంటూ సాదన చేయాలి. అంత చెప్తారు కాని అంత తేలిక కాదండి.

అనుకోవటం చాలా తేలిక. కాని దాన్ని సాధించటానికి ప్రయత్నించటం చాలా ముఖ్యం. ఎంతమేరకు నేను చేస్తున్నానన్నది ఎవరికి వారే పరీక్షించుకోవాలి. ఏమెట్టూ ఎక్కకుండానే తేరగా వచ్చి పడమంటే పరమాత్మ కూడా ఉట్టిమీంచి దించి ఇవ్వడు. ఆ బుద్ధిని వ్యవసాయాత్మకం చేసినప్పుడే ఫల మనేది వస్తున్నది.

ఇక్కడ భాగవతం కథలు గుర్తుచేసుకోవలసిన అవసరం ఉన్నది. అందులో మనకి ప్రాచీన బర్హి వృత్తాంతం వస్తుంది. అతని అసలు పేరు బర్హిషితుడు. ప్రాచీన బర్హి అన ఎందుకు వచ్చిందంటే అతను చెయ్యని యజ్ఞం లేదుట. మొత్తం భూమండలంలో అన్నీ చోట్లా యజ్ఞం చేసాడుట. యజ్ఞం చేసేవాళ్ళు ధర్భాసనాల మీద కూర్చుంటారు. ఆ ధర్బలు తూర్పు వైపు కొనలు ఉండేలా కూర్చుంటారు. అలాటి ధర్భలు ఆయన మొత్తం భూమండంలమంతా పరిచాడుట. అంటే అర్థం ఏమిటి ? అన్ని చోట్లా యజ్ఞం చేసాడు అన్నమాట. అంటే ఎన్ని కర్మలు చేసాడో చూడండి. తూర్పువైపు కొనలు గల ధర్భలను ఆసనముగా కలవాడు అని ప్రాచీన బర్హిని అనగానే ఆయన ఎంత కర్మటుడో చెప్పారు. గొప్ప కర్మిష్టి అందులో సందేహం లేదు కాని ఎంతకాలం ? లెక్కలు చదువుకోవటం మంచిదే. కాని అదే చేస్తూంటే ఎప్పుడు దాని వినియోగ దశ, ఎప్పుడు ఆంతర్యం గ్రహించటం?

కాని అలాంటి కర్మటులైనప్పటికీ కూడా పరమాత్మ అయ్యో మునిగి పోతున్నాడే, వీడిని ఉద్ధరిద్దాం అనుకుంటాడుట. అయితే ఆయనకి ప్రతులు 10 మంది ప్రమ్రచేతసులు అని ఉన్నారు. వారు తండ్రియొుక్క ఆజ్ఞతో బయలు దేరి తపసుకెళ్ళారుట. కాని ప్రాచీన బర్హి వద్దకి నారదుల వారు వచ్చారు. ఇంకా ఈ కర్మలంపటత్వంలో ఎంత కాలం ? అని ఒక గొప్ప కథని అక్కడ చెప్తారు. ఈ త్రైగుణ్య

విషయా వేం అర్థం కావాలంటే నారదుడు ఎందుకు ప్రాచీన బర్హికి ఆ కథ చెప్పాడు అనేది మనం గమనించినట్లయితే, ఎన్నో విషయాలు బోధపడతాయి.

ఈ వేదం చెప్పిన కామాత్మాన స్వర్గపరాః అయిన కర్మలు చేసుకుంటూ పోకుండా బుద్ధిని సర్వవ్యాపకమైన పరతత్త్వము నందు నిశ్చితం చేయి. కర్మయందే ఉంటే సర్వవ్యాపకమైన పరమాత్మ యందు నీకు ఎఱుక ఎప్పుడు కలుగుతుంది ? సర్వవ్యాపకమైన పరమాత్మ , పరమేశ్వరుడూ, పరత్త్వము, పరబ్రహ్మ ఏది అనండి దాని యందు మనసు నిలకడ పెట్టటమే ముఖ్యము. అది చేసే వరకు కూడా జన్మపరంపరలు తప్పవు. కర్మలాలనతో నువ్వు ప్రకృతి పదార్థాలు ఎన్నో వినియోగిస్తున్నావు. వాటిని హింసింప చేస్తున్నావు. ఆ హింసకు ఫలితం తప్పకుండా అనుభవిస్తావు. నువ్వు చేసిన యజ్ఞం వల్ల ఏయే పరువులు హింసింపబడ్డాయో, అవన్నీ నువ్వెప్పుడు దొరుకుతావా ఎప్పుడు తిందామా అని ఎదురు చూస్తూఉంటాయి అని కూడా చెప్పాడు. అంటే యజ్ఞ కర్మలని ఎవరో మరోమతం వాళ్ళొచ్చి విమర్శించాల్సిన పనిలేదు. మన మతమే చెప్పింది. ప్రతిదానికి హద్దులు కూడా మన మతం చెప్పింది. అక్కడ ఒక అత్యద్భుతమైన కథ చెప్తాడు. మరో సందర్భంలో ఆ కథ చెప్పుకుందాం. అది జీవుడి కథఅని, పురంజనోపాఖ్యానమని చాలా దివ్యమైన కథ. తర్వాత జీవుడు కర్మలంపటుడై ఎన్ని బంధాలకి లోనవుతాడో విశేషమైన కథని వివరిస్తాడు. మరొక సందర్భంలో గీతా చార్యులే దాన్ని పలకిస్తారు. మన చేత దానితో అసలు తత్త్వాన్ని తెలుసుకుని, కర్మలంపటత్వం నుంచి నిస్త్రైగుణస్థితికి చేరగలిగాడు. ఎందుచేత ? నారద మహర్షి చేసిన బోధ చేత. ఆయన ఒక ఆచార్యుడు కదా ?

అదే సమయంలో ప్రచేతసుడు విష్ణుమూర్తి కొరకు తపస్సు చేసాడు. ఆ

ప్రచేతసుడికి విష్ణుమూర్తి ప్రజాభివృద్ధి చేస్తూ యజ్ఞములన్నీ ఆచరించండి అన్నాడు. నారదులేమో యజ్ఞము నాపేసేయమని చెప్తారా, విష్ణు మూర్తేమో యజ్ఞములు చేయమని అబ్బాయిలకి చెప్తారా ? నాన్నగారికి ఆ బోధా అబ్బాయిగారికి ఈ బోధా అంటే వాళ్ళాకాయన ఏం చెప్తున్నాడు ? లోక క్షేమమునకై ప్రజాభివృద్ధి చేయవలసిన బాధ్యత, ప్రజాపతులైన మీ మీద ఉంది గనుక, మీరు లంపటులు కాకుండా భగవదర్పణ బుద్ధితో చేయండి.

మన వాళ్ళు ఏ పని చేసినా భగవంతుని ఎందుకు స్మరించమన్నారు ?

ఇలాగైనా కొంత అహంకారం పోగొట్టుకోవటం వీళ్ళలో కొంత మొదలవుతుందేమోనని. మనం భగవంతుని పూజ చేయటానికి మనమేం చెప్పుకుంటున్నాం ? అది చేయటం వల్ల పని సానుకూల మవుతుంది అని . సానుకూలమవుతుంది అందులో సందేహం ఏం లేదు. సానుకూలమవలేదని ఆయన చెప్పాడని మళ్ళీ అనద్దు. కాని మనకి పెద్ద వాళ్ళు అది చెప్పటంలో ఉద్దేశమేమిటంటే నువ్వు చేసే ఆ పనికై నువ్వు అహంకారం పోగొట్టటానికై ఆ విధానాన్ని పెట్టారు. ఏది చేసినా పూజ. ఎందుకు? ఆ పూజద్వారా కర్మ శుద్ధమవటమే కాకుండా, దానియొక్క ఫలితం నీ మీదే ఆధారపడి ఉంది స్వామీ, చేయించే శక్తి నువ్వే, వచ్చే ఫలితమూ నువ్వే అందుకు పరంపరా గతమైన కర్మసంకల్పంలోనే లక్ష్యాన్ని పెట్టారు. వేదాంత లక్ష్యమే మనకి నిక్షిప్తం చేసారు. మమ ఉపాత్త దురితక్షయ ద్వారా, శ్రీ పరమేశ్వర ప్రీత్యర్థం ఈ రెండూ!

ఇదే ఇంతకు ముందు చెప్పిన సత్త్వగుణంతో కూడిన సాధన. ముందు సత్త్వగుణంతో సాధన చెయ్యగా, చెయ్యగా నిస్త్రైగుణ్యం అర్థం అవుతుంది.

ఉట్టికెగరలేనమ్మ స్వర్గాని కెగరలేనట్టుగా, ముందు సత్త్వగుణ సాధన ప్రేరేపించాలి ప్రపంచంలో! అందుకు మమ ఉపాత్త... ప్రీత్యర్థం అని చెప్పి, అంత తొందరగా పోవు గనుక ధర్మార్థ కామ మోక్ష చతుర్విధ ఫల పురుషార్థం సిద్ధ్యర్థం ఇంకా స్థైర్యా, ధైర్య అభయ, విజయ, ఆయు, ఆరోగ్య, ఐశ్వర్య అభివృద్ధర్థం ! ఇంకా ఏమైన ఉంటే అవి. అసలు కర్మ సరిగ్గా చెప్పకపోయినా, సంకల్పంలో మాత్రం ఈ మంత్రాలు సరిగ్గా చెప్తారు. ఎందుకంటే ఇవి బాగా చెపితే దక్షిణ బాగా వస్తుంది. ఉత్తరత్రా అభివృద్ధి సిద్ధ్యర్థం, ఉద్యోశే ప్రమోర్షనార్దం అని ఇంగ్లీషులో కూడా కలుపుతాం దేని కన్నా సిద్ధ పడతాం. ఎన్నెన్ని కలుపుకున్నా ఆదిలో నున్న ఆ సంకల్పం మమ ఉపాత్త దురితక్షయ ద్వారా, శ్రీ పరమేశ్వర ప్రీత్యర్థం. ఆ రెండు మాటలు చాలు. నా దురితములు క్షయంకావాలి. అని ఎప్పుడైనా అనుకున్నామా మనం ? ఏది చేసినా ఏదో ఒక శుభం జరిగిపోవాలి, ఒక సుఖం పొందాలి కాని మరి క్షయాత్మఅనే మాట చాలా గొప్ప విశేషం. దురితములు క్షయించాలి, పరమేశ్వరుడు ప్రీతి చెందాలి. తర్వాతే మిగిలినవన్నీ ఈ రెండూ చేస్తే క్రమక్రమంగా చిత్తశుద్ధి ఏర్పడి, నిస్త్రైగుణ్యమంటే ఏమిటో అర్ధమవుతుంది. సాధన బలపడుతుంది, సాధనకలిగిన ప్రేరణ కలుగుతుంది. దాని ద్వారా నిస్త్రైగుణ్య స్థితికి చేరకుంటాం. అది అల్టిమేట్, సిద్ధావస్థ దాన్ని ఇక్కడ బోధిస్తున్నాడు.

అయితే, అది సిద్ధిస్తే ప్రయోజనమేమిటి ?

అదంటే ఏమిటో, తెలియదు గనుక, గొప్పగా ఉంటుందని కృష్ణుడు చెప్పాడు గనుక ఒప్పుకోవాలి గాని అది సిద్ధిస్తే ప్రయోజనమేమిటి ? మరి ఇది సిద్ధిస్తే ప్రయోజనమేమిటి ? అంటే ఇక్కడ ప్రాక్టికల్ ఎక్సీపిరియెన్స్ ననిపిస్తోంది. శ్రీ సూక్తంతో

ఎవరైతే హోమం చేస్తారో వారికి ధనమొస్తుంది. ఇదేదో బాగుంది, స్పష్టంగా కనిపిస్తోంది ఆరోగ్యం కోసం మరొక సాధన అలా ఒకొక్క దానికి ఒకొక్క యజ్ఞం. అనేక కర్మలు బహుశాఖా అనంతాశ్చ ఇవన్నీ చేసినప్పుడు ఫలితం కనిపిస్తోంది కదా, మీరు చెప్పిన ఆ మహాస్థితి వల్ల ప్రయోజనమేమిటి ?

ఆ మహాస్థితి సర్వవాపకమై, సర్వగతమై, అనంతమై, సత్‌చిత్ ఆనందమై అఖండమైన బ్రహ్మానుభవం, దాన్ని పరబ్రహ్మానందము అంటారు. ఆ బ్రహ్మానందము లభిస్తే ఇవన్నీ అల్పములే, అది లభించిందా వీటి గురించి నీకసలు దృష్టే ఉండదు. అక్కడ అత్యద్భుత మైన ఉపమానం చెప్తున్నాడు కృష్ణ పరమాత్మ.

యావావర్థ ఉదపానే సర్వతః సంప్లుతోదకే

తావాన్ సర్వేషు వేదేషు బ్రాహ్మణస్య విజానతః 2-46

ఇక్కడ బ్రాహ్మణ శబ్దం బ్రహ్మవిత్ అనే అర్థంతో చెప్పబడుతున్నది. బ్రహ్మవిత్, బ్రహ్మైవభవతి పరబ్రహ్మానుభవం పొందినవాడు తానే పరబ్రహ్మ అవుతున్నాడు అన్నాడు. ఈ మాటే పాపం కొందరికి మింగుడు పడలేదు. ఎందుకు అంటే ఇంకా వాళ్ళు త్రైగుణ్య విషయా వేదా లో ఉండటం వల్ల వచ్చింది. మనం అందులో ఉన్నా కనీసం ఆ స్థితిని కనీసం అవగాహనైనా కలగటం కోసం చెప్పుకోవటం. బ్రహ్మవిత్ బ్రహ్మైవభవతి, అంటే అందులో చేరిన వాడు అదే అవుతున్నాడు. అందులో ఖండత్వం లేదు. అఖండత్వం ఉన్నది. రెండున్నాయంటే ఖండత్వము, లోటు అన్నీ ఉన్నట్లే అదే తానైన, ఒక సర్వవ్యాపకమైన, బ్రహ్మాను భవంలో లీనమయ్యాడు. భగవంతునితో పూర్ణ తాదాత్మ్యస్థితి. భగవంతునితో అని భక్తి విషయంలో చెప్పుకున్నా ఆత్మ జ్ఞానము అని జ్ఞాన విషయంలో చెప్పుకున్నా అనుభవం మాత్రం ఒకటే! పరిభాషల వేరు అంతే!

పూర్ణమైన అంటే ఐదడుగులో, ఆరడుగులో ఉన్న ఆకృతి కాదు కదా! సర్వ వ్యాపకమైన వాడు. మనం చదివే స్తోత్రాలకి కూడ అదే కదా అర్థం.

గోవిందం పరమానందం

సత్యం, జ్ఞానమనంతం

నిత్యమనాకాశం పరమాకాశం

ఏమిటి దీనిలో ఉన్న అర్థం?

మనం ధ్యానించే కృష్ణుడి స్తోత్రం అర్థం. గోవిందుడెవరు ? ఆయన సత్యస్వరూపుడు, జ్ఞాన స్వరూపుడు, అనంతుడు ఇందులో ఏ ఊహ మీరు చూసుకున్నా ఆయన సర్వగత, సర్వ వ్యాపక, అంతేకాదు సర్వలయందూ ఆత్మగా ఉన్నది కూడా ఆయనే! మనకి తెలిసి అత్యంత సూక్ష్మ భూతం ఆకాశం. దాని కన్న సూక్ష్మమైన వాడుకనుకనే సర్వగతుడయ్యాడు. ఆకాశం సర్వ వ్యాపకం ఎందుకయింది ? అత్యంత సూక్ష్మం కనుక. మరి ఆకాశానికి కూడా అవకాశం ఇచ్చినవాడు ఆ పరమాత్మ. కనుక ఆయన సూక్ష్మం ఎలాంటిది ? అనాకాశం, పరమాకాశం అని ఆయన గురించి చెప్తున్నాడు. ఆయనే గోవిందు పరమానందం అని చెప్పబడ్డాడు. ఆ శబ్దములని భావించండి. భావించితే పరమాత్మ అంటే ఏమిటో అర్థమవుతాడు. సర్వవ్యాపకమైన ఆ స్వరూపం తెలుస్తుంది. అది తెలిసి మీరు తన్మయులై పొందిన అఖండానందం ముందు ఇదుగో ఈ చిల్లరానందాలు ఏవీ కూడా చాలవు అది ఎలాంటిది ?

మనం దాహం తీర్చుకోవటానికి వేసవిలో ఎన్నో అవస్థలు పడతాం ? ఈ రోజుల్లో పల్లెవాతావరణంకి దూరమయ్యాము కాని అక్కడ చెలమలు అని ఉంటాయి. నదులు పోయిన తర్వాత, కొద్దిపాటి నీరు మిగిలినప్పుడు, వాటికి సమీపంలో ఇసుక

భూముల్లో తవ్వుతారు. తవ్వగా, తవ్వగా, నీరు వస్తుంది. ఆ వచ్చిన నీటిని చెలమలు అంటారు. అందునుండి తీసుకుంటూ ఉంటారు. అలాగే బావులు, కాలువలు, తటాకాలు ఇవన్నీ కూడా యావానర్థ ఉదపానే! ఏ ప్రయోజనం కోసం నీటి సదుపాయాలు చేస్తామో ఆ సదుపాయం అంతా ఒక మహాప్రవాహం వల్ల చెందుతుంది కదా అన్నాడాయన. చెలమలు వేసవిలో తవ్వుకున్నాం. కాని ఒక మహావర్షం వచ్చి, నదులు, పొంగి పొరలి ఆ చెలమల పక్కనుంచి ప్రవహిస్తూ ఉంటే, అక్కడినుంచి చూస్తూ, ఇక్కడెవరన్నా చెలమలు తవ్వుకుంటాడా చెప్పండి! లేదా డ్రమ్ముల్లో, టాంకుల్లో దాచుకున్న నీళ్ళు వైపు వెళ్తామా ? ఇంత మహా ప్రవాహం వచ్చినప్పుడు, నీళ్ళు ఎందుకు ఆచుకున్నామో ఆ ప్రయోజనములన్నీ ఇందులోనే నెరవేరుతున్నప్పుడు మళ్ళీ వాటికి వెనకాల వెళ్తామా చెప్పు? అదే విధంగా అఖండమైన, బ్రహ్మానందమే లభించినప్పుడు ఇంతకు ముందు చెప్పుకున్న ఈ త్రైగుణ్య విషయముల కర్మల వల్ల వచ్చే చిల్లర ఆనందాలు ఇంకెందుకు ? అవి అన్నీ దీని ద్వారానే తీర్చబడుతున్నాయన్నాడు.

అంటు దీని అర్థం ఏమిటి ?

పరబ్రహ్మానంద స్థితిలో ఉన్నట్టువంటి ముక్తుడు పొందే ఆనందం ముందు ఇవన్నీ చిల్లర ఆనందములే. ఇది ఇంకా మీకు అర్థం కావాలంటే రాత్రి పూట మనయింట్లో రకరకాల దీపాలు వెలిగించుకుంటాం. అది చిన్న కొవ్వొత్తి అవచ్చు, పెట్రో మాక్స్ లైటు అవచ్చు, ఛార్జిలైటు అవచ్చు. అఖండమైన సూర్యుడు ఉదయించినప్పుడు తలుపులు తెరవకుండా ఇందులోనే పెట్టుకోవటం ఎంత అవివేకం? అఖండమైన సూర్యరశ్మిలోకి వెళ్ళిన వాడు వీటిని ఎలా చూస్తాడు ? అదే విధంగా అఖండ బ్రహ్మానంద స్థితిలో ఇప్పుడు వీటి వల్ల వాడు పొందిన ప్రయోజనము లన్నీ వాటిలో పొందుతూనే

ఉన్నాడు. వీటిని మించిన ప్రయోజనములు పొందుతాడు. అదీ విశేషం. మనం ఇతర కర్మల ద్వారా పొందే ఆనందములన్నీ ఖండములు. పూర్ణానంద స్థితి ఏదో అది ఆ పరమాత్మయొక్క తాత్మ్య స్థితి.

అందుకే యావనర్థ ఉదపానే మనం ఈ ఉదపానములన్నీ కూడా సర్వతః సంప్లుతోదకే అంతా ప్రవహించే నదివల్ల వీటి యొక్క ప్రయోజనం తీరుతూ, వీటిని మించి ఎలా ఉన్నదో అలాగ బ్రహ్మానంద స్థితిలో ఉన్నవాడు పొందిన ఆనందం ముందు ఇవన్నీ చిన్నవి అంటున్నాడు. ఎంత చిన్నవి అంటే అది రుచి చూస్తే తెలుస్తుంది. ఆ ఆత్మానంద స్థితి గురించి లలితా సహస్రనామం గొప్ప మాట చెప్పింది. ఈ శ్లోకమంతా అక్కడ అర్థమవుతుంది.

లలితా సహస్రనామం అంటే నామాలు, భగవద్గీత అంటే జ్ఞానం దీనికీ దానికీ పొంతన ఎక్కడ అంటే లలితా సహస్రనామం మనకి పూర్ణమైన జ్ఞానాన్ని అందించటానికి వచ్చింది. అందులో ఉన్న నిశ్శబ్దములు చూడండి. నిర్లేపా, నిర్మలా, నిత్యా, నిరాకారా, నిరాకులా నిర్మోహ మోహనాశిని, నిర్మలా మదనాశిని. ఆ తల్లి నిస్త్రైగుణ్య . ఆ స్థితిలో ఉంది కనుక నిర్మోహ, నిర్మదా ఆవిడ కేవలం మదనాశిని కాదు, నిర్మద ఆవిడ అటువంటి ఆ తల్లిని ఆశ్రయించి నప్పుడు ఆ ఎఱుకని కలిగిస్తున్నది.

ఆ తల్లి నామాలలో గొప్పనామం ఏమిటి ?

స్వాత్మానందలవీభూత బ్రహ్మాద్యానంద సంతతిః అని ఒక మహానామం ఉంది. ఇదంతా కలిసి ఒకటే నామం. మనం ఒక ట్యూన్ అలవాటైపోయి దాన్ని విడగొట్టాము. ఈ మాటని ఇక్కడ మనం అన్వయించుకోవాలి. అమ్మవారు అందజేసే ఆనందం ముందు, బ్రహ్మయొక్క ఆనందం వరకూ బ్రహ్మానందం అంటే ఇక్కడ పరబ్రహ్మానందం

అనుకోవద్దు. బ్రహ్మగారి వరకూ ఉన్న ఆనందములన్నీ కూడా లవీభూతము లవుతాయి. లవీభూతములంటే అల్పములే!

అవి ఎలాగ అల్పములు ?

ఇందాక చెప్పినట్లు ఒక మహానదీ ప్రవాహంలో ఈ చెలములన్నీ ఎలాగ లవీభూతములవుతాయి, అలాగే ఒక అఖండమైన ఆత్మానంద స్థితిలో ఇవీన్న అల్పములే. నిస్త్రైగుణ్య స్థితికి చెందిన ఏదైతే ఉందో దాని చూసి జాలిపడ్తాం. అయ్యోపాపం ఆయన ఆత్మజ్ఞాని అయ్యాడు అంటాం లోకంలో. కాని వాడు పొందే ఆనందముల ముందు మనం పొందే ఆనందములు అల్పములు గనుక, అతడు మహోన్నతుడు. అలా అమ్మవారి స్తోత్రంలోనూ ఉంది, ఉపనిషత్తుల్లోనూ ఉంది. ఉపనిషత్తులే గదండీ గీత!

తైత్తిరీయోపనిషత్తులో మనకు సంబంధించిన అనేక విషయాలు చెపుతూ ఆనంద మీమాట చాలా విస్తృతంగా చేసారు. మరియొక ఉపనిషత్తులో కూడా ఆనందం గురించి, ఆత్మగురించి, బ్రహ్మము గురించి అడిగితే సాధనచెయ్యి అంటాడు తండ్రి. సాధనకి వెళితే అన్నమే బ్రహ్మము అనుకున్నాడు అంటే ఇంకా చెయ్యి అంటాడు. తర్వాత ప్రాణమే బ్రహ్మము అనుకున్నాను అంటాడు అలా స్వయం సాధన! బోధిస్తే కాదు ఆనందమే బ్రహ్మము అని చెప్పేయచ్చు కదా! కాని అలా చెప్తే అలా చెప్పేడు కానీయండి, ఇంకో అర్థముంటుందేమో! ఎందుకు అంటే అనుభవం అందే వరకు లాజిక్కులు, తర్కాలు, తండ్రి ఇంకా సాధన చెయ్యి అని చెప్తూనేఉన్నాడు. ఆనందోబ్రహ్మేతి తెలిసింది ఆనందమే బ్రహ్మము అఖండానంద స్థితే బ్రహ్మము అని స్పష్టం చేసాడు. ఆ ఆనందమీమాంస చేస్తూ అసలు ఆనందమంటే ఏమిటో చాలా

చక్కగా చెప్పాడు. చాలా సందర్భాలలో చెప్పుకున్నా ఇక్కడ మళ్ళీ చెప్పుకుంటే బాగా అర్థమవుతుంది. లేదా దీనివల్ల అదైనా అర్థమవుతుంది.

ఆనందములు ఎన్ని రకములు ?

మానుషానందము నుంచి మీ మాంస మొదలుపెట్టాడు. మానుషానందము అంటే మనిషి పొందే ఆనందం. మనిషి పొందే ఆనందాలన్నీ మానుషానందాలు కావుట. మరి ఏమిటి ? ధనిష్ఠరః, బలిష్టః, శ్రోత్రియః, అకామతః అని వర్ణించాడు. శ్రోత్రియుడైన వాడు వేద కర్మ ప్రకారంగా నడుచుకునేవాడు అకామతః ఏకోరికా లేనివాడై అఖండ భూమండలానికి అధిపతియై, శత్రువు లేకుండా, సర్వసంపదలూ ఉండి, అందరూ అనుకూలంగా ఎవరైతే ఉంటారో, అటువంటి వాడు పొందే ఆనందం పేరుమానుషా నందం. దానికి వంద రెట్లు మనిషి గంధర్వానందం, దానికి వందరెట్లు గంధర్వానందం, దానికి వందరెట్లు దేవానందం, ఇలాగ వరసగా చెప్తూ ప్రజాపతి ఆనందం, అక్కడ దాకా వెళ్ళి దానికి ఎన్నోరెట్లు బ్రహ్మానందం అని అక్కడ ఆపారు. అంటే బ్రహ్మానందానికి మనము ఎంత దూరం ఉన్నామో చూడండి. ఆ అఖండ మైన బ్రహ్మానందంలో ఇవీన్న కూడా యావానర్థ ఉదపానే వంటివే!

లౌకికమైన ఇంద్రపదవిలో ఒక అనందముంది. ఉత్తములైన మనుష్యులు పాలకుడైన ప్పుడు పొందే ఆనందానికి మించి ఇంద్రపదవి పొందటం ఆనందం. ఇంద్రపదవి పొందటమే గొప్పగా అనుకుంటే, దానికి మించి మరొక ఆనందం కనిపిస్తుంది. అందుకే ఆ స్థితిలో ఈ లౌకికమైన కోరికలేమీ ఉండవు. కారణం కావలసిందే దొరికింది కదా? సూర్యకాంతిలో కూర్చున్నవాడు నాకు దీపం వెలిగించుకోవాలని ఉందంటాడా ? ఒక గంగా నదీ తీరంలో ఉన్నవాడు నుయ్యి

త్రవ్వించుకునే ప్రయత్నం చేస్తాడా ? ఎందుకు చెయ్యడు ? అఖండమైనది లభిస్తున్నప్పుడు మరొక దానిమీద దృష్టి ఉండదు.

నిష్కామ స్థితిలోకి వెళ్ళిపోయారు అంటే తీర్చుకునే స్థితి లేక వెళ్ళిపోయారు అని కాదు అర్థం. ఇది ఇక్కడ ఆత్మస్థితి యొక్క అనుభూతి ఎలా ఉంటుంది. అన్నది కృష్ణపరమాత్మ ఈ ఉపమానంతో అంత చక్కగా చెప్తున్నాడు. ఈ విషయం ఉపనిషత్తుల్లో కూడా ఉంది. ఆ అఖండానందమునందే ఇవన్నీ ఉన్నాయి. ఒక అఖండానంద ప్రవాహంలో ఇంద్రానందము, ప్రజాపతి ఆనందం అన్నీకూడా అలలమాదిరి ఉన్నాయి. పరిమితులే ఇవన్నీ కూడా! ఆ అఖండసముద్రమే బ్రహ్మానందం. అదే సాంఖ్యము అని చెప్పబడుతున్నది. అదే తర్వాత చెప్పబడ్డ స్థితప్రజ్ఞుని యొక్క స్థితి. ఇంత విశేషమైన ఆ స్థితిని ఇవ్వగలిగే యోగం నీకు నేను చెప్తున్నాను నిష్కామ కర్మయోగం దీని ద్వారా నువ్వు పొందేది అఖండానంద స్థితి. ఎంత గొప్ప విషయం చెప్తున్నాడో చూసారా ? ఈ తన్మయమైన ఆనందానుభూతిని గూర్చి చెప్పి కర్మయోగం ఏ విధంగా అవలంబించాలో ఒక అత్యద్భుతమైన శ్లోకంలో తర్వాత వ్యాఖ్యానిస్తున్నారు.

కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన

మా కర్మేఫల హేతుర్భూః మాతే సంగోస్త్వకర్మణి 2-47

ఈ శ్లోకం భగవద్గీతలో పరిచయం ఉన్నవాళ్ళకీ తెలుస్తుంది, అసలు పరిచయం లేనివాళ్ళకి కూడా తెలుస్తుంది. అందుకే వ్యాఖ్యానించటానికి భయం వేస్తోంది. ఏదీ తెలియకపోతే ఫర్వాలేదు. కాని దీన్ని జాగ్రత్తగా అన్వయించుకోవాలి.

భగవద్గీతకి ఇదే మూలశ్లోకం అన్నాడు ఒక మహానుభావుడు. తలొకరు తలొక శ్లోకాన్ని ఇది ఒక్కటి చాలు అన్నారు. ఇదొక్కటి చాలని 700 మంది 700 శ్లోకాలు

చెప్పారు. మనకి 700 వచ్చినా, రాని దొకటి ఉంది కనుక అన్నీ కావాలి.

శ్లోకాన్ని అనుష్ఠింపు అంటారు. 8 అక్షరముల చొప్పున 32 అక్షరాలతో నాలుగు పాదములందు అనుష్టింపు ఉంటుంది. ఈ ఒక అనుష్ఠింపు శ్లోకంపై భగవద్గీతంతా ఆధారపడి ఉందన్నారు తిలక్‌గారు. ఒక బల్ల నాలుగు కాళ్ళ మీద ఎలా నిలబడుతుందో, భగవద్గీత అనే బల్ల ఈ నాలుగు పాదముల శ్లోకం మీద నిలబడింది అన్నారు. అంత గొప్పగా వ్యాఖ్యానించారు దీన్ని.

ఏమిటి ఇందులో ఉన్న విశేషం ?

ఒకొక్క పాదాన్ని జాగ్రత్తగా చూడండి. కర్మణ్యేవ అధికారస్యే. కర్మణి + యేవ, అధికారస్యే చాల గొప్ప విషయం అది. కర్మయందే నీకు అధికారం ఉన్నది. మా ఫలేషు కదాచన కర్మము నందు లేదు అని అనలేదు. ఫలమునందు ఎన్నడూ నీకు అధికారము వద్దు అన్నాడు. అదీ విశేషం. మా అన్నాడు కాని నా అనలేదు. సంస్కృతం లో నా అంటే లేదు అని అర్థం, మా అంటే వద్దు అని అర్థం. కర్మకు ఫలం లేకుండా ఎలా ఉంటుంది. పైగా కర్మయందు అధికారం ఉన్నప్పుడు ఫలం యందు అధికారం లేదు అంటే అది ఎంత తప్పుమాట ! అధికారం వద్దు అన్నాడు. అదీ విశేం. అధికారం నీకు వద్దు. నాకు పెట్టాననుకో నీకు తలనెప్పి ఉండదు నీ అధికారమంతా కర్మ మీద పెట్టుకో!

కర్మయందు నీకు అధికారం ఉంది అన్నాడు. ఇది అర్థం చేసుకోక భారతీయ కర్మ సిద్ధాంతం గురించి చాలా మాటలు వస్తున్నాయి. కర్మయందు పూర్తి అధికారం నీదే అంటున్నాడు, స్వామి అదీ విశేషం. అధికారం అంటే పూర్తి పట్టు అనికదా అర్థం. కర్మయందు నీ కధికారం ఉన్నది, ఫలముపై అధికారము వద్దు. నువ్వు కర్మఫలానికి

కారణం కారాదు. అలాగని కర్మలు చేయటం మానరాదు అన్నారు అదీ నాలుగు పాదముల యొక్క అర్ధం. ఇది అర్ధమయితే నిజానికి అన్నీ అర్థము లైనట్టే. వేదాంతము, ఉపనిషత్తు, బ్రహ్మస్థితి, అఖండ బ్రహ్మానందం గురించి చెపితే ఏమీ అర్ధం కానట్టే అనిపిస్తుంది. మన సాధన ఏ స్థాయిలో ఉందో తెలియజేస్తుంది. కర్మ అనేది ఉంది కనుక ఇదన్నా అర్ధమవుతుందేమో చూద్దాం.

కర్మణ్యేవ అధికారస్యే కర్మయందు మాత్రమే నీకు అధికారం ఉంది, కర్మఫలము యందు వద్దు అన్నాడు. తెచ్చిపెట్టుకోకు అధికారాన్ని దాని వల్ల చాలా తలనొప్పులు వస్తాయి అంటున్నాడు. ఫలము యందు అధికారం లేదు అంటే ఫలము లేదు అని మాట వస్తుంది. పైగా ఫలము నీ చేతిలో లేదు అన్నమాట వస్తుంది.

దీనికి కొందరు ఏమని వ్యాఖ్యానించారు?

ఎన్నో అనుకూలిస్తే గాని కర్మఫలం రాదుగనుక, ఆ స్థితి నీకు తెలియదు గనుక, నువ్వు కర్మమాత్రమే చెయ్యి అని చెప్పాడన్నారు. ఆ మాటకొస్తే కర్మ చేయటానికి కూడా ఎన్నో అనుకూలించాలి. అనుకూలించకపోతే కర్మ మనం చేయగలమా? శరీరం సహకరించాలి, ప్రకృతి సహకరించాలి, సాటి మనిషి సహకరించాలి. ఫలానికే అనుకూలత కాదు, కర్మకు కూడా అనుకూలత ఉండవలసిందే! ఇది మనం తెలుసుకున్నప్పుడు అనుకూలత విషయంలో ఆయన చెప్పటం లేదు. కర్మకీ శక్తి యిచ్చేది ఆయనే, ఫలమిచ్చేది ఆయనే, అంతేకాని కర్మేదో మనచేతిలో ఉంది, ఫలమేదో ఆయనచేతిలో ఉంది అంటే కర్మ మనచేతిలో ఉంది అనేసరికి అహంకారం వచ్చిందా లేదా ? అది కాదు ఇక్కడ. నువ్వు కర్మచేయవలసినదే! నీకు ఉన్న శక్తితో కర్మ చేయవలసిందే! నేను చేస్తున్ననన్న అహాన్ని వదిలి, ఫలాకాంక్షను వదులు.

జయాపజయముల యందు సమబుద్ధి ఉండుట అంటే అర్ధమేమిటి ? ఫలాసక్తి విడిచిపెట్టి చెయ్యి!

ఫలం యొక్క ఇదమిద్ధ స్వరూపం నీకెలా తెలుస్తుంది ? ఇక్కడ అడుగు వేయటం మొదలెట్టావు. అప్పుడే గమ్యం కనబడాలి అంటే నీకెలా తెలుస్తుంది దాని పూర్తి స్వరూపం ? నువ్వు నీ శక్తిని సరిగ్గా వినియోగిస్తున్నావా లేదా మార్గం పై అడుగు సరిగ్గా వేస్తున్నావా లేదా ఇది గమనించుకుంటూ వెళ్ళు, గమ్యం అదే వస్తుంది. అదీ చెప్తున్నారాయన.

అంతేకాని ఫలము లేదు, ఫలము రాదు అనే మాటలు ఇక్కడ లేవు. ఫలముపై అధికారము వద్దు అని చెప్తున్నాడు. కర్మ ఫలానికి నువ్వు కారణం చేసుకోకు. కారణం ఎప్పుడవుతాము ? ఫలము మీద ఆసక్తి పెట్టుకుంటే ఫలానికి మనం కారనం అవుతున్నాము. అప్పుడు దాని ఫలితము లైన జన్మపరంపరలన్నీ అనుభవించాల్సి వస్తుంది. అందుకు ఫలాసక్తిని విడిచిపెట్టు. ఏ ఫలమివ్వాలో నేను చూసుకుంటాను అంటున్నాడాయన. ఆ నేను చూసుకునే వ్యవస్థని ప్రకృతి రూపంలో ఉంచారాయన. అదీ విశేషం.

ఇక్కడ జాగ్రత్తగా తెలుసుకోవాల్సిన విషయం ఏమిటి ? ఫలాసక్తిని విడిచి కర్మని చెయ్యి అనేది. ఇక్కడే మనం మొదట చెప్పిన నస్త్రైగుణో భవార్జున లింకు కూడా పెట్టుకోవాలి. రాజస కర్మ , తామస కర్మ అని రెండున్నాయి. ఆయన ఫలము నందు అధికారము వద్దు అంటే మనం పనిమానేసి ప్రమాదం ఉంది. అందుకే చివరికి మాతే సంగోస్త్వ కర్మణి అకర్మతో సంగము పెట్టుకోవద్దు అన్నాడు. అంటే కర్మచేయుట మానవద్దు అని చెప్పాడు. ఎక్కడ పొరపాటు పడతామో అని. ఫలితం మన చేతిలో

లేనప్పుడు అది మానేస్తే సరికదా అని మానేస్తే అది తామసం అవుతుంది. ఫలాసక్తితో చేయటం రాజసికం. ఫలాన్ని కాంక్షించకుండా, భగవదర్పణ బుద్ధితో చేయటం సాత్త్వికం. అదీ విశేషం. ఇంకా పై స్థితికి వెళితే భగవదర్పణ బుద్ధి కూడా లేదు, ఫలము విషయమై ఆలోచన లేదు. దేహము ఉన్నది కనుక కర్మని ఆచరిస్తూ ఉంటారు. ఆ స్థితి నిస్త్రై గుణ్య స్థితిలో కూడా సాధ్యమవుతుంది. కర్మణ్యే వ్యాధికరస్తే దానిని జ్ఞానపరంగా చెప్తున్నాం కనుక ఇంత వ్యాఖ్యానించుకున్నాం.

లౌకికంగా దీన్ని పరిశీలిస్తే ఎలా ఉంటుంది ? కేవలం ఫలాపేక్ష కోసం కర్మ చేయటం వల్లనే ఇన్ని ప్రమాదాలు మన చుట్టూ కనిపిస్తున్నాయి. ఎప్పుడైతే ఇది కర్మకి ఫలితం అనుకుంటాడో, దాని వల్ల ఎన్ని ప్రమాదాలో ఆలోచించండి మీరే! ఈ శ్లోకాన్ని ఇంకొక రకంగా ఆలోచిద్దాం. ఒకడు సంగీతం నేర్చుకోవటం ప్రారంభిస్తాడు. ఈ సంగీతానికి ఫలమేమిటి ? వెంటనే వాడి ముందు ఏ బాలమురళీకృష్ణో, ఏ యమ్మెస్ సుబ్బలక్ష్మో స్టేజీ మీద కచేరీలు చేసి అవార్డులు పుచ్చుకున్నారు, నేను కూడా అలా పుచ్చుకోవాలి అని స, ప, స స్థితిలోనే ఫలం మీద దృష్టి పెడతాడు. ఫలం మీద దృష్టి పెట్టినప్పుడు ఏమయింది ? ఎంత వేగంగా అది అందుకుంటానా అన్న తాపత్రయం మొదలవుతుంది. గొప్ప లక్ష్యం పెట్టుకుని ఈ పని చేస్తున్నాడండీ అని అనుకుందామనుకున్నా లక్ష్యం అనేది ఆవిద్యలో పరపూర్ణత సాధించటానికి ప్రయత్నిస్తున్నాడా, లేక ఆ విద్యలో రాణిస్తూ పాప్యులారిటీ ఉన్న వారిలా అవాలని పెట్టుకున్నాడా ? ఇది కూడా మనం ఆలోచించాలి.

పాప్యులారిటి అనేది పరిపూర్ణతకి చెందిందికాదు ఎందరో పరిపూర్ణమైన సంగీత విద్వాంసులు పేరుకూడా తెలియని వారు ఏమారుమూల కుగ్రామాల్లో ఉన్నారో మనకేం

తెలుసు ? కాని వారికివ్వవలసిన ఫలితం మెమెంటోలో, బిరుదులో, భారతరత్నలో కాదు. అవి ఇవ్వవలసిన వాడు ఇస్తాడు. అవే ఇవ్వవలసివస్తే అక్కడ తిరువాయూర్‌లో కూచుని నిధిచాల సుఖమా. రాముని సన్నిధి సేవ సుఖమా అని త్యాగరాజు స్వామి ఎందుకు అనుకుంటారు ? ఆయనకి శంభోజ రాజు పంపిన కానుకలన్నీ కూడా ఎందుకు తిప్పిపంపాడు ? వాళ్ళందరూ కూడా ఉదాహరణే దీనికి కారణం ? వాళ్ళు దేనియందు బుద్ధి పెట్టారు? వ్యవసాయాత్మక బుద్ధి, సర్వగతుడైన ఆ పరమాత్మయందే ఉంది. కర్మయొక్క పరిపూర్ణత యందు మాత్రం దృష్టి పెట్టురు. అది చూడండి. ఎందుకు ? కర్మణ్యే వాధికారస్తే ఆ సంగతమనే విద్యకోసం ఎంత తపించారు త్యాగరాజస్వామి వారు? గురువు చెప్పన విద్యంతా చెప్పి, ఇంక నాదగ్గర విద్య లేదు నీకు అంతా చెప్పినాను అంటే కాదండీ, నాకేదో అసంతృప్తి ఇంకా కావాలన్నాడు. దేని కోసం ? ఫలాకాంక్షకోసం కాదు. ఆ కర్మని పరిపూర్ణంగా నెరవేర్చటం కోసం. ఇది ఒక ఉదాహరణ.

ఎప్పుడైతే ఒక ఫలం పెట్టుకుని మనం పనిచేయటం మొదలు పెట్టామో అది అందుకునే తొందర పెరుగుతుంది. దాని వల్ల మన బుద్ధిశక్తి కర్మపై ఏకాగ్రం కాకుండా, కొంత ఫలంపై షేర్ అయ్యి, దీనిమీద ఉంచవలసిన ఏకాగ్రతతో లోపం వస్తుంది. దాని వల్ల కర్మలో పరిపూర్ణత కొరవడుతుంది. ఇది ఒక కారణం.

రెండవ కారణం ఏమిటి ?

ఎప్పుడైతే పాప్యులారిటీ అని పెట్టుకున్నామో, ఆ ఫలం పొందటానికి, ఇందులో పరిపూర్ణతే అక్కరలేదు. ఏదో కాస్త నేర్చుకుని, ఎవడినో పట్టుకునో, ఏదో ఇచ్చో, ఆ స్థితి తెచ్చుకోవచ్చు. ఎంతమంది ఎన్ని అవార్డులు తెచ్చుకోవటంలేదు? ఎన్ని సన్మానాలు

పొందటం లేదు. ఆ మార్గంలో అది బహిరంగ రహస్యాలు మనకి. అవే ఫలముగా పెట్టుకుంటే అవినీతి వస్తోంది చూసారా ? ఫలదృష్టితో కర్మ చేస్తే అవి నీతికి కూడా అవకాశం ఉంది అవునా, లేదా ?

ఉదాహరణకి నువ్వు ఈ ఉద్యోగం చేస్తున్నావు గనుక నీకీ జీతం అన్నారు. దీని వల్ల ఎన్ని ప్రమాదాలో చూడండి. అలాగంటే ఉద్యోగాలు చేసేవాళ్ళకి జీతాలివ్వద్దు అని కాదు అర్థం. ప్రతిదానికి పెడర్థాలు తీయటానికి సిద్ధంగా ఉంటారు. ఇక్కడ కర్మయోగికి జీతం వస్తుంది కాని వాడు దానికి కర్మకి ఫలంగా అనుకోడు. అది తన కర్మమరింతగా చేయటానికి పనికొచ్చే సాధనగానే అనుకుంటాడు.

అంటే ఏమైంది ?

సాధారణంగా మనం ఒక పని చేస్తే పనికి సాధన అంటారు. పని వల్ల పొందేదాన్ని సాధ్యము అంటారు. కాజిని ఈ ఉద్యోగాన్ని కర్మయోగంలా చేసేవాడికి, వాడి జీతం వాడికి సాధన అయింది. కర్మ చేయటం సాధ్యమయింది. యోగం లేనివాడికి కర్మసాధన అయింది, జీతం సాధ్యమయింది. ఎప్పుడైతే నాకు జీతమే ఫలం అనుకుంటాడో, కర్మలో, ఎన్ని లోపాలు చేస్తాడో చూడండి. ఒక ప్రభుత్వాఫీసులో నువ్వు ఎంత కష్టపడు, నీ జీతం అంతే! వీడూ అదే అనుకుంటున్నాడు, నా పనికి ఏమిటి ప్రయోజనం ఫలము. ఆ ఫలము నాకు ఒకటో తారీకు కల్లా వచ్చేస్తోంది. నా కర్మ ఎలాగంటే ఏమిటి అని ఆ కర్మలో లోపం చేస్తున్నాడు కదా! దేని వల్ల ? ఫలం మీద ఆసక్తి ఉండటం వల్ల, కర్మని సరిగ్గా చేయకపోవటం జరుగుతుందా లేదా ? ఫలాసక్తి విడిచి పెట్టి కర్మనే పరిపూర్ణంగా చేస్తే, వీడిచ్చే జీతం వదిలిపెట్టేయండి, సర్వ సాక్షి అయిన పరమాత్మ తప్పకుండా ఇస్తాడు. అది ఇక్కడ చెప్తున్నాడు.

ఈ కర్మని ఇదే ఫలమని నిర్ణయించటానికి మన మెవరం ? మన దృష్టి ఎంత ? మనం ఒక పని చేసేటప్పుడు దాని ప్రయోజనం పదిరూపాయలే అనుకుని ప్రయత్నిస్తాం. కాని యివ్వదల్చుకున్న పరమాత్మ ఎంత యివ్వదల్చుకున్నాడో మనకి తెలియదు కాని ఆ 10 రూపాయలనే దృష్టిలో పెట్టుకుని చేస్తుంటే, ఇవ్వవలసిన ఆ పదిని కాదు కదా, అందులో సగం కత్తిరించుకుని ఇవ్వచ్చు. కనుక ఆ పూర్ణఫలము యొక్కస్థితిని మనం భావించలేము. ఇలాంటి అవస్థలు మన జీవితంలో ఎన్ని అనుభవించలేదు. ఆలోచించుకోండి. ప్రతి కర్మకీ మనం ఆశించిన ఫలమే వచ్చిందా ? కేవలం ఫలాకాంక్ష పెట్టుకోవటం ద్వారా అవినీతి కూడా వస్తున్నది. నేను ఇందులో దిగాను అంటే దాని వల్ల ఇంత సంపాదించదలుచుకున్నాను అని ఫలం పెట్టుకున్నాడు దాని కోసం వాడు చెయ్యంనివన్నీ చేస్తాడు.

అందుకు ఫలాకాంక్ష అని పెట్టుకుంటే దాని మీద అధికారం పెట్టుకుంటే, దాని మీద అహంకారం ఆరోపించుకుంటే, వాడు దేనికీ వెనుదీయడు. ఫలమిచ్చే వాడొకడున్నాడు అన ఎఱుక కలిగి, వాడు కర్మనే సరిగ్గా ఆచరిస్తే ఆయన మాత్రం మోసం చేయడు. మిగిలిన జీతాలిచ్చేవాళ్ళలో పనికి దోపిడీ చేసి వాళ్ళు న్నారేమోకాని ఆ పరమాత్మమాత్రం అటువంటి వారికి ఎటువంటి లోపం చేయడు. అందులో సందేహం లేదు.

ఇందాక చెప్పినట్లు ఆ బ్రహ్మవేత్తకి అన్నీ నెరవేర్తాయి. అంటే వారికి లౌకికంగా ఏదైనా అవసరమైనా కూడా పరమాత్మ నెరవేర్చుతాడు కాని ఆయన నెరవేర్చాలని మాత్రం ఈయన అనుకోడు.

త్యాగ రాజస్వామి వారు వారి అమ్మాయికి వివాహం చేయాల్సి వచ్చిందిట.

ఆయన ఎప్పుడూ కీర్తనలు పాడుకుంటూ సర్వమూ ఆయనే అంటున్నాడు. ఆయన విద్య ఎలాంటిది ? దేశ దేశాల రాజులందరు సంపదలు తీసుకొచ్చి కుమ్మరించదగినంత విద్యఉంది ఆయనదగ్గిర. కాని వారి కోసం వినియోగించలేదు. ఆ పరమాత్మకే వినియోగించారు. వాళ్ళ అమ్మాయి పెళ్ళీడు కొచ్చినప్పుడు మీరు ఇలాగయితే ఎలాగ, మీకు సాయం చేసేందుకు చుట్టాలు, పక్కాలు లేరా అన్నారు.

ఆయన ఒకటే అన్నాడు. సీతమ్మ మా యమ్మ. శ్రీరాముడు మా తండ్రి. ఎవరు లేరు వాళ్ళిద్దరూ నా వాళ్ళు

సీతమ్మ మాయమ్మ శ్రీరాముడు మాతండ్రి

వాతాత్మజ, సౌమిత్రి, వైనతేయ, రిపుమర్దన,

తాత, భరతాదులు సోదరులు మాకు ఓ మనసా

అంతేనా ? పరమేశ, వశిష్ఠ, పరాశర, నారద, శునసౌనక గుహ శనకాదులు, లంబోదరులు, ధరణిజ భాగవతాశ్రేసరులు.

ఎవరో వారెళ్ళరు త్యాగరాజునుకి పరమ బాంధవులు ఓ మనసా అన్నాడు.

ఇలాంటి ఆయన వాళ్ళమ్మాయికి ఏం పెళ్ళి చేస్తాడని అనుకుని వెళ్ళిపోయారు వాళ్ళు కానీ ఆశ్చర్యకరంగా ఆరాలీమ చంద్రమూర్తే నిజంగా ఆ వివాహం చేయించాడు. ఇది దగ్గరలోనే ఉన్న త్యాగరాజ స్వామి చరిత్ర. దగ్గరలోనే అంటే కేవలం కొద్ది శతాబ్దాల క్రితం జరిగిన చరిత్ర. ఉదాహరణలు చెప్పుకున్నారు.

ఇలాంటి ఉదాహరణలు విని, ఇదేదో బాగుంది, భగవంతుడిని నమ్ముకుంటే పెళ్ళిళ్ళు కూడా చేసిపెడతాడన్నమాట అని చెప్పి ప్రతివాడూ, ఆడపిల్ల పెళ్ళిచేయకుండా సీతమ్మ మా యమ్మ అని పాడుకుంటూ అయిపోతుందా అంటే కావట్లేదు. త్యాగరాజు

స్వామి వారికి పరమ ప్రయోజనం అమ్మాయి పెళ్ళికావటం కాదు. రాముడే సర్వస్వం అనే దీక్షలో ఉన్నటువంటి వాడు.

దానికి రాముడేం చేసాడు ?

అది యావానర్థ ఉదపానే                    తోదకే ? ఆ పరిపూర్ణమైన స్థితిలో ఉన్నవాడికి తీరిపోతాయి. నూతి వల్ల తీరవలసిన ప్రయోజనం కూడా ఆ మహానది వల్ల తీరుతుంది. ఆ మహానదే రామకృప, ఆ మహానదే రామజ్ఞానం, ఆ మహానదే పరమాత్మ జ్ఞానం అదీ విశేషం.

కర్మణ్యే వ్యాధి కారస్తే మాఫలేషు కదాచిన

ఇది ఎలాంటి చిక్కంటే , అందుకే దీన్ని యోగం అన్నారు. యోగమంటే ఉపాయం. ఉపాయం అంటే తెలివైఐన పని. అందుకే కర్మాచరణవేరు, కర్మయోగం వేరు అని ముందే చెప్పుకున్నాం. కర్మ నాచరిస్తున్నవారందరూ కర్మయోగులు కారు. ఫలాన్ని ఆశించకుండా పనిచేయమంటే ఎవరి వల్లనన్నా అవుతుందా ? ఎవరి వల్లా కాదు కనుకే దాన్ని యోగం అన్నారు, దాన్ని సాధన చేయమన్నారు. వ్యవసాయాత్మికా బుద్ధి తెచ్చుకో! ఆయనున్నాడనుకో! సర్వవ్యాపకమైన పరమసత్యమున్నది. ఆపరమ సత్యాన్ని నువ్వు కృష్ణుడను, శివుడను, రాముడను, ఎవరన్నా అను. ఆ పరమ సత్యము నందు నువ్వు వ్యవసాయాత్మిక బుద్ధి నిశ్చితం చేసి, నీకు విద్యుక్త కర్మ ఏదో దానికి లోటు రాకుండా ఆచరిస్తూ వెళ్ళు.

కర్మకి రెండు కొనలు కట్‌చేయాలి. ఏమిటవి ? ఫలాసక్తి వెనకది, అహంకారం ముందుది. ఈ రెండూ తెంచేస్తే ఉన్నది ఆనందమే. మనం ఏదైనా పండు తినాలనుకున్నా రెండు కొనలు కట్ చేస్తాం. అలాగే కర్మకి రెండు కొనలు కత్తిరించాలి నేను చేస్తున్నాననే

అహంకారం, నాకిది కావాలనే ఫలాకాంక్ష. ఈ రెండు కొసలూ కత్తిరించామా ఈ పనిలో ఉక్రోషాలుండవు. ఆక్రోశాలుండవు. ఈర్ష్యలుండవు, ద్వేషాలుండవు. ఏవీ ఉండవు. అపుడు ఆ కర్మ నిర్మలమవుతుంది, పరిపూర్ణమవుతుంది. కాని ఆ కర్మని వాడు మానలేదు. మాతే సంగోస్త్యం కర్మణి ఆ కర్మకి ఎంత శ్రద్ధ అవసరమో అంతే పెడుతున్నాడు. ఎందుకంటే భగవంతుడు శ్రద్ధాప్రియుడు కనుక. కావల్సిన సర్వము ఈశ్వరుడిచ్చిన వాటితో చేస్తూనే తద్బుద్ధి కలిగి ఉన్నాడు. వ్యవసాయాత్మిక బుద్ధి అక్కడ పెట్టి ఉంచాడు. అందుకు వాడికి సవ్యంగా జరుగుతుంది.

కర్మ యోగం ఎలాంటిది ?

విడిచిపెట్టటానికి లేదు, పట్టుకుంటే ప్రమాదం. అది ఎలాంటిది అంటే, పాములాడించే వాడి విషయం తీసుకోండి. పాముని పట్టుకుంటే ఏం చేస్తుంది ? కాటు వేస్తుంది. విషం ఒకటే, వాడికైనా, మనకైనా! వాడు ఏం చేస్తాడు ? పాముని పట్టుకుంటాడు, అది కాటు వేయకుండా కోరలు తీసేస్తాడు. అలాగే కర్మయోగి ఏం చేస్తాడు ? కర్మనే పాముని పట్టుకుని ఫలాసక్తి అనే కోరని తీసి దానితో హాయిగా కాలక్షేపం చేస్తాడు. ఇది కర్మ యోగం యొక్క రహస్యం. 'మాతేసంగోస్త్యకర్మణి' అకర్మతో కర్మని విడిచి పెట్టకు అని స్పష్టంగా చెప్తూనే ఉన్నాడు గీతలో.

మరి ఏ విధంగా కర్మాచరణ చేయాలి ?

సశేషం